TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY
OU_204104
UNIVERSAL LIBRARY

-19-11-79- -10,000

# MANIA UNIVERSITY LIBRARY

391.23
V83P.

Accession No. T2531

k should be returned on or before the date last

శ్రీరస్తు

# పంచతంత్రము

నారాయణకవిప్రణీతము


చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచేఁ బ్రకటితము.

1953


All Rights Reserved.

PRINTED BY
V. VENKATESWARA SASTRULU
OF V. RAMASWAMY SASTRULU & SONS
AT THE VAVILLA PRESS
Madras.—1953.

1st Edition1924.
2nd Edition—1939.
3rd Edition.—1953.

# పీ ఠి క

## దూబగుంట నారాయణకవి

ఈయన యాఱువేలనియోగి బ్రాహ్మణుఁడు. మైత్రావరుణసగోత్రుఁడు. తండ్రి బ్రహ్మయ. తల్లి నాగమ్మ. ఈకవి పంచతంత్రమును దెనిఁగించి బసవరాజున కంకిత మొనర్చెను.

బసవరాజు పేరోలగంబున విద్వద్గోష్ఠి నుండి

చ. "హరిహరభక్తు సార్యనుతు సంధ్రకవిత్వవిశారదుఁ మహీ
శ్వరవరమాననీయుఁ గులవర్ధను శాంతుఁ బ్రబంధవాచకా
భరణము నాగమాంబకును బ్రహ్మయమంత్రికి నాత్మసంభవుఁ
సరసుని దూబగుంటపురశాసను నారయనామధేయునిన్."

అగుఁ దనను బిలిపించి చిఱునగవు మోమునఁ జిందులాడుచుండఁగా

చ. "సురుచిరమైన నీకవిత సూరిసభాంతరయోగ్యతామనో
హరసరసార్థగుంభనల నందము గావున నారనార్య! సు
స్థిరగతిఁ గీర్తి నన్నొనరఁ జేసి సమస్తజగత్ప్రసిద్ధమై
పరఁగుచునుండ మాకొకప్రబంధ మొనర్చు ప్రియం బెలర్పఁగన్."

వ. "తత్ప్రబంధం బెయ్యది యంటేని."

ఆ. "పంచతంత్ర మనఁగ సంచితగీర్వాణ
భాష మున్ను చెప్పఁబడిన యట్టి

కావ్య మంధర (?) భాషం గర్ణామృతంబుగం
గూర్పవలయుం నీదు నేర్పు మెఱయ."

అని వినయమునం బలికినట్లు చెప్పుకొన్నాండు.

ఈయననివాసము నెల్లూరుమండలములోని దూబగుంట యనుట స్పష్టము. ఆమండలమున దూబగుంట యనుగ్రామములు రమారమి మూండున్నట్లు కన్పట్టు. అందీయననివాసమెందనునదియే యిటం బ్రశ్నము. ఉదయగిరికి సమీపమున ననంగా పామూరుచెంత నొకదూబగుంట యున్నది. ఆత్మకూరునకు సమీపమున నొకదూబగుంట యున్నది. నెల్లూరునకు సమీపమున నొకటి యున్నట్టుగూడ వినియున్నవాండను. పామూరునకుం జెంతనున్న దూబగుంటలోం గవు లుండిరని ప్రతీతి కలదు. దానింబట్టి యీనారాయణకవి యాగ్రామనివాసియే యని చెప్పవచ్చును. ఇట్టి ప్రతీతులు కొన్ని రిత్తవిగనున్నవి. కాన నిదమిత్థమని సిద్ధాంతముచేయ దీనిచేతనే వలనుపడదు. ఇప్పటికాకాశపంచాంగముగా నీదూబగుంటయే యనుకొందము. ఇది కాదని ప్రబలప్రమాణము దొరకినపుడు అదియే సిద్ధాంతమగును.

దూబగుంటవా రను నింటిపేరు గ్రామాంతరమునకుం బోయి కాంపురముండుటం గల్గును. మరలం గొంతకాలమునకుం దనగ్రామము చేరినను, ఆపేరే ప్రసిద్ధముగ నుండును. కాంబట్టి వీరిపూర్వులు దూబగుంటనుండి గ్రామాంతరమునకుం బోయి కొంతకాల మందుండి మరల స్వగ్రామము చేరినట్లు తోంచును. దూబగుంట పురశాసనుం డన్నందున నీతండు కరణమని యూహించుట సమంజసమే. పూర్వము బ్రాహ్మణులు గ్రామాధికారులనంగా నుద్యోగవిషయమునం జర్చించినచోం గరణములే యని యూహించుట పొరపాటు కానేకాదు.

ఈయనపద్యములందు "నారయనామధేయునిఁ" అనియు "నారనార్య" యనియుం జెప్పుకొన్నందునను, గద్యమున "నారాయణనామధేయ ప్రణీతమైన"అని చెప్పుకొన్నందునను నారయ్య, నారాయణ నామధేయములు రెండును గలవని స్పష్టమగును. పద్యమునఁ బేరు నిమిడింపఁజాలక నారయ్య యని చెప్పుకొనియె నని కొంద అందురు గాని యది విశ్వాసార్హము కానే కాదు. సాధారణముగాఁ బేరు తాఱుమాఱగుచుండుట సహజము.

ఈకవి తన గ్రంథమును బసవభూపాలున కంకితముచేసి నందున నాభూధవుని కాలమునుబట్టి యీాయనకాలము క్రీస్తు శకము ౧౪౭౦-౮౦ సంవత్సరముల ప్రాంతమున నున్నట్లు కవి చరిత్రమున నున్నది.

కృతిపతివంశాదుల వర్ణించుటయు, స్వచరిత్రము చెప్పుకొనుటయు నాచారములై యున్నవి గాని శాలివాహనశక సంకీర్తనము నివాసాదులను బేర్కొను నాచారమున్న చో నింతటి చిక్కులు లేకుండును. 'స్థితస్య గతిశ్చింతనీయా' యన్నట్లున్న దానింబట్టి యెట్లో పెద్దలు నిర్ణయించిరి. ఈనిర్ణయములలోఁ గొన్ని యిటు కొన్ని యటు పడుచుండును. మొత్తముమీఁద నూహలు సిద్ధాంతములు కాఁజాలవు. ఘుణాక్షరన్యాయముగా నొకప్పు డవి సిద్ధాంతములుగూడ నగును. ఆవిషయ మిప్పు డంతగా నిట ముఖ్యము కాదు.

ఈకవి పంచతంత్రమును జక్కఁగాఁ దెనిఁగించెను. ఆంధ్రీకరణమునఁ దనచమత్కృతిని జక్కఁగాఁ జూపెను. యతిప్రాస ములకుఁ బడరానిపాట్లు పడక సహజగాంభీర్యధారతో గ్రంథ మును రచించెను. కొన్నికొన్నితావుల వలయుననియో, లేక

యొట్లో మిగుల రసవంతములుగఁ బద్యముల నల్లి తన ప్రౌఢిమను సరసమనీషులహర్షమునకుఁ బాత్రముగాఁ జేసి కృతార్థుఁడయ్యెను. ఉచితానుచితవివేకము లేని కవులవలెఁ గాక పదప్రయోగశుద్ధిని వెల్లడించి నిర్మలయశశ్చంద్రికల నెల్లెడల నుల్లసిల్లంజేసి సత్కవుల కుల్లాసమును గల్పించెను. ఇట్టిసత్కవులఁ గన్న తల్లి దండ్రులభాగ్యమే భాగ్యము.

మిత్రభేదము సుహృల్లాభము సంధివిగ్రహము లబ్ధనాశము అసంప్రేక్ష్యకారిత్వ మను నీ యైదుతంత్రము లిందుఁ గలవు. కాకి నక్క యెలుక మొదలగుజంతువులచరిత్రములే తఱచుగా నిందుండినను శాస్త్రమిదియే యని చెప్పఁదగినట్లు కథా చమత్కృతి యలవరింపఁబడినది. ఒక్కకథఁ జదివినను ఆనీతిని గ్రహించి ప్రవర్తించెనేని మనుజుఁడు జగత్పూజ్యుఁ డగును. "కథాచ్ఛలేన బాలానాం నీతిస్తదిహ కథ్యతే" అనుటయే గ్రంథకర్తయభిమతము. ఇట్టిగ్రంథములే మనుష్యులదుష్ప్రవర్తనములఁ బాఱఁదోలి సత్ప్రవర్తన మలవఱచుకొనుటకు మూలకందము లగును. ఇట్టి సద్గ్రంథమును దెనిఁగించి

శ్లో. "పవిత్రమత్రాతను తే జగద్యుగే స్మృతా రసక్షాళనయేవ తత్కథా,
కథం న సా మద్గిరమావిలామపి స్వసేవినీమేవ పవిత్రయిష్యతి."

అని శ్రీహర్షకవిసార్వభౌముఁడు చెప్పినట్లు నారాయణకవియుఁ దనవాక్కును బవిత్రము నొనరించుకొనియెను.

ఈపంచతంత్రము వేంకటనాథుని పంచతంత్ర మంతటి రసపుష్టికలది కాకపోయినను సలక్షణమైనదయి చక్కని లోకోక్తుల తోను, మృదువులైన తెలుఁగుపదములతోను నిండి తేనెలొలుకు నదిగా నున్నదని చరిత్రకారులు వ్రాసిరి. వేంకటనాథుని పంచ

తంత్ర మెట్లున్నదో దానికి దీనికిఁ బోలికలెట్లున్నవో విమర్శించుట కాగ్రంథము మదీయకరగతము కానందున వీలులేదయ్యెను.

ఇపుడది నాకు లభించినందున నిందేది రసపుష్టికలదియో యను విషయమునుగూర్చి నాలుగుమాటలు వ్రాసెదను. తొలుదొలుత నీకవివరద్వయప్రోక్తములయి యేకార్థబోధకములగు రెండుపద్యములు వ్రాసి చూపి యావల నాభావమును వ్రాసెదను.

## సుహృల్లాభము

ఉ. భీకరశాత్రవస్ఫురదభేద్యభయంబును దీవ్రదుఃఖముఁ
వే కడతేర్పఁ జాలుటకు నేర్చి ముదంబున కాలవాలమై
చేకొని కాచు నాత్మసఖు సిద్ధము మిత్రసమాఖ్యరత్నముఁ
శ్రీకరవర్ణయుగ్మము సృజించినయున్నతపుణ్యుఁ డెవ్వఁడో.

(నారాయణకవిది. సుహృ. 221 ప.)

సీ. కర్మచేష్టితములు గాలాంతరావర్తితము లగుమేలుగీ ల్లమరు నైనఁ
గనుఁగొంటి మరిసమాగమవియోగములేల చెనఁటివిధాత సృజించె మొదలఁ
బృథులశోకారాతిభీతిఘాతిప్రమోదసంపాదిప్రీతివిస్రంభభాజ
నము మఱిరెండక్షరములఁ బూర్ణంబైనమిత్రశబ్దముమేర మెఱసి విడిసి

ఆ. యెట్టు నిలువఁగూడు నెబ్భంగి రుచియించుఁ
గూడు కంటి కెట్లు గూర్కువచ్చు
నని హిరణ్యకుండు దనలోన దుఃఖించి
యపుడు పలికె వాయసాధిపతికి.

(వేంకటనాథకవిది. సుహృ. 230 ప.)

## సంధివిగ్రహము

ఉ. ఆమహనీయభూరుహముఁనం దనిశంబు ననేకబాంధవ
స్తోమము దన్నుఁ గౌతుకముతోఁ గొలువంగను మేఘవర్ణుఁడన్

నామము దాల్చి ప్రాభవమునం బెనుపొంది వసించు వాయస
స్వామి విపక్షపక్షికుల సంహరణప్రవణాంతరంగుఁ డై.

(నారాయణకవిది. సంధి. 7 ప.)

చ. నటన ననేకకాకపృతన ల్ప్రతివాసరము న్భజింప న
వ్వటమున మేఘవర్ణుఁడనువాయసవల్లభుఁడుండు వాని కు
త్కటభయకంపనంబు లెసఁగ న్నికటప్రకటాటవీకుటీ
వటమున ఘూకసేన గొలువం బెనుగూబయునుండు నెప్పుడున్.

(వేంకటనాథకవిది. సంధి. 7 ప.)

స్థాలీపులాకన్యాయానుసారము పై రెండుపద్యము లిరువురు చెప్పినవియు నుదాహరించితినిగదా. నారాయణకవి పద్యమందలి యర్థస్వారస్యముం జూడుఁడు. వేంకటనాథకవి పద్యమందలి యర్థచమత్కృతిం జూడుఁడు. మొదటిపద్యమందు రసపుష్టి కాననగు. రెండవదానియందుఁ బద కాఠిన్యము కాననగు. రెండు తావులనుండు పద్యముల కిట్టే భేదము గాననగు.

భావమును సులలితపదములతో వెల్లడించుట రసము గాదన్నచో వారికి నమస్కారము. కఠినపదభూయిష్ఠమగు కావ్య మతిప్రౌఢకావ్య మన్నవారికి ననేకవందనములు. రసపుష్టికిఁ గఠినపదములు బారెడుపొడుగు సమాసములు హేతువులుకావని నడుముకట్టుకొని నిలువంబడి చెప్పఁబూనుట తప్పుగాదు. సమాసభూయిష్ఠముగ నున్నంతమాత్రమున నది ప్రౌఢముగాదు. వేంకటనాథకవి కవిత్వమునఁ బెక్కుతప్పులున్నవి, పద్యములు చదువుటకుఁ బ్రౌఢముగానుండును గాని యర్థస్వారస్యము చాల తక్కువ. నారాయణకవి కవిత్వమున రసపుష్టి యెక్కువ. కావున నీపంచతంత్రమును జూచినపుడు మనోహరముగా నున్నదనుట కేలాటి శంకలుండవు.

ఇందులకు దృష్టాంతములుగాఁ గొన్నిపద్యము లుదాహ రింపఁబడు.

సీ. "ధనవంతు గర్వంబు దార్కొన కేలుండు
వ్యసని కాపద యేల పొసఁగకుండు
సతులఁ జూచిన మతి చలియింప కేలుండు
నృపుల మన్నన లేల నిజములగును
గాలంబుచే రూపు కడచన కేలుండు
గౌరవ మర్థి కేకరణిఁ గలుగు
దుర్జనవాగురఁ దొడర కెవ్వఁడు నిల్చుఁ
జిరకాలసుఖము నేనరుఁడు పొందుఁ
తే. గానిగుణములు విడిచి పుణ్యానుకూల
వర్తనంబుల నిహపరవైభవములఁ
బొందువాఁ డొక్కఁడొక్కఁడు పుణ్యపురుషుఁ
డతఁడు దేవాంశజనితమహాత్ముఁ డండ్రు." (మిత్రభేదము. 33౦. ప.)

ఇంకొక్కపద్యము వ్రాయ మనస్సొప్పుచున్నది.

సీ. "కడఁగి మనోవాక్ప్రకారంబు లేకంబు
గాక మిత్రునిఁగూడఁ గడఁగునతఁడు
ప్రతిదినప్రఖ్యాతపాపవర్తనమునఁ
దగిలి ధర్మము చేయఁ దలఁచునతఁడు
నేపార నెపుడుఁ బరాపకారమొనర్చి
పృథుసంపదలఁ గూడఁబెట్టునతఁడు
సమధికంబగు దేహసౌఖ్య మపేక్షించి
చెలఁగి విద్యల నభ్యసించునతఁడుఁ
తే. బరుసఁదనమున శ్రీప్రాప్తిఁ బద్మముఖులఁ
బొసఁగ వలపింతు నని తలపోయునతఁడు

కొలఁకచాలని వారని యిద్ధరిత్రి
కొలయ నూహింతు రనిశంబు నీతివిదులు." (మిత్రభేదము. ౪౯౭. ప.)

చాపల్యమున నింకొకపద్యరత్నమును వ్రాసి లేఖినిని వేఱొకపనికిఁ ద్రిప్పెద.

మ. "ఖలసంసర్గము యౌవనాభ్యుదయముం గాంతాజనస్నేహముం
జలదచ్ఛాయయుఁ ద్రవ్యసంపదయు నైజం బల్పకాలోపభో
గ్యలసత్సౌఖ్యకరంబు లంచు విని వేడ్కం మెచ్చ రార్యుల్ మదిం
విలసద్ధ్యానసమాధినిర్మలగుణావిర్భూతచేతస్కులై."

(సుహృల్లాభము. ౧౫౭. ప)

ఇట్టిపద్యచింతామణు లిందుఁ బూసగూర్చిన ట్లున్నవి. వానినెల్ల నుదాహరించుట గ్రంథమంతయు వ్రాసినట్లే యగును. కాన నాపని మానితిని.

ఇట్టి మహాకవికృతియందుఁ గొన్నిస్ఖాలిత్యములు కనఁబడుచున్నవి. వానిలోఁ గొన్నిఁటిని జూపుచున్నాఁడను.

| తంత్రము. | పద్యసంఖ్య. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| మిత్ర. | ౯౬ | పొడుచుక | పొడుచుకొని |
| " | ౧౧౨ | మోచుకపోవు | మోచుకొనిపోవు |
| " | ౧౯౧ | కట్టించుక | కట్టించుకొని |
| " | ౫౪౬ | ఎత్తుకపోయెను | ఎత్తుకొనిపోయెను |
| " | ౫౫౫ | తోడుకవేపోయితివే | తోడుకొనివేపోయితివే |
| సుహృ. | ౧౧ | వ్రచ్చుక | వ్రచ్చుకొని |
| " | ౧౬౨ | కూడుక | కూడుకొని |
| " | ౧౭౩ | పుచ్చుక | పుచ్చుకొని |
| " | ౨౩౬ | త్రెంచుక | త్రెంచుకొని |
| సంధి | ౫౦ | పట్టుక | పట్టుకొని |
| " | ౨౨౦ | తీర్చుక | తీర్చుకొని |

## సంధులు శ్రుతికటువులుగా నున్నవి.

| | | | |
|---|---|---|---|
| మిత్ర. | ౧౧౨ | సన్నెఱేఁగి | సన్నయెఱేఁగి |
| ,, | ౩౭౩ | ,దాఁగున్న వాఁడ | దాఁగియున్న వాఁడ |
| ,, | ౫౫౮ | ఇంటాతని | ఇంటియాతని |
| లబ్ధ. | ౮౭ | మేఁతెల్ల | మేఁతయెల్ల |

ఉకారాంతమునఁ గువర్ణకమునకు ముఁందు నగాగమము లేమి.

| | | | |
|---|---|---|---|
| సంధి | ౬ | గారవముకిమ్ము | గారవముఁనకిమ్ము |

## అపశబ్దము

| | | | |
|---|---|---|---|
| మిత్ర. | ౨౮౮ | స్నేహితుండు | స్నిగ్ధుండు |

ఆంధ్రభాషను సంస్కరించుచున్నవారము మేమే యను కొను మహాత్ములుగూడ స్నేహితుఁడు అని ప్రయోగించుచున్నవారు. అనగా ఆంధ్రభాషను గూడిన సంస్కృతమున కీదుర్గతియే పట్టునట్లున్నది. కొందఱు ప్రయోగించినంతమాత్రమున నపశబ్దములు సుశబ్దములగుచో మహాకవికాళిదాసు ప్రయోగించిన త్రియంబకశబ్దము మాత్రము సాధు వేల కాఁగూడదో. ఇట్టి సంస్కర్తలు ఆకాలమున లేకపోవుట దీనింబట్టి కనుఁగొనవచ్చు.

మిత్రభేదము ౫౬౨-వ పద్యమున సభికులు అని ప్రయోగింపఁబడినది. ఈప్రయోగము భారతమున నున్నందున సుప్రయోగమే యగునని సమాధానము రాక మానదని తోఁచెడిని.

## యతిభంగము

రణముఁన వారిచేఁ జచ్చుటొండె. (మిత్ర. ౨౪౨. ప.)

సమాసమున ద్విత్వాక్షరమునకు ముందువర్ణము గురువు గామికి

భాస్కరానిలస్వర్లోకపతులుదగిన (సంధి. ౨౬౭. ప.)

అని యున్నది. రేఫశ్లిష్టము నంగీకరింపఁదగునని కొందఱు, కాదని కొందఱు వాదించుచున్నారు. ఇది దానికన్న వేఱుగ సంస్కరింపఁబడినది.

## ప్రాసభంగము

మ. ఒకయక్షౌహిణితోడఁ బాండవబలం బున్నన్ని శౌమధ్యవే
ళను ద్రోణాత్మజుఁ డొక్కఁడుం గదిసి లీలన్ సంహరింపంగ.
(సంధి. ౨౯౧ ప.)

ఇట్లు మార్చిన నించుక మేలేమో.

"వేళను ద్రోణాత్మజుఁ డొక్కరుండు చని." అని ఇదియు నంత మంచిమార్పు కాదు కాని ప్రాసభంగమును దొలఁగింపఁ గలదు.

ఇట్టి కొలఁదిలోపము లున్నను సత్కవిప్రఖ్యాతికి యోగ్యతకుం గొఱంతలేదు. ఇవన్నియుఁ బ్రమాదో ధీమతామపి యన్నమాటతోఁ దొలఁగిపోవును. ఎట్టివారికైనను బ్రమాదము లుండకపోవు. సముద్రతీరమున నిరుపయోగపదార్థములు కొన్ని యున్నను దానిగాంభీర్యాదులకు రత్నాకరత్వమునకుఁ గొఱంత లేనియట్లీకొలఁదిపాటి లోపములచేఁ గవికీర్తిచంద్రున కేలాటికళంకము రాఁజాలదు.

ఇం దేమేని తప్పులుండినను అన్నియుఁ దప్పులే యైనను నాయందుఁ బుత్రవాత్సల్యముంచి సత్కవులు నన్ను మన్నిం

తురుగాక. ఆంధ్రభాష కుందు నొందఁగూడదని యెన్నువాఁడఁ గాన నివి లోపములని తెల్పితిని. వాంఛారీతి సంస్కరణము లొనరించువారి కీపీఠిక యాటంకము కాఁజాలదు. సంస్కర్తలు తమపట్టుదలనే నెగ్గింపఁ బూనక దేశభాషలలోఁ దెనుఁగు లెస్స యను కీర్తిని గాపాడుదురు గాక. గ్రామ్యభాషను జేర్చి వ్యాకరణమునకు ముందున్నట్లు చేయకుందురు గాక. మనదేహము స్థిరత నొందనిది. మనపని కొంతకాలము నిలుచు నేమో భాషకుఁ జెట్టఁ గల్గింపనివార మగుట లెస్స. ఇట్లు వ్రాయుట గూడ నావంటియల్పమతికిఁ దగిన పనికాదు. ఐనను జాపలమున వ్రాసితి. క్షమింతురని భాషాపోషకుల వేఁడుచున్నాఁడను.

ఇట్లు విన్నవించు సుజనపాద సేవకుఁడు,

జనమంచి శేషాద్రిశర్మ.

శ్రీరస్తు

# పంచతంత్రము

## పీఠిక

శ్రీరామాస్తనకుంభకుంకుమరసా
ర్ద్రీభూతవక్షస్స్థలో
దారుం డంజనశైలభర్త కరుణా
ధామాంతరంగుండు శ్రీం
గారశ్రీనిధిఁ దమ్మరాజు బసవ
క్ష్మాకాంతుఁ గాంతాజన
స్మేరాలోకనపూర్ణచంద్రు జయల
క్ష్మీనాయకుఁ జేయుతన్. 1

సీ. ఆకాశమండలం బరవిరిపూఁదోఁట
సొమ్ము పెట్టె రసాతలమ్ము తనకుఁ
గందర్పదేహంబు కమ్మగందపుమ్రాను
కట్టువర్గంబుల కాపు సురలు
వారువంబులఁ బట్టువారు బ్రహ్మాదులు
శిఖిరవిచంద్రు లక్షిత్రయంబు
పవనాగ్నిరవిశశిపరమాత్మ గగనభూ
జలము లంగము లట్టి చారుమూర్తి

తే. శంభుఁ డానందరసకళారంభుఁ డగుచు
సమధికైశ్వర్యముల నిచ్చు సంతతంబు
సల్లలితకీర్తిమల్లికావల్లభునకు
బాహుబలునకు బసవభూపాలునకును. 2

చ. పలుకులబోటి యాత్మసతి భావభవుండు సహోదరుండు గా
నలినదళాక్షునాభినలినంబు నిజంబుగఁ గన్నతల్లి గాఁ
దలఁచినమాత్ర లోకములఁ దాను సృజింపఁగఁ గర్త యైనయ
న్నలువచతుర్ముఖుండు కృతినాథునకిచ్చుఁ జిరాయురున్నతుల్.

ఉ. ఖండశశాంకశేఖరుఁడు కన్నకుమారుని కగ్రజుండు మా
ర్తండశశాంకవహ్ని ముదితప్రభ నొప్పెడిదివ్యమూర్తి యా
ఖండలపద్మజాచ్యుతు లఖండితభక్తిభజించుచుండు వే
దండముఖుం డభీష్టఫలదాయకుఁడై బసవేంద్రుఁ బ్రోవుతన్.

చ. మెఱసినవేల్పుతేనితలమీఁదివియన్నదికాంతి మించి యే
ర్పఱఁ గనుపట్టుపూర్ణశశిదేహవిలాసము నేలఁ జాలి చూ
పఱకు మనోహరంబు లగుభాసురదీప్తుల వర్ణనీయ యై
వఱలెడువాగ్వధూటి బసవక్షితిపాలునిఁ బ్రోచుఁ గావుతన్.

చ. కిసలయహస్త పీనకుచ కిన్నరకంఠి కరీంద్రయాన హే
మసమతనూవిలాస హరిమధ్య మనోభవు కన్నతల్లి యిం
పెసఁగ ముకుందుదేవి కడుఁ బ్రేమను సూనుని నేలునట్లుగా
బసవనృపాలుమందిరముఁ బాయక యెప్పుడు నేలుఁ గావుతన్.

వ. అని యిష్టదేవతాప్రార్థనంబుఁ జేసి. 7

ఉ. కొండయమంత్రియొజ్జయకుఁ గూరిమినందనుఁ డైనమద్గురుఁ
ఖండశశాంకశేఖరుఁద్రికాలముఁ బూజ యొనర్చునాగనా
ర్యుం డనుపేరు గల్గినసరోజభవాన్వయవార్ధికైరవా
ప్తుం డగుపుణ్యమూర్తి సులభుండగుటం గొనియాడి వేడుకన్.

సీ. వల్మీకభవునకు వందనం బొనరించి
సత్యవతీసూను సంస్తుతించి
బాణుని నుతియించి భవభూతిఁ గొనియాడి
భారవిఁ బొగడి మయూరుఁ దలఁచి
శివభద్రుఁ గొనియాడి శ్రీహర్షుఁ బ్రార్థించి
కాళిదాసుఁ బ్రసన్నుఁగాఁ దలంచి
నన్నయభట్టాంకునకు మ్రొక్కి తిక్కన
సోమయాజుల నతిస్తుతులఁ గొలిచి
తే. శంభుదాసుని మదిలోన సంస్మరించి
మఱియు సుకవుల సత్కృపామహిమ వడసి
శారదాసత్ప్రతాపవిశారదుండ
నగుటఁ గృతిఁ జెప్పఁదలఁపు నా కమరియుండె. 9

ఉ. చెప్పిననాకవిత్వము రుచింపనితావులు చూచి చెప్పఁడీ, తప్పులు
లేనిచో నవుఁ గదా యని తీర్పఁడు మాటిమాటికిన్, జెప్పకుఁ
డొప్పఁ దప్పనుచుఁ జెప్పఁగ నేర్చినవాని కొక్కచోఁ, దప్పులు
లేక మానవని తద్జ్ఞు లెఱుంగుఁడు మీకు మ్రొక్కెదన్. 10

వ. అని మద్గురుకరుణాస్మరణంబును బురాతనసత్కవిసమారాధ
నంబునుం జేసి యొక్క మహాప్రబంధంబుఁ జెప్ప నుద్యోగించు
సమయంబున. 11

సీ. మండలాధిపమూర్ధమకుటమాణిక్యసం
భావితాంచితపాదపంకజుండు
కల్పితహేమాద్రికల్పమహాదాన
ధారణీదేవసంతర్పకుండు
పరిచరసహవాసభామామనఃప్రియ
భాసురకుసుమశరాసనుండు

మానితాంగకసర్వమంగళాలంకృత
శేఖరీకృతరాజశేఖరుండు

తే. వల్లభూపాలతమ్మభూవల్లభేంద్ర
శుక్తిముక్తాఫలం బనఁ జూడ నమరి
మాన్యసామంతవిద్వదమాత్యనృపతు
లోలిఁ గొలువంగ బసవేంద్రుఁ డొక్కనాఁడు. 12

వ. విద్వత్సంభాషణసమయంబున. 13

చ. హరిహరభక్తు నార్యనుతు నంధ్రకవిత్వవిశారదు న్మహీ
శ్వరవరమాననీయుఁ గులవర్ధను శాంతుఁ బ్రబంధవాచకా
భరణము నాగమాంబకును బ్రహ్మయమంత్రికి నాత్మసంభవుఁ
సరసుని దూబగుంటిపురశాసను నారయనామధేయునిన్. 14

క. తలపించి హితులు చెప్పఁగఁ
బిలిపించి కవిత్వగోష్ఠిఁ బ్రియ మెసఁగంగాఁ
బలుకుచు నితాంతభక్తిం
దలుకొత్తఁగ నంకురించు దరహాసముతోన్. 15

క. తనముఖచంద్రమరీచులు
జననయనచకోరములకు సాంద్రానందం
బొనరింప వేడ్క నన్నుం
గనుఁగొని యిట్లనియె వినయగౌరవ మెసఁగన్. 16

చ. సురుచిర మైననీకవిత సూరిసభాంతరయోగ్యతామనో
హరసరసార్థగుంభనల నందము గావున నారనార్య సు
స్థిరగతిఁ గీర్తిన న్మానరఁ జేసి సమస్త జగత్ప్రసిద్ధ మై[గన్.
పరఁగుచు నుండ మా కొకప్రబంధ మొనర్పు ప్రియం బెలర్పఁ

వ. తత్ప్రబంధం బెయ్యది యం టేని.

ఆ. పంచతంత్ర మనఁగ నంచితగీర్వాణ
భాష మున్ను చెప్పఁబడినయట్టి
కావ్య మంధ్రభాషఁ గర్ణామృతంబుగాఁ
గూర్పవలయు నీదునేర్పు మెఱయ. 19

వ. అని వినయంబునం దాంబూలవస్త్రాంబరాభరణంబు లొసంగి
వీడుకొల్పినం బ్రియం బంది మదాత్మగతంబున. 20

చ. పస గలనీతిశాస్త్ర మని ప్రాజ్ఞులు మెచ్చినపంచతంత్రికిన్
వసుమతిఁ దమ్మరాజుబసవక్షితినాథుఁడు నాథుఁ డౌటకుం
బొసఁగి యశోవిలాసినికిఁ బుట్టినయిల్లని సన్నుతింపఁ బెం
పెసఁగె సముద్రముద్రితమహీస్థలిరాజసభాంతరంబులన్. 21

వ. కావున నేతత్కృతి కధీశ్వరుం డైనబసవక్షితీశ్వరువంశం బభి
వర్ణించెద. 22

చ. రవికులశేఖరుం డైనరఘురామునినందనుఁ డైన కుశావనీ
ధవుఁ డుదయించె నాయనకు ధర్మవిధిం బ్రభవించె శ్రీసదా
శివమహిమాధ్యుఁ డైవిజయసేనకుమారకుఁ డొప్పు నవ్వరన్
సవినయమూర్తి యవ్విభునిసంతతి నంతఁ గ్రమక్రమంబునన్.

చ. మును బెజవాడదుర్గఁ దనముగ్ధతనంబున మెచ్చఁ జేసి పెం
పున రథదంతివాజిభటభూరిబలంబులచేఁ గళింగభూ
జనపతిఁ ద్రుంచి చేవఁ దనసంతతికై మహిఁ బాడి నిల్పి క్ర
మ్మనఁ జిరకీర్తులం గనియె మాధవవర్మ తదన్వయంబునన్. 24

మ. ఉదయించెన్ గమలాప్తవంశకరుఁడై యుద్యత్ప్రతాపోన్నతిన్
జదియించెన్ సకలార్థిదైన్యముల రాజత్కల్పభూజాతమై
కదియించెన్ నిజకీర్తిరాశి దిశలన్ గల్పాంతరస్థాయిగాఁ
గుదియించెన్ బ్రతివీరబాహుబలముల్ గొమ్మావనీశుండిలన్.

క. ఆకొమ్మక్షితిపాల
శ్రీకాంతున కుదయ మయ్యెఁ జిరతరపుణ్య
శ్లోకుం డన్నలదేవమ
హీకాంతుం డతులధైర్య హేమాచలుఁ డై. 26

చ. అతనికి నుద్భవించె నభియాతిమహాంబుధికుంభసంభవ
ప్రతిముఁడు సింగభూవిభుఁ డభంగపరాక్రమశాలి శౌర్యవ
ర్ధితుఁడు వివేకశీలుఁ డతిధీరుఁడు నిర్మలకీర్తికామినీ [యున్.
రతుఁడు సమగ్రదానగుణరమ్యుఁడు సౌమ్యుఁడు బుద్ధి నెంత

ఉ. బల్లిదుఁ డైనసింగనరపాలున కుద్భవ మైరి ధాత్రి శ్రీ
వల్లభమూర్తు లైనపెదవల్లభుఁడున్ జినవల్లభేంద్రుఁడున్
సల్లలితప్రతాపబలసాహసనీతివివేకసంపదన్
దొల్లిటిరామలక్ష్మణులదోయి యనంగ మహానుభావు లై. 28

వ. అందగ్రజుండు. 29

చ. తిరుగనిమందరాద్రి కళ దీయనిపూర్ణశశాంకుఁ డాజులన్
సురుగనిపార్థుఁ డీశుకను సోఁకనిమన్మథుఁ డొక్క బొంకునుం
బొరయనిధర్మసూతి యుడి వోవనికల్పమహీరుహం బనన్
వరగుణధాముఁ డైనపెదవల్లభభూవరుఁ డొప్పు నెంతయున్.

క. అన్నరపతిపుణ్యాంగన
యన్నలదేవమ్మ గెలుచు నన్నులు దేవిన్
సన్నుతగుణసౌందర్యస
మున్నత విభవముల నన్న నువిదలు సరియే. 31

వ. ఆదంపతుల పురాకృతపుణ్యవిశేషంబున. 32

క. సుతు లుదయించిరి సింగ
క్షితిపతియును దమ్మవిభుఁడు శ్రీతిరుమలభూ

పతియుఁ గలికాలమున నొక
సతికిని రామత్రయంబు జనియించెనొ నాన్. 33

వ. అమ్మహీశ్వరులలోఁ దమ్మక్షితీశ్వరుండు. 34

సీ. త్రిభువనాలంకారదీపితభావళ్య
వరకీర్తిమల్లికావల్లభుండు
నిజభుజాసికుఠారనిర్భిన్నదుర్వార
పరనృపాలకమన్యభార్గవుండు
కింకిణీఘంటికాంకితసింధుఘోటక
బహుళసైన్యరణరంగభైరవుండు
బంధుసంరక్షణప్రకటమహాభాగ్య
బంధురసహాకారబాంధవుండు

తే. నతమహీపాలమస్తకన్యస్తమృదువి
రాజమానపదాబ్జుండు రాజవరుఁడు
రాజమాత్రుండె విభవవిభ్రాజితుండు
వల్లభూపాలతమ్మభూవల్లభుండు. 35

మ. మనుమార్గుం డగుతమ్మభూపతికి వేమాజాంబకుం బుత్రుఁడై
జనియించెన్ బసవేంద్రుఁ డర్థిజనభాస్వత్కల్పభూజాతమై
వనితామన్మథుఁడై వివేకనిధియై వారాశిగంభీరుఁడై
యనతారాతిమహాంధకారపటలీహంసప్రతాపాఢ్యుఁడై. 36

వ. మఱియు నేవంవిధగుణగణాలంకృతుం డైనబసవభూపా
లుండు. 37

సీ. రమణీయదానధారాప్రవాహంబులు
పాథోధి కలితవిజృంభణము గాఁగ
నిరుపమానప్రభావనిర్మలసితకీర్తి
త్రిభువనసాంద్రచంద్రికలు గాఁగ

నతులవిక్రమబలోద్యత్ప్రతాపస్ఫూర్తి
పరులకు నుగ్రాతపంబు గాఁగ
సమధికశృంగారసౌందర్యరేఖ దాఁ
దరుణీలతావసంతంబు గాఁగ

**తే.** రామరఘురంతిసగరధర్మజదిలీప
భోజసర్వజ్ఞసోమేశరాజసరణి
ధాత్రిఁ బాలించెఁ దమ్మభూధవసుతుండు
శాశ్వతంబుగ బసవభూమీశ్వరుండు. 38

**సీ.** నరులకుఁ జేచాఁచినను ఫలం బందని
దివిజభూరుహమువితీర్ణి యెంత
యవయవశృంగార మంగనామణులకుఁ
జూపనికందర్పరూప మెంత
కనుఁగొన నొకవేళ ఘనతిరోహితుఁడైన
తపనునిమహితప్రతాప మెంత
యురుశక్తిఁ జని మహోవ్యూహంబు వెడలంగఁ
జాలనిసౌభద్రుశౌర్య మెంత

**తే.** వితరణంబున శృంగారవిలసనమున
దీపితాటోపసహజప్రతాపమహిమ
శౌర్యగుణమున నెవ్వారు సాటి వత్తు
రితని కన మీఱె బసవభూమీశ్వరుండు. 39

**సీ.** కుసుమకోదండంబు గుఱుతు మూఁడము గాని
దర్పితరూపకందర్పుఁ డనియు
నిజమూర్తిలోపల నెర సెఱుంగము గాని
సత్కళాసంపూర్ణచంద్రుఁ డనియు

నుష్ణాంశుజాలంబు లొదవఁ గానము గాని
యతులితసత్ప్రతాపార్కుఁ డనియుఁ
బొసఁగ వేగన్నులపాడవు మించదు గాని
సాంద్రవైభవనిర్జరేంద్రుఁ డనియు
తే. ననుదినంబును దనుఁ జూచునఖిలజనులు
సమధికానందమగ్నులై సన్నుతింప
సురుచిరాకారకాంతితేజోవిభవము
లమరుఁ దమ్మయబసవధరాధిపునకు. 40

క. అసమానమానధనునకు
రసికశిఖామణికి దానరాధేయునకుఁ
బ్రసవాంబకసమరూపున
కొసబిరుదరగండనికి మహోర్వీశునకున్. 41

క. వేమాజాంబాసుతునకు
భామాకంతునకు మన్యభార్గవునకు సం
గ్రామక్షోణీవిజయ
శ్రీమహనీయునకు రాజసింహాంబునకున్. 42

క. రణరంగభైరవునకుఁ
బ్రణమితరాజన్యహృదయపద్మార్కునకుఁ
మణికనకవస్తువాహన
గణికాద్యఖిలప్రదానఖచరేంద్రునకున్. 43

క. సహకారబాంధవునకుఁ
సహజాలంకారదేహసౌందర్యునకుఁ
మహనీయకీర్తివాచా
మహితాత్మునకుఁ బ్రతాపమార్తాండునకున్. 44

క. తెల్లదలాటాంకునకుఁ
సల్లలితకృపాకటాక్షసౌజన్యునకుఁ
ఫుల్లారవిందనేత్రున
కుల్లసితపరాక్రమునకు నూర్జితమతికిన్. 45

క. కిమ్మీరాంతకబలునకు
ధమ్మిల్లనవప్రసూనధరునకుఁ దరుణీ
సమ్మోహపంచశరునకుఁ
దమ్మయబసవనికి నుభయదళమిండనికిన్. 46

## మిత్రభేదము

వ. అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నాచెప్పంబూనిన పంచతంత్రి యనుమహాప్రబంధంబునందుం గలకథలకు నలంకారంబుగా వర్ణింపం దగినపాటలీపురం బెట్టి దనిన. 47

సీ. వేదశాస్త్రపురాణవిద్యావిజృంభిత
కలితధాత్రీసురకలకలంబు
గజహయారోహణకౌశలసంచార
మహితరాజకుమారమండలంబు
వజ్రముక్తాఫలవస్త్రసువర్ణాది
సకలవిక్రయవైశ్యసంకులంబు
నానాయుధాభ్యాసనైపుణధౌరేయ
విశ్రుతసచ్ఛూద్రవిభ్రమంబు
తే. కల్పితానల్పదేవతాగారభూమి
రత్నకీలితఘనసౌధరాజితంబు
నగుచు నమరేంద్రునగరంబు నగుచు ధాత్రిఁ
బొలుచుఁ బాటలిపుత్రమన్పురవరంబు. 48

ఉ. ఆపుర మేలుచుండు నమరాధిపతిప్రతిమానవైభవో
ద్దీపితుఁ డార్యసమ్మతుఁడు ధీరుఁడుదారుఁడు బాహువిక్రమా
టోపవిజృంభితుం డనఁ గడుం బొగడొంది సుదర్శనుండు నా
భూపకులావతంసము ప్రభుత్వముఁ బేరును బెంపు నొప్పఁగన్.

క. ఆరాజు తనకుమారులు
ధారుణిఁ బాలించునేర్పు దగిలెడుచదువుల్
నేరక యునికి మనోవ్యథఁ
గూరి నిజాత్మం దలంచెఁ గొలు వున్నయెడన్. 50

తే. ఎఱుకయును ధార్మికత్వము నింత లేని
కొడుకు పుట్టిన నేటికిఁ గొఱ తలంపఁ
జాఁడిపాఁడివిధంబులు చూప లేని
గొడ్డుటావైన వలవనిజడ్డు గాదె. 51

క. పెక్కండ్రు సుతులు గల రని
లెక్కించిన ఫలము గలదె లేశంబును బెం
పెక్కినకులదీపకుఁ డగు
నొక్కఁడె తనయుండు చాలు నుర్వరమీఁదన్. 52

వ. అని మఱియుఁ దనమనంబున. 53

సీ. కలకంఠిగర్భంబు క్రాఁగిపోయిన మేలు
పుట్టినప్పుడ మృతిఁ బొంద మేలు
తగ ఋతుకాలంబు దప్పిపోయిన మేలు
కన్య యైనను సంతకంటె మేలు
కాంతుఁడు పరదేశగమనుఁ డైనను మేలు
మగువ గొడ్రాలైన మఱియు మేలు

పల్లవాధర పతి నొల్ల కుండిన మేలు
పడఁతుక తెగులుచేఁ బడిన మేలు

తే. గాక శాస్త్రపరిజ్ఞానఘనులు గాని
సుతులు గల్గినఁ దండ్రికి సొంపు గలదె
రూపబలవిక్రమాద్భుతాటోపు లైన
నధికధనవంతు లైన నయ్యధము లేల. 54

చ. జనకునిపూర్వపుణ్యఫలసంపదఁ దత్తనయుం డుదారుఁడుఁ
మనునిభమూర్తియుఁ బిత్రుకమాతృహితుండును నౌను
బాపకర్మునకు జనించినట్టి యధముండు కులాంబుధిమంథ
నంబునఁ,జనితహాలాహలం బనఁగఁ జాలి హరించుఁ గులంబు
వ్రేల్మిడిన్. 55

సీ. కమనీయవిద్య దాఁ గామధేనువుభంగిఁ
గామితార్థంబులు గలుగఁజేయు
సజ్జనవిద్వాంససంఘంబులోపల
మానుగాఁ దనుఁ బెద్దమాన్యుఁ జేయు
నెన్ని దేశంబుల కేఁగిన సాయమై
తల్లిచందంబునఁ దన్నుఁ బ్రోచుఁ
బన్నుగాఁ దనపుణ్యపాపంబు లెఱిఁగించు
సాధించు నిహపరసాధనంబు

తే. నగ్నిఁ గాలదు రాజుల కలవి గాదు
నీళ్ల నానదు చోరులపాలు గాదు
సోదరులచేత నెప్డుఁ బంచుకొన రాక
చెలఁగు విద్యాధనమునకుఁ జేటు లేదు. 56

వ. కావున. 57

**తే.** సంతతోన్మార్గవర్తన సరవిఁ దిరుగు
సుతులఁ జదివించి సద్బుద్ధిహితులఁ జేసి
వెసను నీరీతిసంపద నొసఁగఁ జాలు
నట్టిపుణ్యుండు గలఁడొకో యరసి చూడ. 58

**ఉత్సాహ.** అని సుదర్శనుండు పల్కునట్టి యవసరంబునం
దనిమిషేంద్రగురుఁడపోలె నఖలనీతిశాస్త్రసం
జనితబుద్ధియుతుఁడు విష్ణుశర్మనామధేయుఁ డి
ట్లనియెఁ దాఁ బ్రతిజ్ఞ గాఁగ నవనివిభునితోడుతన్. 59

**తే.** అఖలనీతిశాస్త్రంబులు నాఱునెలల
నీకుమారులఁ జదివింప లేక యున్న
సుతులపని యేమి నన్ను నాశ్రితులలోన
నడప కాప్రాద్దె గ్రామంబు వెడల నడపు. 60

**సీ.** అని విష్ణుశర్మ పల్కిన ప్రతిజ్ఞావచ
నంబుల కతఁడు ముదంబు నొంది
యనుపమభూషాంబరాదులఁ దనిపి సం
భావించి సుతుల నప్పనము సేయ
సరవిఁ దొల్లిఁటినీతిశాస్త్రంబు లన్నియు
సంక్షేపరూపవిస్పష్టముగను
దంత్రంబు లైదింటి ధరఁ బ్రసిద్ధము గాఁగ
నేర్పడఁగాఁ జేసె నెవ్వి యనిన

**ఆ.** మిత్రభేద మనఁగ మెఱయ సుహృల్లాభ
మనఁగ సంధివిగ్రహం బనంగ
లబ్ధనాశ మనఁగ లలి నసంప్రేక్ష్యకా
రిత్వ మనఁగఁ బరఁగురీతి మెఱయ. 61

చ. అమరినయట్టితంత్రముల నైదిఁటియందును సర్వనీతిశా
స్త్రముల సుభాషితంబులను సారకథాబహుళంబు భూవరో
త్తమతనయానుబోధమును ధారణి లోకహితంబుగాఁ గ్రమ
క్రమమునఁ గావ్యరూప మెసకంబుగఁ జేసెను వానిలోపలన్.

వ. ప్రథమతంత్రం బగుమిత్రభేదం బెట్టి దనిన. 63

క. మృగపతియును వృషభంబును
మిగులఁగ సఖ్యంబు చేసి మెలఁగఁగ వనిలో
మృగధూర్తం బారెంటికి
విగత స్నేహంబు చేసి విఱియఁగఁ జేసెన్. 64

ఆ. అనిన నృపకుమారు లాకథ మా కెఱిం
గింపుఁ డనుచుఁ బలుక నింపు మిగుల
సావధానబుద్ధి సకలంబు వినుఁ డని
చెలఁగి విష్ణుశర్మ చెప్పఁ దొడఁగె. 65

తే. కలదు దక్షిణాపథమునఁ గనకరత్న
రాజితం బయి మహిళాపురం బనంగ
వర్ధమానుం డనఁగ సార్థవాహుఁ డందు
నధిక సంపత్సమృద్ధిచే నతిశయిల్లు. 66

వ. ఇట్లున్న సార్థవాహుం డొక్కనాఁడు తనధనంబు వృద్ధి
నొందించుటకుఁ దలంపుపుట్టి యి ట్లనియె. 67

ఆ. అరసి లేనిచోట నర్థ మార్జింపఁగఁ
దగిన యది సురక్షితంబు గాఁగఁ
జేసి వృద్ధిఁ బొందఁ జేయు తెఱంగున
నట్టిధనము సద్వ్యయంబు సేయ. 68

క. నేరవలె నివ్విధంబున
నేరుపు లేకున్నవాని నిలయమున ధనం
బేరీతి నిలువ దది ని
ష్కారణ మయి విఱియఁ బాఱఁ గానరు మూర్ఖుల్. 69

వ. అవ్విధం బెట్టి దనిన. 70

సీ. సంరక్ష సేయనిస్వర్ణ మప్పుడె చెడు
వృద్ధిఁ బొందింపనివిత్త మెడయు
ననుభవతకు రానియర్థంబు గల్గియు
లేనిఫలమె కాని లేదు సుఖముఁ
తగ నుపార్జించియు ధనము పాత్ర మెఱింగి
దక్షత నిడిన సంరక్ష యదియ
నిండినసరసికి నెరయ వాటము గాఁగ
నలువులు దీర్చినయట్ల కాన
తే. ధనము లార్జించి సంరక్ష తగ నొనర్చి
వృద్ధిఁ బొందించి యనువుగా వెచ్చపఱచి
నడవ నేర్చినవానిజన్మంబు సఫల
మున్నవారలజీవన మెన్న నేల. 71.

వ. అని వర్ధమానుండు వెండియుఁ దనమనంబున నిట్లు తలంచె.

చ. తమయుదకంబు వాహినులు ద్రావనిభంగి ఫలించినట్టివృ
క్షములు ఫలంబులం దిననిచందమునన్ జలదంబు నీట స
స్యములకుఁ దృప్తిఁ జేసి యవిస్మృతిఁగోరక యున్నమాడ్కి ను
త్తములధనంబు సజ్జనులఁ దార్కొను బ్రత్యుపకారనిస్పృహన్.

సీ. అని వర్ధమానుండు తనమదిఁ జింతించి
శకటంబునను బెక్కు సరకు లెత్తి

యందు సంజీవకనందకాఖ్యము లగు
వృషభయుగ్మముఁ గట్టి విపినభూమి
త్రోవ రాజ్యమునకుఁ బోవఁగాఁ దెరువున
నిమ్నోన్నతంబుల నీల్గి తివియ
జానుభగ్నం బైన సంజీవకుని గనుఁ
గొని వర్ధమానుఁ డాకులత నొంది
తే. పరిజనుల నాతఁ డం దున్నసరకు లెల్ల
మోవఁ గట్టడ చేసి సంజీవకునకుఁ
గాపు కొందఱఁ బెట్టి యక్కడఁ దొలంగి
చింత నొందుచుఁ బోవ ననంతరంబ. 74

ఉ. కావలి యున్నయాభటనికాయము సుగ్రవనంబులోపలఁ
జావఁగ నేల పోద మని చయ్యన నేఁగి నిజేశ్వరుం గళా
కోవిదుఁ గాంచి యొక్కహరి కూడఁగ ముట్టిననేము పాఱ సం
జీవకుఁ బట్టి చంపె నది చెప్పఁగ సిగ్గగుచున్న దెంతయున్.

క. అని యివ్విధమున వారలు
వినయం బెసఁగంగ వచ్చి వినిపింప నిజం
బని సంజీవకుఁ దలఁచుచు
మనికితపడుచుండె వర్ధమానుఁడు బుద్ధిన్. 76

వ. అట సంజీవకుండు. 77

చ. విఱిగినకాలు వచ్చి యటవీస్థలి నాయువుకల్మిఁ జేసి యే
డ్తెఱఁ జని పూరి మేసి కడుఁ దియ్యనిచల్లనినీరు ద్రాగి మై
యెఱుఁగక సత్వసంపద వహించి భయం బొకయింత లేక య
క్కఱ నొకనాఁడు డప్పియెసఁగ న్నదికిన్ వడి నేఁగుచున్నెడన్.

తే. ఆవనంబునఁ బింగళకాఖ్యుఁ డయిన
సింహ మధికజంతువుల శాసింప నధికుఁ
డగుచు నిజభుజవిక్రమణాఢ్యమహిమ
ననుభవించుచు రాజ్యంబు నట్లు కాఁగ. 79

క. అభిషేకాది క్రియలను
విభవము లేకయును ఘోరవిపినంబులలోఁ
శుభగోన్నతవిక్రమమునఁ
బ్రభువై సింహము మృగాధిపతియై వెలసెన్. 80

వ. ఇట్లు సకలవనజంతునియామకుండై పింగళాఖ్యుఁ డగుహర్యక్షముఖ్యుండు వనంబున వెలుంగుచుండె. 81

శా. ఆసింహం బొకనాఁడు డప్పిగొని తోయం బానఁ గాంక్షించి వే
రాసం దా యమునాతరంగిణిని డాయం బోవుచో నవ్వలన్
భూసంత్రాసకరాంత్యకాలజలదప్రోద్భూతగర్జోపమ [చున్.
వ్యాసంగంబుగ అంకె వైచె నొకచో నాఁబోతు కాల్ద్రివ్వు

క. బెడిదంబుగ నవ్విధమున
నడరినసంజీవకునిమహాధ్వని విని య
ప్పుడ మృగపతి తనయాత్మం
గడు శంకం బొంది యచటఁ గదలక యున్నన్. 83

ఆ. అతనిమంత్రితనయు లైనట్టికరటక
దమనకాఖ్యు లపుడు తద్విధంబుఁ
దెలిసి దమనకుండు తెఱఁ గొప్పఁ గరటకు
తోడఁ బలికె నగవు తోఁప నపుడు. 84

ఆ. ఇంతరాజు చూడు వింతశబ్దము విని
నదికి నీరు ద్రావఁ గదల వెఱచె

దీనికారణంబుఁ దెలియుద మే యన్నఁ
గరటకుండు పలికెఁ గడఁకతోడ. 85

క. మన కేమికారణం బీ
పనులు విచారింపఁ దగనిపనికిం జనినన్
మనుజుండు నొచ్చు ము న్నొక
వనచర మొక తగనిపని నెపంబున నీల్గెన్. 86

వ. అనిన విని దమనకుం డవ్విధం బెట్లనినఁ గరటకుం డిట్లనియె.

చ. ఒకనగరంబుచేరువ మహోన్నతదేవగృహంబు జీర్ణ మై
వికలత నొంది యర్ధము భువిం బడి యుండఁగ దానిఁజూచి యు
త్సుకమతినొక్క వైశ్యుఁడది తొల్లిటియందమునొందునట్లుగా
నకుటిలవృత్తిఁ జేయుఁ డని యర్థ మొసంగిన శిల్పకారులున్.

క. ఇయ్యకొని నగరు గట్టుచు
నయ్యెడ నొకచేవదూల మది పలకలుగా
వ్రయ్యుటకు నాడనాడను
జయ్యనఁ గీలములు గాఁడఁ జఱచినపిదపన్. 89

ఆ. ప్రొద్దు చేరఁబడినఁ బోయి రిండ్లకు వార
లాసమీపతరుల నాశ్రయించి
తిరుగుమర్కటములు దేవాలయంబున
కవల నివల మెలఁగునట్టియెడను. 90

సీ. గుడి యెక్కి తరులపైఁ గుప్పించునవియును
దరువులపై నుండి దాఁటునవియు
నురుతరశాఖల నూఁగాడునవియును
బ్రాకారములు ప్రాఁకి పాఱునవియు
గోపురంబులమీఁదఁ గూర్చుండునవియును
గోళ్లఁ బ్రక్కలు వీఁపు గోఁకునవియు

నిక్కుచు బొమ లెత్తి వెక్కిరించెడునవి
యొండొంటితోఁ బోరి యోడునవియు
తే. నిట్లు వానరయూథంబు లిట్టు నట్టు
సహజ మగుచాపలంబున సంభ్రమింప
వానిలోపల నొకవృద్ధవానరంబు
దూరముగఁ బాఱె తా విధిప్రేరణమున. 91

క. కీలాకీర్ణ స్తంభము
లోలత్వమై నెక్కి నెఱియలో నండంబుల్
ప్రేలంగ రెండుకరములఁ
జీలం బెకలించి లావుచేఁ దిగియంగన్. 92

క. బిగు వెడలి చీల యూడిన
నగచరు బీజంబు లిఱుక నానొప్పిఁ గడున్
వెగ డొంది మొఱలు వెట్టుచుఁ
దెగియెన్ మర్కటము దాని త్రిమ్మట వింటే. 93

వ. కావునఁ దమకుం గారణంబు లేనిపనికిం జొచ్చినమానవుల తెఱం గిప్పుడు చెప్పిన మర్కటవ్యాపారంబుచందంబు మన కిది విచారింప నేమిపని మనయేలిక భక్షింపఁగా మిగిలిన మాంసం బున్నయది భక్షింతము రమ్మనిన విని దమనకుండు రాజులం గొలిచి తనకడుపుఁ బ్రోచుకొనుమాత్రం బైనఁ గొలువ నేల వినుమని యి ట్లనియె. 94

క. మిత్రుల కుపకారంబును
శత్రుల కపకారమును నిజంబుగఁ జేయన్
క్షత్రియులఁ గొలుచుట యుదర
మాత్రముకొఱకైన సేవ మహిఁ గొఱ యగునే. 95

క. ఒక్కరుని బ్రతుకువలనన్
జెక్కండ్రు మహాసమృద్ధిఁ బెరుగక యున్నన్
ముక్కునఁ బొడుచుక తినియెడి
కొక్కెర తనకడుపుఁ బ్రోచుకొనదే తలఁపన్. 96

సీ. స్వల్పవసాస్నాయుసంయుతకఠినాస్థిఁ
గొఱుకు నాఁకలి మానుకొఱకుఁ గుక్క
సింహంబు తనయంకసీమ జంబుక మున్న
దృష్టించి మఱి దాని తెరువు వోక
శుంభదుజ్జృంభితకుంభికుంభంబుల
మెదడు భక్షింపంగ మదిఁ దలంచు
హీనులు నధికులు నైనమానవులును
దమతమకోలఁది సత్వములఁ దలఁతు
తే. రఖిలకర్మంబులను గాన నాత్మశక్తి
కనుగుణం బైనఫలములె యావహిల్లు
నట్లు నీవును జాతిమర్యాదతోడి
తలఁపుఁ దలఁచితి యిది దొడ్డతనము గాదు. 97

వ. అదియునుంగాక. 98

సీ. వాలంబు నులిచియు నేలఁ గాళ్లడఁచియు
ధాత్రిపైఁ బొరలియుఁ దాల్మి విడిచి
వదనంబుఁ దెఱచియు నుదరంబుఁ జూపియుఁ
బెక్కుపాట్లను బడ్డ కుక్క కొక్క
కడియెఁ డన్నమె కాని కడుపార నిడఁబోరు
నాగంబునకుఁ బ్రార్థనంబుతోడఁ
గబళశతంబులు కరమున కందియ్య
నాఁకలి దీఱంగ నది భుజించు

తే. నెంత కార్పణ్యపడినను హీనజాతి
కెవ్వరును నీరు కడు నల్ప మిచ్చి రేని
ఘనున కూరక యుండంగఁ గాంతు దీఱ
గురుతరార్థంబు లిత్తురు ధరణిపతులు. 99
క. ఘనవిద్యావిక్రమములు
మనుజేంద్రులు చూచి మెచ్చ మఱి బ్రతికినఁ గా
కనయంబుఁ దోఁక నులిచిన
శునకమునకుఁ గడెడు కూడ చూడక యిడరే. 100
తే. పౌరుషజ్ఞానకీర్తులఁ బరఁగనేని
వానిసంపద యొకపూఁట గైనఁ జాలు
నుదరపోషణమాత్రకై యుర్విమీఁదఁ
గాకి చిరకాల మున్న నేకార్య మగును. 101
తే. అల్పజలముల మొరపవా గడరి పాఱు
నల్పధాన్య మొదవు మూషకాంజలికిని
స్వల్పఫల మబ్బెనేనియు స్వల్ప మనక
యల్పుఁ డానందమును బొందు నల్పలీల. 102
క. సరవి హితాహితగుణముల
వెర వెఱుఁగక చవికిఁ జదువు వింతగ నాత్మో
దరభరణకేవలేచ్ఛం
బరఁగెడునరపశువు పశుప్రతి యన వినవే. 103
వ. అనినఁ గరటకుం డిట్లనియె. 104
క. మనము ప్రధానులమే యే
పనులకుఁ గర్తలము గాము బహునీతులకుం
బని యేమి యనిన నతనికి
విను మని దమనకుఁడు పల్కె వివరం బెసఁగన్. 105

తే. భాగ్యవశమున బుద్ధిసంపన్నుఁ డగును
బుద్ధిబలమున నృపులకుఁ బూజ్యుఁ డగును
నృపులు మన్నింప నయకళానిపుణుఁడగుచుఁ
బూని రాజ్యంబునడుపుప్రధానుఁడగును. 106

వ. కావునఁ బ్రధానపదవికిం బ్రాప్తంబు గలిగినం గలుగుఁగాక
దాన నేమిచోద్యంబు వినుమని యిట్లనియె. 107

చ. నడవడి మంచి దైనను జనంబులు పెద్దఁగఁ జూతు రాతనిన్
నడవడి చక్కఁగానినరు నచ్చిన చుట్టము లైనఁ జేరనీ [హీన్
కెడ గలుగంగఁ దోలుదు రహీనతయున్ లఘువృత్తియు న్మ
నడవడిచేత వచ్చుటది నైజము దీని నెఱుంగ వింతయున్. 108

చ. ఒడికముతోఁ బ్రయత్నమున నొక్క మహాశిలఁ గొండమీఁది
కిన్, గడపఁగ భార మచ్చటిది గ్రక్కున భూమికి డిగ్గఁ
ద్రోవఁగాఁగడు సులభంబ యట్లు గుణగణ్యుఁ డనం బొగ
డొందుటద్భుతం, బుడుగక దుర్జనుం డనఁగ నుండుట దా
సుకరంబుధాత్రిలోన్. 109

క. అని దమనకుండు సెప్పిన
విని కరటకుఁ డతనితోడ వివరించితి వీ
వను వైననీతివాక్యము
లెనయఁగ నీతలఁచుకార్య మెయ్యది సెప్పుమా. 110

మ. అనినన్ వానికి నిట్లనున్ దమనకుం డత్యంతభీతస్థితిన్
మనరా జేటికిఁ బోవఁగా వెఱచియున్నాఁ డిప్డు కంటే యనన్
విని యేభంగి నెఱింగితీ వనిన భావింపఁగ నేకార్య మై
నను భావజ్ఞులయంతరంగములఁ గానన్వచ్చు భావింపుమా.

చ. పలికినస న్నెఱింగి పశుపంక్తులు సెప్పినయట్లు చేయు శి
క్షల హయకుంజరంబులు వశంబయి మోచుకపోవు నట్లు ఘ

ర్త్యులు తమబుద్ధిలే కెదిరియుక్తిఁ జరించిన వార లేటికిన్
వెలయఁ బరేంగితం బెఱుఁగ నేర్చుట గాక వివేక మిష్టహీన్.

ఉ. కావున నిప్పు డివ్విభునిఁ గన్గొని చిత్తము వచ్చునట్లుగా
సేవ యొనర్చి మన్ననలఁ జెందెద నన్న నతండు మున్ను ధా
త్రీవిభులన్ భజింపవు తవీయచరిత్ర లెఱుంగు దే యనన్
గోవిదవృత్తి భూపతులఁ గొల్వఁగ నేర్తు నటంచు నిట్లనున్.

తే. అతిసమర్థుల కిల నసాధ్యంబు లేదు
పోల నుద్యోగికిని దూర భూమి లేదు
విద్య గలవాని కెందును వింత లేదు
వఱలు ప్రియవాదికిని శాత్రవంబు లేదు. 114

వ. అనినం గరటకుం డతని కిట్లనియె మనస్వామిచిత్తవృత్తియెఱుఁ
గనినీకుం గదియ నెట్లగు ననిన నతం డిట్లనియె రాజు మన్నించు
సేవకులపొందునం బోయి న న్నెఱింగించుకొని యాసన్న
వర్తనుండ నయ్యెద విను మని యిట్లనియె. 115

ఉ. వీనికి విద్య లే దనరు వీఁడు కులస్థుఁడు గాఁ డనారు మే
ధానిధి వీఁడు గాఁ డనరు తమ్ము భజించినఁ జాలు నెప్పుడున్
మానవనాథులున్ సతులుమవ్వ మెలర్చినపువ్వుఁదీఁగెలున్ [న్.
మానకపార్శ్వసంశ్రితసమాజముఁ బూని గ్రహించు నిచ్చలు

క. కోపప్రసాదచిహ్నము
లేపార్థివునందు భృత్యుఁ డెఱిఁగి చరించున్
దీపించి వాఁడు నృపుచే
నేపారఁగ మంతుకెక్కు నెక్కుడుకరుణన్. 117

వ. అనినం గరటకుండు నేఁడు నీవు రాజుసమ్ముఖంబునకుం బోయి
యేమని పలుకంగలవాఁడ వనినం దమనకుం డిట్లనియె. 118

క. ఉత్తరమునఁ బొడమెడుఁ బ్ర
త్యుత్తర ముత్తరము లేక యుత్తర మగునే
హా త్తినసువృష్టివలనఁ
విత్తులకుం బొడమునట్టివిత్తులుపోలెన్. 119

వ. అని మఱియును. 120

చ. నరుల కపాయదర్శనమునం బ్రభవించిన యాపవిత్తియుఁ
సరవి నుపాయదర్శనవశంబున నిచ్చినకార్యసిద్ధియుఁ
వెరవున బుద్ధిమంతులు వివేకమునఁ దగునీతిసంపదఁ
దిరముగ మున్న కాంతురు మదిం దలపోయుచు నిక్క-
వంబుగన్. 121

వ. కావున నిమ్మహీపతికి సంప్రాప్తకాలం బైన విన్నపంబు
చేయుదు నెట్లనిన నప్రాప్తకాలవచనంబు లుపన్యసించి బృహ-
స్పతి యైన నవమానితుం డగు దేశకాలపరిజ్ఞానం బెఱుంగక
గుణహీనులు ప్రయోగించిన సుభాషితంబులు వ్యంగ్యంబు
లగు నని మఱియు నిట్లనియె. 122

క. తననడవడి సత్పురుషులు
కొనియాడఁగ నుబ్బ కదియ గుణముగఁ దద్వ
ర్తనము న్వదలక యుండిన
మనుజుఁడు పూజ్యుండు జనసమాజములోనన్. 123

వ. అని మఱియు నిట్లనియె సేవకులు రాజులంగొలువ నెట్లు
వచ్చువారు పర్వతంబులుంబోలెఁ బ్రకృతివిషములు జల
గ్రాహులు నని పలుకవలదు. 124

తే. ఎవ్వరెవ్వరియాత్మల కెద్ది హితము
వారివారికి ననుగుణవర్తనమున

బుద్ధిమంతుఁడు శీఘ్రంబ పొసఁగ మెలఁగి
యతని వశ్యునిఁగాఁ జేయు నాక్షణంబ. 125

ఆ. చటులసింహశరభశార్దూలగజముల
వశ్యములుగఁ జేయ వచ్చు ననఁగ
నరయ మిగులఁ దద్‌జ్ఞు లగువారలకు నల్ల
యవనిపతులు వశ్యు లగుట యెంత? 126

వ. అనినం గరటకుండు దమనకా నీకుఁ గార్యసిద్ధి యయ్యెడు
మరుగు మనిన దమనకుండు పింగళకుసమ్ముఖంబునకుఁ బోయి
మ్రొక్కిన నాసీనుంగా నియమించి కృపాకటాక్షంబు లొలయ
బింగళకుండు నిన్నుఁజిరకాలంబునకుఁ బొడగంటిమి భవదాగ
మనంబునకు నిమిత్తం బేమని యడిగిన దమనకుండు భవత్పాద
పద్మంబులకు నావలనం బ్రయోజనంబు గలుగుటంజేసి పని
వింటి నమాత్యుం డైనవాఁడు దనయేలికకు నవసరంబు గల
యప్పుడు కార్యాకార్యంబు లెఱింగింపఁ బిలువకున్నను గది
యవలయు నేనకా దెట్టిమానవుం డైననుం బార్థివేంద్రునకు
నొక్కొక్కవేళం బ్రయోజనపడు నని యిట్లనియె. 127

తే. కర్ణములతీఁట దంతనిర్ఘర్షణంబు
వేఱుతృణకాష్ఠములఁగాని తీఱ దనిన
నంగవాక్పాణిపదముల నమరునట్టి
నరుఁడు గొఱగాక యుండుట ధరణి గలదె. 128

ఉ. ఒప్పమి సజ్జనోత్తమున కొక్కయెడన్ బ్రభవించెనేనియున్
దప్పదు ధైర్యవృత్తి సతతంబును బూర్వపథంబు నగ్నిఁ దా
నొప్పర వేల్మిఁ బట్టునెడ నూర్ధ్వముఖంబులు గాక తచ్ఛిఖల్
దప్పి యధోముఖంబు లయి తారొకన నేర్చునె యెన్నఁడేని
యున్. 129

వ. అని మఱియు విశేషజ్ఞుం డైనమహీవల్లభునకు సర్వంబును మున్ను గానంబడు నెట్లంటేని. 130

మ. హాలికుం డోపి సమస్తబీజముల నర్హ్యవేళలం జల్లుచో
నెలమిం బుట్టినకోమలాంకురముల నీక్షించి మున్మున్న తాఁ
దెలియుం గా సస్యఫలంబు లాకరణి సద్బిగా బుద్ధిమంతుండు మ
ర్త్యులయాకారము సూచి నిశ్చయము సేయుం గా దన్నానో
వృత్తులన్. 131

క. నరపతి భృత్యులఁ దొడవుల
నొరసి తగిననెలవులందు నునుపక యున్నన్
జరణంబునఁ జూడామణి
శిరమున నందియముఁ బెట్టుచెలువము గాదే. 132

తే. కుందనము గూర్ప నర్హమై యందపడిన
పృథులరత్నంబు వెండిలోఁ బెట్టెనేని
రత్నమున కేమికొఱయగు రాజు బంటుఁ
దగినపనిఁ బెట్టకుండినఁ దగవు గాక. 133

ఉ. ఈతఁడు బుద్ధిమంతుఁ డగు నీతఁడు నా కనురక్తుఁ డేలఁగా
నీతఁడు తా జడుం డని మహీశ్వరుఁ డాత్మ నెఱింగి వారి నా
రీతుల నేర్పడ న్మనుపఁ బ్రీతి దలిర్పఁగ నట్టివార లా
భూతలనాథునిఁ విడిచిపోవక కొల్తుర యెల్ల యప్పుడున్. 134

క. తురగంబులు నాయుధములు
నరుదుగ శాస్త్రములు వీణ యావాణియు నే
ర్పరి యగు నరుండు నారియుఁ
బురుషవిశేషంబు నొంది పొరి నుతి కెక్కున్. 135

క. అని పలికి దమనకుం డి
ట్లను నన్ను సృగాలమాత్ర మని నీచిత్తం
బునఁ దలఁపక నావిన్నప
మనఘాత్మ వినంగఁ దగుఁ బ్రయత్నముతోడన్. 136

సీ. సూకరరూపంబు భీకరంబుగఁ దాల్చి
పుండరీకాక్షుండు పొగడు వడఁడె
మృగరూపమునఁ బుట్టి జగతిఁ బ్రసిద్ధుఁడై
ముని సురేంద్రునిచేత మ్రొక్కుఁగొనఁడె
ఛాగస్వరూపంబు షణ్ముఖుండు ధరించి
సురసమూహామునఁ బ్రస్తుతి గనండె
యింద్రాగ్ను లిరువురు నెసగంగఁ బక్షులై
బృథులసత్కీర్తులఁ బెంపు గనరె
తే. యల్పజంతువు లని వారి నాదరింప
కుండెనే తొల్లి సురమునిమండలంబు
గాన నీవును ననుఁ జుల్కఁగాఁ దలఁపక
చిత్తమునఁ జేర్చి నామాట చిత్తగింపు. 137

వ. అని మఱియును. 138

క. అసమర్థుఁడై నహితుఁడును
నసమానసమర్థుఁడై నయహితుండును న
వ్వసుధాధిపునకుఁ గొఱఁ గా
రెసఁగఁగ నాశక్తిభక్తు లెఱుఁగఁగవలయున్. 139

వ. అని పల్కి వెండియు. 140

సీ. అవివేకి యగురాజు నంటినప్రజలందు
నెట్టివారును మతిహీను లగుదు

రట్టివా రాసన్నులై మహీశ్వరుఁ గొల్వ
రెడపక పెద్దలు విడుతు రపుడ
పెద్దలు విడిచినఁ బెరిఁగి యన్యాయంబు
ప్రబలంబు గాఁగ ధర్మంబు తొలఁగు
ధర్మంబు తొలఁగిన ధాత్రీతలం బెల్లఁ
జీకాకు పడి రూపుచెడి యడంగు

తే. రాజు పరిసరవర్తులు రాష్ట్రజనము
మున్న నశియించి చనుటకు మోస లేదు
గాన సర్వజ్ఞుఁ డనఁగ లోకంబుచేత
వినుతిఁ బొందినరాజు వివేక మమరు. 141

ఆ. అనుచు నిట్లు దమనకాఖ్యుండు పలికిన
నర్థిఁ బింగళుండు నతని కనియెఁ
బొసఁగ మాకు మంత్రిపుత్త్రుండ వగుటను
జెప్పఁ దగినబుద్ధి సెప్పఁ దగదె. 142

క. అన నతఁడు విన్నవించెద
ననఘా! యుదకార్థి వగుచు యమునానదికిం
జనుచుండి వెఱఁగుపడి ని
ల్చినకారణ మేర్పడంగఁ జెప్పుము నాకున్. 143

వ. అనిన నాతం డి ట్లనియె. 144

సీ. ఈయున్నవన మెల్ల నాయధీనం బిది
సర్వసత్త్వవ్రాతసంకులంబు
కడిమి నిన్నాళ్లును గదల కుండితిమి యీ
విపినంబు నేఁ డింక వెడలవలసె
నెట్లన్న నొకశబ్ద మేమని చెప్పుదు
నశనినిర్ఘోషంబు ననుకరించి

నాకర్ణముల సోఁకినను భయం బొందవిన
విన్న చోటనె నిల్చి యున్నవాఁడ

తే. శబ్ద మూహింప నుత్కృష్టజంతువునకుఁ
గాని యల్పజంతువునకుఁ గలదె యట్టి
దేమిసేయుదు ననినమృగేంద్రునకును
దమనకాఖ్యుండు వల్కె నందంద మ్రొక్కి. 145

వ. దేవా! శబ్దమాత్రంబునకు శంకింపం బని లే దవధరింపు మని
యి ట్లనియె. 146

తే. బహుజలంబుల సేతువు బగిలిపోవు
విను మరక్షితమంత్రంబు విఱిసిపోవుఁ
గొండియంబున సఖ్యంబు గ్రుంగిపోవుఁ
గఠినభాషలఁ బడిపోవుఁ గాతరుండు. 147

వ. అని మఱియును. 148

క. నీ విన్నశబ్ద మిప్పుడ
యే విని తెలిసితిని బుద్ధి నెంతయు మును దా
భావించి నక్క తెలియదె
దేవా ఘనదారుచర్మతీవ్రధ్వనులన్. 149

వ. అనినం బింగళకుం డవ్విధంబు తెలియం జెప్పు మనిన నతం
డి ట్లనియె. 150

తే. ఎసఁగునాఁకటి పెల్లున నిందు నందు
నడవిఁ జరియించి యాహార మబ్బకునికి
నలసి యొకజంబుకంబుభాగ్యమునఁ గాంచెఁ
గలహమొనరించిపోయినకదనభూమి. 151

సీ. అటిముటి నంతంతఁ దఱుచు ప్రోవులు గట్టి
యఱవఱలై యున్న యరదములును
దొండముల్ గొమ్ములుఁ దోఁడలు మస్తకములు
ఖండంబులైన వేదండతతులుఁ
జరణంబు లూరులు బరులుఁ గంధరములుఁ
దునకలై పడియున్న తురగములును
గంకణాంగదములఁ గడు నొప్పి విఱిగిన
బాహుదండంబులభటకులంబుఁ
తే. గలిగి బీభత్సరౌద్రశృంగారములకు
నాస్పదంబుగఁ గనుపట్టునట్టినేలఁ
గౌతుకంబునఁ బొడగాంచి కదియు నంత
నవల నొకమహాధ్వని గుండెలవియనిగుడ. 152

సీ. అమ్మహాధ్వని విని యత్యంతభయముతో
మృగధూర్త మట్టిట్టు మెదల వెఱచి
కను మూసి లెఱవ కెక్కడఁ జొత్తు నని బుద్ధి
శోకించి కను విచ్చి చూచునంత
ధారణిఁ బడి యున్న భేరీముఖంబునఁ
దరుశాఖ గాలిచేఁ దాఁకుచుండఁ
బొడగని తనలోనఁ బొడమినభయ మెల్లఁ
బోయిన నాభేరి డాయ వచ్చి
తే. యప్పు డివి గాన నేరక యధికభీతిఁ
బాఱిపోవఁగఁ జూచితిఁ బట్టు విడిచి
పొలవ కిది భాగ్యదేవత చూపె నాకు
ననుచు నానక్క యాత్మ నిట్లని తలంచె. 153

తే. ఇది మహాభోజ్య మిచ్చట నొదవె నాకు
నిప్పు డిది ప్రచ్చుకొని చొచ్చి హితమెలర్ప
వలయుమాంసంబు భక్షింపవచ్చు ననుచు
సొలవ కాభేరి వ్రచ్చితాఁ జొచ్చి చూచి. 154

వ. ఆమృగధూర్తం బందు నేమియుం గానక వృథాస్థూలం బని
పోయెం గాన శబ్దమాత్రంబునకు శంకింపం బనిలే దెచ్చట
శబ్దంబు వినంబడె నచ్చటికిం బోయి తెలిసికొనివచ్చెదం బనుపు
మని యతండు వనుప సంజీవకుం డున్నయెడకుం బోయి
యి ట్లనియె. 155

సీ. ఎఱుఁగు మృగేంద్రునిహితభృత్యుఁ గా నన్ను
నతఁడు నీయున్నెడ కరుగు మనిన
వచ్చితి నాతఁ డివ్వనజంతుకోటికి
నధిపతి గావున ననఘ నీవు
నాయనపంపు చేయక యొంటిఁ దిరుగుట
తగవు గా దతనిపాదములు గనుము
మంత్రి వై తత్కార్యతంత్రంబు తీర్పుము
వెఱవక రమ్మన్న విని యతండు

తే. సమ్మతించిన మృగపతిసమ్ముఖమునఁ
దాను మును నిల్చి మృగనాథ యేను బోయి
మున్ను నీవిన్నశబ్ద మిమ్ముగ నెఱింగి
తెలిసి వచ్చితి నీపాదములు భజింప. 156

వ. అది కావించిన యతండు దేవర మన్నింప నర్హుం డని చెప్పి
మఱియు ని ట్లనియె. 157

సీ. అడరి మహాబలుం డధికసత్త్వంబున
నురుతరువ్రజముల నురులఁ గొట్టి

నీచంబు మృదువునై నెరయ నానత మైన
కసవుఁ బెల్లగిలంగ విసర నొల్లఁ
డబ్భంగి నధికుండు నల్పులదెసఁ బోక
ఘనతరారాతుల గండడంచు
నట్లు నీవును మహాహంకారమృగములఁ
దగిలి సాధింపంగఁ దగుదు గాన
తే. సాధుజంతుమాత్రంబుల బాధపఱిచి
యుదరపోషణ మొనరించుచున్నహరులు
సాటి సేయంగఁ దగునె యీజగతి నీకు
శౌర్యగుణధామ మృగకులసార్వభౌమ. 158
క. అని కీర్తించుచుఁ దమనకుఁ
డనఘా నీ వపుడు వినఁగ నార్భట మటఁ జే
సినయాతఁడు సంజీవకుఁ
డనఁ జనువృషరాజు సౌమ్యుఁ డనఘుఁడు బుద్ధిన్. 159
తరల. అతఁడు నీకును మంత్రి గాఁదగు నాయనం గొనివత్తు నే
నతులవిక్రమ పోయి వచ్చెద నన్న నాతఁడు పొమ్మనన్
వితతవాక్యవివేకసంపద వింతభావము మాన్పి తాఁ
జతురతన్ వృషభేంద్రు సింహముసమ్ముఖంబునఁ బెట్టినన్.160
క. అదిమొదలుగ సంజీవకు
వదలక మృగనాథుఁ డధికవాత్సల్యం బిం
పొదవఁగఁ దనయొద్ద సచివ
పదవికిఁ దగు విభవ మిచ్చి పనిగొనునంతన్. 161
మాలిని. కరటదమనకాఖ్యుల్ గాఢచింతాంతరంగ
స్ఫురితబహువిధోక్తుల్ శోకమూలంబు గాఁగన్

బరఁగఁగఁ దమలోనఁ బల్కుచున్నట్టివేళం
గరటకుఁ డనె వానిం గర్ణశూలంబు గాఁగన్. 162

తే. సరవి నిన్నాళ్లు నీమహేశ్వరుఁడు మనలఁ
బ్రజల నొక్కర లేకుండ భక్తిఁ బోచె
వెనుక సంజీవకుండు వచ్చినది మొదలు
విడిచె నిది భవత్కృతదోషవిధిన కాదె. 163

వ. అనిన వానికి దమనకుం డిట్లనియె. 164

ఉ. వావిరి రాజు ప్రాఁతపరివారము నెల్లఁ బరిత్యజించి సం
జీవకుఁ బట్టి సేవకులు చెచ్చెర గ్రాసము లేక చిక్కి రేఁ
జూవె విచారదూరమతి చొప్పడ నిద్దఱఁ బొందు చేసితిన్
దైవము కర్త గాక మఱి తక్కినవారివశంబె చెప్పుమా. 165

వ. అని దమనకుం డస్మత్కృతదోషంబునకు వగవం బని లేదు
విను మని యిట్లనియె. 166

తే. మేషయుద్ధమధ్యంబున మెలఁగి యొక్క
శివయు నాషాఢభూతిచే సిద్ధమునియుఁ
దొడరి సాలీనిసతిచేత దూతికయును
నాత్మకృతదోషమునఁ గాదె హానిఁ బడిరి. 167

వ. అనినం గరటకుం డవ్విధం బెఱింగింపు మనిన దమనకుం
డిట్లనియె. 168

చ. కలఁ డిల దేవశర్మ యనఁగా నొకయోగి యతండు పెక్కుది
క్కులఁ జరియించి నేర్పెసఁగఁ గూర్చిన యర్థము కంథలోపలం
బొలుపుగఁ బోసి వైచుకొని పోవఁగ నత్తెఱఁ గెల్లఁ గాంచి ము
చ్చిలుటకు శిష్యభావమునఁ జేరి యొకానొకదుర్జనుం డొగిన్.

తే. నామ మాషాఢభూతి నా నటన మెఱసి
కదిసి భయభక్తు లతనికిఁ గానఁబడఁగఁ
బరమవిశ్వాస మెసఁగంగఁ బనులు చేసి
మెలఁగునంతటఁ దపసియు మిగుల నమ్మి. 170

క. ఈకంథ నాకువ్రేఁ గని
చేకొన నాషాఢభూతిచే నిచ్చి యతం
డాకందువ వనమధ్యత
టాకముఁ బొలుపారఁ జూచి డాసి కడంకన్. 171

క. ఆచమనం బొనరింపఁగ
నాచేరువ మేషయుగళ మత్యుగ్రముగాఁ
ద్రోచియును మస్తకంబులఁ
దాచియుఁ దమలోనఁ బోరఁ దా నవ్వేళన్. 172

ఆ. తగరుదోయితలలు దాఁకంగ దాఁకంగఁ
బగిలి రక్త మొలికి పడుచు గట్టి
కరడు కట్ట మాంసఖండంబుగాఁ జూచి
ఫేరవంబు మిగులఁ జేర వచ్చి. 173

వ. ఆరక్తం బాస్వాదింపఁ గోరి మేషయుద్ధమధ్యం బని తలంప నెఱుంగక దుర్బుద్ధియగు జంబుకంబు జిహ్వాచాపలంబునఁ దద్రక్తం బుపయోగించుసమయంబున. 174

క. మును పాసి వెనుక వెనుకకుఁ
జని తాఁకుతగళ్ళనడుమఁ జచ్చిననక్కన్
గనుఁగొని వగచుచు భిక్షుకుఁ
డెనయఁగ నాషాఢభూతి నెలమిం బిలువన్. 175

వ. వాఁ డంతకుమున్న వసుభరితంబైనయాకంథనపహరించి చను
టెఱింగి మోసపోయితినని భిక్షుకుండు దనమనంబున మేష
యుద్ధమధ్యంబున జంబుకంబునకును నాషాఢభూతివలనఁ
దనకును ననర్థకం బయ్యె ననుచుం జింతింపుచు నస్తమయసమ
యంబునఁ దత్సమీపనగరంబుఁ బ్రవేశించి యం దొకతంతు
వాయగృహంబునకుం జని సుహృద్వ్రాతగోష్ఠిం జెంది సుఖోప
విష్టుం డై యుండె నంత. 176

క. ఆసాలీనికులాంగన, దోసం బన కన్యవిటులతోఁ దిరుగంగా
నాసరసిజాక్షివలనన్, గాసిల్లుచుదానివిభుఁడు కన్నిడియుండెన్.

సీ. ఉన్నచో నారాత్రి యొండుబాలికఁగూర్చి
మగఁడు వోవఁగఁ జూచి మదినెఱింగి
తనదుదూతిక యైనతరుణి రమ్మని పిల్చి
నదియుఁ దానును నన్యసదనమునకుఁ
జనునంత నెదురుగా సాలీఁడు వచ్చిన
దూతికఁ దొలఁగించి తోయజాక్షి
పురుషుముందఱ నేఁగి భోరున నిలు చొచ్చి
గరగతోయము దెచ్చి కాళ్లుగడుగఁ

తే. దఱియ భావజ్ఞుఁ డై దానిధౌర్త్య మెఱిఁగి
విసువ కొడలెల్లఁ జెడఁగొట్టి విఱిచికట్టి
తెల్లవాఱంగఁ జూడు నీ తెఱఁ గటంచు
నిండుమనమున నాతండు నిదురవోవ. 178

వ. అయ్యవసరంబున. 179

ఉ. దూతిక వచ్చి నీపతి మృతుండనుబోలెను నిద్రవోయెడున్
భీతకురంగనేత్ర యితనిం గనుబ్రామి సుఖింపఁ బొమ్ము నీ

వీతతటి వచ్చునంతకు సహించెదఁ గట్టినరజ్జుబంధముల్
నాతనువల్ల నుంచుకొని నాకుఁ బ్రియం బిది పద్మలోచనా.

ఉ. కంతునిఁ బోలునట్టియుపకాంతునితోడ రమించి తేనియుర్వీ
సంతస మందె దంచు విలసద్గతి నీకడ కేఁగుదెంచితిన్
గాంత పురాతనుం డయినకాంతుఁడు మేల్కనె నేని వీఁడు కా
లాంతకుఁ డై ననుం దలఁకు నచ్చటికిం జని రమ్ము పొమ్మొగిన్.

వ. అని దానిరజ్జుబంధంబు లూడ్చి దానికిం బ్రియంబుగాఁ దన్నుం గట్టించుకొని యయ్యువతీరత్నంబుననిచిన నదియు నర్ధరాత్ర సమయంబున నిబిడాంధకారంబునఁ బుష్పకోదండసహాయ యగుచు నుపనాథుమందిరంబుఁ బ్రవేశించె నిటఁ దంతు వాయుండు నంత మేల్కాంచి యంధకారంబుకతంబునఁ దన కాంత యున్నరూ పెఱుంగ కిట్లనియె. 182

ఉ. ఓసిగులామ నన్నెఱుఁగకుండఁగ నెయ్యెడ కేఁగి తిప్పుదే
వాసియు వన్నెయుం గలుగువాఁడఁ గులంబున నింద తెచ్చివే
దోసి తలంప నీకరణి దుష్కృత మెవ్వరు చేసినారు నీ
బైసి తొలంగ దొత్తువలెఁ బాపెదఁ గూటికిఁ జీరకుం జెడన్.

వ. అని మఱియును. 184

క. నిను విడువలేక పలికెదఁ
గనికరమున నేఁడు మొదలుగా నెంతేనిన్
జన నని శపథముఁ జేసిన
నిను విడిచెద సమ్మతంబె నీకుం దరుణీ. 185

క. అని యిట్లు పలుకుచుండఁగ
విని దూతిక యెలుఁగు చూప వీఁ డెఱుఁగునొయం

చొనరఁగఁ బలుకక యుండిన
మనమునఁ గ్రోధానలంబు మండుచు నుండన్. 186

వ. ఆతంతువాయుం డంతట సముత్థితుం డై యిద్దురాత్మిక నాకుం బ్రమాణంబు చేయుమనినఁ బలుక కూరకున్నయది యిట్టిధార్త్యం బింకను జేయుతలంపుగావలె నని యగ్గలంపుఁగోపంబున దిగ్గన లేచి తీక్ష్ణశస్త్రికం గొని యాదూతిక నాసికాచ్ఛేదంబుఁ జేసి క్రమ్మఱ శయ్యాతలంబునకుంజని నిద్రించుసమయంబునఁదంతువాయుకాంతయుపకాంతునితో నలరువిల్తుకేళిం గలసి వేగంబ వాని వీడ్కొని యంతంత నాలకింపుచుఁ జనుదెంచి దూతికం గదిసి యిట్లనియె. 187

క. పురుషుఁడు మేల్కని నిన్నుం
బరుషంబులు పల్కి నంచుఁ బఱతెంచితిఁ దా
మరసాక్షీ వాఁడు మేల్కని
యరయండు గదా విచార మయ్యెడు నాకున్. 188

వ. అని పలుకఁ గన్నీ రొలుక నల్లన యిట్లనియె. 189

ఆ. నీవు వోవఁ దడవ నీనాథుఁ డప్పుడె
నిదుర మేలుకాంచి నీ వటంచు
ముక్కుఁ గోసె నింక నెక్కడిసంసార
మమ్మ నన్ను విడువు మరుగవలయు. 190

క. అని యొయ్యఁ బలుక దానిం
గనికర మొప్పంగ విడిచి ఘనబంధములన్
దనతనువునఁ గట్టించుక
వనజానన యుండె దానివల్లభుఁ డంతన్. 191

వ. ప్రబుద్ధుం డగుచు నాసన్నుం డై యోదురాత్మికా యేమి చేసెద వనిన నమ్మగువ యిట్లనియె. 192

ఉ. నన్ను నకారణంబ సరినారులలోఁ దలవంపు సేయుచున్
మిన్నక ముక్కుఁ గోసితివి మిక్కిలి నాకడ నేర మేదియేన్
గన్నది విన్న దింతయునఁ గల్గెనొ యొల్లనివాఁడవై కదా
పిన్నతనంబు చేసి వగపించితి వేమితలంపు చెప్పుమా. 193

ఉ. దేవమహోత్సవం బని సతీమణు లందఱు నేఁగ నేనునుం
బోవఁగ నీవు నాకెదురు బోరన వచ్చినఁ బోక చిక్కితిం
గావునఁ దప్పు నావలనఁ గల్గమి నీవు దలంపకుండినన్
దైవ మెఱుంగఁడే తగనిదండము దండధరుండు చేయునే.

క. ఇలువాడుదు గరగరగాఁ
దలవాకి లెఱుంగఁ బొరుగుతరుణులఁ గూడన్
గల నైన నన్యపురుషులఁ
దలఁపన్ దులువా పతివ్రతామణిఁ గానే. 195

వ. అని సురమునీంద్రుల నుద్దేశించి యి ట్లనియె. 196

ఉ. ఓసురలార యోమునివరోత్తములార భవత్పదాబ్జవి
శ్వాసము నాకుఁ గల్గుట నిజం బగునేని మదీయకాంతుపైఁ
జేసినభక్తి యెన్నఁడును జిందిలదేని వినుండు నేఁడు నా
నాసిక వచ్చుఁగాక జతనంబుగఁ బూర్వగతిం బ్రకాశమై.197

వ. అని పలికి నిజనాథు నుద్దేశించి యిట్లనియె. 198

చ. ఎఱుఁగక చేసినట్టినిను నేమన వచ్చుఁ బతివ్రతాగుణం, బెఱుఁ
గుటఁజేసి నాకు సుర లిచ్చిరి ముక్కిటు చక్కఁ జూడు ప
ల్లఱపులు మాని యాకసమునందు సురేంద్రుఁడు లోకపా
లురుం, దఱుచుగ నన్నుఁ జూచుటకుఁ దార్కొని రందఱుఁ
గాన నయ్యెడున్. 199

క. అని తనవల్లభ పలికిన
విని విస్మితుఁ డగుచు లేచి విభుఁ డతిశీఘ్రం
బున దివియఁ గొనుచుఁ గదియం
జని కనియెం దనదుభార్యచక్కనిముక్కున్. 200

క. పొడగని తనభామినికిఁ
దడయక పదయుగము చేరి దండం బిడి య
ప్పుడ తాఁ గట్టినపెడకే
ల్విడిచి ప్రియుఁడు ప్రియము వల్కె వేగినపిదపన్. 201

వ. భిక్షుకుండును నిద్రావిరహితుండై సర్వవృత్తాంతంబునుఁ జూచుకొని యుండె నట దూతికయును వస్త్రాచ్ఛాదితముఖకమల యై తన గృహంబునకుం జని శయ్యాతలంబున నాసీన యై తనపురుషుం డెఱింగిన నేమని మొఱుంగుదు నేమి సేయుదు నెక్కడఁజొత్తు నని చింతించుచున్న సమయంబున దానివల్లభుం డైనక్షౌరకుండును మేల్కని ముఖప్రక్షాళనంబు చేసికొని తనభార్యం బిలిచి యిట్లనియె. 202

ఆ. కత్తు లున్నసంచి కడువేగఁ గొనిరమ్ము
పోయి యూడిగమ్ము సేయవలయు
రాజు పిలువఁ బంపె రమణిరో తెమ్మన్న
నది యొకటి కత్తి యొకటి యతని కొసఁగ. 203

వ. అది పుచ్చుకొని నాపితుం డగ్నికణంబు లొలుకఁ గన్నుల దానిం జురచురం జూచి. 244

ఉ. కత్తులతిత్తిఁ దె మ్మనినఁ గానక నా కిది యొంటికత్తి నీ
వి త్తఱి నేల యిచ్చి తిది యేమి పరాకున నున్నదాన వో
తొత్తులతొత్త వేచడమ దూలపిసాచి యటంచు నాత్మలో
నెత్తినతీవ్రకోపమున నింతిపయిం బడఁ గత్తి వైచినన్. 205

ఆ. వాటు దాఁకి ముక్కు వ్రయ్యలై పడె నంచు
ముదిత శోకకొంగు మూసికొనుచు
వాడవాడ లెల్ల వడి వెంటఁ దగులంగఁ
బోయి రాచనగరఁ గూయుచుండ. 206

తే. అపుడు దౌవారికులు విని యవ్విధంబు
నృపుని కెఱిఁగింపఁ బిలిపించి నెలఁతఁ జూచి
యిత్తెఱంగున కేమి నిమిత్త మనిన
జనపతికి విన్నవించె నిజంబు తోడ. 207

ఉ. తప్పొకయింత లేదు తను దైవము గాఁగఁదలంతునేను దా
నొప్పక నాయెడం గినియుచుండు నకారణవైర మూని నేఁ
డిప్పుడు ముక్కు గోసె ధరణీశ్వర యీదురవస్థ నేమిగాఁ
జెప్పుదు నీవ దిక్కనుచుఁ జేరితి నా మొఱ యాలకింపవే. 208

వ. అనిన విని భూమీశ్వరుండు నాప్రొద్ద నాపితుం బిలిపించి
వాని కిట్లనియె. 209

తే. ఓరి నీభార్య కేల రా యూర కిట్లు
వికృతవేషంబు చేసితి వెఱపు మాలి
యనిన వాఁడు భయంపడి మనుజపతికి
నొండు పలుకంగ నేరక యూరకుండె. 210

క. ధరణీశ్వరుండు నంతటఁ
బరిజనులం జూచి వీనిఁ బట్టుకొనుచు మీ
రరిగి నగరంబువెలుపల
నరణ్యదేశమునఁ జంపుఁ డని పనుచుటయున్. 211

వ. అంత భిక్షుకుండు తద్వృత్తాంతం బంతయు నెఱుంగుం
గావున నమ్మహీశ్వరుసమ్ముఖంబున నిలిచి యాశీర్వాదపుర
స్సరంబుగా నతని కిట్లనియె. 212

తే. మేషయుద్ధమధ్యంబున మెలఁగి యొక్క-
శివయు నాషాఢభూతిచేఁ జిక్కి- నేనుఁ
దొడరి సాలీనిసతిచేత దూతికయును
ముప్పు గను టాత్మకృతదోషములనె యనుచు. 213

ఉ. చెప్పిన నద్భుతం బెసఁగ శీఘ్రమె నాపితుఁ బిల్వఁ బంచియే
తప్పును లేదు పొ మ్మనుచుఁద త్తరుణిం బురి నుండకుండఁ బెం
పొప్పఁగఁదోలఁబంచి సుజనో త్తము భిక్షుకునిచ్చ మెచ్చఁదాఁ
జొప్పడ భూమిపాలుఁ డని సొంపెసఁగం గథ చెప్పినంతటన్.

వ. కరటకుండు నీ వింకఁ జేయఁదలఁచినకార్యం బెయ్యది యనిన
నతం డతని కిట్లనియె. 215

తే. దృష్టముగఁ గార్య మంతయుఁ దెలియుకొఱకు
నెసఁగులోకప్రవర్తనం బెఱుఁగుకొఱకుఁ
దుది ననర్థకార్యంబులఁ ద్రోచుకొఱకుఁ
దగిన దెయ్యది యదియ మంత్రంబు సుమ్ము. 216

ఉ. కావున మంత్రభిన్న మయి కార్యము దప్పక యుండ నిప్డసం
జీవకపింగళాఖ్యులకుఁ జేరక భేదము పుట్టునట్లుగా
నేవెర వైనఁ జేయక సహించిన నవ్విభుఁ జేర వచ్చునే
సేవకకోటికిఁ మనకు సీమ దొలంగుట గాక యుత్తటిన్. 217

వ. అనినం గరటకుం డది యెట్లు సాధ్యం బగు ననిన నతని
కిట్లనియె. 218

చ. చెనసి యుపాయమూలమునఁ జేయఁగ శక్యము లైనకార్య
ముల్, మొనసి పరాక్రమంబున నమోఘముగా నొడఁగూర్ప
శక్యమే, కనకవిభూషణంబు గొని కాకము సర్పముఁ జంపె

నేర్పుతోఁ, గనఁగ నుపాయసాధ్యములు గానిపనుల్ గలవే
తలంపఁగన్. 219

వ. అనిన నక్కథ వినవలతుం జెప్పు మనిన దమనకుం డిట్లనియె.

ఉ. వాయసదంపతుల్ తగునివాసముగా నొకవృక్షశాఖపైఁ
బాయక యున్నచో నునికిపట్టునఁ జేరువ పుట్టపట్టునం
దాయతరోషభీషణమహాభుజగేంద్రుఁ డెఱింగి కాచి వా
లాయము గాఁగఁ జంపును జలంబునఁ గాకముకన్నపిల్లలన్.

వ. ఇవ్విధంబునఁ జంపి తినుచున్న కృష్ణసర్పంబునకుం దలంకి చేయునది లేక నిరంతరక్లేశంబునఁ జింతింపుచు వాయసంబు తనకాంతకుం బ్రసవకాలం బగుటయుఁ గనుంగొని తనకు నత్యంతమిత్రుం డైనగోమాయువు కడకుం జని కుంభీనసంబు సేయు నపకారంబు చెప్పి యేమిసేయుదు ననిన జంబుకం బిట్లనియె. 222

తే. తగిలి యుత్తమమధ్యమాధమము లైన
మత్స్యముల నెల్ల భక్షించి మలయు బకముఁ
గపటమునఁ దొల్లి కర్కటకంబు చంపె
నట్ల నీవును బగ దీర్పు మనువుపడఁగ. 223

వ. అనిన వాయసంబు తన కక్కథ వినిపింపు మనిన జంబుకం బిట్లనియె. 224

చ. గురుసరసీతటంబునకుఁ గొక్కెరవృద్ధొకఁ డేఁగుదెంచి ని
ర్భరనియమవ్రతాచరణభావము దోఁపఁగ మోమువాంచికం
ధరముఁగుదించి కన్నుఁగవ దార్కొన మూసినదానిఁజూచియ
చ్చెరువునఁగర్కటం బచటఁ జేరి మృదూక్తుల నల్లి యిట్లనున్.

తే. మిగుల నాకంటె పెల్లున నొగిలి నీవు
చిక్కియును మీను గదిసినఁ జీరకునికి
యద్భుతం బయ్యెఁ జెప్పుమా యని కుళీర
మడుగ దానికి బకవిభుఁ డనియె నపుడు. 226

సీ. ఏకొలంకుల నైన నిట్టట్టు మెలఁగుడు
మీనుల భక్షించి మేను పెంతుఁ
బెంచుచో నొకనాఁడు పిడుగుఁబోలెడు వార్త
నా చెవి నాటిననాఁటనుండి
కడుపు విచారింపఁ గడు విచారంబునఁ
జిక్కితి నేమని చెప్పువాఁడ
ననినఁ గుళీర మేమని వింటి వీ వన్నఁ
గొక్కెర కన్నీరు గ్రుక్కుకొనుచు
తే. ననియెఁ గైవర్తు లిచటికి నరుగుదెంచి
వలలు నూఁతలు మొదలుగా వలయునట్టి
సాధనంబులు గొని జలజంతుకోటిఁ
బొరిగొనఁగ వత్తు మనఁగను బొసఁగ వింటి. 227

తే. అని కుళీరంబుతో బక మప్పుడు పలుక
నచటిమీనంబు లన్నియు నాలకించి
యోబకంబ మ మ్మిందఱ నుద్ధరింపఁ
గలిగితివి నేఁటియాపద గడపవలయు. 228

వ. అనినం గొక్కెర యొక్కింత ప్రొద్దు చింతించి మీకు నేఁజేయం
దగినకార్యం బెద్దియనిన నామత్స్యంబు లిట్లనియె. 229

క. ఇంకనిజలములు గలిగిన
నింకొక్కయగాధసరసి నిడినం జాలుఁ

సంకోచింపక మము నీ
యంకిలి వాపుటకు నీవ యర్హుఁడ వెందున్. 230

వ. అనిన నాబకం బిట్లనియె జాలరులవారింప నశక్తుండఁ గాని మిమ్ము నొక్కొక్కరినె గ్రక్కున ముక్కునం గబళించుకొని పోయి మీకు ననుకూలం బైనతావునఁ గ్రమక్రమంబున నందఱను బెట్టి వచ్చెద ననిన నవి సమ్మతించుటయు నాబకంబు.

ఉ. ముక్కున నొక్కటిం గఱచి మొక్కల మేమియు లేక పాఱి తా, నొక్కశిలాతలంబుపయినుండి రయంబున మెక్కి వచ్చి వే ఱొక్కటిఁ గొంచుఁ బోయి యదియుం దిని క్రమ్మఱఁ బాఱు తెంచి తా, నక్కఱ దీఱ మత్స్యముల నన్నిఁటిఁ జంపెను గాంక్ష మీఱఁగన్. 232

వ. ఇట్లు క్రమక్రమంబునం గతిపయదినంబుల నాసరోవరంబునం గలమత్స్యంబుల నెల్లభక్షించి మఱియుం దనివిచనక మత్స్యం బుల వెదకుచున్నబకంబుం గనుంగొని కర్కటం బొక్కటి కదియం జనుదెంచి యి ట్లనియె. 233

క. ఇమ్మడువు మీనములతో
నిమ్ములఁ గూడాడి పెరిఁగి యున్నాళ్ళను బ్రే
మమ్మున నుండితి నొంటిగఁ
గ్రుమ్మరలే నింక నన్నుఁ గొనిపోవఁగదే. 234

క. నావుడుఁ గుళీరమాంసం
బే వెనుకను నమలి యెఱుఁగ నిది నేఁ డొసఁగెఁ
దైవంబె యనుచు దానిని
వేవేగం గఱచి పట్టి విహగం బెలమిన్. 235

క. మును మత్స్యంబుల భక్షిం
చినయెడకుం గొంచుఁ బోయి శిలపైఁ దా వా

లిన మత్స్యమాంసమేదో
ఘనగంధం బెఱిఁగి యెండ్రి కడుఁ జకితంబై. 236

వ. ఇద్దురాత్ముండు కపటోపాయంబున మీనంబుల నెల్ల నిచ్చోట
వధియించెనని యెఱింగి తనలో నిట్లని వితర్కించె. 237

క. సాహసము లేనివానికి
నూహింపఁగ బ్రతుకుఁ గలదె యొకట ధరిత్రిం
బాహువిజృంభితశత్రు
వ్యూహంబులఁ జంపుఁ జచ్చు నొండె ఘనుఁ డిలన్. 238

వ. అని మఱియుం గుళీరంబు దనమనంబున. 239

ఉ. ఏలొకో యుద్ధభూమి నొకయించుక నిల్చి జయంబుఁ గై
కొనక, జాలుట లేక పాఱుదురు చావు శరీరము దాఁచఁ
దప్పునే, కాలవశంబు గాక యది గానక హీనుఁడు పాఱుఁ
బ్రాజ్ఞుఁ డా, వేళఁ దొలంగిపో కనుభవించును నిందును
నందు సౌఖ్యముల్. 240

వ. అదియునుంగాక. 241

సీ. వైరంబు కొఱ గాదు వసుధ నెవ్వారికి
నట్టిది బలవంత మయ్యె నేని
తగినసాహాయ్యంబు దగఁ గూర్చుకొని పగ
సాధింపవలయు నుత్సాహలీల
బలముఁ గూడకమున్న పగతుండు తఱివేచి
గొదగొని చిక్కించుకొనియె నేని
నొదుగక పగరపై నుఱికి చంపుట యొండె
రణమున వారిచేఁ జచ్చు టొండెఁ

తే. బోఁటి కలకాల మెవ్వాఁడు బ్రతుకునంచుఁ
బ్రాణసందేహమునఁ దెగుఁ బ్రాజ్ఞుఁ డెఱిఁగి
సాహసము చేయ నాకును సమయ మనుచు
నుఱికి కొక్కెరకంఠంబుఁ గొఱికి చంపె. 242

వ. ఇట్లు చంపి యాకుళీరం బెటకేనియుం జనియె నట్లు నీవును కృష్ణసర్పంబు భంజింపుమని యుపాయంబుం జెప్పినఁ దెలిసి వాయసంబు జంబుకంబు ననిచి నిజనివాసంబునకుం జనియెఁ దదనంతరంబ. 248

ఉ. ఆమఱునాఁడు వాయసము నాపుర మేలుమహీశుమందిరా
రామములోనఁ గ్రుమ్మరఁగ రాజపురంధ్రులు వచ్చి యచ్చటం
గోమలపుష్పమంజరులు గోసి పదంపడి యంబుకేళికిఁ
బ్రేమ దలిర్ప డిగ్గుతఱి భీతమృగేక్షణ యొత్తు నెవ్వడిన్.

చ. తన మెడ హేమసూత్ర మొకదారువునం దగిలించి గ్రక్కునం
జనిన నెఱింగి వాయసము చంచుపుటంబున దాని గ్రుచ్చి యం
గనలు గనుంగొనంగ వడిగాఁ గడుదూరము పోవ గొయ్యనొ
య్యనఁ జనన త్తెఱంగు వసుధాధిపునొద్దకుఁ బోఁటి చెప్పుడున్.

క. విని యానరపతి భృత్యులఁ
గనుఁగొని వాయసము గొన్నకంఠాభరణం
బనువుగఁ దెమ్మని పనిచినఁ
జని వారలు వాయసంబుచక్కటి నరుగన్. 246

తే. వాయసంబును నెలయించి వారు సూడఁ
గనకసూత్రంబుఁ గొనిపోయి కాలసర్ప
మున్న వల్మీకవివరమం దునిచి తొలఁగ
సరభసంబున నాపుట్టఁ దిరుగువాఱి. 247

తే. గడ్డపారలఁ బారల బెడ్డ లొదవ
వెడఁదగుద్దళ్ళ నాపుట్ట విడియఁ ద్రవ్వ
నందు నిద్రించుచున్న కాలాహి కెరలి
తూలి పాఱంగఁ గొందఱఁ దోలితోలి. 248

వ. కఱచి యొట యేనియుం బఱచునమ్మహాహిం బొదివి పోనీక కొందఱు కోదండధరులు డాసి యేసి కృష్ణసర్పంబును మృతిఁ బొందించి యాకంఠాభరణంబు గైకొని చనిరి గావున నుపాయంబున సాధింపరానికార్యంబులు గలవే యని దమనకుండు వెండియు నిట్లనియె. 249

ఉ. వారకబుద్ధిమంతుఁడగువాఁడె బలాధికుఁ డైనవాఁడు గా
కారయ బుద్ధిహీనునకు నైనబలం బిది నిష్ఫలంబు దు
ర్వారమదంబునం బరఁగి వాలినసింహముఁ జంపె నేర్పుతో
నీరస మెక్కుడైనశశ మెట్టిదొ బుద్ధిబలంబు చూడుమా. 250

వ. అనినం గరటకుం డక్కథ నా కెఱింగింపు మనిన దమనకుం డిట్లనియె. 251

ఉ. ఉగ్రవనంబులోన హరి యొక్క యెడన్ వసియించి సర్వస
త్త్వగ్రహణార్థియై బహువిధంబుల మాంసముఁ దించు
నుండఁ దద్వ్యగ్రతఁ జూచి జంతుతతు లన్నియుఁ గూడి మృ
గేంద్రుపాదపద్మాగ్రము లౌదలల్ గదియ నార్తిమెయిం
బ్రణమిల్లి యిట్లనున్. 252

సీ. అవధరింపు మృగేంద్ర యడవి జంతుసమూహ
మిదె విన్నపంబున కేఁగుదెంచె
నెట్లన్న నన్నింటి నెస రేఁగి యొక్కటఁ
జలపట్టి యొకనాఁటఁ జంప నేల

నిత్య మొక్కమృగంబు నీకుఁ గట్టడ గాఁగఁ
బ్రీతి నాహారంబు పెట్టఁగలము
సమ్మతింపు మనిన సకలజంతువులకు
నట్ల కానిమ్మని యభయ మొసఁగి
తే. యనుప నవి వోయి నిత్యకృత్యంబు గాఁగ
నుదయ మయ్యెడికోలఁదిని నొకటిఁ బంప
నది భుజించి హర్యక్షము ముదముఁ బొందు
నీవిధంబునఁ జిరకాల మేఁగునంత. 253

క. పులి కోలుకాఁడు గావున
నలయక వరు నెఱిఁగి వాని ననుపఁగ నొకనాఁ
డోలసి యొక చెవులపోతుకుఁ
గలయఁగ నిలువరుస యనుచుఁ గ్రక్కునఁ జెప్పన్. 254

ఆ. పలుకు విన్నమాత్రఁ బ్రాణంబు చలియింప
శశక మపుడు మూర్ఛఁ జాలఁ దూలి
తెలిసి కన్ను దెఱచి దృష్టించి తల యూఁచి
దిగులుప్పట్టి యాత్మ నగుల నొగిలి. 255

వ. ఆశశకంబు ముహూర్తమాత్రంబు చింతించి తెలివొంది డెందంబుకొందలంబుడిపికొని వృద్ధుం డయ్యును సాహసంబు దెచ్చుకొని తనలో నిట్లని వితర్కించె. 256

క. క్రూరమృగనిగ్రహాగ్ర
స్ఫారమహాబలమృగేంద్రు సాహస మెసఁగన్
వారింతుఁ బ్రంతు నొక్కఁడ
సారం బగునాదుబుద్ధిచాతుర్యమునన్. 257

వ. అని మఱియుం దనమనంబున. 258

క. బుద్ధికి నశక్య మగుపని
యిద్ధాత్రిం గానఁగలదె యిదె గెలిచెద నా
బుద్ధిబలంబున సింహము
నుద్ధతి యణఁగించి ప్రాణము క్తికిఁ బాయన్. 259

క. అనుచుఁ దలపోసి యాశశ
మనుమానింపుచును గదలునప్పటికి నినుం
డు నభోమధ్యగతుం డగు
డు నతిక్షుత్పీడచేఁ గడుం గ్రోధమునన్. 260

తే. అపుడు గఱచి కంఠీరవం బౌర యివ్వ
నమున మృగములు నేఁడు గర్వమున నేచి
దినదినంబును నాకుఁ బుత్తెంచుమృగము
ననుప విది యేమొకో యనునవసరమున. 261

క. అడుగులు తొట్రుపడంగా
నడ లొందిన యదియ పోలె నయ్యెయెడలక
బుడమిఁ బడి మ్రొగ్గి లేచుచు
గడుసరి యగుశశక మొయ్యఁ గదియం బోవన్. 262

క. అప్పుడు చూచి మృగేంద్రుఁడు
నిప్పులు కనుదోయినుండి నెగయఁగ నోరీ
చొప్పడదు వేళ దప్పిన
యప్పటియశనంబు నాకు నహితం బగుచున్. 263

క. అపరాహ్ణవేళదాఁకం
గపటంబున నిట్లు రానికారణ మేమీ
విపరీతంబులు పుట్టెనొ
విపినంబున నున్న జంతువితతికి నెల్లన్. 264

వ. అని యివ్విధంబున రోషావేశంబునఁ బలుకుచున్న మృగేంద్రు
నకు సాష్టాంగదండప్రణామంబులు చేసి శశకం బిట్లనియె.

చ. కినియక చిత్తగింపు మొకకీడును నా దెస లేదు నేఁడు సూ [గిం
ర్యునియుదయంబువేళ నను నొక్క మృగేంద్రుఁడువచ్చి యడ్డ
చిన నిది యేల యేలికభుజింపఁగఁ బోయెడినన్నుఁ బోవని
మ్మనిన వనంబుజంతునివహంబుల కేలిక నేన కానొకో.

వ. అనుచుఁ బెద్దయుం బ్రొద్దతండు నన్ను దేవరసమ్ముఖంబునకుఁ
బనివిననీక నిలిపి మఱియు నిట్లనియె. 267

క. నాకంటె నధికుఁ డెవ్వఁడు
నా కతనిం దెచ్చి చూపిన న్నిను మెత్తుఁ
లేకున్న నిన్నుఁ ద్రుంతుం
గా కని యతఁ డప్పు డనుపఁ గడు భీతిమెయిన్. 268

క. ఆవిధ మెఱిఁగించుటకై
దేవర యున్నెడకుఁ బాఱుతెంచితి నీకుం
దేవలసినట్టిమృగమును
రా విడువం డనిన నతఁడు రభసం బెసఁగన్. 269

క. ఏవంక నుండు నాహరి
యేవేళను నాకుఁ జిక్కు నే నేభంగిఁ
భావించి యతనిఁ గదియుదు
నావుడు నాతనికి శశకనాథుం డనియెన్. 270

క. సింగం బాఁకలిగొని సా
రంగాదిమృగాళి వెనుక రయమునఁ జను నీ
వంగీకరించి కదలుము
వెంగలిమృగరాజుఁ బట్టఁ వెఱ పేమిటికిన్. 271

క. అనుపలుకు విన్న మాత్రన
తనమది( గ్రోధానలంబు దరికొన శశకం
బున కనియె నోరి ముందఱ
వనమున వా( డున్న దెసకు వడి( జను మనుచున్. 272

సీ. ఆమృగేంద్రుండు మహాజవంబున(బాఱ
నతనిముందఱ( దాను నతిరయమున
నెలయించి చెవులపో తెంతయు దూరంబు(
గొనిపోయి మున్ను చూచినయగాధ
జలములు గలకూపసన్నివేశంబున
నిలుచుండి నీశత్రునికి నివాస
యోగ్యంబు నెల విది యూహించి డగ్గఱి
చూడుమా యన( దొంగి చూచునప్పు

తే. డాత్మ దేహంబు కూపజలాంతరమున(
గాంచి వేఱొకసింహంబుగా( దలంచి
కన్ను గానక మాత్సర్యంబుకతన నుఱికి
యపుడ మృతి(బొందె దుర్బుద్ధి యగుట(జేసి. 273

వ. కావున నెంతటిబలవంతు నైనను బుద్ధిబలంబునంజేసి బుద్ధిమంతుండు గెలుచు నన( గరటకుం డట్లు కాక నీకు(గార్యసిద్ధి యయ్యెడు మరుగు మనిన దమనకుండు పింగళకు సమ్ముఖంబు నకుం బోయి నమస్కరించి యిట్లనియె. దేవరకు నే నత్యంతాపరాధంబు చేసితి సంజీవకుని( గొలువంబెట్టి తగనిపని( జేసితి( గావున నీయపరాధంబు సహింపవలయు నని యిట్లనియె. 274

క. పదవిం బొందినసచివుండు
పద(పడి నృపునెదుట నెట్లుపలికిన నమరున్

బలహీనుఁడు తగుపలుకులు
పలివే లాడినను భూమిపతి కింపగునే. 275

క. అనినం బింగళకుం డా
తనితో నీ వేమి చెప్పఁదలఁచిన నీకం
టెను హితుఁడు గలఁడె నాయొ
ద్దను వెఱవక చెప్పు మనిన దమనకుఁ డనియెన్. 276

క. ఈసంజీవకుఁ డెప్పుడు
నాసన్నిధిఁ దప్పనాడి నగుచుండు నినుం
దా సరకుసేయఁ డేమిట
నీసున నినుఁ గొలువఁ జేరనీఁ డెవ్వానిన్. 277

చ. అదియునుగా కతండు భవదాజ్ఞఁ జరింపక నీప్రభుత్వసం
పదయును మంత్రశక్తియును బ్రాభవశౌర్యమహోద్యమం
బులుం, మదమునఁ దప్పనాడును గ్రమంబున నీమహిఁ దాన
కైకొనం, మదిఁ దలపోయు నేఁ దెలిసి మానుగ నీ కెఱిఁ
గింప వచ్చితిన్. 278

తే. అనిన భయవిస్మయమ్ములు మనముఁగలఁప
నేమియును బల్కకున్న మృగేంద్రుతోడ
నధిప నీమంత్రి నీకంటె నధికుఁడైన
కతన నభివృద్ధి నీ కెట్లు గలుగు వినుము. 279

తే. మహిమ నత్యుచ్ఛ్రయుండగుమంత్రి మీఁదఁ
బార్థివునిమీఁద నొక్కొక్కపదము నిలిపి
నిల్చు స్త్రీస్వభావంబున నిల్వలేక
యుదధికన్యక వారిలో నొకని విడుచు. 280

వ. అన నతండు వెండియు నిట్లనియె. 281

సీ. మనుజవరుఁడు నిజామాత్యుగా నొక్కని
నిల్పఁ దద్భారంబు నిర్వహించి
తనరు ప్రక్చందనవనితాదిసుఖముల
మోహ మంతంతకు మురియఁబడఁగ
మోహంబుచే గర్వమునఁ గన్ను గానక
గర్వాతిశయమునఁ గానిపనులఁ
జేసి నిజేశ్వరుచే నొత్తు ననుబుద్ధి
నతని నుల్లంఘింప మతిఁ దలంచుఁ
తే. దలఁచి దృఢతరముగ నేలి దళముఁ గూర్చు
కూర్చి రాజ్యంబు తనకుఁ గైకొనఁగడంగుఁ
గడఁగి నృపపక్ష మగువారికడుపు కిడక
కుశలబుద్ధిని బతిఁ గాలవశునిఁ జేయు. 282

వ. అని మఱియును. 283

ఉ. పెంచి యనేకసంపదలఁ బ్రీతి వహింపఁగఁ జేసి తన్ను మ
న్నించినరాజుమీఁదఁ దుది నేరము పెట్టి పరావనీశదే
శాంచితభూరిసంపదల కాసపడుక్ పడి హానిఁ బొందునే
మంచితనంబు దుష్టు లగుమంత్రులకుం గలదే తలంపఁగన్.
తే. అతిసమర్థుఁడై మంత్రి కార్యములు దీర్చు
నపుడు హితమతిగాకున్న నదియుఁగాదు
మిగుల ననురక్తుఁ డగువానిమీఁదఁ గరుణ
నవనిపతియున్నకుండిన నదియుఁ గాదు. 285

వ. అని వెండియు. 286

క. సేవకులు లోకమందును
శ్రీవిశ్రుతు లైన నేల సేవింతురు ధా

త్రీవిభులఁ దమకు జరగమి
కై వలసినపంపు సేయ నగుఁ గాక మహిన్. 287

వ. అనినం బింగళకుండు సంజీవకుండు నా కత్యంతస్నేహితుం డెట్లు విడువనేర్తునని యిట్లనియె. 288

ఆ. సకలదుష్టదోషసహితదేహం బిది
నాకు నేటి కనెడినరుఁడు గలఁడె
యట్లు నిజహితుండు నప్రియం బొకచోటఁ
గడఁగి చేసెనేని విడువరాదు. 289

వ. అని పలికి సంజీవకు నుద్దేశించి. 290

ఉ. నమ్మిక యిచ్చి చేకొని ఘనమ్ముగఁ బూజ్యునిఁ జేసి మాటమా
త్రమ్మున వీఁడు గాఁడని వృథా బహుదోషము లెన్ని భృత్యు
రా, రమ్మని యాజ్ఞ సేయ నగరా నను లోకమువారు వానినే
రమ్మున వాఁడె పోవుఁ దెగ రాదు కలంపకు నాదుచిత్తమున్.

వ. అనిన విని దమనకుం డిట్లనియె. 292

ఉ. ఎంతయు గారవించి తను నింతయమాత్యునిఁ జేసి రాజ్యమి
ట్లింతయుఁ జేతి కిచ్చి యనయమ్మును దేవర నమ్మియున్నచోఁ
గొంతయినం దలంపక నిగూఢముగా మహియెల్లఁ గైకొనఁ
జింత యొనర్చు శే నెఱిఁగి శీఘ్రమ నీ కెఱిఁగింప వచ్చితిన్.

వ. మఱియును. 294

ఆ. అన్నదమ్ముఁడైన నాత్మజుం డైనను
సచివపదవిఁ బనులు జరపుచోట
వానిమీఁదిదృష్టి వదలిన యప్పుడా
రాజుఁ బాయు నిందిరావధూటి. 295

చ. సుజనహితోక్తి కర్ణముల సోఁకఁగనీయ కహర్నిశంబునుం
గుజనులబుద్ధి చిత్తమునఁ గూర్చి సరాష్ట్రము గాఁగ నమ్మహీ
భుజుఁడు నశించు రోగి తనబుద్ధి నపథ్యమె పథ్య మంచు న
కృజముగ నాత్మలోఁ దలఁచి కాలవశంబును బొందుచాడ్పు
నన్. 296

ఉ. అప్పటి కప్రియం బయి నిజాత్మకు మీఁదటికిన్ బ్రియంబుగాఁ
జెప్పెడువాక్యముల్ విను సుచిత్తుఁడు నిచ్చక ముజ్జగించి మేల్
తప్పక చెప్పు సుత్తముఁడు ధారణిఁ బుట్టరు పుట్టరేని న
య్యొప్పెడివారల న్విడువకుండు రమాసతి యెల్లకాలమున్.

క. ప్రాఁత యగుమంత్రి తనకుం
జేఁతఁజేకముఁ జేసె ననుచు శిక్షించి యొరున్
లాఁతిం బెట్టిన నీఁతలు
మ్రాఁతలు నై రాజు విడుచుఁ బొందక మూఁకల్. 298

సీ. పాటించి తనప్రాఁతపరివారమును బోర్చి
హత్తినన్నృపునకు హాని గలదె
మొన పేర్చి వైరులు మోహరించినవేళఁ
గేడింప కప్పుడె గెలుచు టొండె
మొనసి దైవాధీనమున నపజయ మైన
భూపాలుఁ గప్పి కొంపోవు టొండె
నర్థంబు దఱిఁగిన నధిపతి ధన మిచ్చి
నడపలే కుండిన నవయు టొండె

తే. నెవ్విధంబున నైన మహీశువలని
మన్ననకుఁ జాల నిలుతురు మఱవ కెపుడు
విడువకుండుదు రెటువంటివేళలందుఁ
బూర్వపరివారమునుబోల్పఁ బురుఁడుగలదె. 299

క. అనినం బింగళకుం డి
ట్లను సంజీవకున కభయ మట్లొసఁగి పద
స్థునిఁ జేసి ప్రీతి యొనరిం
చిన నా కె గ్గతఁడు లోనఁ జింతించునొకో. 300

వ. అనిన దమనకుం డిట్లనియె. 301

తే. ఎంతసఖ్యంబు జేసిన నెంత ప్రియము
చేసి తిరిగిన దుర్జనుచిత్త మేల
చక్కటికి వచ్చు శునకపుచ్ఛంబు కడఁగి
వంక యొత్తినఁ జాయకు వచ్చు నెట్లు. 302

క. కొఱ యగుపదార్థ మెందుం
గొఱ యగుఁ గొఱ గాని దైనఁ గొఱ గా దెచటన్
నెఱి నమృతధారఁ బెంచినఁ
గొఱ యగునే ముసిఁడి కల్పకుజముంబోలెన్. 303

ఉ. వారక యుత్తముండు దనవారి కపాయము వచ్చువేళ ము
న్నారసి చెప్పు తీర్చును దురాత్ముఁ డెఱింగియుఁ జెప్ప కాత్మని
ష్కారణవైరమూఁది తనగాదిలిచుట్టము నైన నిర్దయా[గున్.
కారతనొంచుఁ గొండియముఁ గైకొను నొండులచేటుకు న్న

వ. అని వెండియు నిట్లనియె. 305

సీ. వ్యసనదూరుం డైనవాఁడె పో సిద్ధుండు
గీర్తితం బగునదె వర్తనంబు
పురుషానుకూలతఁ బొగ డొందునదె భార్య
బుధవర్ణనీయుండె బుద్ధియుతుఁడు
మదముఁ జేయక యుండునదె మంచిసంపద
యాశావిహీనుండె యధికసుఖుఁడు

కపటస్వభావనిర్గతుఁడె సన్మిత్రుండు
విజితేంద్రియుండె వివేకఘనుఁడు
తే. కారణము లేకయును బరకార్యములకు
నోపి తీర్చినయాతండె యుత్తముండు
సమరరంగంబునం దధీశ్వరునిపనికి
వెనుకతీయనియాతండె వీరభటుఁడు. 306

వ. అని పలికి దమనకుండు సంజీవకునిమీఁదఁ బింగళకునిచిత్తంబు
తిరుగంబడకుండుట యెఱింగి యిట్లనియె. 307

సీ. అధికకామాసక్తుఁ డైనభూపాలుండు
మొనసి కార్యాకార్యముల నెఱుంగ
కత్యంతమదఘనాహంకారయుక్తుఁడై
సన్మార్గ మరుచిగా సంచరించుఁ
దొడరి భృత్యామాత్యదోషవిచారంబు
చాలక శిక్షింప శక్తి లేక
యపవాదకంటకాయతశోకగహనంబు
సొచ్చి వెల్వడు నట్టిచోటు గాన
తే. కహితమృగములచే నొండె నాత్మ భృత్య
దావపావకపటుశిఖాతతుల నొండె
రీతిఁ జెడుఁ గాని మఱి సేకరింపలేఁడు
శౌర్యగుణధామ మృగకులసార్వభౌమ. 308

వ. అని చెప్పినఁ బింగళకుం డిట్లనియె సంజీవకుండు నాకుఁ బ్రతి
కూలుం డై కీడు సేయ సమర్థుం డగునే యనిన దేవర కవ్వి
ధంబున మున్న విన్నవింపవలసినవాఁడనై యుండియు
మంత్రభిన్నం బైనఁ గార్యంబు దప్ప దని శంకించితి మంత్రం

బతిప్రయత్న రక్షణీయంబు గావలయు విజ్ఞాతశీలాచరణుం
డగుశాత్రవు విశ్వసించి మయిమఱచిన నతం డేమిసేయ
నోపండు విజ్ఞాతశీలాచరణం బగుడిండిగంబుచేతం గాదె మంద
విసర్పిణి మృతిం బొందె ననుటయు బింగళకుండు తత్కథా
క్రమం బెట్లనుటయు నతం డిట్లనియె. 309

క. మందవిసర్పిణి యన నా
నందముతోఁ జీరవేసు నరపతిశయ్యం
బొందుకొని పెద్దకాలం
బెందుం బోక చట నుండు నిష్ట మెలర్పన్. 310

క. అచ్చోటికి నొక తెఱఁగునఁ
గ్రచ్చఱ నరుదెంచి డిండికం బనునామం
బచ్చుబడిననల్లి మదిం
బొచ్చెము లే కనియె యూకపుంగవుతోడన్. 311

శా. నీపాదంబుల కేను మ్రొక్కెదఁ దగ న్నీ వాఁడ నీచుట్టముం
గాపాడం దగు నన్ను యూక మకటా కైవార మింతేటికిఁ
నాపుణ్యంబున వచ్చి తిచ్చటికి ధన్యం బయ్యె మద్వంశ మీ
భూపశ్రేష్ఠునిపాన్పునందు సుఖినై పూజ్యుండ నై తిం జుమీ.

న. అని మఱియును. 313

క. నన్నే మియడుగుకొఱకై
సన్నుతగుణ ప్రియము చెప్పఁ జనుదెంచితి నా
యున్నయది హీనవృత్తము
కన్నారఁగఁ జూచి యేమి కాంక్షింతు వనా. 314

వ. అనిన నమ్మాటకు జండికాఖ్యం బగుమత్కుణం బిట్లనియె. 315

సీ. కలిమిలేములు చూచి కాంక్షించునా యర్థి
తనకు నక్కఱ యైనఁ దగులుఁ గాక
యితఁడు లోభి వదాన్యుఁడితఁ డని యెఱుఁగునా
యర్థంబు కాంక్షఁ జెల్లఱచుఁ గాక
హీనాధికంబుల నెఱిఁగి యాచించునా
లేమికై యొరులఁ గారించుఁ గాక
విద్య లే దని తన్ను వివరింప నేర్చునా
సభల విత్తాపేక్షఁ జదువుఁ గాక

తే. తెల్ల బట్టలవారైన వెంట నెల్లఁ దిరిగి
తనదు నేర్చిన నడుగంగ దాత మెచ్చి
యర్థ మిచ్చిన నలరు లోభానుకూల
చిత్తుఁ డీకున్న నంతటఁ జిన్నవోవు. 316

వ. అని పలికి డిండికుండు వెండియు నిట్లనియె. 317

ఆ. అర్థితారతమ్య మడుగంగఁ జెప్పితి
నర్థకాంక్ష నిన్ను నడుగ రాను
మిత్ర నాకు నశనమాత్ర మింతియ నీవు
చేయవలయునట్టిసాయ మెల్ల. 318

ఉ. మానక మున్ను నేఁ జెనఁటిమానవరక్తముఁ ద్రావుచుండుదుం
గాని మహీశుదేహమునఁ గల్గినశోణిత మానఁ గానమిఁ
మే నెరియంగ నుండి నిను నేఁడు గనుంగొన నిందు వచ్చితిఁ
దీనికి నీయకో మ్మిటు మదీయమనఃప్రమదంబు చెల్లఁగన్. 319

వ. ఇవ్విధంబున నువ్విళ్ళూరినకారణం బెట్లం టేని. 320

సీ. శాల్యన్నఘృతసూపశాకభక్ష్యములతో
వాసన గలరసావళులతోడ

బహుఫలంబులు గలపానకంబులతోడఁ
గమనీయమాంసఖండములతోడ
మధురేక్షుగోక్షీరమధుపానములతోడ
సరసంబులైనపచ్చళ్ళతోడ
సుమనోగ్రదధితక్రశుద్ధజలములతోఁ
బరిమళగంధపుష్పములతోడఁ

తే. జతురశ్శృంగారవతులైనసతులతోడ
ననుదినంబును భోగించునవనిపతుల
దేహరక్తంబుఁ గ్రోలంగ నూహ చేసి
తిరుగుచుండుదుఁ గాని సిద్ధింప దెందు. 321

వ. అనుడిండికంబుపలుకు లాకర్ణించి కటకటంబడి మందవిసర్పిణి
యిట్లనియె. 322

చ. చలనము లేక యీనృపతిశయ్య నహర్నిశమున్ సుఖించునా
మెలఁకువ హానిచేయుటకు మేకొని రాఁదగునయ్య దోషకా
రులు సుజనాపకారములు రోయుట నైజము గాన నీకు నే
నలుగుదుఁగానియించుకయువార్తనొడంబడమత్కుణోత్తమా!

వ. అనిన మందవిసర్పిణికి డిండికుం డిట్లనియె. 324

క. నీదగునెలవున నాకుం
గా దవ్వునన బలిమి లేదు కరుణాన్విత నీ
పాదముల కేను మ్రొక్కెద
వా దడవక సమ్మతింపవలె నన నదియున్. 325

వ. దాక్షిణ్యంబుకతంబున నొడంబడి యిట్లనియె. 326

క. వెర పెఱిఁగి వేగిరింపక
సురతశ్రమపారవశ్యసుఖసుప్తిమెయిన్

బొరసినధరణీకాంతుని
వరదేహం బొయ్యఁ గఱచి వలయుఁ దొలంగన్. 327

క. కక్కురితకాఁడు కార్యము
చక్కటి యెఱుఁగండు సంధ్యజామున నతనిన్
బొక్కిపడ నీవు కోఱల
నొక్కిన నది తెలియ మన కనువు దప్పుఁ జుమీ. 328

ఆ. అనిన నట్ల కాక యని నల్లియును జీర
పేను నేకశయ్యఁ బ్రీతి నుండ
బేనుకన్ను మొఱఁగి ప్రియపడి భూమీశుఁ
గదిసి సందెజామె కఱచె నల్లి. 329

వ. అప్పు డమ్మహీపతి నిద్రావిరహితుండై యుండుటం జేసి యదరి
పడి తనపదతలంబు లొత్తుచున్న యనుచరుల నాలోకించి
యిట్లనియె. 330

ఉ. దీవియఁ దెచ్చి చూడుఁడు మదీయశరీరము తేలు కుట్టిన
ట్లే వెత పొందెడుం గడు రయంబున రం డన వారు వచ్చునా
లో వివరాంతరంబునకు లోఁగినమత్కుణనాథుఁ గాన కా
భూవరుపాన్పుమధ్యమును బొందినమందవిసర్పిణిం దగన్.

క. పొడగాంచి యిదియె కఱచెం
బుడమిధవుని దేహ మనుచుఁ బొడవడఁగింపన్
బడెను మందవిసర్పిణి
కడు దుర్జనుపొందు హాని గాకేలుండున్. 332

వ. అని యిట్లు దమనకుండు చెప్పిన విని పింగళకుండు నాపరా
క్రమం బెఱింగియు సంజీవకుఁ డెయ్యైసాధనంబుల నన్ను
సాధించువాఁ డనుటయు నతం డిట్లనియె. 333

ఉ. కొమ్ముల గ్రుచ్చి యొత్తియును ఘోరఖురాగ్రనిపాతనంబులన్
జిమ్మియు దంతఘాతములఁ జించియు వాలవిశాలచాలనో
గ్రమ్ముల నెమ్ము లెల్లఁ గడికండలుగాఁజదియంగ మోఁదియున్
సమ్మద మారఁ జంచు మృగసత్తమ యేమఱియుండితేనియున్.

వ. అనిన విని పింగళకుం డొక్కింత చిత్తక్షోభంబుగా దమనకుం
జూచి నీవింతటి నరిగి యావృషభనాయకుని యభిప్రాయం
బెఱింగి శీఘ్రింబ రమ్మన్న వాఁడును నంతంత నొదుగుచుఁ
జకితుండునుంబోలె సంజీవకుం జేరం బోయిన నతం డిది యేమి
భయకంపితుండ వగుచుఁ జనుదెంచితివి కుశలంబ కదా యనిన
సేవకధర్మంబునం దిరుగువారికి సంసారసుఖంబు గలదే విను
మని యిట్లనియె. 335

ఉ. ఇంతటివానిఁ జేసె నృపుఁ డింతధనం బొడఁగూడెఁ బక్షమ
త్యంతము నాపయిం గల దయత్నసుఖానుభవంబు దీర్ఘకా
లాంతరసంచితం బని నిజాత్మఁ దలంచును బాలిశుండు ప్రా
ణాంతముగాఁ దలంచి చలితాత్మత నుండు వివేకి యిమ్మహిన్.

వ. అని చెప్పి మఱియును. 337

సీ. ధనవంతు గర్వంబు దారొక్కన కేలుండు
వ్యసని కాపద యేల పాసఁగ కుండు
సతులఁ జూచిన మతి చలియింప కేలుండు
నృపులమన్నన లేల నిజము లగును
గాలంబుచే రూపు కడచన కేలుండు
గౌరవ మర్థి కేకరణిఁ గలుగు
దుర్జనవాగురఁ దొడర కెవ్వఁడు నిల్చుఁ
జిరకాలసుఖము నేనరుఁడు పొందుఁ

తే. గాని గుణములు విడిచి పుణ్యానుకూల
వర్తనంబుల నిహపరవైభవములఁ
బొందువాఁడొక్కఁడొక్కఁడుపుణ్యపురుషుఁ
డతఁడు దేవాంశజనితమహాత్ముఁడండ్రు. 338

తే. దేశకాలధనాగమస్థితులఁ దెలిసి
యరులు మిత్రులుఁ దన కెవ్వ రని యెఱింగి
యెవ్వఁ డైనను నాశక్తి యిట్టి దనుచు
నధిపుఁ డెప్పుడుఁ జింత చేయంగవలయు. 339

వ. అనిన విని సంజీవకుం డప్పటి రాజకార్యప్రసంగం బెద్దియనినఁ గదియం జనికూర్చుండి యల్లన నిట్లనియె. 340

క. ఏకాలంబున రాజులఁ, జేకొని సేవకులు నమ్మి చెడు టది సిద్ధం
బీకాలఁది నే నెఱింగితి, నీకుం జెప్పంగఁ దగు ననింద్యచరిత్రా.

వ. అనుచు నేకాంతంబున నిట్లనియె. 342

ఉ. ఎప్పుడు మోసపోవక మృగేంద్రునిపైఁ దగువేగు వెట్టి తెం
పొప్పఁగ నాయతం బయిన నోపిక ముట్టినకార్య మైనచోఁ
దప్పక నిర్వహించుకొని ధాత్రికి నీవ యధీశ్వరుండ వై
చొప్పడకున్నమా బ్రతుకుసూ వెవ్రు థావృష భాధిపోత్తమా!

వ. అనిన సంజీవకుం డదరిపడి మృగేంద్రుని కరుణాకటాక్షంబు నాయెడ శిథిలంబు గాదు గదా యనిన నతం డేకాంతంబుగా నిట్లనియె. 344

క. విపరీతచిత్తవృత్తునిఁ
గపటి దయారహితుఁ జపలు గాంభీర్యగుణ
వ్యపగతు రా జని కొల్చిన
నపరాధము లేకయైన నాపద వచ్చున్. 345

వ. అని మఱియును. 346

చ. కొలువున కీవు రాఁ దడవ ఘోరకరాళవిశాలదంష్ట్ర లన్
మెలఁగఁగ నిన్నుఁబట్టి బలిమిన్ గళరక్తము మున్ను గ్రోలి క
ట్టలుక నిజాశ్రితప్రతతి కంతటికిన్ భవదీయమాంస మ
గ్గలముగఁ బంచిపెట్టుటకుఁగా నియమించె మృగేంద్రుఁ
డుగ్రతన్. 347

వ. ఇత్తెఱంగు నేఁడ కాదు పెద్దకాలంబునుండియుఁ బింగళకుండు నీనామంబు ప్రసంగవశంబునం గొలువులోపల వినంబడిన యప్పు డసహ్యతయుఁ బ్రజ మెచ్చునెడ నీర్ష్యయు నీపారవశ్యంబును మెచ్చమియును నీవారలైనవారలయెడ నాగ్రహంబును నీవువెలిగానిసంపద కసూయయు నీయొప్పమికిఁ బ్రియం బందుచిత్తంబును నై యున్నవాఁడు మున్ను నీకు శపథం బిచ్చి కొలిపించుటం జేసి యివ్విధంబునం దెలుపం జనుదెంచితి నీకుఁ బొందైనతెఱంగు జూచుకొ మ్మనిన సంజీవకుం డత్యంత దుఃఖాకులుం డగుచు నిశ్చేష్టితుం డై యూరకుండి కొండొకసేపునకు దమనకుం జూచి యిట్లనియె. 348

ఉ. పూని దురాత్మగమ్య యగుపొల్తుక చక్కఁదనంబుఁ బాత్రస
న్మాన మెఱుంగలేనినరనాథువివేకముఁ గష్టవృత్తిమై
నానినలోభిసంపద మహాంబుధిలోపలఁ బర్వతంబులం
దూనినవర్షధారలును యోగ్యము గావు నిరర్థకంబు లౌ.

క. ఆరాధ్యమానుఁ డగునృపు
నారాధన దనకు లేమి యది గల దంచున్
గోరి యపూర్వప్రతిమా
కారము గైకొనుట వైరకారణ మరయన్. 350

క. నేరమున కలుగు భూపతి
చేరువనె ప్రసాద మొందు సేవకులపయిఁ
నేరము లేకయె యలిగెడు
భూరమణునిమనసు ప్రీతిఁ బొందునె యెపుడేన్. 351

వ. అని పలికి వెండియు. 352

సీ. రాత్రులు సరసిలో రాజహంసము జొచ్చి
నవసితోత్పలఖండనంబు సేయు
తఱిఁ బ్రతిబింబితతారౌఘములఁ జూచి
యవియ కైరవపఙ్క్తి యని తలంచి
ముక్కునఁ బొడుచుచు నక్కడ వృథ యైనఁ
దక్కినపుష్పసంతతియుఁ గల్ల
గాఁ జూచు వేగినఁ గన్నులఁ గనియును
బొడువ శంకించుచుఁ గుడుపు దక్కి

తే. నిలుచుఁ గల్లనిజంబును నిజము కల్ల
యు నని స్వాత్మకుఁ దోఁచు నొక్కొక్కవేళ
దానుమూఢాత్మతనుమున్ను తప్పఁదలఁచి
నాఁడననిచూడఁడెన్నండు నరుఁడు మదిని. 353

క. నెపము గలకోపమైనను
నృపుచేఁ బడవచ్చుఁ గాక నెప మేమియు లే
కపరాధంబులు వెదకెడు
కపటాత్మునిఁ గొలువ వశమె కలకాలంబున్. 354

వ. అని పలికి సంజీవకుండు దమనకున కిట్లనియెఁ బింగళకుండు పరప్రణీతవ్యాపారసంగతుండు గాఁబోలు నని మఱియు నిట్లనియె. 355

తే. వైద్యవిద్వజ్జనామాత్యవర్యు లేధ
రాధిపున కిచ్చు లాడుదు రావిభుండు
సంతతారోగ్యధర్మతోషముల వృద్ధిఁ
బొందనేరక శీఘ్రింబ పొలిసి పోవు. 356

వ. అని పలికి సంజీవకుండు మఱియు నే నీరాజునకుఁ గీడు దలంచుట లేదు నాయెడ నిగ్నిమిత్తాపకారి యయ్యెఁ జూచితే యని యిట్లనియె. 357

శా. భావాతీతము లైనకార్యములు దీర్పన్ మెచ్చఁ డెల్లప్పుడున్
సేవాభక్తివిహీనదుర్మతుల రక్షించు న్మహీభర్త దా
నేవాఁ డైనను రాజులం గొలుచు నే ర్పేభంగులం గల్గు హా
సేవాధర్మము యోగి కైన వశమే చింతింప నీధాత్రిలోన్.

క. గుణులం జేరినపురుషుఁడు
గుణి యగు నవగుణులఁ గూడి గుణహీనుఁ డగున్
బ్రణులికి నెక్కినవదులు ల
వణజలధిం గూడి చెడినవడువున నెందున్. 359

తే. మంచిగుణములు గలయట్టిమనుజునందు
స్వల్పగుణ మైన నది ప్రకాశంబు నొందు
శ్వేతగిరిశిఖరంబుపై శీతకరుని
కిరణజాలంబు మెఱవడిఁ బొరయుకరణి. 360

తే. కానిగుణములు కలయట్టివానియందు
మంచిగుణములు పైకొని మించలేవు
సురుచిరోరునిశాకరకిరణజాల
మంజనాద్రిపైఁ బ్రసరించి యడఁగినట్లు. 361

వ. అని మఱియును. 362

చ. ఖలునకుఁ జేసినట్టియుపకారము విశ్రుతశబ్దజాలదు
ర్బలున కుపన్యసించినసుభాషితవర్గము మూఁగవానితోఁ
బలికినవాక్యపద్ధతులు భావమునం దనమాటపాటిగాఁ
దలఁపనివానికిన్ బహువిధంబుల బుద్ధులుఁ గానిపద్ధతుల్.

సీ. దారుణాటవి రుదితంబుఁ జేసినయట్లు
చేరి శవంబుఁ గైచేసినట్లు
నిర్జలంబైనచో నీరజం బిడినట్లు
వట్టిచోటను విత్తు వెట్టినట్లు
సారమేయముతోఁకఁ జక్కఁ గట్టినయట్లు
చెవిటి కేకాంతంబు చెప్పినట్లు
తనరఁ జీకునకు నద్దంబుఁ జూపినయట్లు
వెలిమిడిలో నెయ్యి వేల్చినట్లు
తే. చాల నవివేకి యైనట్టిజనవరేణ్యుఁ
దగిలి కొలుచుట నిష్ఫలత్వంబు సేయు
సేవకుల కెల్లభంగి విశేషబుద్ధి
నిల వివేకంబు గలరాజుఁ గొలువవలయు. 364

తే. మొనసి యల్లంతఁ గనిధూర్తు మ్రొక్కి లేచు
నార్ద్రహృదయుఁడై యొసఁగు నర్ధాసనంబు
బిగియఁగౌఁగిటఁగదియించుఁ బ్రియమువలుకు
విషమునమృతంబులోనను వెలినిగాన. 365

మ. రవి యస్తాద్రికి నేఁగునప్పుడు విచారం బేది మత్తాళి లో
భవశేచ్ఛన్ వెసఁ బంకజోదరము దర్పం బేర్పడం జొచ్చిత
ద్వివరంబంతటఁ గ్రమ్ముకొన్నఁగడునార్తిం బొందుచందానమా
నవులుం గొందఱుమీఁదెఱుంగ కెలమిన్ వర్తింతురీలాగునన్.

వ. అని చెప్పి మఱియును. 367

చ. శరనిధి దాఁట నావయును సంతమసం బడఁగింప దీపముల్
వరకరిశిక్ష కంకుశము వాయువుఁ గూర్పఁగఁ దాళవృంతముల్
వెరవునఁ జేసె బ్రహ్మ పదివేలవిధంబుల మూర్ఖచిత్తవి
స్ఫురణ మడంపలేక తలపోయుచు నిప్పుడు *నున్న వాఁడహో.

వ. అని పలికి సంజీవకుం డిట్లనియెఁ దృణాహారవ్యవహారంబునఁ బతిహితకార్యంబు చేయునాకుఁ గాలముఖప్రవేశంబు కర్తవ్యం బయ్యె నింక నెక్కడి బ్రతుకు వినుమని యిట్లనియె.

తే. ఎన్న నిప్పుడు పెద్దలు పిన్న లనక
వితతమాయోపజీవితయుతులు గాన
సాధులకుఁ గీడు దలఁతురు జగతి నుష్ట్ర
మునకుఁ గాకాదు లేకమై మొనసినట్లు. 370

వ. అనిన విని దమనకుం డక్కథ నాకెఱింగింపు మన్న సంజీవకుం డిట్లనియె. 371

చ. అతులమహోగ్రకాననమునందు మదోత్కటనామసింహ ము
ద్ధతిఁ జరియించు దానికిఁ బ్రధానులు కాకము పుండరీకముల్
మతిగలజంబుకంబును గ్రమంబునఁ బంపొనరింపుచుండి యొ
క్కతఱినరణ్యదేశమునఁ గాంచిరి యుష్ట్రము నిందువేడుకన్.

మ. కని నీ వెచ్చటనుండి వచ్చి తనినం గాకాదిజంతుత్రయం [బీఁ
బునకున్ వందన మాచరించి యనియెన్ మున్ సార్థవాహుండు
పున మోపింపఁగ మోసి డస్సి యెచటంబోలేక దాఁగున్న వాఁ
డను మీరే గతి నన్నుఁ బ్రోచినను వేడ్కన్నిల్తు మీచేరికన్.

వ. అని పలికినయుష్ట్రంబునకు జంబుకం బిట్లనియె. 374

*నున్నవాఁ డొగిన్-అని పాఠాంతరము.

క. ఈకాన కొకమృగేంద్రుఁడు
చేకొని సామ్రాజ్యపదవిఁ జెన్ను వహించుౕ
మా కతఁడు కులస్వామిగఁ
గైకొని సేవింతు మెల్లకాలము కడఁకన్. 375

క. నీవును మాలో నొకఁడవు
గావున మృగరాజుసమ్ముఖంబున నిడి నే
నీవిధముఁ దెలియఁ బలికి శు
భావహ మగుభంగి నీకు ననుసంధింతున్. 376

చ. వెఱవక విశ్వసింపు మము వింతగఁ జూడక వచ్చితేని ని
న్నె ఱుకపడౕ మృగేంద్రునకు నింపుగఁ జెప్పి తదీయభక్తికిౕ
గుఱుతుగ నిన్నుఁ జేసి మనకోరిక లెల్ల నతండు దీర్పఁగా
నెఱసినవేడ్క నల్వురము నెమ్మది నుండుద మెల్లకాలమున్.

క. అనుటయు నాలొట్టియయును
దనమది ముద మంది వెంటఁ దగిలిన వానిం
గొని చని మృగపతియుందట
వినయముతో నతని తెఱఁగు వినిపించుటయున్. 378

వ. ఆమృగేంద్రుండును నయ్యుష్ట్రంబు నభయవాక్యంబులఁ బ్రమోదం బెసంగం జేసి కథనకనామధేయం బిడి నాపూర్వామాత్యులలో నీ వొకండవై యుండుమని నియమించిన గోమాయుపుండరీక కాకంబులంగలిసి యతిస్నేహంబునఁ బెద్దకాలంబున్న సమయంబున నొక్కనాఁడు మదోత్కటుండు కాకవ్యాఘ్రగోమాయూష్ట్రంబులం గనుంగొని యిట్లనియె.

ఉ. కల్యమునందు భక్ష్యమును గానక మేను కృశించె రోగదౌ
ర్బల్యము నాకుఁ గల్గుటను భద్రగజేంద్ర శిరఃపలాదబా

పాటవ్యము లేమి సుద్ధతికి నోపక చిక్కితిఁ గాన దేహాపై
కల్యము మానుకై వడి సుఖం బగుపథ్యముఁ దెచ్చి పెట్టుఁడీ.

వ. అని పలికిన మృగేంద్రునకు నన్నలువురు నేకవాక్యంబుగా
నిట్లనిరి. 381

తే. మీకుఁ దగినయాహారంబు మేము దెచ్చి
ప్రీతి నొకపూఁటకైనను బెట్టలేము
చాల నల్పుల మగుట మాచంద మట్టి
దనిన మృగరాజు వారితో ననియె నపుడు. 382

క. ఏపాటియశన మబ్బిన
నాపాటిం బ్రొద్దు గడపి యట్లుండెద నా
కీపాపపుఁ దెవు లొదవెం
జూపోపక దైవ మిట్లు సొం పడఁగించెన్. 383

వ. అట్లు గావున. 384

క. వడిఁ బోయి మీర లిప్పటి
కడిదికి నేమాంస మైన గ్రక్కునఁ గొనిరం
డెడ సేయ కనుచుఁ బనిచినఁ
గడు వడి నలువురును బోయి గహనములోనన్. 385

ఆ. పొదలు సొచ్చి చూచి పుట్టలు వీక్షించి
చెట్టుగుట్ట మొదలు చేరి కాంచి
గిరులు నదులుఁ దోనలు బరికించి పరికించి
కాన నొకమృగంబుఁ గానలేక. 386

వ. కాకవ్యాఘ్రగోమాయూష్ట్రంబులు నలుదిక్కులం జెదరి
వెదకం బోయి కథనకుండు వెలిగా నొక్కచో మువ్వురుఁ
గూడుకొన్న సమయంబునఁ గాకం బిట్లనియె. 387

తే. స్వామిపని పూని వచ్చినచందమునకు
నడవిలోపల నేమియు నబ్బదయ్యెఁ
గంట కాహారుఁ డైనయా కథనకాఖ్యు
నతని కాహారముగఁ జేయ ననువు గాదె. 388

వ. తచ్ఛేషంబును మనకుఁ గొన్నిదినంబు లుదరపోషణంబునకుఁ జాలు గతకాలంబున ననేక మృగమాంసంబుల మనలఁ బోషించినరాజున కీసంకటంబుఁ బాపం దగదే యనిన గాకంబునకు నవి యిట్లనియె. 389

ఆ. అభయ మిచ్చి కరుణ నందఱికం బెను
విభవ మిచ్చినట్టి విభుని మొఱఁగి
మనము వీనిఁ జంప మది నెఱింగినయేని
నాగ్రహించి మనల నాజ్ఞ చేయు. 390

క. పేరెఱుకమాత్ర నధిపతి
చేరువ నంతంతఁ దిరుగుచిఱుతని నైనం
గారించె నేని సచివుని
భూరమణుఁడు గినియు వీనిఁ బొసఁగునె చంపన్. 391

వ. కావున మనస్వామి యెఱుంగకయుండ నతనిఁ జంపుట కార్యంబు గా దనినఁ బుండరీకజంబుకంబులకుఁ గాకం బిట్లనియె. 392

తే. చావు తథ్యంబు మనకు విచార మేల
పెక్కుదివసంబు లాఁకటి పెల్లుకుడుచు
హరికి నెచ్చోట నేమియు దొరకదయ్యె
నరయ నింతకు దైవికం బట్లు కాదె. 393

చ. మది నధిక క్షుధార్తుఁ డగుమానవుఁ డాలిని బిడ్డ నొల్లఁ డిం
పు దనర సర్పముం దనకుఁ బుట్టినయండమునుఁ భుజించు నొ
ప్పు దఱిగినట్టిచోటను బుభుక్షితుఁ డై దురితంబు చేయఁగా
మదిఁ దలపోయ కుండునె ప్రమాదము పుట్టుఁ దొలంగి
పోదమా. 394

వ. అనినఁ గాకంబునకు శార్దూలం బిట్లనియె మనస్వామి మహా
వ్యాధిపీడితుండును బుభుక్షితుండును నై యున్నయెడఁ
దొలంగిపోవుట భృత్యన్యాయంబు గా దతనిసమ్ముఖంబునకుం
బోవుద మనికదలునంతం గథనకుండుం గూడుకొన్న నన్నలు
వురుం జని సింహంబుబహిర్ద్వారంబునఁ గథనకుని నిలిపి
ముప్పురుం జని మదోత్కటునకుం బ్రణమిల్లి యిట్లనిరి. 395

తే. అధిప గిరగహ్వరముల కుగ్రాటవులకు
నరిగి యామిష మబ్బక తిరిగి తిరిగి
చిక్కితిమి నీవు చిక్కి నశింప నేల
విన్నవించెద మే మొకవెరవు వినుము. 396

ఆ. కథనకుండు మిమ్ముఁ గార్యార్థియై వచ్చి
కొలిచినాఁడు గాని నిలువలేదు
వాఁడు నీకు మాకు వలయుభోజన మగుఁ
బ్రియము వదలి మట్టుపెట్టితేని. 397

వ. అని కాకంబు పలికిన విని మృగేంద్రుండు కర్ణస్పర్శపూర్వ
కంబుగా హరిస్మరణంబు సేయుచు నభయవాక్యంబు లొసంగి
కొలిపించుకొని యిట్లు సేయందగునే విను మని యిట్లనియె.

మ. ధనదానంబును నన్నదానమును గోదానంబు భూదానముఁ
విను మిట్లీయభయప్రదానమునకు న్నిక్కంబు తుల్యంబు లౌ

ననరా దీయెడ నశ్వమేధమఖపుణ్యంబున్ భయభ్రాంతుఁ గా
చినపుణ్యంబునఁ బోలదంచు సుజనుల్ చెప్పంగ వింటిం దగన్.

వ. అనినఁ గాకం బిట్లనియె. 400

ఆ. కులముకొఱకు విడుచుఁ గొఱగానిపుత్త్రునిఁ
గులము విడుచు నూరు నిలుపుకొఱకు
భూమికొఱకు విడుచు బోరన గ్రామంబు
ధాత్రి విడుచు నృపుఁడు తనకుఁగాను. 401

వ. కావున మే మందఱముం గలిగియుఁ బ్రయోజనంబు లేదు
సకలజంతురక్షకుండ వగునీశరీరంబు నిలిచినం జాలు నా దేహం
బీపూఁట కాహారంబు సేయ నవధరింపు మని వాయసంబు
పలికిన విని మృగపతి యూరకున్నయెడ లబ్ధావకాశులై
తక్కినముువ్వురుం గూడుకొని యతనిముందఱ నిలిచియుండ
వాయసంబు మఱియు నిట్లనియె. 402

ఆ. తప్పుఁ జూచి నన్ను నొప్పింపఁజాలవు
చాలకున్న నేన చత్తు నాశ
రీరమాంస మిపుడు ప్రియమున భక్షింపు
మనఘ నాకు దీన నగు ముదంబు. 403

వ. అనినం గాకంబునకు సింహం బిట్లనియె. 404

ఆ. అల్పమాంస మిందు నాప్యాయనము గాదు
వట్టిహింస నాకుఁ గట్ట నేల
యనిన నాలకించి యామృగేంద్రునితోడ
జంబుకంబు పలికె సామ్యభణితి. 405

క. నాదేహము నీ కిచ్చితిఁ
గా దనక భుజింపు స్వామి కార్యము సేయం

బోఁది గలనాఁడు నిదె నీ
పాదంబులె దిక్కు సూవె పరమార్థముగన్. 406

వ. అనిన విని మదోత్కటుండు కాకంబుతోడఁ బల్కినట్ల
యమ్మృగధూర్తంబునకుం బ్రత్యుత్తరం బిచ్చినఁబులి కదియం
జను దెంచి సాష్టాంగనమస్కారంబు చేసి వినయపూర్వకంబుగా
నిట్లనియె. 407

క. ఎవ్వరు నేటికి నా మెయిఁ
గ్రొవ్విననమాంసంబు గలదు కొను మాఁకలియుఁ
నొవ్వియును దీఱు నంతట
నవ్వల నారోగ్య మగు మృగాధిప నీకున్. 408

వ. అని శార్దూలంబు పలికిన మృగేంద్రుం డిట్లనియె. 409

ఉ. గోవుల విప్రులం దఱిమి కూడఁగ ముట్టి భుజించి తచ్ఛరీ
రావృతమాంసపోషణమునం దనిశంబును మేను పెంచుటఁ
గా విటువంటికల్మషవికారపు మేనులు భక్ష్యభోజ్యముల్
నీవు దొలంగు మాఁకటికి నేఁడునునోర్చెద వ్యాఘ్రపుంగవా.

వ. అని మదోత్కటుండు పలికినఁ బుండరీకంబు సలజ్జావనతవదన
ఖిన్నత్వంబునం దొలఁగిచనినఁ దదనంతరంబ కథనకుం డతనిం
గదియం జని మచ్ఛరీరంబున భవదాత్మరక్షణంబు గావింపం
దగునన్న నాక్షణంబ. 411

క. వడి నుఱికి లొట్టిపిట్టను
మెడఁ గోఱలఁ గఱచి పట్టి మేదినిమీఁదం
బడఁ దిగిచిన శార్దూలము
నోడఁగూడినసక్క తాను నుదరము వ్రచ్చెన్. 412

వ. వ్రచ్చి తచ్ఛరీరమాంసంబు మృగపతికిం బెట్టి తచ్ఛేషంబు

గోమాయు వ్యాఘ్రకాకంబు లనుభవించెఁ గావునఁ గ్రొత్తగాఁ గొలిచినసేవకుం డెంతబలవంతుండయ్యును రాజునకును బరివారంబునకును హత్తనేరఁ డత్తెఱంగున నన్నుం జూచు నని తెలియం బలికి వెండియు సంజీవకుం డిట్లనియె.

క. సన్నపువారల నధిపతి
మన్నించిన బ్రాపుఁ దైనమంత్రికి బ్రతుకే
మున్నది మునుము న్నతఁడును
సన్నకసన్న నటఁ బాసి చనకున్నఁ జెడున్. 414

వ. అని మఱియును. 415

సీ. చెలఁగి మానససరసీతటంబున నొక
గ్రద్ద హంసములలోఁ గలిసి యుండ
నదియును నొకవన్నె హంసంబు గాఁబోలు
ననుచుఁ జూచినవార లాత్మఁ దలఁతు
రొక్కటి కలహంస యూరిచేరువఁ బ్రేత
భూమి గృధ్రంబులఁ బొందుపడినఁ
గనుఁగొని గృధ్రంబుగాఁ దలంతురు గాని
రాయంచ యనువిచారంబు రాదు

తే. గానఁ దగువార లున్న భూకాంతునొద్ద
నల్పులైనను గుణవంతులై భజింతు
రధిపునొద్దను హీనాత్ము లలమికొనిన
భవ్యగుణుఁ డైననధిపతి ప్రకృతిఁ దొలఁగు. 416

వ. అని సంజీవకుండు రాజునకు నాకును నన్యోన్యభేదం బెవ్వఁడో పుట్టించె దురాత్ముండైనవాఁడు నిజంబు కల్లయుఁ గల్ల నిజంబుఁగా మహీశ్వరునకుఁ జెప్ప నెవ్వరి నేమిసేయఁ దతనిదయా

విశేషంబు నామీఁద శిథిలంబయ్యెఁ గార్యంబునుం దప్పె
నేమిసేయుదు నని మఱియు నిట్లనియె. 417

తే. వజ్రమును రాజతేజంబు వసుధమీఁద
నతిభయంకర మగు నందు నశనిపాత
మొక్కనిన కాని నొప్పింప దుర్విరిపుల
రాజతేజంబు చెఱుచు సరాష్ట్రముగను. 418

వ. కావున నే నతనితోడి సంగ్రామంబున మృతిం బొందుటయ
భావ్యంబు గాని తదాజ్ఞానువర్తన మయుక్తంబు. 419

క. ఉడుగక కార్యాకార్యము
లెడఁదం బరికింప కెఱుఁగ కేపను లైనన్
బెడఁ జేసెనేని వానిం
దడయక గురు నైన విడువఁ దగు నేభంగిన్. 420

వ. అని నిశ్చయించి మఱియు నిట్లనియె. 421

చ. క్రతునివహంబుఁ జేసినను గైకొని దానము లెన్ని యేనియున్
జతురతిఁ జేసినన్ బ్రచురసాగరతీర్థము లాడినన్ రణ
క్షితి నిమిషంబు నిల్చి దృఢచిత్తమునం బ్రతివీరమర్దన
వ్రతమున బ్రాణముల్ విడుచువానిఫలంబునఁ బోలఁ డేమి
యున్. 422

వ. అదియునుంగాక. 423

ఉ. ధీనిధి యై మనస్వి యతఁ డెంపున వైరి నెదిర్చి యాజిలోఁ
ధా నిలుగంగ స్వర్గమునుఁ దద్రిపువర్గము నుక్కడంచినన్
వానిసమస్తసంపదలు వచ్చుటయుం గడు రెండు నొప్పుటం
బూనిన శత్రుభంజనముఁ బోలునె యొండొకరాజధర్మముల్.

వ. కావున నా కిప్పుడు యుద్ధంబ కార్యంబు నానిశ్చయంబు
వినుము. 425

తే. పన్ని రణమున నిలువక పాఱిపోయి
ప్రాణములు దాఁప నెప్పుడేఁ బడకపోఁడు
ప్రాణసంశయ మైనచోఁ బ్రాజ్ఞుఁ డెదిరి
గెలుచు నొండైన మృతి నొందుఁ దొలఁగిపోఁడు. 426

వ. అనిన విని దమనకుం డిట్లను రణమరణంబు మంచి దని యసాధ్యశత్రుమధ్యంబునం దఱియ నుఱుకం జనునే శత్రు పరాక్రమం బెఱుంగక వైరపడు నెవ్వాఁడు వాఁడు పరాభవంబు నొందు మున్నొక్కటిట్టిభంబుచేత రేఁపంబడినసముద్రుండును బోలెననిన నక్కథఁ దెలియఁజెప్పు మనిన సంజీవకునకు దమనకుం డిట్లనియె. 427

ఉ. టిట్టిభదంపతుల్ సుఖపటిష్ఠత వార్ధితరంగజాలసం
ఘట్టితభూమిజాతములకందువగూఁట వసించి యున్నచో
నట్టి యెడం గులాంగన నిజాత్మవిభుం గనుఁగొంచు నన్ను నీ
పట్టునఁ గావరా ప్రసవభారమునం దురపిల్ల వల్లభా. 428

వ. అనిన దానివిభుం డిట్లనియె. 429

తే. గర్భభార మెఱుంగుదుఁ గంబుకంఠి
చేయవలసినకార్యంబుఁ జెప్పు మనినఁ
గలదు సకలంబు నేమియు వలదు నాకుఁ
జిత్తసంక్షోభ మొదవెడుఁ జిత్తగింపు. 430

ఉ. సంగతిఁబర్వకాలములఁ జంద్రునిఁ జూచి చెలంగి పొంగుచున్
నింగియు దిక్కులుం గడచునీరధి యీమనమున్న టెంకికిం
జెంగటఁ బాసిపోవుట విశేషపుబుద్ధి ప్రసూతికాల మై
నం గదలంగ లేము జతనం బగుచోటికిఁ బోయి నిల్తమే. 431

వ. అనినం బ్రియాంగనాలాపంబులు హాస్యంబు సేయుచు దానితో నిట్లనియె. 432

P. G.

తే. ఈసముద్రుండు నాతోడ నెట్లు వైర
పడ సమర్థుండు తెలియక పలికి తబల
సంశయము మాను మిట్టట్టు జరగుపనికి
ననినమాటల కా కాంత యనియె నిట్లు. 433

వ. ఈసముద్రునకును నీకును హస్తిమశకాంతరంబు వినుము.

క. తనశక్తియుఁ బరశక్తియు
జనసుత విజ్ఞానదృష్టిఁ జర్చించినయా
మనుజుఁడు దుఃఖప్రాప్తికి
ననుకూలుఁడు గాక సౌఖ్య మందుచు నుండున్. 435

వ. అని పలికి మఱియును. 436

క. ఎన్నఁ దగుహితులు బుద్ధులు
విన్నను వునఁ జెప్ప నతఁడు వినకున్నఁ జెడుఁగా
ము న్నొకకాష్ఠమువలనం
బన్నఁగఁ బడిచెడినకూర్మపతియునుబోలెన్. 437

వ. అని టిట్టిభాంగన పలికినఁ బురుషుం డాకథ యెఱింగింపు
మనిన నది యిట్లనియె. 438

క. కంబుగ్రీవుం డనుపే
రం బరఁగినకచ్ఛపము నిరంతరసౌఖ్యా
డంబర మగునొకకొలనం
బంబినసంతోష మెసఁగఁ బాయక యుండున్. 439

ఆ. అందు వికటసంకటాఖ్యహంసయుగంబు
నిలిచి కచ్ఛపంబుఁ గలసి తిరుగు
వానలేక చాల వఱపైనఁ గూర్మంబుఁ
గాంచి యప్పు డనియె సంచదోయి. 440

క. మానససరోవరాంతర
మానితజలపానకేళిమగ్నుల మైనం
గాని మనబడలికలు మఱి
మానంగా నేర విచటిమడుఁగులనీళ్ళన్. 441

తే. నటికి యెలతామరలతూండ్లు నములలేవు
చాలఁ దీయనితెలినీరు గ్రోలలేదు
జాతిపక్షులతోఁ గూడ జరగ లేదు
పోదుమా యన్నఁ గచ్ఛపంబును దలంకి. 442

వ. హంసయుగ్మంబున కిట్లనియె. 443

సీ. కూడితి మిన్నాళ్లుఁ దోడఁబుట్టువులట్ల
యెడరు పుట్టినచోట విడుతురయ్య
పక్షహీనుం డని భావింతురేని న
పక్షుండ నతిదుర్విపక్షవృత్తిఁ
బక్షాధికులు మీరు పక్షపాతము గల్గి
పక్షిమార్గమున సంరక్షతోడఁ
గొనిపోవ కుండినఁ గొల నింకునంతలో
నెవ్వరిచే నైన నీల్గవలయుఁ
తే. దోడుకొనిపోవుఁడన నంచదోయియొక్క
కాష్ఠమధ్యంబుఁగమఠంబుఁ గఱవఁ బనిచి
కడలు రెండును ముక్కునఁ గఱచిపట్టి
యెగసి రాయంచ లుడువీథి నిగుడి పఱవ. 444

వ. అతిదూరంబుగఁగచ్ఛపంబుఁ గొనుచున్ హంసంబు లిట్లేగఁ
గా,క్షితిపై నొక్కపురంబుమానవులు తచ్చిత్రంబు నీక్షింపు
చున్,జతురోక్తుల్ బెరయంగఁ జెప్పుకొన నాసంరావ మా

లించి దుస్స్మృతి నై యాత్మఁ దలంపలే కపుడు కూర్మం బంచ
లకఁ జూచుచున్. 445

క. ఇది యేమికలకలం బని
వదనము కాష్ఠంబు వదలి వసుధం బడున
య్యద నెఱిఁగి మాంసలుబ్ధకు
లదయతఁ గొని రనుచుఁ డిట్టిభాంగన మఱియున్. 446

క. వినుమా వెండియు నొకకథ
వినిపించెద నీకుఁ బూర్వవృత్తము దెలియఁగ
విన నేర్చినమతిమంతుఁడు
వినుతిం బొందంగఁ గను వివేకులతోనన్. 447

వ. కావున ము న్ననాగతవిధాతయుం బ్రత్యుత్పన్నమతియు
యద్భవిష్యుండును నను మీనంబులు గల వందులోన యద్భ
విష్యం డల్పమతి యగుటం జేసి వెర వెఱుంగకచిక్కి మృతిం
బొందిన తెఱం గగు ననినఁ దత్కథాక్రమంబు దెలియం జెప్పు
మని పురుషుం డడిగినఁ డిట్టిభాంగన యిట్లనియె నొక్కతటాకం
బున నిప్పుడు చెప్పంబడిన మీనత్రయంబును నన్యోన్య
స్నేహంబునఁ బరిభ్రమించుచుండ నొక్కనాఁడనాగతవిధాత
యిట్లనియె. 448

క. మడుఁ గింకఁ జొచ్చి నీజల
మెడఁ జేరిన బెద్దమడువు కేఁగుట భారం
బెడ చేసిన జాలరులకు
నెడ గలుగును మనలఁ బట్ట నిదె పోవలయున్. 449

వ. అని మఱియు నొక్కవిశేషంబు వినంబడె నింతకమున్ను
జాలరులు దమలోనం బలికినపలుకు లీసరోవరతీరంబునందు.

తే. అడుసు చిక్క జలము లాడకాడకు నింకె
మొనసిపులుఁగుఁగములు దినఁగఁ జొచ్చె
సాధనంబు లెల్ల సమకూర్చుకొని మన
మరుగుదెంత మెల్లి యనఁగ వింటి. 451

వ. కావున నీప్రొద్ద యీసరోవరంబు విడిచి పోవం దగు ననినఁ
బ్రత్యుత్పన్నమతి యిట్లనియె. 452

క. నేరుపు గలమతిమంతుఁడు
నేరమి యొకవేళఁ బొంద నెఱి నది గెలుచున్
జారద్వయసంపర్కము
గౌరవముగ మెలఁగుగోపకాంతయుఁబోలెన్. 453

వ. అనుటయు ననాగతవిధాతయు యద్భవిష్యుండును నక్కథ
మాకుం జెప్పు మనినఁ బ్రత్యుత్పన్నమతి యిట్లనియె. 454

సీ. కరికుంభయుగ మతికాఠిన్య మగుఁ గాని
యీకాంతచనుదోయి కింత వెలితి
దళితారవిందంబు తెలివి మేలగుఁ గాని
యీయింతిమోముతో నీడు గాదు
మెఱసి నిల్చినకారుమెఱుఁగు మేలగుఁ గాని
యీకొమ్మతను కాంతి కింత కొఱఁత
మించి కెంజిగురాకు మెఱయుచుండును గాని
యీలేమపదముల కీడు గాదు

తే. అనుచుఁ గొనియాడుతలఁపుల కగ్గలించి
కమ్మవిల్తునిమ్మృదుసాయక మ్మనంగఁ
జారుశృంగారమోహనాకార యగుచుఁ
బ్రణుతి కెక్కినగోపాలబాల యొర్తు. 455

తే. కాంతుఁ గనుఁ బ్రామి తా భోగకాంక్ష దండ
పాలకుఁడుఁ దత్సుతుఁడు నుపపతులు గాఁగ
నెన్నఁడును వారు దమలోన నెఱుఁగ కుండ
నొనర రతికేళి సలుపంగ నొక్కనాఁడు. 456

క. తలవరికొడుకును దరుణియుఁ
దళుకొత్తెడు వేడ్క మన్మథక్రీడ మెయిఁ
గెల నరయక జక్కవకవ
పొలుపున బహురతులఁ బ్రొద్దు పుచ్చుచునుండన్. 457

ఉ. ఆతఱి దండపాలకుఁడు నయ్యెడకుం జను దేరఁ దత్తనూ
జాతుని గాదెలోన నిడి సమ్మద మొప్పఁ దలారితోడ సం
ప్రీతి రమించునంతట గభీరగతిం జను దెంచుచున్న యిం
టాతనిఁ జూచి గోపిక భయంపడ కయ్యుపనాథుతోడుతన్.

వ. ప్రత్యుత్పన్నమతి గావున నిట్లను వీఁడె మద్వల్లభుం డరు
దెంచెఁ బాదుకారావంబు వినంబడియె నీవు నామీఁద
వృథారోపంబు దీపింపఁ దిట్టుచు మద్గృహంబు వెడలు మనిన
వాఁడును నట్లు సేయ నంతటఁ గదిసి గోపాలుండును దన
గృహంబు చొచ్చి భార్యతో నెన్నండు లేనిది యీ తలవరి
మనయిల్లు చొచ్చి నిన్నుఁ దిట్టుచుంబోవుటకుఁ గతం బేమి
యని యడిగిన నది యిట్లనియె. 459

తే. కొడుకుమీఁద నతం డిటు కోప మెత్తి
యేనిమిత్తంబొ చంపక మాన ననుచు
నొలసి వెదకంగ వీఁడు నా నిలయమునకు
ఖిన్నమతి రాఁ గుసూల నిక్షిప్తుఁ జేసి. 460

సీ. తమకింపకున్న చో దండపాలకుఁడును
దనయుని నిల్లిల్లు దప్పకుండఁ
జూచుచు మనయిల్లుఁ జొచ్చి మావాఁడు మీ
యింటనె యున్న వాఁ డిప్పు డనిన
నెన్నండు రానిమాయింటి కేటికి వచ్చు
నతఁడు రాఁ డని త్రోచి యాడఁ గినిసి
నిష్ఠురాలాపముల్ నీవును వినుచుండ
ననుఁ బల్కి పోవుచున్నాఁడు కంటె
తే. యింత కోపించి పొడగన్న నెంత దెగునె
వీనిపై నంచు నీగాదెలోన డాచి
చూప కుండితి నిదె వీనిఁ జూడు మనుచుఁ
బోలఁతి తలవరిసూనుని బిలుచుటయును. 461

వ. పిలిచినఁ గుసూలంబు డిగ్గనుఱికి నిలిచినవానిం బరిరంభణంబుఁ జేసి నగుచున్నతనభార్యం జూచి మెచ్చి గోపాలకుం డిట్లనియె. 462

క. ఈపిన్న వాని నిప్పుడు
వేపడినం జంపు వాఁడు శీఘ్రము దోపా
రోపంబున కర్హుం డై
కోపము పాపంబుపొత్తు కువలయనేత్రా. 463

క. వీనిం దండ్రిని గూర్పక
మానుగ నను గూర్చి మిగుల మన్నించితి ప
ద్మానన నీసరి లే రని
తా నప్పుడు గొల్ల మెచ్చెఁ దనకులకాంతన్. 464

వ. కావున గోపాంగనయుఁ బ్రత్యుత్పన్నమతి యై తనముప్పు దప్పించుకొనియె నట్ల మనమును నప్పటికిం దగినకార్యం బను

సంధింతమని యూరకున్న యనంతరంబ యనాగతవిధాత
యనుమత్స్యం బెడ తెగనిజలప్రవాహమార్గంబున నన్యజలా
శయంబునకుం బోయి నమ్మఁగునాఁడు. 465

తే. మత్స్యఘాతుకు లేతెంచి మడువు సొచ్చి
మొదలఁ బట్టిన మీలను గుదులు గ్రుచ్చి
యీడ్చి తిరుగంగ నప్పుడు హెచ్చి గుదికి
నడుము గబళించి జీవంబు విడిచినట్లు. 466

క. అనువున నుండఁగ నొండొక
వనజాకరమునకు నేఁగి వారలు గుదులం
బెనురొంపి పోవఁ దోలఁచినఁ
జనెఁ బ్రత్యుత్పన్నమతి నిజం బగుకడఁకన్. 467

వ. అంత యద్భవిష్యం డెటఁ బోదు నేమి సేయుదు నని విచా
రించుసమయంబునం బట్టువడి మృతింబొందె నని చెప్పి టిట్టి
భాంగన కొన్ని దివసంబులకుం బ్రసూతియైనఁ దత్ప్రతిజ్ఞా
భంగంబు సేయంగలవాఁడై సముద్రుం డయ్యండంబుల
నపహరించిన. 468

క. ఆపక్షీంద్రకులాంగన
దీపించినశోకజలధిఁ దేలుచుఁ బతితో
నాపలుకులు వినవైతివి
పాపాత్మ సముద్రుచేతఁ బడఁ బాలైతిన్. 469

ఉ. అవ్వల నెన్ని లే వట మహాగహనైకనికుంజవృక్షముల్
దవ్వున నిప్పు డున్న యదె తామనకుండఁగఁ గాణయాచియే
యివ్విధ మేను మున్నె తెఁగియెంతయుఁ జెప్ప ననాదరంబుతో
నవ్వితి గాని పట్టదు మనంబున మీఁదటిహాని ధీనిధీ. 470

వ. అనిపరిదేవనంబు చేసినఁ దనప్రాణవల్లభ నూఱార్చి దాని
విభుండగుపక్షి యిట్లనియె. 471

చ. వెఱవకు కాంత నన్ను నవివేకి యితం డని నీవు చూడ కే
ర్తెఱ భువనప్రపంచమునఁ దిమ్మరుపక్షులఁ గూర్చి నీవు ని
వ్వెఱపడఁ బక్షివల్లభుని విష్ణుని దెచ్చి యపత్య మిప్పుడే
నెఱయఁగఁ దెచ్చి యిచ్చెద ననింద్యచరిత్ర విచార మేటికిన్.

మ. అని యాటిట్టిభ మప్పు డేగి తనకార్యం బుర్విపైఁ గల్గుప
క్షినికాయంబున కేర్పడం దెలిపి భక్తిం బక్షులుం దానుఁ బు
ణ్యునిఁ బక్షీంద్రుని వేఁడుకో నతఁడునన్నుం గ మీర లెల్లం దలం
చి నమస్కారము లాచరించినను మచ్చిత్తంబు రంజిల్లుటన్.

మత్తకోకిల.—
మీర లున్నెడ కేఁగుదెంచితి మేలు మీకొకఁ డెద్దియేఁ
గోరి చేసెద నందు దొడ్డును గొంచెముం దలపోయకుం
డేరి కిందు నసాధ్య మైనది యిత్తు నుత్తములార నా
వార లెవ్వరు మీరు గా కని వైనతేయుఁడు పల్కినన్. 474

తే. పక్షు లెల్లవిహంగమపతికి మ్రొక్కి
జలధి టిట్టిభములకును జలముతోడిఁ
గీడు చేసినపని యెఱిఁగింప నెఱిఁగి
యమ్మహాత్ముఁడు పక్షుల కభయ మొసఁగి. 475

వ. క్షీరాబ్ధిమధ్యగతం బగువైకుంఠంబునకుం జని తన్మధ్యంబున
దివ్యసుధాభవనంబునఁ బన్నగతల్పంబున నున్నపురాణ
పురుషుం బుండరీకాక్షుం గని సాష్టాంగనమస్కారపూర్వ
కంబుగా బహువిధస్తోత్రంబుల బ్రసన్నుం జేసి తనకులస్వాము
లకుం జేసినయన్యాయదుర్ణయంబు విన్నవించిన. 476

సీ. నీలాంబుదచ్ఛాయ నెఱసిన మేనితో
రమణీయపీతాంబరంబుతోడ
శంఖచక్రాదికోజ్జ్వలహస్తములతోడ
ధవళాబ్జతులితనేత్రములతోడ
వనమాలికాంకితవక్షస్థలంబుతోఁ
బ్రవిమలకౌస్తుభప్రబలతోడ
శోభితోభయపార్శ్వసురసమూహంబుతో
సిద్ధవిద్యాధరశ్రేణితోడ
తే. గరుడవాహనారూఢుఁడై కైటభారి
రయముతో వచ్చి యుదధితీరమున నిల్చి
యండజంబులు మ్రొక్కిన నభయ మొసఁగి
జలధరధ్వనిఁ గేలెత్తి జలధిఁ బిలిచె. 477

చ. పిలిచిన నంబుధీశ్వరుఁడు పెంపెసలార ముకుందు మందరా
చలధరుఁ గాంచి సద్వినయసంభ్రమ మొప్పఁగఁ జాఁగి మ్రొక్కి—
జలరుహాలోచనుం డనియెఁ జయ్యన నీవు హరించినట్టిపి [నన్
ల్లలఁ గొని రమ్ము పక్షులవిలాపము మాన్పుము నేఁడు
మాకుఁగన్. 478

క. అనినఁ జలధి ప్రసాదం
బని వేగమ తెచ్చి టిట్టిభాండంబుల న
వ్వనజోదరుముందట నుం
చినఁ గైకొని యతని ననిచి శ్రీపతి పేర్మిన్. 479

వ. అయ్యండంబు లయ్యండజంబుల కిచ్చి యంతర్హితుం డయ్యె
టిట్టిభంబులు పూర్వప్రకారంబున నచ్చోట సుఖంబున నుండె
నని చెప్పిన సంజీవకుండు మృగేంద్రుం డేభావంబున యుద్ధ
సన్నద్ధుం డగు ననిన దమనకుం డిట్లనియె. 480

క. మునుగాళ్లు రెండు త్రోఁకయు
ఘనములుగా మీఁది కెత్తి కడు వివృతముగా
నొనరించినవదనముఁ గని
మనమునఁ దలపోయు కలహమతిఁగా నతనిన్. 481

వ. అని చెప్పి దమనకుండు కరటకుం డున్నయెడకుం జని మన ముద్యోగించిన కార్యంబు సఫలం బయ్యె నన్యోన్యభేదంబులు పుట్టెనని చెప్పి యతనితో మఱియు నిట్లనియె. 482

తే. నయవిశారదు లైనమానవులచేతఁ
దేమల భేదింప రాని కార్యములు గలవె
గాన నేనును నానేర్పు కసము నెఱపి
కార్య మీఁడేర్చుకొంటిని గడిఁది ననుచు. 483

వ. అని పింగళకునిసమ్ముఖంబునకుం బోయి సగతుండు వీఁడె యుద్ధసన్నద్ధుండై చనుదెంచుచున్నవాఁడు నీ విప్పుడు మయిమఱచి యుండందగునె యనిన నతండును దమనకుండు చెప్పిన తెఱంగునఁ గట్టాయితంబై యెదురు చూచుచుండె నంతట సంజీవకుండును జనుదెంచి మున్ను దనవిన్నచందంబున నున్నపింగళకునివికృతాకారంబు చూచి వెఱవ కతనిం దాఁకిన బింగళకుండును సంజీవకునిమీఁదికి లంఘించె నయ్యిరువురకు నన్యోన్యబద్ధామర్ష యుద్ధంబు వృద్ధిగతిం జెల్లుచున్న సమయంబునం గరటకుండు దమనకున కిట్లనియె. భవద్దుస్తంత్రవిలసితం బిట్లుండునే యని పలికి మఱియును. 484

ఆ. తగిలి సామభేదదానదండములందు
మూర్ఖుఁ డైన సామమునఁ గరంగు
భేదదానదండవాదంబు లెన్నిక
కొఱకుఁ గాని సామగుణము మేలు. 484

తే. మొదలఁగార్యజ్ఞుఁడగువాఁడు మూఢునందుఁ
జెలఁగిసామప్రయోగంబుసేయవలయు
సామమున నెల్లపనులును సరవిఁ బొందు
నెన్నిచూచినఁ గీడులే దెట్టియెడల. 486

ఆ. తలఁప సామభేదదానదండంబులు
భూరికార్యసిద్ధికారణములు
సంఖ్యకొఱకు నయ్యె సరవిఁ దక్కినయవి
సామముననె సిద్ధి సంభవించు. 487

చ. నరనుత చంద్రనూత్నకిరణంబులచేత సరోజబాంధవ
స్థిరమహితాతపస్ఫురణచేతఁ గృపీటసముద్భవప్రభా
పరిణతిచేతఁ బాయనియపారవిరోధిమహాంధకారముల్
విరియుమహాస్త్రమాత్రమున విశ్రుతసామవిలాససంపదన్.

ఆ. దగిలి సామభేదదానదండములచే
వెలయు నీతి నాల్గువిధము లగుచు
నందులోన దండ మధికపాపముఁ జేయు
నది పరిత్యజించు టర్హవిధము. 489

వ. కావున మంత్రరహితుం డగుట గర్వం బనంబడు గర్వంబున
నాత్మవినాశం బగుస్వామికిం గొఱగామి సంభవించినయప్పుడు
తత్ప్రతీకారం బూహించుట కర్తవ్యంబు. 490

చ. కొలఁది యెఱింగి సంధి యొడఁగూర్పఁగ నేర్చినమంత్రిమంత్ర
ముల్, దొలఁగఁగ సన్నిపాతగతి తోడనె మాన్పినవైద్యు
వైద్యముల్. జెలఁగి సభాంతరాళములఁ జెప్పుకొనం దగుఁ
గాక యుల్లసద్బలుఁ డగువేళ నేయతఁడు పండితవృత్తిఁ
వహింపకుండెడున్. 491

క. నృపుఁడు గుణి యైన సచివుఁడు
కపటాత్ముం డైనఁ బ్రజలు గదియరు వానిం
జపలమకరాశ్రయం బగు
విపులసరోవరముఁ జేర వెఱచినభంగిన్. 492

వ. అని మఱియును. 493

ఉ. ఆసల నీశుభంబునకు నక్కట యీవిభు నొంటివానిఁగాఁ
జేసితి గాని సేవకులఁ జేరఁగ నీవు ప్రజాసమృద్ధి ను [డెంతవి
ద్భాసితుఁ జేయ కంతయును దా నయి యున్నయమాత్యుఁ
శ్వాసము గల్గెనేని నరవర్యునకుం బగవాఁడు దా నగున్.

క. పరుసనివానికి మదిహిత
మరుదుగ నొనరించు నెవ్వఁ డతఁ డమృత మగుం
బురుషవరేణ్యున కెవ్వఁడు
వెరవిడియై కీడు సేయు విష మగు నతఁడున్. 495

వ. కావునఁ బురుషుల కహితం బాచరించుతలంపునఁ బ్రవర్తిల్లు
నీవు బుద్ధిహీనుండ వనిపలికి కరటకుండు మఱియు నిట్లనియె.

సీ. కడఁగి మనోవాక్ప్రకారంబు లేకంబు
గాక మిత్రునిఁ గూడఁ గడఁగునతఁడుఁ
బ్రతిదినప్రఖ్యాతపాపవర్తనమునఁ
దగిలి ధర్మము చేయఁ దలఁచునతఁడు
నేపార నెపుడుఁ బరాపకార మొనర్చి
పృథుసంపదలఁ గూడఁబెట్టునతఁడు
సమధికం బగుదేహసౌఖ్య మపేక్షించి
చెలఁగి విద్యల నభ్యసించునతఁడుఁ

తే. బరుసఁదనమున నే ప్రొద్దుఁ బద్మముఖులఁ
బొసఁగ వలపింతు నని తలపోయునతఁడు
నెఱుక చాలనివా రని యుద్ధరిత్రి
నెఱయ నూహింతు రనిశంబు నీతివిదులు. 497

క. స్వామిప్రసాదసంపద
వేమఱు మదిఁ గోరువానివిభవం బమరున్
స్వామిప్రసాదసంపద
వేమఱు మదిఁ గోరకుండువీఱిడి చెడెడున్. 498

క. ఏ రాజు తనదుభృత్యుని
కారుణ్యమువలనఁ బ్రతుకఁగాఁ జూచి మదిన్
వారక శంకితమతి యగు
నా రాజువిధంబు నీచ మగు ననుదినమున్. 499

తే. అర్థశాస్త్రంబు చదువనియట్టివాని
పుత్త్రుఁడును దంష్ట్రిగుణములఁ బోలి పొలుచు
జగతిఁ గేతకివృక్షసంజాతఫలము
బహుళకంటకములచేతఁ బ్రబలినట్లు. 500

వ. కావున నీకుం జెప్పఁదగినబుద్ధి యేమి యున్నది విను మని
యిట్లనియె. 501

చ. నెఱయఁగ వంపరానిధరణీజము వంపఁగడంగనేని యే
ర్తెఱ బలుఖడ్గధార జగతీధరశృంగము వ్రేసెనేని మీ
దెఱుఁగక బుద్ధిహీనునకు నెంతయు బుద్ధులు చెప్పెనేని చె
చ్చెర నొకవానరంబునకుఁ జెప్పినసూచిముఖంబుచాడ్పగున్.

వ. అనిన విని దమనకుండు తత్కథాక్రమం బెట్టి దని యడుగ,
గరటకుం డిట్లనియె. 503

సీ. ప్రాలేయభూధరప్రాంతకాంతారప్ర
దేశభాసురసరిత్తీరములను
దాలతమాలతక్కోలహింతాలాది
రాజితానేకమహీజములను
గిసలయవిసరసంకీర్ణ నానాలతా
మంజులోదారనికుంజములను
నిరుపమానతరంగిణీవేగసంజాత
మహనీయసైకతమంటపముల
తే. పొరిది విహరించుకపు లొకచోటఁ గూడి
కడిఁది చలిచేత మేనులు గడు వడంక
రాత్రి మెఱుఁగారుఖద్యోతరాజిఁ జూచి
కణఁకు గాఁబోలు నని సీతుగాఁచుచుండ.
క. సూచిముఖ మనువిహాంగం
బాచేరువనుండి యనల మది గా దని యా
లోచనము చేసి యొకకపి
కాచందము తెలియఁ జెప్ప నతికుపితంబై. 505
ఆ. అడుగ కూర కేల నొడివితి విప్పుడు
వట్టితేఁట నీకుఁ బుట్టె ననుచుఁ
బట్టి దాని రాతిపైఁ ద్రిప్పి వధియించె
హీనమతికి బుద్ధి లేలకొలుపు. 506
వ. అట్లు గావున. 507
చ. అనవరతంబు విశ్వవినుతాయతబుద్ధి విశేషవృత్తి నొం
డెను ధనవృత్తి నొండెను గడిందిబలంబున నొండె నెవ్వఁ డిం
పెనయఁ గులంబువారల నహీనగతిక్ భరియించు నట్టినం
దనుని ముదంబునం గనినతల్లియ తల్లి ధరాతలంబునన్. 508

క. ఆపాదమాత్రశోభిత
రూపము లేకుండ నెన్నరుండును గలఁడే
దీపితసుజ్ఞానకళా
స్థాపితమతి లేఁడు గాక చరమయుగమునన్. 509

వ. అని యిట్లు పలికిన విని దమనకుం డూరకున్నం గనుంగొని
కరటకుండు మఱియు నిట్లనియె. 510

తే. స్వరము భిన్నంబు ముఖము వివర్ణమరయ
దృష్టి శంకించు వడఁకును దేహమెపుడుఁ
జెనసి యపకార మొరులకుఁ జేసినట్టి
కల్మషాత్మునిగుణ మిట్లు కానఁబడును. 511

వ. అని చెప్పి మఱియును. 512

క. క్షితి దుష్టబుద్ధిబుద్ధులు
మతియుతు లాదుష్టబుద్ధి మందాక్షుము లే
కతిలోభత్వగుణంబున
మృతుఁడుగఁ దనజనకుఁ జేసె మిన్నక కంటే. 513

వ. అనినఁ దత్కథాక్రమం బెఱిఁగింపు మనినఁ గరటకుం
డిట్లనియె. 514

ఉ. పొందుగ దుష్టబుద్ధియు సుబుద్ధియు నాఁగ వణిక్కుమారు లా
నందముతోఁ జరింప నొకనాఁ డొకచోట సుబుద్ధి గాంచెఁ బెం
పొంద సొనారిటంకముల నుంచినకాంచనకుంభ మట్టియా
కుందన మొక్కచోట నిడి కూర్చినకోమటిఁ జేరి చెప్పినన్.

సీ. చెప్ప వారిరువురు శీఘ్రంబ చని రాత్రి
గొనివచ్చి తమపురంబునకు వెలిని
వృక్షమూలంబున వెలయ నిక్షేపించి
వెచ్చంబునకు మున్ను పుచ్చినట్టి

నిష్కంబు లిరువురు నెఱయ విభాగించు
   కొని తమయిండ్ల కింపొనరఁ బోయి
ప్రకటితస్నేహసంపదఁ బొంది యిరువురు
   తొలఁగక మెలఁగంగ దుష్టబుద్ధి
తే. తనదుచిత్తంబునందుఁ దద్ధనముఁ దాన
యపహరించిన నంతయు నబ్బు ననుచుఁ
దలఁచి యొక్కనాఁ డొంటిగాఁ దాన యరిగి
పేర్చి యాబిందె వేగంబె పెల్లగించి. 516

క. కొనితెచ్చి యతిరహస్యం
బున నొకచోఁ బాఁతి దుష్టబుద్ధి సుబుద్ధిం
గని పలికె నాఁడు దాఁచిన
ధన మిండ్లకుఁ దేక మనకు దడయఁగ నేలా. 517

క. అతిధార్మికుండు నరపతి
చతురుఁడు మంత్రియును బ్రజలు సజ్జను లగుటన్
మతిఁ దలఁక నేల మన కిది
సతముగఁ జేకూడెఁ బసిఁడి సర్వము ననుచున్. 518

వ. పలుక వైశ్యకుమారు లిరువురుఁ జని తరుమూలంబున నిడిన నిక్షేపంబు పుచ్చుకొనుటకుం గ్రొచ్చిచూచి యప్పుడచ్చోటఁ బసిండి గొనిపోయినతర్ఘాతం బుపలక్షించి యొండొరుల మీఁద నవిశ్వాసంబునొంది వివాదంబు సేయుచు నప్పురంబు మహీశ్వరు సమ్ముఖంబునకుం జని యత్తెఱం గెఱింగింప నతండును ధర్మాధికారులఁ దీర్ప నియోగింప వారలను బంచదిన పర్యంతంబు మీలోనం దెలిసి రండని యనిపినం జని షష్ఠ దివసంబునఁ బ్రభాతంబున నయ్యిరువురుం బొడచూపి నిలిచి రప్పుడు దుష్టబుద్ధి ధర్మాధికారుల కిట్లనియె. 519

మత్తకోకిల.—

పూని దీనివిచార మేల సుబుద్ధి తానె హరించె మీ
యాన దానికి సాక్షి యచ్చట నంచితం బగువృక్షమే
కాని మానిసిఁ జెప్పఁ జెప్పినఁ గల్లపెట్టెఁడు నన్ను స
న్మానితాత్మకులార మీరలు నాకు దిక్కని మ్రొక్కెనన్. 520

క. వెఱఁగువడి వారలందఱు
నెఱయఁగ నొండొరులఁ జూచి నేఁ డాశ్చర్యం
బెఱుకపడఁ దరులచేతను
వఱలఁగఁ బలికించునట్టివారలుఁ గలరే. 521

వ. అనుచు ధర్మాధికారులు వైశ్యకుమారుల కిట్లనిరి. 522

ఆ. ప్రొద్దులేదు నేఁడు పోయి ప్రాతఃకాల
వేళ రండు పొందు వేగ యనిన
నరిగి దుష్టబుద్ధి యాత్మీయజనకునిఁ
బ్రార్థనంబు చేసి పలికె నపుడు. 523

సీ. తండ్రి యీహస్తగతం బైనయర్థంబు
నెట్టివానికిఁ బాలు వెట్ట నేల
వాఙ్మాత్రమున నీకు వశ మైనపని గానఁ
జెప్పెద నామాట చిత్తగింపు
వృక్షకోటరము ప్రవేశించి యీరాత్రి
నీ వదృశ్యంబుగా నిలుచునంత
ధర్మాధికారు లంతట రేపకడ వచ్చి
యచటివృక్షము సాక్ష్య మడుగఁ దడయ

తే. కిద్ధనంబు సుబుద్ధి గ్రహించెఁ గాని
దుష్టబుద్ధికిఁ బని లేదు దృష్టి మనుచు

నీవు పలికిన నది తీఱెపోవుఁ బిదప
మనకుఁ గలకాల మెల్లను మనుట గలుగు. 524

వ. అనిన విని దుష్టబుద్ధికిఁ దజ్జనకుం డిట్లనియె. 525

చ. చెడుతరవాయి నిట్టిపని చెప్పితి గాని ధనంబు కాంక్షకుఁ
గడపలలేదు హీనమతి గప్పినవానికి దుష్టబుద్ధి నా
నొడువఁగ నున్న నిన్నిటు తనూభవుఁగాఁ గనునట్టిపాపముం
జెడుఁ గగునాకు దుర్లభమె చెప్పెదునారకబాధ పుత్త్రకా.

వ. అని పలికి మఱియు నిట్లనుఁ బ్రాజ్ఞుం డుపాయంబు చింతించిన
పిదప నపాయంబునుం దలంపవలయుఁ దొల్లి బకమూర్ఖంబు
నకుం గలయపత్యంబుల నొక్కముంగి మ్రింగినచందం బగు
విను మని యి ట్లనియె. 527

మ. ఒకకాసారతటంబునందు నొరపై యున్నట్టివృక్షంబుపై
బకయుగ్మంబు వసింప భార్య పురుషుం బ్రార్థించి యోనాథ
యర్భకరాజిం దినిపోవఁ గ్రిందఁ గల సర్పం బేపుమై నింక న
చ్చిక నేతెంచుఁ బ్రసూతికాలమును వచ్చెం గార్య మెట్లుం
డునో. 528

వ. అనిన విని బకవిభుం డమ్మహీరుహంబు డిగ్గి కొలనితీరంబున
నిల్చి విచారించుసమయంబున నయ్యెడకు నొక్కకుళీరంబు
చనుదెంచి యిదియేమి దుఃఖాకులుండవై యున్నవాఁడ వనిన
నబ్బకం బి ట్లనియె. 529

ఉ. నాకులకాంత గర్భమయి నందనులం గనునంతలోన ద
ర్వీకర మేగుదెంచి తిని వేగమ పోయెడు నెల్లినేఁటిలో
నాకలకంఠి వెండియును నర్భకులం గనువేళ గాన నే
నాకులతం దలంకెద మదాత్మకు నేమియుఁ దోఁపకుండఁగన్.

వ. అనినం గర్కటంబు నీకుం దగినయుపాయంబు చెప్పెద విను మని యి ట్లనియె. 531

తే. నకులవివరంబునందుండి నాగవిభుని
యునికిదాఁకను మీనంబు నొకటినొకటి
వైచుకొనిపోవ నాముంగి వరుసఁ దినుచుఁ
బాముఁ జంపును దీని కుపాయమిదియె. 532

వ. అని కుళీరంబు చెప్పినఁ గొక్కెర యవ్విధం బాచరింప నకులం బమ్మత్స్యంబులఁ దినుచుం జనిచని కృష్ణసర్పంబును ఖండించి వృక్షం బెక్కి బకదంపతుల యపత్యంబులను భక్షించెం గావున. 533

క. తన బ్రతుకుకొఱకు నొరునిం
గనికర మొక్కింత లేక కారించినయ
మ్మనుజుఁడు గనఁ డున్నతశో
భనముల నెన్నండు మూర్ఖబకముంబోలెన్. 534

వ. అని యిట్లు చెప్పినతండ్రిపలుకులు గైకొనక దుష్టబుద్ధి లోభాక్రాంతుఁడై బలాత్కారంబున నతని నొప్పించుకొనిపోయి నిశామధ్యంబున వృక్షకోటరంబున నునిచి ప్రభాతసమయంబున. 535

సీ. ఆదుష్టబుద్ధి ధర్మాధికారులఁ బిల్చి
కులముపెద్దలఁ గూర్చుకొని కడంగి
ధర్మబుద్ధియుఁ దోన తడయక చనుదేర
నావృక్షమునకు సాష్టాంగ మెరఁగి
సత్యంబ పలుకు వృక్షమ సాక్షి వీవన్నఁ
బూని వనస్పతిలోననుండి

ధర్మబుద్ధి మొఱంగి ధనముఁ గైకొనెఁ గాని
పుచ్చుకోఁ డీదుష్టబుద్ధి యన్న

తే. వాగ్విలాసంబు వినఁబడ్డ వార లెల్ల
నద్భుతం బంది కనుఁగొనునంతలోన
మ్రాను పలికినచోటు దా మది నెఱింగి
పాటిమాలి యసత్యంబు పలికె ననుచు. 536

వ. ఆధర్మబుద్ధి యంతరంగంబునఁ గోపోద్దీపితుం డై. 537

తే. కుజము వెస నెక్కి యామీఁదికొమ్మలరసి
తొలఁగ వీక్షింపునపు డొకతొఱ్ఱఁ గాంచి
యింగలంబును బూరియు నెసఁగఁ దెచ్చి
కోటరంబున వైచి యచ్చోటు దొలఁగ. 538

క. అనలజ్వాలాజాలము
తనదేహము చుట్టుముట్టఁ దల్లడపడుచున్
మునుకొని మొఱ్ఱలు వెట్టుచు
జనములపై దుష్టబుద్ధిజనకుం డుఱికెన్. 539

ఆ. పడినసెట్టిఁ జూచి పైఁబడి ధర్మాధి
కారు లెల్ల బ్రమసి కదిసి యడుగ
సుతుఁడు దుష్టబుద్ధి సుండు న న్నిటువంటి
యుడుకు చేసె ననుచు నుసులు విడిచె. 540

వ. విడిచినం జూచి ధర్మాధికారు లత్తెఱం గంతయు మహీకాంతు
నకుం జెప్పిన నతండు దుష్టబుద్ధిం గొఱతవేయం బంచి వాని
సర్వస్వంబునుం జూఱఁగొనియె నని చెప్పి కరటకుండు మఱియు
నిట్లనియె. 541

సీ. సమధురవాహినీసంపూర్ణజలములు
వడి లవణాబ్ధిలో నడఁగుదాఁకఁ

ప్రకటితస్నేహసంబంధబంధుత్వంబు
లంగనానిర్భేద మయినదాఁక
నత్యంతకాంతరహస్యవాక్యంబుల
వివరించి కొండీఁడు విన్నదాఁకఁ
గలితపారంపర్యకులసమృద్ధి దలంక
నిలఁ గుపుత్రుం డుదయించుదాఁక

**తే.** నిలుచునేగాని యటమీఁద నిలువ కునికి
దప్ప దందురు నయశాస్త్రధర్మవిదులు
నీవు కులహాని యగునట్టినీచగతికిఁ
దగిననడనడి గన భయం బగుచు నుండు. 542

**ఆ.** కడఁగి పిశునవృత్తిఁ బెడఁబాయ కుండిన
వాని వదలకున్నవాఁడుఁ జెడును
నురగశాబకంబుఁ జిరకాల మొగిఁ బెంప
మెఱసి యొక్కవేళఁ గఱువకున్నె. 543

**తే.** ఎఱుకగలవానిపొందైన నెందు నమరు
నతఁడు కపటాత్ముఁడయ్యె నేనదియుఁ గాదు
మూర్ఖుతోఁ గూడి మెలఁగెడుమూర్ఖశఠుని
సఖ్య మెన్నండుఁ గొఱగాదు సజ్జనులకు. 544

**వ.** కావున నీవు స్వామికి నిట్టిదురవస్థ యుత్పాదించి తింక నన్యులు నీకు దృణకణాయమానం బగుట నిశ్చయంబు విను మని యిట్లనియె. 545

**ఉ.** వేయితులాలలోహమును వేడుకతోఁ దినె మూషకంబు ల
త్యాయతశక్తి నంచు వ్యవహారి యొకం డన నొక్కరుండు పి
న్నాయన నొక్కగృధ్రము రయంబున నెత్తుకపోయె నంచు ము
న్నోయి విచిత్రమైనకథ యొక్కటి వింటిమి నీవు వింటివే.

వ. అనిన నక్కథ వినవలయు నాకుం జెప్పు మనినఁ గరటకుం
డిట్లనియె. 547

చ. లలి నొకపట్టణంబునఁ గలం డొకవైశ్యుఁడు లేమిచేత ని
ష్ఠుల వ్యవహారికంబునకుఁ బోవుచు లోహతులాసహస్ర మి
ట్టలముగ నొక్క చుట్టముకడం బదిలంబుగఁ బెట్టి సమ్మదం
బొలయఁగ నాత్మమందిరమునొద్దకుఁ గ్రమ్మఱవచ్చియత్తఱిన్.

వ. లోహం బిడినవైశ్యునికడకుం జని యతం డిట్లనియె. 549

క. ఇన్నిదినంబులుఁ బోయితి
నన్నా పరదేశమునకు నచ్చట నాకుం
జిన్నముఁ జిదరయుఁ బుట్టక
మిన్నక రావలసె మగిడి మీ రున్నెడకున్. 550

క. మీయింట దాఁచఁ బెట్టిన
నాయినుము మిపు డొసఁగవలయు నని పలికిన వాఁ
డీయక మూషకములు తిని
పోయె ననుచు ద్రవ్యలోభమున నన నతఁడున్. 551

క. ఈలాగున నాసొమ్మీఁ
జాలక కేరడము లాడుచనవరి నెట్టుఁ
దూలించి మోసపుచ్చక
యేలా నాసొమ్ము వచ్చు నింతట ననుచున్. 552

ఉ. ఆయెడ లోహహర్త యగునాతనిసూనుఁడు వచ్చె నాడఁ
గాఁ, బోయి జలంబు లాడుటకుఁ బోదము రమ్మని వానిఁ
గొంచు నాత్మాయతనంబు చేరువగృహంబున బాలుని
దాఁచియుండఁగాఁ, బాయనిదుఃఖభారమున బాలుని తం
డ్రియు వాని రోయుచున్. 553

తే. పురవరంబున నింటింట నరసియరసి
యడుగఁగా లోహ మిచ్చినయతఁడె కొడుకు
నంత గొనిపోయె నని చెప్ప నతఁడు వించు
శీఘ్రగతితోడఁ జనుదెంచి సెట్టితోడ. 554

క. పాపని నదికిం దోడుక
వే పోయితి వాఁడు రాఁడు వెండియు సతి దా
వాపోవఁ దొడఁగెఁ జెప్పవు
పాపం బని తలఁచి దుఃఖపడ వింతైనన్. 555

వ. అనిన నతం డిట్లనియె. 556

క. ఇద్దఱమును నేటికిఁ జని
ప్రొద్దునఁ దీర్థంబులాడి బోరన రాఁగా
గ్రద్దెత్తుక చనె నీసుతు
బద్దరవలె నుండు ననుచుఁ బలుకఁగ వెఱతున్. 557

వ. అనిన నతండు రూక్షేక్షణుండై యతిత్వరితగతిం బఱచి రాజ
ద్వారంబున నాక్రోశింప నమ్మహీశ్వరుండు ధర్మాధికారులం
బిలువం బంచి విచారింపుం డన వారును నవ్వైశ్యునిఁదన్ని
మిత్తం బడిగిన నతం డిట్లనియె. 558

ఆ. సెట్టి దొంగ యొకఁడు శీఘ్రమ నాపట్టిఁ
బట్టి చంపి పక్షి పట్టుకొనుచుఁ
బాఱిపోయె ననియె భావింపరయ్య యీ
యాగడంబు భూమియందుఁ గలదె. 559

వ. అనిన విని ధర్మాధికారు లీకార్యం బతర్కితం బిది విచారింపం
దగు నని ప్రతివాది వైశ్యునిం బిలువం బంచి యవ్విధం
బడిగిన నతం డిట్లనియె. 560

క. వేయితులాలం గలిగిన
యాయిను మితనింట నిడిన నది యెలుకలచేఁ
బోయె ననెఁ జిన్నపాపని
నాయతగతి గ్రద్దకొనుచు నరుగుట యరుదే. 561

చ. అని పలుకంగ నాసభికు లప్పు డెఱింగి యితండు సెట్టి నీ
యిను మొసఁగుం గుమారకుని నిమ్మని వారలు చక్కఁ బెట్టినన్
మనమున సమ్మతించి మఱుమా టన కాసభవారు తీర్చి చె
ప్పినగతి నట్ల చేసి రని పెం పెసఁగన్ గథ చెప్పి యిట్లనున్.

క. మతిమంతుఁ డైనవానికి
హితముగ నొకమాట చెప్ప నెఱిఁగి చరించున్
ధృతి దఱుఁగ నీవు నేలా
ప్రతిమగతిం జేష్ట దక్కి భ్రమసితి గంటే. 563

వ. కావున నీకు నేకార్యంబును నుపదేశింపం బనిలేదు నిన్నుఁ
గూడుట యనుచితంబు. 564

తే. సుజనదుర్జనసంగతిఁ బ్రజలు నడవ
గుణములును దుర్గుణంబులుఁ గూడి పరఁగు
వరుస బహుదేశసంచారవాయువులకు
గంధదుర్గంధములు వచ్చి కలిసినట్లు. 565

క. మతిమంతులు దమకార్య
స్థితు లొనరింపంగఁ జింత సేయుదు రభ్యా
గతజల మానెడుమనుజుం
డతితృష్ణాభరముఁ దొరయ నరయనిభంగిన్. 566

వ. అని యిట్లు కరటకుండు పలుక దమనకుండిట్లనియె మనస్వామి
సంజీవకునిం జంపినతెఱం గెఱుంగవలయుఁ బోద మని

యయ్యిరువురుఁ గదియం జనునప్పుడు పింగళకుం డటమున్న సంజీవకుం దెగటార్చి పశ్చాత్తాపంబునం బొరలుచుండి యప్పుడు దమనకుం జూచి చూచితే యని పలికి యిట్లనియె.

శా. పాలింపం దగువానిఁగాఁ దలఁచి తాఁ బాలించి రాజార్థ సు
శ్రీలం బ్రోదిగఁ జేసి పెంచుటయ ధాత్రీపాలధర్మంబు గా
కేలా యిట్లు విచారదూరమతి నై యేఁ ద్రుంచితిఁ వాని దు
శ్శీలుండై విషవృక్ష మైన నిడి తా ఛేదించునే యెవ్వఁడున్.

వ. అదియునుంగాక. 569

చ. అవగుణి యైనఁ గాక సుగుణాత్మకుఁ డైనభటోత్తము నృపో
త్తముఁడు పరిత్యజింప మఱి తక్కినవారు తొలంగిపోదు ర
య్యవినయవృత్తి భూపతికి హానియు ధాత్రికి నాకులంబు నై
భువి నపకీర్తి పుట్టుఁ దలపోసి తలంకెద నేమిసేయుదున్. 570

వ. అనిన విని దమనకుండు దేవా వైరిసంహారణానంతరంబున నిట్లు సంతాపింపం బనిలేదు వినుమని యిట్లనియె. 571

ఉ. సమ్మద మొప్ప వైరిజనసంహరణం బొనరించెనేని శో
కమ్మును బొంద నేల ఘనగర్వమునన్ బ్రతికూలవృత్తిగాఁ
దమ్ములుభృత్యులున్ హితవితానముఁబుత్రులుఁగూడకుండినన్
గ్రమ్మఱ నాజ్ఞ చేయఁదగుఁ గాదె నృపాలుర కివ్వసుంధరన్.

సీ. సార్వకాలికకృపాసంపూర్ణమతి యైన
మానవేశ్వరునకుఁ గానిగుణము
కుటిలవిచారసంఘటితమిత్రుం డైన
వాని భావించినఁ గానిగుణము
సమధికప్రియమున సర్వభక్షకుఁ డైన
భూనిలింపున కది కానిగుణము

ప్రాణేశసంతతప్రతికూల యగునేని
మానినీమణి కది కానిగుణము
తే. తివిరి సచివుండు రాజ్యంబుఁ దీర్చునపుడు
కడుఁ బ్రమత్తత పొందుట కానిగుణము
చెనసి భృత్యుండు నృపుసేవ సేయ కుండు
క్రమము గలిగిన నదియును గానిగుణము. 573
చ. అరయ మనుష్యమాత్రులకు నంటినకొంచెపుబుద్ధి ధారణీ
శ్వరుఁడు ధరిత్రి యేలు టవి వర్ణన కెక్కునె శత్రుభీకర
స్ఫురదురుకార్యఖడ్గముల భూతల మంతయు నాక్రమించి సు
స్థిరఘనకీర్తిసంపదలఁ జెన్నువహించినఁ గాక మేదినిన్. 574
వ. అని మఱియును. 575
సీ. సత్యంబు దప్పక జరపు నొక్కొకచోట
నన్నృతంబు లొకచోట నడరఁ జేయు
సరసంపుఁ బ్రియములు సలుపు నొక్కొకచోటఁ
బరుషంబు లొకచోటఁ బల్కఁ జేయుఁ
బరమకారుణ్యస్వభావ యౌ నొకచోట
నొకచోట హింసకు నుత్సహించు
నర్థార్జనాతిసమర్థ యౌ నొకచోట
నుచితదానాఢ్య యౌ నొక్కచోట
నిత్యవ్యయంబులు నెఱపు నొక్కొకచోట
నొడఁగూర్చు బహుధన మొక్కచోట
తే. నమర నృపనీతి పెక్కురూపములు గలిగి
చతురవారాంగనయుఁబోలె జగతి మెఱయు
నిట్టినయమార్గములు నీవు నెఱిఁగి నడువ
ఘనతరైశ్వర్యసంసిద్ధి గలుగు నీకు. 576

వ. అని యిట్లు దమనకుండు పలికినఁ గలంక దేఱినచిత్తంబునం బ్రియం బంది నిజభృత్యామాత్యవర్గంబులం గూడుకొని పూర్వప్రకారంబునం బూజ్యసామ్రాజ్యంబు సేయుచుండె నని విష్ణుశర్మ నృపకుమారులకుం జెప్పిన మిత్రభేదంబు విని యటమీఁద సుహృల్లాభంబు తెఱం గెఱింగింపు మనుటయు.

శా. భామానూతనపుష్పబాణ కరుణాపారీణ విద్వజ్జన
స్తోమారామవసంత వైరిజనతాశుండాలహర్యక్ష ది
క్సీమాలంఘనసాంద్రకీర్తిలతికాకీర్ణ ప్రభావోదయా
నామోచ్చారణభుక్తిముక్తిఫలదా నమ్రైకరక్షామణీ. 578

తరల. చిరయశోధన శిష్టబోధన చింతితోద్యమసాధనా
సరసభూషణ సాధుపోషణ శత్రులోకవిభీషణా
పరమపావన ప్రాజ్ఞసేవన పద్మనేత్రవిభావనా
స్మరవిరాజిత సత్యయోజిత సర్వలోకసుపూజితా. 579

మాలినీ. సరసగుణవిశాలా చారుధర్మానుకూలా
వరవితరణకర్ణా వర్ణితానందపూర్ణా
పరుషజనవిదూరా భామినీచిత్తచోరా
గిరిధరవరసేవా కీర్తనీయప్రభావా. 580

గద్య. ఇది శ్రీమైత్రావరుణగోత్రపవిత్ర బ్రహ్మనామాత్యపుత్త్ర సుకవిజనవిధేయ నారాయణనామధేయప్రణీతంబైన పంచతంత్రం బనుమహాకావ్యంబునందు మిత్రభేదం బనునది ప్రథమాశ్వాసము.

శ్రీ రస్తు

# పంచతంత్రము

## సుహృల్లాభము

శ్రీరమణీమణిహారవి
హారాంకితబాహుమధ్య యానతవైరి
త్స్మారమణాభరణకరుణా
పారంగత తమ్మవిభునిబసవకుమారా. 1

వ. అవధరింపు మక్కుమారులు సుహృల్లాభం బనియెడుద్వితీయ
తంత్రం బెఱిఁగింపుమనిన విష్ణుశర్మ యిట్లనియె. 2

తే. సాధనంబులు నర్థసంచయము లేక
బుద్ధిమంతులు తమలోనఁ బొందు చేసి
వలయుకార్యంబు లొనరింపఁదలఁతు రెందుఁ
గాక కచ్ఛపఁ, మృగ, మూషికములరీతి. 3

వ. అది యెట్లంటేని. 4

సీ. మహికి నలంకారమండనం బై యొప్పు
మహిలాపురప్రాంతగహనభూమిఁ
బొలుపొందుశాల్మలిభూజంబు పై లఘు
పతనుఁ డన్వాయసపతి వసించు
నమ్మహీజముక్రింది కంతట లుబ్ధకుఁ
డరుగుదెంచినఁ గాక మాత్మఁ దలఁకి

దండధర ప్రతిముండు వీఁ డిచటికి
నేమికారణమున నేఁగుదెంచె
తే. నుండఁ గొఱగాదు దుర్జనుఁ డున్నచోట
నట్టు గాకయు నాకింటి కరుగవలయు
నిచటఁ బ్రొద్దయ్యె నిలువంగ నేల యనుచుఁ
జూచుచుండంగ నాచెట్టుచుట్టుఁదిరుగ. 5
క. వలవైచి క్రింద ధాన్యం
బలికి నిగూఢంబుగాఁగ నవ్వలిపొదలోఁ
దల దూఱిచి దృఢదృష్టిం
దొలఁగక కనుఁగొనుచు నుండ దూరమునందున్. 6
క. కనుఁగొని చిత్రగ్రీవుం
డనఁ బరఁగు కపోతభర్త యాధాన్యములం
దిన మనసు పెట్టి తనబల
మును దానును వ్రాలి జాలమునఁ దగులుటయున్. 7
వ. ఇట్లు కాలపాశబద్ధుండునుంబోలెఁ జిత్రగ్రీవుండు సపరివారం
బుగా నవ్వలం దగులువడినం జూచి ప్రహర్షోత్కర్షంబునం
బొదలి లుబ్ధకుండు కదియం జనునంతకుమున్న చిత్రగ్రీవుం
డనుచరవర్గంబున కిట్లనియె. 8
సీ. ఉదరాగ్ని బాధల నొడ లెఱుంగమిఁజేసి
తడఁబడఁ బడితి మిందఱము వలను
మనకు నాపద దీర్ప మఱి యెవ్వ రున్నారు
వెలయ నేఁ జెప్పెదు వెరవు వినుఁడు
పురుడించి మన మొక్క మోఁపున వలయెత్తి
గగనభాగమునకు నెగసి చనిన

నిప్పు డీయొప్పమి దప్పు నవ్వలఁ బోవ
వల పాయుటకు నొండువలను గలుగు

ఆ. ననిన నట్లకాక యనుచుఁ గపోతంబు
లద్భుతంబుగాఁగ నాకసమున
కడరి వలను గొనుచు నరిగెఁ గ్రవ్యాదుండు
దుఃఖితుండు విస్మితుండు నగుచు. 9

వ. తనలో నిట్లని విచారించె. 10

చ. వలఁబడి చిక్కుటొండె వల ప్రచ్చుకపోవుటయొండెఁ గాక ప
క్షులు వల గొంచు భారమునకుండలఁ కొండకయంబరంబునన్
గలఁగక పాఱు టిట్లు వెనుకం గనుఁగొన్నది లేదు చిత్ర మీ
పులుఁగులు నేల వ్రాలఁ గని పోయి హరించెద నంచుఁజూడఁ
గన్. 11

వ. ఆసమయంబున శాల్మలీవృక్షగతం బగు వాయసం బధికక్షుత్పి
పాసాపరవశంబై యుండియు నయ్యాశ్చర్యంబు చూచు
వేడుక నాకపోతంబుల వెనుకం బఱచుచుండ లుబ్ధకుండునుం
గపోతంబుల చెంత భూతలగతుండై యతిత్వరితగమనంబునం
బఱచి యవియు దృష్టిగోచరంబులు గాక దూరం బరిగిన
నిట్టూర్పు నిగిడించుచు నిజనివాసంబునకుం జనియె నట చని
చని చిత్రగ్రీవుం డనుచరవర్గంబున కిట్లనియె. 12

క. నాచెలికాఁడు హిరణ్యకుఁ
డీచేరువ నుండు నెపుడు నిటఁ దా మనపైఁ
దోఁచినదుర్దశ మూన్పక
జూచు నతఁడు నన్నుఁ దెలియఁ జూచినమాత్రన్. 13

వ. అనఁ గపోతంబు లట్లకాక యని హిరణ్యకుం డనుమూషి
కంబుబిలంబు గదియ డిగ్గినఁ జిత్రగ్రీవుండు తనవదనంబు
బిలద్వారంబున జొనిపి హిరణ్యకా నేను నీసఖుండఁ జిత్ర
గ్రీవుండ నన్నెఱుంగవలయు ననినఁ దద్వచనంబు లాకర్ణించి
సంభ్రమంబున బిలంబు వెడలి పరిగతుఁ డగుచెలికాని నత్యా
దరంబునఁ గౌఁగిలించుకొని దుఃఖితుం డై యిట్లనియె. 14

క. మిగుల వివేకివి నీకుం
దగ నెగ్గులు చేసెనే విధాతృం డనినన్
నగుచును జిత్రగ్రీవుఁడు
తగునే యెఱిఁగియును నడుగఁ దత్త్వజ్ఞనిధీ. 15

వ. ఎఱింగియు నన్నడిగితివి గాక విను మని యిట్లనియె. 16

ఉ. ఎచ్చట నేనిమిత్తమున నేపని యెవ్వనివంక నెప్పుడో
నచ్చట నానిమిత్తమున నాపని యాతనివంక నప్పుడో
నచ్చుగ మర్త్యకోటికి శుభాశుభనిర్మితకర్మజాలముల్
దెచ్చి విధాత కాలముగతిం గదియించుఁ దలంక నేటికిన్. 17

వ. అనిన విని హిరణ్యకుండు విచారింపక పలికితిం గాని నీచెప్పి
నట్ల యగుం దప్పదని యిట్లనియె. 18

తే. నూటపది యోజనంబులపాటి నెగసి
యవనిఁ బక్షులు పొడగాంచు నామిషంబు
కాలసంప్రాప్త మైనచోఁ గానలేవు
పాశబంధంబు లేమి చెప్పంగవలయు. 19

క. గ్రహపీడ చంద్రసూర్యుల
కహిగజ విహగముల కుగ్రమగు బంధనముల్
బహుమతికి దరిద్రత్వము
విహితంబుగఁ జేసినట్టివిధి నేమందున్. 20

చ. అరుదుగఁ జేరరానిగహనాబ్ధులఁ గ్రుమ్మరు నాఖగాండజో
త్కరములుఁ జిక్కుఁ బెన్వలలఁ గానవు దుర్నయసచ్చరిత్రవి
స్ఫురణముఁ దెల్వి స్థానబలముల్ మఱి యెయ్యది యాఁ
గదా క్రియాపరుఁ డగుచుర్ గ్రహించువిధి ప్రాణుల దవ్వు
లఁ గేలు సాఁచుచున్. 21

చ. ఒరులకుఁ గీడు సేయక పరోపకృతిం జరియించుసజ్జనుం
బొరిఁ బొరిఁ బొందు నాపదలు భూరిసుఖం బగు దోషకారికిన్
సరవి యెఱింగి చేయఁడు నిజంబుగఁ జూచి విధాతపూర్వజ
న్మరచితపుణ్యపాపములమార్గనిరూఢతఁ గాని నెచ్చెలీ. 22

వ. అని యిట్లు హిరణ్యకుండు పలికి తనమిత్త్రుం డగుచిత్రగ్రీవున్
బంధనిర్ముక్తుం జేయం దలంచి కడసినం జూచి చిత్రగ్రీవుం
డిట్లనియె. 23

క. పరిజనబంధచ్ఛేదము
వెరవునఁ గావించి పిదప విడిపింపు ననున్
పరివారము నరయనిన్నృప
వరునకు నెక్కడిది రాజ్యవైభవ మెందున్. 24

వ. అని యిట్లు పలికిన చిత్రగ్రీవువచనంబునకుఁ బ్రియం బంది
హిరణ్యకుం డిట్లనియె. 25

క. నీనిర్మలగుణసంపద
నీనడవడి నీక యొప్పు నినుఁ గొనియాడం
గా నాకు శక్య మగునే
భూనుతగుణ నిన్నుఁ బోల్పఁ బురుషుఁడు గలఁడే. 26

తే. వ్రాలి భూలోక మంతయు నేలఁ జాలు
నధికపుణ్యుండ వని కొనియాడి యతని

పరిజనంబుల నిర్బంధభార ముడిపి
పిదపఁ దత్స్వామి విడిచి సంప్రీతితోడ. 27

ఆ. విందు వెట్టి యనుప వేడ్కా నాతఁడు పోవ
నాహిరణ్యకుండు నరుగఁ జూచి
లలి నెఱింగి యపుడు లఘుపతనుం డను
వాయసంబు గదిసి వాని కనియె. 28

తే. ఓహిరణ్యక సఖుని నిట్లూఱడించి
బంధ నిర్ముక్తునిఁగఁ జేసి పంపఁ జూచి
సౌఖ్యకర మైననీతోడిసఖ్యమునకుఁ
గాంక్ష చేసితి న న్నట్లు గారవింపు. 29

తే. శాల్మలీవృక్షగతుఁడనై సంచరింతుఁ
బ్రీతి లఘుపతనుం డను పేరువాఁడఁ
గాకు లెల్లను నాభృత్యగణము గాఁగఁ
బసులు గొందును సామ్రాజ్యపదవి నొంది. 30

వ. అనిన హిరణ్యకుం డతనితోడ నీకును నాకును మైత్రి యెట్లు
గూడనేర్చు వినుమని యిట్లనియె. 31

తే. ఎవరి కెవ్వరికే భంగి నెట్లు పొసఁగు
నట్టివారికి మైత్రి దా నమరుఁ గాక
నాశరీరంబు నీకు నన్నంబు నీవు
భోక్తవటుగానఁ జెలిమికిఁ బొందు గాదు. 32

వ. అనిన విని లఘుపతనుం డిట్లనియె. 33

క. నీదేహము నా కశనము,గా దోపుణ్యాత్మ యిట్టికష్టుఁడనేయి
ష్మేదిని జిత్రగ్రీవుని,నీదగుసఖ్యంబువోలె నెఱపుము నెమ్మిన్.

క. రోయక నిను భక్షించిన
నాయాఁకలి దీఱఁ జాలునా యనుమానం

బీయెడ వల దిటు చేకొన
నాయము నన్నుం గపోతనాయకు భంగిన్. 35.

క. ఎందును దిర్యగ్జంతువు
లందును దగు సమయనిశ్చయంబును హితముం
బొందుపడుట దృష్టం బిది
వింద వయిన నినుఁ గపోతవిభునిం జూడన్. 36

వ. అని లఘుపతనుండు మఱియు నిట్లనియె. 37

ఉ. ఓర్వక దుర్జనుండు కఠినోక్తుల సజ్జనుఁ బల్కె నేని ని
ర్గర్వుఁడు గాని యాతఁడు విచారము నొందఁ డొకింత యేని
తా, నౌర్వశిఖం గలంగనిమహాబ్ధిజలంబు తృణాగ్ని వైచినన్
దుర్వహదుఃఖ భార మయి తోడనె తాపముఁ బొంద నేర్చునే.

వ. అనిన హిరణ్యకుం డిట్లనియె. 39

ఆ. చపలమతివి నీవు చాల నమ్మినవారి
నెలమిఁ బ్రోచుశక్తి యెట్లు గలుగుఁ
జంచలుండు చెఱుచు సకలకార్యంబులు
గాన నీకు నాకుఁ గాదు పొందు. 40

వ. అనిన లఘుపతనుం డిట్లనియె. 41

ఉ. ఏ నటువంటివాఁడ నని యీవిరసోక్తులు పల్కనేటికిన్
మానుము లోనిశంక బహుమానపురస్సర మైనమిత్రసం
ధాన మవశ్యకార్యముగఁ దత్పరతం దగఁ జేయు నాయెడం
గాని గుణంబు లెన్నకు మొకానొకవేళను నోహిరణ్యకా.

వ. అనిన నతం డిట్లనియె. 43.

తే. నీకు నాకును శాత్రవనియతధర్మ
మైననడవడి వర్తిల్లు నాత్మ యందుఁ

గల్మషము లేనిమైత్త్రి దాఁ గలుగు టెట్లు
గానఁజెప్పంగనదియు యుక్తంబుగాదు. 44

ఆ. బుద్ధిమంతుఁ డైనపురుషుండు దనశత్రు
హితుఁ డటంచుఁ జేర నిచ్చి చెడును
దప్తజలముచేతఁ దడిసినయగ్ని దా
హీన మగుచు శమిత మైన కరణి. 45

వ. అని మఱియును. 46

క. విను శక్య మైనకార్యము
చనుఁ జేయ నశక్య మైనఁ జనునే చేయన్
వననిధిపై శకటంబును
నొనరంగా మిట్ట నేల నోడయుఁ జను నే. 47

చ. మిగుల హితుండునావలన మేలును బొందె నితండు నాయెడం
దెగఁ డని ధూర్తు నమ్మి చెడుఁ దెల్లమి సజ్జనశబ్దమాత్రమే
నెగడును గాని యిప్పు డవనిన్ సుజనుం డనువానిఁ గాన ని
మ్ముగధనలేశమాత్రమున మోహనిబద్ధము లోకమంతయున్.

ఉ. చాలఁగనిష్టుఁడంచు ననుశౌర్యమహోద్యమకార్యజాలముల్
మేలుగఁ జేయు నంచును సమీపము పాయక యుండునట్టి దు
శ్శీలుని వర్తనం బెఱిఁగి చేరఁగ నిచ్చినఁ జేటు వచ్చు మ
ర్త్యాలికి నంకమధ్యభుజగాంకితసుప్తునిఁ బోల్ప బిట్టుగన్. 49

క. సనిదానంబున శత్రుఁడు
ననుకూలత లేనినిజకులాంగనమనువున్
వినయంబు లేని మనుజుల
మనుగడ యాసన్న కాలమరణము లెందున్. 50

క. కర్కశరిపునెడఁ దొలఁగక
మార్గానఁ దగు సంధి జేసి మఱి కదిసినచోఁ
దార్గాను నతనికి మృత్యువు
కర్కటి గర్భంబుచేతఁ గ్రాఁగినభంగిన్. 51

క. ఏదోషంబులు నతనికి
నాదిం జేయుటయ కల్గ దని క్రూరాత్ముం
గాదు గదియంగఁ బలుకఁ బ్ర
మాదము మతిమంతు లైనమనుజుల కెల్లన్. 52

వ. అని యిట్లు హిరణ్యకుండు వలికిన లఘుపతనుం డిట్లనియె. 53

క. నీనీతివాక్యపద్ధతు
లే నన్నియు వింటి నీకు నిష్టునిఁగా న
న్నీ నెఱిఁ గైకొన కుండిన
నే నశనము దొఱఁగి దేహ మిచ్చుట విడుతున్. 54

వ. అని మఱియును. 55

చ. కరఁగిన నెల్లలోహములు గ్రక్కునఁ గూడు నిమిత్తమాత్రమై
జరగుటఁ జేసి పక్షిమృగసంతతి గూడు భయంబు లోభముఖ
బరఁగుటఁ జేసి మూర్ఖు సులభంబుగఁ గూడు గుణాఢ్యు లైన స
త్పురుషులుచూచినంతటనె పొందొనరింతురు పోహిరణ్యకా.

తే. మంటికడవఁబోలె మహిదుర్జనస్నేహ
మధికశీఘ్రముననె హత్తు విరియుఁ
గనకకలశభాతి గలసజ్జనస్నేహ
మొదవుఁ బగులఁ బడక పదిల మగును. 57

వ. అని యిట్లు లఘుపతనుండు పలికిన హిరణ్యకుం డిట్లనియె. 58

క. నే నీకు నెంతచెప్పినఁ
గానిమ్మన కెల్లభంగిఁ గావలె ననుచుం
బూనితి నాయెడ మైత్రికి
నేనుం దగ నియ్యకొంటి నెంతయు వేడ్కన్. 59

మ. ఉపకారం బొకవంకఁ జేయుటయుఁ దా నూహింప సన్మైత్రియే
యపకారం బొకవంకఁ జేయుటయుఁ దా నబ్భంగి శత్రుత్వమే
నెప మొక్కింతయు లేనివర్తనము లన్వేషింప మేల్గీళ్ల న
చ్చపువాత్సల్యము ద్వేషముం గలుగుటల్ సౌహార్దశత్రుత్వ
ముల్. 60

వ. అనుచు నివ్విధంబుననన్యోన్యసంభాషణంబులనత్యంతస్నేహం
బులు నిగుడ నఖమాంసంబులుం బోలి దుర్భేద్యంబు లగు
నంతఃకరణంబులం గలిసి కూడి మెలంగు నంత హిరణ్యకుండు
తనగృహంబున స్వేచ్ఛావిహారం బొసంగి లఘుపతను వీడ్కొ
ల్పిననతండునుం దనమందిరంబునకుం జని యప్పటప్పటికిమహా
గహనంబునకుం బోయి సింహశరభశార్దూలాదులచేతంజచ్చి
నమృగంబులమాంసంబులు దెచ్చిహిరణ్యకునకుఁబెట్టి తాను
నుపయోగించుచున్నఁ గొంతకాలంబునకు నొక్కనాఁడు హిర
ణ్యకుంజూచి లఘుపతనుం డిట్లనియె. 61

ఉ. ఉండితి నీకడన్ విడువ నోపక యిన్దినంబులోన నేఁ
డొండొకతాన కేగవలయున్ ననుఁ బంపుము చక్రవాకశా
రండవరాజహంస బకరాజవిహార విరాజమాన మై
యుండు సరోవరం బచట నుండును నాచెలికాఁడు నిచ్చలున్.

ఉ. ఆతఁడు మిత్రమందరసమాఖ్యమునం బొగ డొందుకచ్ఛపం
బీతటి నేను బోవఁ బ్రియ మేర్పడ వేగమె తెచ్చి పెట్టు నా

నాతనువర్ణ మీనముల నాదుశరీరము వృద్ధిఁ బొందు ప్రే
మాతిశయంబు గానఁబడునట్లుగఁ బాయఁగ రానిచుట్టమై.

వ. అనిన విని హిరణ్యకుం డిట్లనియె. 64

తే. నిన్నుఁ బాసి నిలువ నేర నీతోడన
వత్తుఁ గొంచుఁ బొమ్ము వాయసేంద్ర
ప్రాప్త మైనదుఃఖభరము దేశాంతర
గమనుఁ డైనఁ గాని క్రాఁగ దెందు. 65

వ. అని పలుక లఘుపతనుం డదరిపడి నాతోడ నిన్నిదినంబు
లెన్నఁడుం జెప్పవు దుఃఖప్రాప్తి యగుటకుఁ గతం బేమి యని
యడిగిన హిరణ్యకుండు నాతెఱం గంతయు నచ్చటఁ దేటపడ
వివరింపం దెలియుదువు గాని నన్నుఁ దోడ్కొని పొ మ్మనిన
నతం డట్ల కాక యని చంచూపుటంబునం గబళించి గగన
భాగంబున నమ్మూషికంబుఁ గొని చని వాయసంబు దాను
మున్నరుగ నుద్యోగించిన సరోవరతీరంబునఁ బెట్టి నిలిచినసమ
యంబున. 66

ఉ. ఎన్నఁడు రానిచుట్ట మిదె యిచ్చటికిం జనుదెంచె భాగ్యసం
పన్నుఁడనైతి నంచు జలమధ్యమువెల్వడి యగ్రసత్క్రియల్
గ్రన్నన నాచరించి చెలికానిఁ గనుంగొని కూర్మనాథుఁ డో
యన్నమహాత్మ మూషికము నారసి యెచ్చటనుండి తెచ్చితో. 

వ. అనిన మిత్త్రమందరునకు లఘుపతనుం డిట్లనియె. 68

చ. ఇతఁడు హిరణ్యకుం డనఁగ నిమ్మహి మూషికభర్త నాకు సం
తతమును నెయ్యుఁడై తిరుగు దైవకృతంబునఁ దీవ్రదుర్దశా
ధృతి చెడి నిల్వలేక చనుదెంచెను నీపొడ గాన నీతనిఁ
జతురభవద్వచోవిభవసంపద శోకము మాన్పు నాకుఁగాన్.

తే. విను సహస్రముఖమ్ముల వేలు పొండెఁ
దెలిసి నాలుగుముఖముల దేవుఁ డొండె
సురగురుం డొండె నితనివిశుద్ధగుణము
లెన్న నోపుదు రున్నవా రెన్న లేదు. 70

తే. చెలిమి గలకాల మెల్లను జెలుప కునికి
క్రోధ మాప్రొద్దె శీఘ్రంబె కూడి విడుట
యోగినిస్సంగుఁడునుబోలె నిచ్చి చనుట
యివిమహాత్ములగుణములై యెన్నఁబడును. 71

వ. అని మఱియుఁ జిత్రగ్రీవోపాఖ్యానంబు మొదలుకొని హిరణ్యకునిగుణకథనంబు లమ్మహాత్మునికిం దేటపడం జెప్పి నాకంటె నీ వితని నీకు నిష్టసఖునింగాఁ బరిగ్రహింపు మని యతనికి నప్పగించి నాశ్చర్యచిత్తుండై మిత్రమందరుండు హిరణ్యకున కిట్లనియె. 72

తే. అనఘ యింతదూర మనక నిర్జన మైన
వనముఁ జొచ్చినన్ను గనుటకిచట
నేమికార్య మనిన నెఱిగింతు విను మని
యతఁడు చెప్పఁదొడఁగె నతనితోడ. 73

సీ. ఒకయూరిలోపల నొర పైన మఠ మొప్పు
నందుఁ జూడాకర్ణుఁ డనఁగఁ బరఁగు
సన్న్యాసి బ్రాహ్మణసదనంబులకుఁ జని
యొత్తినభిక్షతో నేఁగుదెంచి
మఠములోనికిఁ దెచ్చి మానుగా భుజియించి
శేషాన్న మొకపాత్రఁ జిందకుండ
నచ్చోట నిడి నిద్ర నందిన నాతని
ప్రియసఖుం డగుబృహస్ఫిగుఁడు వచ్చి

తే. నిద్ర దెలిపి యతని నెఱియ నే వినుచుండఁ
బుణ్యకథలచేతఁ బ్రొద్దు గడప
వినుచు నతఁడు నన్ను వెఱపించుకొఱకు నై
గిలుక లున్న వెదురు కేలఁ బట్టె. 74

తే. అప్పటప్పటి కాకోల చప్పుడించి
నన్ను దనభిక్షుపాత్రయు నాటఁజూడఁ
గథలు చెప్పెడునాతండు గనలు నిగుడ
నేమి చెప్పితి నిందాఁక నేమి వింటి. 75

వ. ఏకాగ్రచిత్తుండవు గామికిఁ గతంబేమి యనినఁ జూడాకర్ణుం డాబృహస్ఫిగునకిట్లనియె. నాచిత్తంబు నీవు చెప్పెడుకథల మీఁద సావధానంబు గామి నిజంబు నీవు నక్కథయెట్లో యెఱింగితి వదె యొక్క మూషికంబు నామఠంబునవసియించి నాభిక్షాపాత్రంబునం గలయన్నంబొక్కింత గన్నుమూసిన సమయంబుననంతయుఁ దిని పోవ నేనును నమ్మూషికాపకారంబునకు నీమఠంబు విడిచి పోనం గలవాఁడనై యున్న వాఁడ ననిన బృహస్ఫిగుం డిట్లనియె నీమఠంబున వసియించిన మూషికం బొకటియొ బహుమూషకంబు లున్నవో యనినఁ బెక్కు లేవొక్కటియే యనిన నతం డొకమూషికం బీమఠంబున వసియించుటకుఁ గారణంబు గలుగవలయు నెట్లంటేని. 76

తే. శాండలీమాత యనునట్టిచంద్రవదన
నువ్వుఁబప్పుకు సరి చేరునువ్వు లడుగ
నెఱయ విప్రుండు కారణమెఱిఁగినట్లు
మూషికం బున్న కారణమును నెఱుంగు. 77

వ. అనిన నత్తెఱం గెఱింగింపు మనినఁ జూడాకర్ణునకు బృహ
స్ఫిగుం డిట్లనియె. 78

మ. విను మేనొక్కధరామరేంద్రుగృహమన్వేషించి భిక్షింపఁగాఁ
జని యున్నంతట నింటిబ్రాహ్మణుఁడు విస్పష్టంబుగా నింతితో
వనజాతాయతనేత్ర రేపటియమావాస్య న్మహీదేవభో
జనకార్యంబున కేమి గూర్చితివి వాత్సల్యంబునం జెప్పుమా.

వ. అనిన బ్రాహ్మణి దనపురుషు నీక్షించి యిట్లనియె. 80

క. తననేర్పుకొలఁదిఁ బురుషుం
డనువున ద్రవ్యములు గూర్చి యవి దెచ్చినచో
వనితలు పాకక్రియలకు
నొనరింతురు నీవు దేక యున్నవె చెప్పుమా. 81

వ. అనిన నమ్మహీదేవుం డమ్మగువం గోపించి యిట్లనియె. 82

క. తగుసంచయంబు వలయుం
దగ దతిసంచయము సేయుతలఁ పెవ్వరికిఁ
మృగధూర్తం బతికాంక్షను
మగువా మును వింటిచేత మడియుట వినవే. 83

చ. అనుటయుఁ గాంత తత్కథ ప్రియంబునఁ జెప్పఁ డనంగ
బ్రాహ్మణుం, డనియెఁ గిరాతుఁ డొక్కఁడు గృహంబుననుండి
ఫలోపజీవి యాఁటను వనభూమి కేఁగి యొకతావున నొక్క
మృగంబుఁ జంపి చేకొని చనుదెంచుచోఁ గనియెఁ గోలము
నీలకుభృద్విశాలమున్. 84

వ. కనుంగొని యాత్మగతంబున. 85

క. ఇది నాకు దైవమిచ్చిన
యదియని తన మూఁపువేఁట నటువెట్టి శిత

ప్రదరంబు దొడిగి యేసిన
నది వాని వధించి తాను నవ్వలఁ ద్రెళ్లెన్. 86

క. అంత నొకనక్క యామిష
చింతం జరియించుచుండి చేరువ కని య
త్యంతముదంబునఁ బొంగుచు
నెంతయుభాగ్యమున నబ్బె నిది నా కనుచున్. 87

ఆ. దాఁటునూలవెట్టుఁదలఁకుదిక్కులుసూఁచుఁ
దోఁకనులుచుఁగదియఁదొడఁగుదొలఁగు
మోఁది చేర నరుగు మూర్కొనుఁ దార్కొనుఁ
గాలు ద్రవ్వ నిసుము కలయఁ జల్లు. 88

వ. ఇవ్విధంబున ననేకప్రకారంబుల నాదద్రుకనామధేయం బగు మృగధూర్తంబు పెన్నిధానంబుఁ గన్న పేదయుంబోలె నత్యంతసంతుష్టాంతరంగంబునఁ దనలో నిట్లని వితర్కించె. 89

తే. బోయనొకనాఁడు భక్షింతు భూరిమృగము
సూకరంబును రెన్నాళ్ల క్షుధకు విడుతుఁ
బట్టి యూరక యివి గంటి పెట్టనేల
నేఁటి కీనారి దగు వేయు నేటి కనుచు. 90

ఉ. గ్రక్కునఁ జేరి నక్క తమకంబునఁ జచ్చినబోయయొద్ద ము
న్నెక్కిడియున్నవింటిగుణ మిమ్ముగఁ దాఁ గొఱుకంగ దానికో
మ్మక్కునఁ దాఁకి తీవ్రముగ నవ్వల వెళ్లినఁ గూలెఁ గావునన్
మిక్కిలి లోభియై నతఁడు మీఁదటికార్యముఁ గాన నేర్చునే

క. మిక్కిలిగఁ గూడఁబెట్టక
తక్కక ధనసంచయంబు తగుమాత్రముగాఁ
జొక్కముగఁ జేయ కుండిన
నక్కాంతకు బ్రతుకు గలదె యంబుజనేత్రా. 92

క. అనునతనిమాట కాసతి
వినయంబునఁ బలికె నేను వెట్టినె కాలం
బునఁ దిలతండులముల దాఁ
చినదానం బులగ మేను జేసెద ననుచున్. 93

ఉ. ఆమరునాఁడు రేపకడ నాతిల లెల్లను దంచి ముంగిటన్
దామరసాక్షి యెండనిడి తా గృహకృత్యము దీర్చుచున్న చో
నేమఱియున్న నయ్యెడకు నేపునఁ గుక్కుట మేఁగుదెంచియు
ద్దామత నువ్వు లచ్చటఁ బదంబులఁ జల్లిన విప్రిఁ డిట్లనున్.

క. విను కామాంధకి యాతిల
లనయము గొఱగావు బ్రాహ్మణార్థముకొఱకున్
గొనిపోయి మార్చి తెమ్మని
పనిచినఁ జని పొరుగుటింట భాషించుతఱిన్. 95

తే. ఇంటిగృహమేధి యచటికి నేఁగుదెంచి
యేమిబేరము లాడెద వింతి యనిన
నువ్వుఁబప్పు నా కిచ్చి నే నువ్వు లీయ
మాటలాడెద ననిన నామాట కతఁడు. 96

క. చేనువ్వులకుం గడిగిన
యీనువ్వుల నిచ్చువార లెందును గలరే
మానిని దీనికిఁ గత మే
దేనిం గలుగంగవలయు నిమ్ముగఁ దలఁపన్. 97

వ. అనుమాట లంతకమున్న భిక్షాన్నంబునకుం బోయి నేను
వింటి నిమ్మూషికంబును గారణంబు లేక యొంటి నిచ్చట వసి
యింప నేర దని బృహస్ఫిగుండు చూడాకర్ణునకుం జెప్పిన
నతండు. 98

క. తనభిక్షాన్న మశంకం
గని నిచ్చలు నొంటి నరిగి గర్వోద్రేకం
బున నొలసి మీఁదెఱుంగక
తినియెడియాకారణంబు తెలిపినవాఁడై. 99

తే. వాఁడికొయ్యను నాయున్నవలను ద్రొచ్చి
పెద్దకాలంబునను గూడఁబెట్టినట్టి
ప్రోదిధన మెల్లఁ గన్గొని పుచ్చుకొనియెఁ
గఠినహృదయుఁడై యతఁడదిగాన నేను. 100

క. ధనహీనుఁడైన నాకుం
దనుశక్తియుఁ బౌరుషంబుఁ దఱిగినకతనన్
విను మాహారముమాత్రం
బును దొరకించుటకు వెరవు పుట్టక యున్నన్. 101

వ. అయ్యతీశ్వరునిభిక్షాపాత్రం బెట్టకేలకుఁ గదల్చునన్నుం
గనుంగొని యదల్చు చూడాకర్ణుం గాంచి. 102

క. ఘనధన మంతయుఁ గైకొ
న్నను భిక్షాపాత్ర దివియ నడయాడుచు నే
నును నల్లనల్ల వెనుకకుఁ
జనఁ దొడఁగఁగ భిక్షుకుండు చతురత ననియెన్. 103

క. ధనవంతుఁడె బలవంతుఁడు
ధనవంతుఁడె యోగ్యుఁ డరయఁ దా నధికం బ
య్యును ధనహీనత నెలు కిది
తనజాతిం గూడెఁ బాపతాపము పేర్మిన్. 104

వ. అని మఱియును. 105

ఉ. భూరిదరిద్రుఁడుం మిగుల బుద్ధివిహీనుఁడు నైనమానవుం
జేరవు మంచికార్యములు చెప్పఁగ నేటికి వాని దైనసం
సారముఁ జెప్పఁ జూపఁగ నసార మగుం దలపోసి చూడ ని
స్సారపుమందు వేసవిని సన్నపువాహిను లింకుకైవడిన్. 106

క. కలవాఁడె చెలులు చుట్టలు
కలవాఁ డగు నతఁడు బుద్ధి గలవాఁడు నగుం
లలి నతఁడె లోకపూజ్యుఁడు
బలవంతుఁడు నతఁడె వంశపావనుఁ డెందున్. 107

క. పరదేశమె నిజదేశము
పరులే బాంధవులు ద్రవ్యపరిపాలునకుం
ధరణి నసాధ్యం బెయ్యది
పరమార్థము ధనము చూవె ప్రజలకు నెల్లన్. 108

క. కులసతి రోయును జుట్టం
బులు వాయుదు రోరులు కష్టపుంబలుకుల ని
మ్ముల నాఁడదొడఁగుచుందురు
కలియుగమున ద్రవ్యహీనుఁ గలకాలంబున్. 109

క. మృతినొందినజను నైనను
హితు లెల్లను డాయుదురు మహీస్థలిలోనం
మతిఁ దలఁపఁ బేదఁ జేరరు
బ్రతిమాలిన నైన సఖులు బంధులు నెపుడున్. 110

ఉ. చుట్టము లేని దేశమును సూనుఁడు లేని నికేతనంబునం
జెట్టతనంబు మూర్ఖజనచిత్తము శూన్యము లంతకంటె నే
పట్టున నెల్లవారు గనుపట్టక హీనదశం జరించుచో
నెట్టన సర్వశూన్యుఁడని నిందితుఁడయ్యె దరిద్రుఁ డెంతయున్.

చ. అమరు నిరాకులేంద్రియము లన్నియు నప్రతిమానబుద్ధియుక్
ప్రముదితవాక్యపద్ధతియుఁ బాయక తొల్లిఁటివే మనుష్యుఁ డ
ర్థముఁ బెడఁబాసెనేనియును దప్పదు మున్నిటినామ మైనఁ జి
త్రము క్షణమాత్రరూపు వికృతం బగు వానికి ఘోరభంగియై.
వ. అది నిమిత్తంబుగా నే నచ్చట నుండనొల్లక యొండొక్క
చోటికిం బోదుఁగా కేమి నే నొక్కని నడుగంజాల నెట్లనిన
నడిగెడువాఁడు జీవన్మృతుం డట్టివాని తెఱంగు వినుమని
యిట్లనియె. 113
చ. నడువఁగఁ దొట్రుపాటొదవు నాలుక యాడదు మాటలాడఁగాఁ, దొడఁగిన నీరెలుంగు వడుఁ దొల్లిటిపొంకము డొంకి
దేహముక్, వడఁకు భయంబు గ్రమ్మి దురవస్థలఁ దల్లడమందు
వేఁడుచోఁ, జెడుగగు నర్థికిక్ మరణచిహ్నము లన్నియుఁ
దోఁచు నారయన్. 114
తే. అర్థహీనుఁ డై యుండెడు నంతకంటె
వహ్నిలోపలఁ దగ మేను వైచు టొప్పు
యాచకుఁడు వేఁడ నీలేనియధమలోభి
జన్మ మేటికి వానిసంసార మేల. 115
సీ. వఱలుదారిద్ర్యంబువలన సిగ్గు జనించు
సిగ్గున సత్యంబు శిథిల మవును
సత్యహీనుఁడు తిరస్కారదూషితుఁ డగుఁ
బరిభవయుక్తి నన్నరుఁడు బెగడు
బెగడినవాఁడు నెవ్వగలచే దురటిల్లు
నధికదుఃఖితుబుద్ధి యడఁగి పోవు
బుద్ధిహీనుండును బొడ వడంగును వేగ
పొడ వడంగినఁ గీర్తి యడఁగు ధాత్రి

తే. నట్లు గావున నిర్ధనుం డైనవాఁడు
బహువిధంబుల నీచెప్పఁబడినయట్టి
యాపదల కెల్ల మూలమై యార్తిఁ బొందు
నెవ్విధంబున నతఁ డెన్న నీడు గాఁడు. 116

వ. అని మఱియు హిరణ్యకుండు. 117

చ. పరఁగ నసత్యవాక్యములు పల్కుటకంటెను మౌనవృత్తి మే
లరుదుగ నన్యభామఁ గదియం జనుకంటె నపుంసకత్వవి
స్ఫురణము మేలు కొండియము పూనుటకంటెను జావు మేలగుఁ
బరధనకాంక్షకంటె సులభం బగుభిక్షమ మేలు చూడఁగన్.

చ. చెడు నభిమాన మార్యునకు సేవకతంబున సాంద్రచంద్రికల్
జెడుఁ దమ మంతయుఁ దెవులుచేఁ జెడుఁ జక్కఁదనంబు
పాపముల్, చెడు హరిశంభుకీర్తనముచే శతసౌమ్యగుణంబు
లైన నసుఁ, జెడు నొరు వేఁడఁబోవుటకుఁ జేరినయర్థికి నెల్ల
భంగులన్. 119

వ. కావున నొక్కరి నడిగినవారు పెట్టుట కష్టం బగుట నెవ్విధంబున బ్రతుక నేర్తు నెవ్విధంబున మృత్యుముఖద్వారంబు దొలంగుదుఁ జిరప్రవాసియుఁ బరాన్నభోజియుఁ బరగృహవాసియు నయినమానవుండు బ్రతికియుఁ జచ్చినవానితో సమానుండు వాఁడు జీవితుండై యుండుటకంటె మృతుండగుటయె మే లని విచారించియును ధనాపేక్ష నయ్యతీశ్వరుం గఱవనాగ్రహించికదిసిన నన్నెఱింగి బృహస్ఫిగుండు కృతాంతదండంబువోని ప్రచండదండంబున నన్నుదండించిన సాభిలాషంబున సంతోషంబు లేనినన్ను నాత్మద్రోహిఁ గా నెఱింగితి నెట్లంటేని. 120

తే. నిత్యసంతోషవంతుఁ డై నెగడువాని
కన్నిచోటుల సంపద లానియుండుఁ
జెప్పు లిడుకొన్న కాళ్లకీక్షితితలంబు
తోలు గప్పినచందమై తోఁచునట్లు. 121

వ. అని మఱియును. 122

శా. సంతోషామృతతృప్తి నూఁదినమదిన్ శాంతాత్ము లైనట్టిని
శ్చింతుల్ గాంతురు నిత్యసౌఖ్యమహిమల్ సిద్ధంబు సాపేక్ష న
త్యంతక్లేశగతాగతభ్రమణదుర్వ్యాపారమోహాంకుర
స్వాంతుల్ గానఁగ నేర రవ్విధము లేశంబున్ వృథాయాసతన్.

తే. ఆశ మిగులంగఁ గల్గినయన్నరునకుఁ
గదల నూఱామడయు దవ్వుగాక యుండు
నిత్యసంతోషి యైనట్టినిర్మలునకు
ధనము చేపడ్డ నందు నాదరము లేదు. 124

వ. అట్లు గావున సత్త్వవంతుండును వివేకియు నయ్యె నేనియుం
గాంచనరత్నసాంగత్యసామ్యంబు సంధిల్లు లోకదృష్టాంతం
బును వినంబడియుండు నెట్లంటేని. 125

ఉత్సాహ. భూతదయకు మిగులఁ గల్గుపుణ్యమున్ బ్రభూతరో
గాతురంబు గాక దేహ మమరుకంటె సౌఖ్యమున్
బ్రీతికపట మింత లేనిపేర్మికంటె స్నేహమున్
ఖ్యాతి నిర్ణయించుకంటెఁ బండితత్వ మున్నదే. 126

వ. అది నిమిత్తంబు నాకుఁబుట్టినవిచారంబుకతంబున భవదంతి
కంబునకుం జనుదెంచితి ననిన విని మిత్రమందరుం డిట్లనియె.

క. సురనరకిన్నరపన్నగ
గరుడాసురపక్షిపశుమృగంబులు లోనై

పరఁగిన లోకత్రయమును
బరువడి నాహారముఁ గొనుఁ బగలిటిలోనన్. 128

క. కావున నాహారార్థము
కావింపఁడు నింద్య మైనకార్యము ప్రాజ్ఞం
డీవును బరోపకార
ప్రావీణ్యముమైఁ బ్రయాసపడు టొప్పుఁ గదా. 129

ఉ. మానవుఁ డంత ధర్మవిధిమార్గ మెఱుంగఁగ లేనికేవల
జ్ఞానియొయేని లేదు ఫలసంపద నీతికిఁ బాసి యుద్యమ
శ్రీ నెఱయంగ లేనినరుఁ జెందినమంచిగుణంబు గల్గినన్
గానఁగ రాక పోవు మఱి కార్యము రాదు మనోవిహీనతన్.

తే. అచ్చుపడ నీతిశాస్త్రంబు వచ్చెనేని:
బొరి నిరుద్యోగి ఫలసిద్ధిఁ బొందలేఁడు
తెల్ల మంధుండు కరమున దీపముండె
నేని యచటిపదార్థంబుఁ గానలేఁడు. 131

వ. అని చెప్పి మఱియును. 132

సీ. ఒకవేళ దాత యాచకవృత్తిమై నుండు
యాచకుం డొకవేళ నగును దాత
యొకవేళ శాత్రవనికరంబు భంజించు
నొకవేళ నిలువక యోడి పాఱు
నొకవేళ సంపద నుప్పొంగుఁ బైపయి
నొకవేళఁ గడు లేమి నొంది యుండు
నొకవేళఁ బుత్త్రమిత్త్రకళత్రయుతుఁ డగు
నొకవేళ నొక్కఁడు నొదిగి యుండు

తే. హెచ్చుదగ్గులు తఱుచుగా నెల్లయెడల
నెవ్వరికి నైనఁ గలుగుచో నివ్విధమున
భాగ్యవంతుఁడు కొనసాగి బ్రతికి యుండు
ధాత్రి నదిగాన భాగ్యప్రధాన మరయ. 133

వ. కావున దేశకాలంబుల తెఱం గెఱుంగునది. 134

క. వనమునఁ బుట్టినశాకము
లనయము భక్షింపఁ దనకు నాఁకలి చెడదే
విను మును స్వోదరపోషణ
మున కెవ్వఁడు నష్టవృత్తి నొందెం జెపుమా. 135

వ. అని యిట్లు హిరణ్యకు నూఱడించి యిట్లనియె. 136

సీ. అవివేకి శాస్త్రంబు లభ్యసించినయేని
నతఁడు మూర్ఖుఁడు గాని ప్రతిభ లేదు
చదివినశాస్త్రంబు సకలార్థము నెఱింగి
యవ్విధంబును దాను నాచరించి
యడిగినవారికి నర్థంబు దెలియంగ
వివరించునతఁడు వివేకి గాన
నివ్విధంబునకును దృష్టాంత మైనయ
ర్థంబు నొప్పంగ నుదాహరింతుఁ

తే. దెవులు గొన్నట్టివానికిఁ దివిరి మందు
చేసి సేవింప నొసఁగక చేత నిడిన
మాన నేర్చునె రోగంబు మదిఁ దలంపఁ
జదువు పనిలేదు భాగ్యంబు చాలకున్న. 137

క. నెలవులు దప్పిన మిగులం
బలుచన నఖదంతకేశమానవులపనుల్

తలపోసి బుద్ధిమంతులు
దొలఁగరు తమతావు లెంతదుర్దశ నైనన్. 138

వ. అని పలికి మిత్త్రమందరుం డవ్విధం బల్పవిచారికార్యం
బార్యులతెఱంగు వినుమని యిట్లనియె. 139

చ. ఇరవుల రాయి డైనఁదగునిక్కలు చూచుచుఁబోయిపోయి కే
సరులు గజంబులుం సుజనసంఘము నెమ్మది నుండుఁ జాల దు
స్తర మగుకాలము న్వెడలఁ జాలక పెంకిన యుండి డస్సియు
ర్వర మృగకాకకాపురుషవర్గము దుర్గతిపొందు నెంతయున్.

సీ. ధీరుండును వివేకదీపితుండును నైన
ప్రభునకుఁ బరదేశభయము లేదు
నిజభుజవిక్రమోన్నిద్రభద్రశ్రీల
నాత్మీయులును దాను ననుభవించు
నెట్లన్న విను సింహ మేప్రొద్దు వసియించు
నడవిఁగా కొండొకయడవి నైన
నల్పజంతువునందు నాత్మీయపౌరుషో
ద్యుక్తికి సమకొని యుక్తి మెఱసి

తే. కులిశసన్నిభనఖముఖాంకుశవిభిన్న
మదభరాభీలకుంభికుంభప్రకీర్ణ
మాంసరక్తానుభవమోదమానసమునఁ
బొదలుచుండును నెంతో యొప్పిదము గాఁగ. 141

తే. అమర మండూకములు పల్వలమును బకము
లరసి కాసారమును జేర నరుగుకరణి
నధికధనములు సత్సహాయములుఁ దివిరి
ధరణి నుద్యోగిఁ బ్రాపించుఁ దమకుఁదామ. 142

వ. అవ్విధం బెట్టిదనిన. 143

చ. వఱపున మేను లెండఁ దమవారియెడం బెడఁబాసి జీవ
ముం, దొఱఁగి ధరిత్రి డింది యతిదుర్దశఁ గాలము వేఁచి
యుండఁగా, నుఱవగువానద్రోణముల నొయ్యన నూల్కొన
మున్ను వోలె నే, డ్తెఱఁ గనుపట్టు భేకవితతిం గని యుత్సవ
మొప్పఁ జేయఁగన్. 144

వ. అని చెప్పి వెండియు. 145

శా. ఆలస్యంబును గామినీజనరతివ్యాసక్తియున్ జన్మభూ [మున్
లోలత్వంబును రోగమున్ ఘనభయోల్లోభంబు సంతోష
బోలంగానివి యాఱు నెప్పుడు జగత్ప్రాజ్యప్రతాపోనయ
శ్రీలం జెందఁగ విఘ్నకారణములై చెల్లున్ ధరామండలిన్.

వ. కావున నివి యాఱుగుణంబులు పరిహరించినపురుషుం బ్రదీప్త
సంపదలు ప్రాపించుఁ బ్రాప్తంబులైనసుఖదుఃఖంబులవలన
మోదఖేదంబులం బొరయ కుండునది. 147

తే. చక్రపరివర్తనమువోలె జనుల కెల్ల
సౌఖ్యదుఃఖంబు లెడనెడ సంచలించు
వానిఁ గైకొని యాత్మవిజ్ఞానమహిమ
బుధులు మోదఖేదంబులఁ బొరయ రెందు. 148

సీ. వర్ధితోత్సాహుఁడై వలయుకార్యములందు
దీర్ఘసూత్రుఁడు కాక తెలివి గలిగి
పనులఁ బ్రగల్భుఁడై బహుకార్యములతటి
విసువ కేమిట నతివ్యసని గాక
మిగుల శూరుండైన మే లెఱుంగుట గల్గి
దృఢచిత్తుఁడై సమస్థిరత లాదవ

మితసత్యభాషణోన్మేషంబు సంధిల్లఁ
బుణ్యకర్మములపై బుద్ధి నిలిపి
తే. యుండు పురుషునిగుణముల యోజ తెలిసి
యింటి కెడపక తనుదానె యేఁగుదెంచి
సంచలింపక తాఁ బ్రతాపించి మించి
యంచితంబుగఁ గనుల సేవించు నెపుడు. 149

క. ఉద్యోగరహితు నలసుని
నుద్యోత్సాహవిహీను నొల్లదు సిరి సం
పద్యోగుఁ గొల్వఁ జేరదు
చోద్యముగా వృద్ధుఁ దరుణి చూడనిభంగిన్. 150

వ. కావున నీకు ద్రవ్యసంపత్తి గలుగకున్నను బుద్ధిసముత్సాహంబు గలుగుటంజేసి బ్రతుకంగలవాఁడవని పలికి వెండియు.

చ. ఘనుఁ డొకవేళ లేమిఁ గడుఁ గందినఁ జుల్కదనంబుగాదుహీ
ననరుని కొక్క చోటను ధనం బొడఁగూడిన దొడ్డవాఁడు గా
డనయము హేమమాలికల నందముగాఁ గయిచేసి రేనియుఁ
శునకము విక్రమస్ఫురణసొంపునఁ సింహము బోల నేర్చునే.

సీ. శౌర్యసముత్సాహధైర్యసారంబులఁ
బురుడు చెప్పఁగ రానిపురుషవరుఁడు
జలనిధి గోష్పదస్వల్పమాత్రంబుగా
సమరాద్రి వల్మీకసమము గాఁగఁ
దలఁచు నహీనసత్త్వప్రతాపోజ్జ్వలు
నగరిలో నవనిధానములతోడ
సంతతసంతోషితాంతరంగంబున
శ్రీదేవి నిశ్చలస్థితి వహించు

తే. నట్టిపుణ్యులు తఱచుగాఁ బుట్ట రవనిఁ
బుట్టిరేనియు సుజనసంపూజ్యు లగుచు
నెన్నికకు నెక్క నూట వెయ్యింట నొకడు
గర్భనిర్భాగ్యు లెందఱో కలుగ నేల. 153

క. అమరాద్రిపొడవు పాతా
ళములోఁతు మహాబ్ధివిరివి లఘుతరములుగాఁ
దమచిత్తంబునఁ దలఁపుదు
రమరఁగ సుద్యోగవంతు లైనమహాత్ముల్. 154

వ. అనిన హిరణ్యకుండు మిత్త్రమందరున కిట్లనియె ననఘా నీవు చెప్పిన హితవచనంబు లాకర్ణించుటంజేసి నాచిత్తంబునం గల కలంక యంతయుఁ దీఱె నని మఱియును. 155

మ. ధనవంతుండవు నిన్ను గర్వ మిసుమంతం జేర దిబ్భంగినే
నను నర్థోత్కరనాశదైన్యమును మేనం జెందనీ నెప్పుడున్
మనుజుం డొక్కెడఁ బాటులం బడుట సామ్రాజ్యంబు గై
కొంటనుం, గనుఁ డా నేర్పరిచేతికందుకము రేఖన్ బెక్కుచం
దంబులన్. 156

మ. ఖలసంసర్గము యౌవనాభ్యుదయమున్ గాంతాజనస్నేహ
మున్, జలదచ్ఛాయము ద్రవ్యసంపదయు నైజం బల్పకా
లోపభోగ్యలసత్సౌఖ్యకరంబు లంచు నివి వేడ్కన్ మెచ్చ
రార్యుల్ మదిన్, విలసత్స్థానసమాధినిర్మలగుణావిర్భూత
చేతస్కులై. 157

క. అది గాన నర్థహానికి
హృదయంబునఁ దలఁక నించుకేనియు నను నిం

పాదవఁగ బోధించిననీ
సదమలవాక్యములు నను బ్రశాంతునిఁ జేసెన్. 158

వ. అనిన మిత్రమందరుండు హిరణ్యకున కిట్లనియె. 159

ఉ. తోడనె యర్థసంపదలతోఁ బ్రభవించినవాఁడు లేఁ డొడం
గూడినద్రవ్య మెల్ల ననుకూలముగా శతహాయనంబులన్
వేడుకలారఁగా ననుభవించినవాఁడును లేఁడు గాన నే
నోడను బూర్వసంచితము యోగ్యమె నాకును నెల్లవారికిన్.

ఉ. దానముకంటె వేఱొకనిధానము లేదు ముదంబుకంటె నిం
పైనధనంబు లేదు కొనియాడెడుశీలముకంటె భూషణం
బేనెటి లే దరోగమున నింపగుదేహముకంటె లాభమున్
గానఁగ నెందు లే దనఘ గౌరవబుద్ధిఁ దలంచి చూచినన్.

క. పెక్కులు పలుకం బనిలే
దెక్కడికిం బోవ వలవ దేనును నీవున్
దక్కక కూడుక యుండుద
మిక్కడ నతిసౌఖ్యవృత్తి నింపెసలారన్. 162

వ. అనిన హిరణ్యకుం డిట్లనియె. 163

తే. మిత్రమందర నీసుచరిత్రమహిమ
మఖిలజనులకుఁ గొనియాడ నాస్పదంబు
గాన నాకును సంతోషకరము గాదె
నిన్నుఁ గనుఁగొన్న నాభాగ్య మెన్న నేల. 164

ఉ. ఉన్నతుఁడైన మానవున కొక్కయెడన్ గడుఁగీడు వొందినన్
సన్నపువాఁడు దీర్పుటకు శక్తుఁడె యంతటివాఁడు వాఁడు గా
కన్ననఁ బంకమగ్న మగునట్టిగజేంద్రుని నెత్త నేనుఁగుల్
పన్నగ నోపుఁ గాక మృగపంక్తులు హీనము లంత కోపునే.

ఉ. దేవబలాఢ్యుఁ డైనతఁడు ధీరమతుల్ గొనియాడ నొక్కచో
దైవిక మైనకీడు దనుఁ దాఁకిన నోర్చి సమస్తకార్యసం
భావితబుద్ధిమైఁ బ్రకృతిబాంధవు లాపదఁ బొంది వచ్చినన్
జేవ దలిర్ప వారలకుఁ జెందినదుఃఖము మాన్పు నెయ్యుఁడై.

చ. పరువడి నెల్లనాఁడు బుధబాంధవకోటి నుతింప నుండువాఁ
డరుదుగఁ దన్నుఁ జేరుశరణార్థుల నర్థులఁ జింతితార్థసం
భరితులఁ జేయువాఁడు కులపావనుఁడై పెనుపొందువాఁడు
పో, పురుషవరేణ్యుఁ డాయమరపూజ్యుఁడు కారణజన్ముఁ
డీమహిన్. 167

వ. అని మఱియును. 168

ఉ. మారుతముల్ వనంబులను మానుగ షట్పదపంక్తి పువ్వులన్
హారివిహారిచారుకలహంసము లంబులఁ బక్షు లంబరా
ధారము గోరినట్లు ప్రమదంబున నేనును నిన్నుఁ జూడఁగాఁ
గారణ మాటఁజేసి ఫలకాంక్షులఁ జేరితి మివ్విధంబుగన్. 169

వ. అని యిట్లు మిత్రమందరలఘుపతనహిరణ్యకులు తమలోపల
సంభాషణంబులఁ బ్రొద్దుపుచ్చుసమయంబున. 170

క. సారంగ మొకటి మృగయుని
బారిం బోరిఁ దప్పి బెదరి భయవిహ్వలతన్
గూరి పఱతెంచినంతటఁ
జేరువఁ బొడగాంచి వారు చిడిముడిపడుచున్. 171

వ. మిత్రమందరలఘుపతనహిరణ్యకులు మృగంబుతీవ్రగమనంబు
చూచి వెఱచుచుఁ గనికనింబఱచి రందు లఘుపతనుండచ్చే
రువ నొక్కమహీరుహం బెక్కి భయంబు దక్కి నిక్కిచూచి
యామృగంబుపజ్జఁదక్కిన క్రూరమృగవ్యాధబాధలు లేకుండ

నిరీక్షించి మిత్రమందరహిరణ్యకులం బేర్కొని, వెఱవక రం
డని పిలిచిన నయ్యిరువురు వృక్షంబుపొంతకుం జనుదెంచి
నితాంతభయభ్రాంతుండునుం గంపితశరీరుండును నగుచిత్రాం
గదుం డనుమృగసత్తము నాలోకించి వారలలో మిత్రమం
దరుం డమందానందకందళితహృదయారవిందుం డగుచు నా
మృగంబున కిట్లనియె. 172

ఉ. ఎచ్చటినుండి వచ్చితివి యేమి మృగోత్తమ నీమదిన్ భయం
బచ్చుపడంగ నున్నయది యవ్వల నెంతటికార్య మయ్యె నీ
వచ్చుట పెద్ద లెల్ల నిట వచ్చుట గావున నన్న పానముల్
పుచ్చుక మానివాసమునఁ బొంది వనంబు నలంకరింపవే. 173

వ. అనిన విని చిత్రాంగుం డిట్లనియె. 174

తే. వెంట నిడువక లుబ్ధకవీరుఁ డొకఁడు
సారెకును వచ్చి నామీఁదఁ జలముకొన్న
నచట నుండక వచ్చితి నిచట మీకు
విందనై యన్న నామిత్రమందరుండు. 175

క. మాకంటె నీకుఁ జుట్టము
లీకాననమందుఁ గలుగ రిది నీయిలుగాఁ
గైకొని నిలువుము నీ వనఁ
జేకొని బహుకాల మధివసించినపిదపన్. 176

ఉ. అంగద నొక్కనాఁడు ప్రియ మారఁగ మేఁతకు దూర
మేఁగి చిత్రాంగుఁడు రాక చిక్కటయు నర్మిలి నిద్దఱుఁ జింత
నొంద నయ్యింగిత మాత్మలో నెఱిఁగి యేపున వాయస
మేఁగి కాంచె క్షీణాంగుని వాగురీనియమితాంఘ్రి నినాహారి
ణేంద్రు నొక్కచోన్. 177

క. కని లఘుపతనుఁడు డగ్గఱి
మునుకొని కన్నీరు దొరఁగ మోహభ్రాంతిన్
దనమేను దుఃఖవహ్నిన్
గనలఁగ నిట్లనియెఁ బరమకారుణ్యమునన్. 178

ఉ. ఒక్కని వేఁడఁ బోవు మఱియొక్కనిచేతున కియ్యకోవు వే
రొక్కనిసొమ్ము కాసపడ నొల్లవు మూలవిధాత నిర్దయుం
డక్కట నీరుసుం దృణము నాని మహోగ్రవనాంతరంబునన్
మ్రుక్కెడునీకు నిట్టియవమానము మానము దప్పఁ జేసెనే.

వ. అని మఱియు ననేకప్రకారంబుల నమ్మృగంబు నుద్దేశించి
వగచుచు వాయసపతి వెండియు నిట్లనియె. 180

క. ఈవంక కేల వచ్చితి
వేవెరవునఁ దగులు వడితి వింకిట మనకున్
గావలయుకర్జ మెయ్యది
నావుడు నాతనికి హరిణనాథుం డనియెన్. 181

ఆ. అనఘ వేఁటకాని కగపడ్డ ననుఁ గావ
నీకుఁ గడిఁది వాఁడు రాకమున్న
చని హిరణ్యకునకు సకలంబు నెఱిఁగించి
తోడుకు రమ్ము పలుకు లుడిగి వేగ. 182

వ. అనినం గానిమ్మని లఘుపతనుం డుడువీధి కెగసి యతిత్వరిత
గతిం జని మిత్రమందరహిరణ్యకులకుఁ జిత్రాంగుం డురిఁ
బడుట తేటపడం జెప్పి హిరణ్యకుం దోడ్కొని పోయినం
జిత్రాంగునిం జూచి హిరణ్యకుం డిట్లనియె. 183

క. మతిమంతుఁ డైననీ వి
ట్లితరునిక్రియఁ దగులువడితి వీదుర్దశకుం

గత మేమి యనిన నాతం
డతనికి నిట్లనియెఁ జంచలాత్ముం డగుచున్. 184

క. మాటాడఁ దగదు మన మి
చ్చోటను లుబ్ధకుఁడు వచ్చి చూడకము న్నీ
పాటం దగిలినయురుల
న్వీటిం బుచ్చంగఁ దగు ననింద్యచరిత్రా. 185

వ. అనుటయు హిరణ్యకుండు. 186

ఆ. నీకు శుభము గోరి నీసమీపమునకు
వచ్చినాఁడఁ గాన వలదు భయము
చెప్పు మన్న నపుడు చిత్రాంగుఁ డిట్లను
నాహిరణ్యకునకు నర్థితోడ. 187

క. మును మోసపోయి యప్పుడు
కనుగానక తగులువడితిఁ గడవఁగ వశమే
మనుజుండు దైవకృతముల
ననుటయు నది యెట్టి దనిన నాతని కనియెన్. 188

ఉ. ఎంతటివారి కైన మహి నింతటివార మనంగ రాదు మా
కింతటిబుద్ధిమంతులకు నింత లవస్థ లనంగ రాదు జ
న్మాంతరకర్మవాసనలయందు శుభాశుభముల్ క్రమంబులఁ
వింత లె బుద్ధిమంతులు వివేకమునఁ బరికించి చూచినన్. 189

వ. కావున నిందులకుం జింత వలవ దాకర్ణింపుము. 190

సీ. తలిగర్భమున నాలునెల లైన నుదయించి
యొకనాఁడు మూఁకరై యున్నయట్టి
చుట్టపుజాతిలో నిట్టలం బగు వేడ్క
నుల్లాస మెసఁగ నే నున్నవేళ

నచ్చటికి వేఁటకాఁ డరుగుదెంచినఁ జూచి
బెదరి మావా రెల్ల జెదరుటయును
గొండికవాఁడనై కూడి పాఱెడునట్టి
జవసత్త్వములు నాకుఁ జాల కున్న
తే. ముట్టఁ బఱతెంచి ననుఁగూడ ముట్టి పట్టి
పెట్టెదంబుగ నాకేలు చుట్టికట్టి
పట్టికృప పుట్టి చంపక వాఁడు నన్నుఁ
జూచి తను నేలుభూపాలసుతున కిచ్చె. 191

ఉ. ఇచ్చిన నన్నుఁ బుచ్చుకొని యెంతయు వేడుక లుల్లసిల్ల నా
కిచ్చగు మేపునీరు ప్రియ మేర్పడఁ గట్టడ చేసి గారవం
బచ్చుపడంగ నంతిపురమంగనలుం బరివారముం గడుం
మచ్చికఁ బుత్త్రభావమున మన్ననఁ బెంపఁగ వృద్ధిఁబొందితిన్.

వ. ఇవ్విధంబునఁ బెద్దకాలం బుండి యొక్కనాఁడక్కుమారుండు పవ్వళించినగృహంబు కనతిదూరంబునఁ గట్టెదుర నేను విశ్రమార్థి నై శయనించి యున్నసమయంబున నతనిబిడనీల వలాహక స్ఫారాంధకారప్రద్యోతమానవిద్యుల్లతావితానంబును వాతవిధూతవర్ష జలబిందుసందోహ విజృంభితగర్జాడంబరంబును నైననిశాసమయంబు నాకుఁ బరితోషంబుఁ జేయ నట్టిసంతోషపారవశ్యంబునం గెలను పరికింపనెఱుంగక మనుష్యభాషణంబుల నెలుంగెత్తి యిట్లంటి. 193

తే. చినుకుతోఁ గూడుకొనిగాలిచెలఁగఁజూచి
దాఁటగట్టుచుమృగములు దాఁటుచుండ
వెఱను మావారివెనుక నేఁ బఱచునట్టి
భాగ్యసంపద యెన్నఁ డేర్పడునో నాకు. 194

సీ. అనుచున్న సమయంబునందు నంతకమున్న
యాచమనార్థమై యరుగుదెంచి
భూపాలసుతుఁడు సమీపస్థుఁడై యుండి
పోల నవ్వాక్యంబు లాలకించి
దిక్కులు పరికించి యొక్కడ నెవ్వారు
మెలఁగుచందము లేమి తెలిసి యప్పు
డీమృగంబునఁ బుట్టె నిట్టియుత్పాతంబు
లోడల మహాభూత ముండఁ బోలు
తే. ననుచుభ్రమనొంది తామూర్ఛమునిఁగి యుండ
నతనిజనకుండు తెలవాఱ నరుగుదెంచి
కారణం బేమి యని పెద్దవారి నడుగ
నందు దైవజ్ఞుఁ డిట్లనె నతనితోడ. 195

తే. జంతుపరిభాష దమలోన జరుగుచుండుఁ
గాని మానుషభాషణక్రమము వినము
కారణము దీని కేమైనఁ గలుగ నోపుఁ
గలుగుఁ గాకేమి మీకింక వలదు భయము. 196

క. అని యతనిదేహ మెల్లను
దనకరములఁ నిమిరి బహువిధంబుల మంత్రిం
చినఁ బూర్వభంగి నృపసుతుఁ
డనయము బడలికలు తీఱె యరిగినపిదపన్. 197

వ. అమ్మహీశ్వరుండు నన్నుఁ జుఱచుటఁ జూచి తనకింకరుల కి
ట్లనియె. 198

క. అఱజాతిజంతు విచ్చట
వెఱపించుచు నుండవలదు విపినంబునకుఁ

దలుముఁ డని ముదల వెట్టిన
నటిమిటి ననుచరులు వెడల నడిచిరి నన్నున్. 199

క. నాఁ డట్లు వడితి నమ్మెయి
నేఁ డిట్లురిబారిఁ బడితి నీచపువిధి నె
వ్వాఁడైన గెలువఁ గలఁడే
పోఁడిమి గలనీతిమార్గమున నేభంగిన్. 200

వ. అని యిట్లు చిత్రాంగుండు పలుకునంత నచ్చట మిత్రమందరుం డాత్మగతంబున లఘుపతనహిరణ్యకు లరిగి తడ వయ్యె నక్కారణంబు దెలియునంతకు నే నెట్లు గుండియ పట్టియుండ నేర్తు నని యప్పుడ కదలి హిరణ్యకుండు చనినజాడం దడయ కయ్యెడకుం బోయిన హిరణ్యకుం డిట్లనియె. 201

తే. మిత్రమందర నీవు మాపైఁదిభక్తి
నిచటి కేతెంచు టిది మాకు హితము గాదు
వేటకాఁ డిప్డు దేతెంచువేళ యయ్యె
వాని కగపడ కేము పోవంగఁగలము. 202

క. ఉదకంబులోన నైనను
గొదగొని పాటింగఁ గలవు కుంభినిమీఁదన్
గదలంగ నేర వడిగెడు
నది గావున నీవు వచ్చు టనుచిత మెందున్. 203

వ. అనుటయు మిత్రమందరుం డతని కిట్లనియె. 204

క. మతిమంతుఁడు గుణవంతుఁడు
హితుఁడును నైనట్టిసఖుని నెవ్వరుఁ బాయన్
ధృతి నిలుపలేరు పాసియు
నతఁ డొకచోఁ గాలు వ్రాంచ కలఁతం బొందన్. 205

వ. అని మఱియును. 206

చ. సురుచిరనిర్మలాత్ముఁ డగుచుట్టమునందును శీలవృత్తి పెం
పరు దగుసాధ్వియందును బ్రయాస మెఱింగినపుత్రునందునుఙ్
బురుషుఁడుదుఃఖమంతయును బోవఁగఁద్రోచి యచింతతో నిరం
తరసుఖసంగతిఙ్ మెఱయుఁదామనుచుండెడునంతకాలమున్.

వ. అని పలుకుచున్న యవసరంబున. 208

క. యమదూతవోలె నచటికి
సమదగతిఙ్ వేఁటకాఁడు చనుదేరంగాఁ
దెమలక హిరణ్యకుం డురిఁ
దుమురుగఁ దెగఁ గొఱికి బొక్కఁ దూఱంబాఱెన్. 209

క. చిత్రాంగుఁ డుఱికి పఱచెఙ్
జిత్రత లఘుపతనుఁ డెగసె శీఘ్రతఁ జంచ
ద్గాత్రస్థూలతఁ గదలెడు
మాత్రంబున బోయ మిత్రమందరుఁ గనియెన్. 210

క. కని దానిఁ బట్టి త్రాటం
గొని యనువునఁ గట్టి వింటికొప్పునఁ దగిలిం
చి నిజమనోరథభంగం
బున కాత్మం దలరి వాఁడు బుద్ధిం దలఁచెన్. 211

క. వలఁ జిక్కక చనె మృగ మ
వ్వలఁ జిక్కను దాసరయ్య వలవనిజాలిం
దలరంగ నేల నేఁ డీ
కొలఁదియె కూరయ్యె ననుచుఁ గొనిపోవుతఱిన్. 212

క. మృగమును గాకము నెలుకయుఁ
దెగపడి కచ్ఛపముపోక తేటపడిన నె

వ్వగలం బొగిలెడుదానికి
మొగ తప్పక కార్య మెఱిఁగి మూషిక మనియెన్. 213

క. వగ పధికరోగమూలము
వగపున గార్యంబు వచ్చువల నెఱుఁగం డి
మ్ముగ వగ పనర్థమూలము
వగపున శాత్రవభయంబు వచ్చుఁ నొచ్చున్. 214

క. కడ లేనిదుఃఖవార్ధిం
గడచితిఁ దొల్లియును నేఁడుఁ గడతుముగా కి
ప్పుడు దైవ మేల మనలఁ
జెడఁ జూచును దీని కేల చింతం బొందన్. 215

క. తగుమిత్రుఁడు భాగ్యాధికుఁ
డగువానికిఁ గాని దొరకఁ డాపద నైనన్
దిగ విడువక రక్షించును
సుగుణాఢ్యుం డుత్తముండు చుట్టం బైనన్. 216

తే. తల్లియందును దనుఁ గన్నతండ్రియందు
నాలియందును సుతసోదరాలియందు
నెంతసంతోష మగు నగు నంతకంటె
మేలిసౌఖ్యంబు నరునకు మిత్రునందు. 217

చ. తమతమకర్మవాసనలఁ దాఁకు శుభాశుభకర్మకాలముల్
క్రమమున మర్త్యకోటి కటుగాన విపద్దశ లెల్లఁ బెక్కు జ
న్మములవి గూడి తన్ను నలమంబడి యిప్పటిపుట్టువందు దై
వము ప్రతికూల మైన వగవం బనిలేదు వివేకహీనతన్. 218

తే. కడఁగి దేహి నపాయంబు గాచియుండుఁ
గదియఁ గూటమిఁ బాయుట గాచియుండుఁ

గలిమిఁ బెడఁ బాప లేమియుఁ గాచియుండు
నస్థిరం బది సంసార మనుట నిజము. 219

ఉ. ఆరయ నాయుధక్షతమునందున మేనికిఁ బాటు గల్గు నా
హారము లేక యున్నను దరాగ్ని శరీరము దీర్చు నాపదం
గూరిన వైరముల్ దలఁచఁగల్ దమలో నొకసందు గల్గినన్
జేరె ననర్థకోటి నిరసించినఁ బోవవి దేహధారికిన్. 220

ఉ. భీకరశాత్రవస్ఫురదభేద్యభయంబును దీవ్రదుఃఖముల్
వే కడతేర్పఁ జాలుటకు నేర్చి ముదంబున కాలవాలమై
చేకొని కాచు నాత్మసఖు సిద్ధము మిత్రసమాఖ్యరత్నమన్
శ్రీకరవర్ణయుగ్మము సృజించినయున్నతపుణ్యుఁ డెవ్వఁడో.

వ. అని యిట్లు తనప్రాణసఖుం డైనమిత్రమందరుండు దగులువడి
పోవుటకుఁ బరితాపాంతఃకరణుం డగుచు హిరణ్యకుండు
చిత్రాంగలఘుపతనుల నాలోకించి యిట్లనియె. 222

క. వడి నడవి గడచి లుబ్ధకుఁ
డెడదవ్వగఁ జనియెనేని యెంతటివారల్
విడిపింపలేరు మనసఖుఁ
దడయక దీనికిఁ బ్రచింత దలఁపఁగవలదే. 223

వ. అనినఁ జిత్రాంగలఘుపతను లాహిరణ్యకున కిట్లనిరి. 224

ఉ. ముట్టినయాపదన్ భయము ముంచి మనంబుఁ గలంపఁ గార్య
సం, ఘట్టన గానలేక చెలికానిఁ దలంచుచు దుఃఖవార్ధిలోఁ
దొట్టుచుఁ బొక్కుచుండ మఱి తోఁపవు మీఁదటియుక్తు
లేమియున్, జుట్టమ వైననీశరణు చొచ్చితి మెయ్యది బుద్ధి
చెప్పవే. 225

క. పొడవును జక్కఁదనంబును
గడువల మైనట్టియొడలు గలిగియుఁ గలవే

జడబుద్ధి యయ్యె నేనియుఁ
బుడుకకుఁ గొఱగాడు వానిపుట్టు వదేలా. 226

క. మాకందఱకు నశక్యం
బై కానంబడినబుద్ధి నధికుఁడ వగుటన్
నీ కింత ప్రియము చెప్పెద
మే కార్యము చేయువార మెఱిఁగింపు దయన్. 227

వ. అని ప్రార్థించిన హిరణ్యకుండు నాకుం జేయ నవశ్యకర్తవ్యం
బైనకార్యంబునకు మీ రింత ప్రియంబు చెప్ప నేల యని పలికి
యొక్కింతచింతించి నిశ్చితకార్యుండగుచుఁ జిత్రాంగలఘుపత
నులం జూచి మీరు వేఁటకానికిఁ దలకడచి పోవువా రని
యును బోయి చేయంగలయుపాయం బిద్ది యనియును
దానును నింతనంతఁ జని కూడ ముట్టి పట్టినపని తుదముట్టఁ
జేయువాఁడ ననియునుం గఱపి పంచిన నయ్యిరువురుం జని
రవ్విధం బెట్టిదనిన. 228

చ. మెఱసి మహీజవంబునను మేఘపథంబునఁ బాఱె వాయసం
బెఱుఁగక యుండఁ బల్లమున నీరముచాటునఁ బోయె నమ్మృ
గం, బఱిమిఱి నింతనంతఁ గదియం జనుదెంచెను మూషి
కంబు నేర్పెఱ మిగులంగ నయ్యెలుకుఁ దెంపు మెయిం
గెలువం దలంచుచున్. 229

క. త్వరితముగ వేఁటకానికి
సరిగడచి మృగంబు వాయసంబును దూరం
బరుగుచును వాఁడు పోయెడు
తెరువున నొకమడువుదరి నతిస్థిరబుద్ధిన్. 230

ఆ. లోఁతు లేనినీటిలోను జిత్రాంగుండు
సాఁగఁబడుచుఁ గాళ్లఁ జాచికొనుచుఁ

గన్ను లమర మూసి కనకుండఁ జచ్చిన
వాఁడువోలె నుండె వాయసమును. 231

క. తల యెత్తి చంచుపుటమునఁ
బలుమాఱును బొడిచి తినెడిభావము దోఁపన్
దలకొనునంతట రెంటికి
దళుకొత్తెడువేడ్క నెలుకు దవ్వులఁ గాంచెన్. 232

ఆ. కాంచి మేను వెంచి కడు నాత్మ హర్షించి
కమఠయుక్త మైనకార్ముకంబు
వెడఁగుబుద్ధితోడఁ గడు దవ్వనను బెట్టి
యతఁడు మృగముఁ జేరునవసరమున. 233

క. కను గలిగి యింత నంతం
జను దెంచి హిరణ్యకుండు సంతస మెసఁగన్
దనమిత్రు మిత్రమందరు
తనుబంధం బపుడు గొఱికెఁ దత్క్షణ మాత్రన్. 234

క. వడివడి జలమధ్యమునకుఁ
గడువేగమ కమఠ మేఁగె గ్రక్కున బొక్కన్
బడె నెలుక వానిఁ బొడగని
వడిఁ గాకము నెగసె మృగముఁ బాఱెన్ దవులన్. 235

ఆ. ఆస గొలిపి పోయె నక్కట నన్ను నీ
చెనఁటిమృగ మటంచు సిగ్గుపడుచుఁ
దిరిగి చూచె నపుడు త్రెంచుక పోయిన
కచ్ఛపంబు లేనికార్ముకంబు. 236

క. అందుకొని వెచ్చ నూర్చుచు
మందిరమున కూర కేట్లు మరలుదు ననుచున్

మందప్రయాణమునఁ దన
సుందరి యేమునో యనుచు స్రుక్కుచుఁ జనియెన్. 237

వ. ఇవ్విధంబున లుబ్ధకుండు విఫలమనోరథుండై కడు దూరంబు పోవుట నిరీక్షించి లఘుపతనుండు తోడిమువ్వురం గూర్చుకొని నిజనివాసంబునకుం జనుదెంచి పూర్వప్రకారంబున నన్యోన్యమిత్రభావంబునఁ జిరతరసౌఖ్యంబులం బ్రవర్తిల్లిరనిన. 238

ఉ. గండధనంజయాంక బలగర్విత వైరిమదాంధకారమా
ర్తాండ కుమారమన్మథ బుధప్రకరామరభూజ వైభవా
ఖండల విద్విషత్కమలగంధగజేంద్ర విరోధివాహినీ
మండలదావపావక నమజ్జనరక్షణ దుష్టశిక్షణా. 239

వనమ. మన్నెకులభార్గవ కుమారమకరాంకా
సన్నుత మహోగ్రపటుసంగరజయాంకా
కిన్నరనరప్రకరగీతసితకీర్తి
పన్నగవరాభరణభక్తియుతమూర్తీ. 240

తోదక. దానధనాధిప ధర్మపరాత్మా
మానసుయోధన మంత్రివిచారా
భానుతకీర్తి విభూషితదేహా
భానుసమానవిభాసితదేహా. 241

గద్య. ఇది శ్రీమైత్రావరుణగోత్రపవిత్ర బ్రహ్మనామాత్యపుత్ర సుకవిజనవిధేయ నారాయణనామధేయప్రణీతం బైనపంచతంత్రం బను మహాకావ్యంబునందు సుహృల్లాభం బనునది ద్వితీయాశ్వాసము.

శ్రీరస్తు

# పంచతంత్రము

## సంధివిగ్రహము

శ్రీపతిదృఢపదయుగళ
స్థాపితహృత్కమల సకలజననిధిమధ్య
ద్వీపయుతరత్నగర్భా
స్థాపితదక్షిణభుజాగ్ర బసవాధీశా! 1

వ. ఏకాగ్రచిత్తుండవై తత్కథాసుధారసంబు వీనులం గ్రోల నవధరింపుము. సుదర్శనక్షితీశ్వరనందనులు విష్ణుశర్మకుం బ్రణమిల్లి యనఘా మీవలన మిత్రభేద సుహృల్లాభంబుల తెఱంగులు తేటపడ వింటి మటమీఁదఁ దృతీయం బగుసంధివిగ్రహం బెఱింగింపు మనిన నతం డిట్లనియె. 2

చ. అలఘువిరోధి కార్యమునకై కడుచుట్టఱికంబు చేసినన్
వలవదు నమ్మ నమ్మిన నవశ్యము నెగ్గొనరించు నిశ్చయం
బొలసి దివాంధకోటి గుహ నుండఁగ వాకిట నింగలంబుఁ గా
కులు దగిలించి యన్నిఁటిని గుత్సితభంగి వధించెఁ జూడుఁడీ.

వ. అనినఁ దత్కథాక్రమం బెట్టి దని నృపకుమారు లడిగిన విష్ణుశర్మ యిట్లనియె. 4

ఉ. మెండగుశాఖలన్ ధరయు మిన్నును దిక్కులు నాక్రమించి మా,
ర్తండమరీచిజాలములఁ దార్కొననీయనియాకుఁజొంప

ముల్, నిండి మహాండజంబులకు నిల్కడఁగా నొకకానలోన
బ్రహ్మాండము ముట్టి యొక్కవట మద్భుతమై పెనుపొందు
నెంతయున్. 5

తే. అనుదినంబును దన చల్లఁదనముచేత
జలద మెబ్భంగి సకలజీవులను బ్రోచుఁ
దాను నాచందమున జంతుతతి భరించు
గారవము కిమ్ముగా నామహీరుహంబు. 6

ఉ. ఆమహనీయభూరుహమునం దనిశంబు ననేకబాంధవ
స్తోమము దన్నుఁ గౌతుకముతోఁ గొలువంగను మేఘవర్ణుఁడన్
నామము దాల్చి ప్రాభవమునం బెనుపొంది వసించు వాయస
స్వామి విపక్షపక్షికులసంహరణప్రవణాంతరంగుఁడై. 7

వ. ఇట్లు వాయసనివాసం బైనయవ్వటమహీరుహంబున కనతి
దూరంబున. 8

ఉ. వేఱొకవంకఁ గొండగుహ వేశ్మముఁ గాఁగ నులూకభర్త దన్
మీఱిన యట్టిమంత్రులగమిం గలవాఁ డుపమర్దనాముఁ డా
యీఱమునందు రేలు దమయిచ్ఛల మేసి దివంబు లాగుహన్
దూఱివసించుచుండి యొకదుష్టత యాత్మకు నింపు పెంపఁగన్.

వ. అతం డొక్కనాఁటినిశాసమయంబునఁ దనకుం గలమంత్రులం
బిలిచి వారలతో నిట్లనియె. 10

క. మహిఁ గాకులకును మనకును
సహజం బగువైర మగుటఁ జంపఁగఁ దగు నా
గ్రహ మధిక మెపుడు నాకుం
బ్రహరింతు నిశాంధవృత్తిఁ బరఁగెడువానిన్. 11

క. మీరును మీమీ సేనలఁ
దోరముగాఁ గూర్చుకొనుచుఁ దో డ్తెం డనినన్
వా రట్ల చేయ ఘూకము
లారాతిరి నడుచుచుండి యన్నియుఁ దమలోన్. 12

లయగ్రాహి:—
రండు వెస దండు వెడలుం డోకఁడు నుండకని
యొండొరులఁ జీరుచును మెండుకొని దిక్కుల్
నిండుకొని ఘూకము లఖండగతిఁ గూడుకొని
దండధరకింకరులతండములమాడ్కిన్
జండతరతీక్ష్ణఘనతుండహతిఁ గాకముల
పిండుపయి గిట్టి కడిఖండలుగ మోఁదన్
గొండికలు పెద్ద లనకుండ నవి యన్నియును
భండనపునేలఁ బడి యుండవలె నంచున్. 13

క. చెలఁగుచును దివాభీతం
బులు వడి నిబ్బంగి నడవఁ బోఁడఁగని విభుఁ డ
బ్బలముతో సీరీతిని
వలనుగఁ గదనమున నుండవలయుం జుండీ. 14

సీ. అనుచు నయ్యుపమర్దఁ డర్ధరాత్రపువేళఁ
గదలుచుఁ గలయులూకములఁ గూర్చు
కొని మంత్రులును దాను గొదగొని పఱతెంచి
యరికట్టుకొని మఱ్ఱితిరుగువాఱఁ
గావలి పదిలంబుగా నసంఖ్యల నిల్పి
తాను గొన్నింటితో లోను జొచ్చి
యధికనిద్రాసక్తి నంది మే నెఱుఁగక
కాకంబు లున్నట్టికందు వెఱఁగి

తే. యుఱికి కొన్నిఁటికంఠముల్ నఱికివైచి
యేచి కొన్నిఁటివక్షంబు లూచివైచి
కదిసి కొన్నిఁటిపార్శ్వముల్ చదిపివైచి
గ్రుచ్చి కొన్నిఁటికడుపులు వ్రచ్చివైచి. 15

వ. మఱియు ననేకప్రకారంబుల నయ్యులూకంబులు కాకంబులకు మహాప్రళయం బాపాదించి మున్నత్యంతకోలాహలబహుళం బైనవటగర్భంబు నిశ్శబ్దం బైయున్నం గనుంగొని పగర ననవశేషంబుగా సంహరించితి మని సంతసిల్లి తమయంతవట్టును గూడుకొని యులూకంబులు నిజనివాసంబునకుం జనియెఁ దదనంతరంబ. 16

తే. అట్టియుత్పాతకాలంబునందు మేఘ
వర్ణుఁ డొకతొఱ్ఱఁ దనమేను వైచి యుండఁ
దెల్లవాఱంగ నాత్మీయు లెల్లఁ బడుట
కాత్మఁ దలపోసి చింతించునవసరమున. 17

క. అతనికిఁ గులక్రమాగత
మతియుతు లగు మంత్రివరులు మాన్యులు గల ర
ద్భుతచరితు లేవు రప్పటి
గతికిం బ్రాణములతోడఁ గడచినవారల్. 18

వ. వార లెవ్వ రంటేని యుద్దీపియు సందీపియు నాదీపియుఁ బ్రోద్దీపియుఁ జిరంజీవియు ననువా రామంత్రివరులు కదిసిన నాలోకించి దీనాననుం డగుచు మేఘవర్ణుం డిట్లనియె. 19

ఆ. ఏను లేనిమీఁర లెందును గొఱగారు
మీఁరు లేనినేను మృతునియట్ల

కాన నేను మీరుఁ గలిగితి మీవేళ
భాగ్యమహిమఁ బగరబారిఁ బడక. 20

క. మీబుద్ధిబలము ప్రాపున
నాబాహుపరాక్రమమున నడచితిమి తుదిఁ
గూబలచే నిక్కెళ్లితిమి
ద్రాబలమై మీఁదికార్యతంత్రము చెప్పుఁడీ. 21

వ. అనిన మేఘవర్ణునకు సుద్దీపి యనునమాత్యుం డిట్లనియె. 22

సీ. బలవద్విరోధికిఁ దొలఁగి యవ్వలనొండు
బలవంతుతోఁ గూడి నిలుచు టొండె
స్థల ముజ్జగించి యసాధ్యమార్గంబున
నొండుచో నవ్వల నుండు టొండెఁ
గాక దూరంబుగా గడిభూములకుఁ బోయి
యుడుకారి యచ్చట నుండు టొండెఁ
గార్యంబు లని నాకుఁ గానవచ్చినభంగిఁ
జెప్పితి నింక నీచిత్త మనిన

తే. నతనిపలుకులు విన్నవాఁడై యతండు
వరుస సందీపి యనియెడివానిఁ జూచి
నీతలం పెట్టి దన్నను నెమ్మి నతఁడు
వినయశీలుఁడై మేఘవర్ణునకు ననియె. 23

తే. తొలుత నుద్దీపి దేవరతోడ నిపుడు
సరవిఁ జెప్పినమూఁడుపక్షములు నమరు
నందు విడు ముత్తమంబును నదియు మిగుల
వేగపడిపోవుకార్యంబు వెరవు గాదు. 24

క. తనయున్నచోట నుండఁగ
ననుకూలతఁ గార్యసిద్ధు లగుఁ దగినక్రియన్
విను మేఁకపాడుగుచన్నుల
జనితం బగుపాలు గళముచన్నులఁ గలవే. 25

చ. నెలవున నప్రమత్తమతి నిల్చినరాజు జయంబు చేకొనున్
వల దనుమాన మేమియును శ్వానము పెంచినయింట నుండ న
స్వలనికి నెందతే నదుగ వారల నంచటి మాటమాత్రలో
గెలుచు నసాధ్య మెద్ది పరికింపఁగ స్థానబలంబు పెంపునన్. 26

ఆ. కాన నెలవు విడువఁగా రాదు విడువక
పోక యున్న రాకపోక లైన
దేశకాలబలము దెలియుచుండినఁ గార్య
సిద్ధి నిజము వేయు చెప్ప నేల. 27

వ. అనుటయు. 28

క. విని యాదీపిం గనుఁగొని
యనుకూలం బైనకార్య మడుగుటయును నా
మనమునఁ దోఁచినయర్థము
వినిపించెద ననుచు నాత్మవిభునకు ననియెన్. 29

చ. అతిబలవంతుఁ డైన వినయంబున వారలతోడిమైత్రి సం
తతమును నిశ్చలం బగుమనంబునఁ జేసి నిజప్రదేశసం
గతుఁడయి పొల్చుటొప్పు నదిగాదని యొండొకదేశ మేఁగినన్
ధృతి మెయిఁ బోరినన్వినుము ధీయుతనొచ్చునతండు నేరమిన్.

క. అటు గాన నధికబలములఁ
దటుకున మన మిచటఁ గూర్చి తగుసంధియ సం
ఘటితముగఁ జేసికొని యీ
పటుదుర్గమునందు నిలువవలయుం జూడన్. 31

వ. అని చెప్పుటయును. 32

క. అమ్మాటలు వెడయూఁకొని
క్రమ్మఱఁ బ్రోద్దీపివంకఁ గనుఁగొని తగ నీ
నెమ్మనమునఁ గలకార్యము
సమ్మతితోఁ జెప్పుమా నిజంబుగ ననినన్. 33

వ. అతం డవ్వాయసపతి కిట్లనియె. 34

ఆ. రాత్రిగాని కానరా దులూకములకుఁ
బగలుగాని కానఁబడదు మనకు
రాయబారి సంధిచేయుటకై పోవఁ
గాల మెద్ది పొందు గాదు దలఁప. 35

క. అదిగాన రాత్రిఁ గానక
కదలక నిద్రించుమనలఁ గ్రౌర్యం బెసఁగన్
జదియంగ మోఁది పఱచిరి
వదలక యయ్యనువు దెలియవలదా మనమున్. 36

ఆ. పగలు గానకున్న పగతుర నరికట్టి
తెగ వధింప కేల పగ యడంగు
నాకుఁ జూడ ననియె నల్వురు నీభంగిఁ
బలుక నాలకించి పక్షివిభుఁడు. 37

వ. సకలనయశాస్త్రతత్త్వజ్ఞుం డైనచిరంజీవి యనునమాత్యుం
గనుంగొని యతనికిం బ్రియపూర్వకంబుగా నిట్లనియె. 38

క. ఓతండ్రి నీదుబుద్ధి
ద్యోతంబున రాజ్య మేను దుది ముట్టంగాఁ
బ్రీతిన్ జేసితి బంధు
వ్రాతముతోఁ గూడ నధికరాజసవృత్తిన్.

వ. కావున. 40

క. ఇప్పటికిఁ జేయఁ దగియెడు
నప్పనికిం దెరువు వెట్ట నర్హుఁడ వనినన్
జెప్పఁదొడంగె నిజేశ్వరుఁ
గప్పినశోకతమ ముడుప ఖద్యోతనుఁడై. 41

క. వీరిందఱుఁ బరమాప్తులు
నేరుపు గలకార్యమతులు నీ కెఱిఁగింపన్
వీరలకంటెను నెఱిఁగెడు
వా రెవ్వరు నీతిశాస్త్ర వాసన నెందున్. 42

క. ఐనను నాయెఱిఁగినపని
యే నించుక విన్నవింతు నిందఱు నాప్తుల్
గా నమ్మి మెలఁగ నేనియు
మానవపతి కెందు గుప్త మంత్రము వలయున్. 43

తే. మంత్ర మాప్తపరంపర మ్రుందిపోవు
నఖిలకార్యంబులకు విఘ్న మావహిల్లు
విఘ్నమునఁ జేసి కార్యంబు వృద్ధిఁబొంద
దట్లుగావున మంత్రంబు నరయవలయు. 44

వ. కావున మంత్రరక్షయ భూవల్లభులకుఁ బ్రధానకార్యం బని కార్యాకార్యజ్ఞుండైన చిరంజీవి యిట్లనియె సంధివిగ్రహయానాసనద్వైధీభావసమాశ్రయంబు లనుషాడ్గుణ్యంబులు నెఱింగి కర్మప్రారంభ పురుషద్రవ్యసంపత్తి దేశకాలవిభాగ వినిపాతప్రతీకారకార్యసిద్ధులను పంచాంగమంత్రంబులం బ్రవీణుండై సామదానభేదదండంబు లనుచతురుపాయప్రయోగ సమయంబులు నెఱిఁగి ప్రభుమంత్రోత్సాహ శక్తిత్రయ

సంపన్నుండై తత్తదుచితానుష్ఠానంబులం బ్రవర్తింపవలయుఁ గావున మనకులంబు గూడకుండుటంజేసి యుద్ధంబునకు సామర్థ్యంబు లేదు కాలంబునుంగాదు తనశక్తియుఁ బరశక్తియు దేశకాలంబులును విచారించి ఒకప్రకారం బదను గాచియుండునది పంచాస్యంబునుంబోలె నాసన్నం బైన కార్యంబు నప్పు డహితు నాహుతి గొనునది యని చెప్పి మఱియుం జిరంజీవి యిట్లనియె. 45

క. తనబలము నెదిరిబలమును
మనమునఁ జింతింప కరుల మర్దించుటకై
గొనకొనినవాని కొప్పమి
జనియించుట తప్ప దంష్ట్ర శక్రుని కైనన్. 46

వ. మఱియును. 47

చ. అతులితసత్త్వప్రతాపమహిమాస్పదుఁ డైన విరోధి దూరసం
స్థితుఁ డగునేనిఁ దద్విపులతేజము తా నడఁగించు నల్పుఁ డా
యతశితశస్త్రహస్తుఁ డయి యాదలదగ్గఱ నుండె నేనియుం
జతురుఁడు గాఁడు వైరిజనసంహరణంబునకుం నిజంబుగన్.

చ. ఒనరఁగ బుద్ధిమంతుఁ డయి యోరుపు గల్గి యొకప్డు వేళ వ
చ్చినయెడఁ బౌరుషంబుఁ దగఁ జేయఁగ నేర్చి పరాత్మదోష
ముల్,గనుఁగొని యుండి శాత్రవు నొకానొకనాఁడును విశ్వ
సింపఁగాఁ, జనదు వివేకియై నరుఁడు సారమతిం బ్రదుకం
దలంచినన్. 49

చ. వదల కుపాయవంతుఁ డగువానికి నెన్నఁడు రాగశక్తిమైఁ
బదనికి రానిబాలఁ దలపట్టుక యీడిచి తెచ్చినట్లుగాఁ
గొదుగక చొచ్చి శ్రీసతి మహోన్నతిమైఁ దను దాన వచ్చి త
త్పదనమునందు నిల్పుఁ బ్రమదస్థితిఁ బాయక యెల్లకాలమున్.

క. వరమంత్రశక్తివశమై
గురురాజ్యశ్రీభుజంగకుటిలవిహార
స్ఫురణంబు దొఱఁగి సతతము
నరపతులకు భోగదర్శనం బొనరించున్. 51

క. ఖలులకు మందులకును గ్రో
ధులకును లోభులకు గర్వితులకును నతిమ
త్తులకును గామాతురులకు
సులభం బె దండనీతి శోధింపంగన్. 52

ఉ. నాయము దప్ప కెంతయు మనంబున గర్వము లేక కార్య
ముల్, సేయ నెడఁ విచారమతిఁ జేయుచు నేర్పును నొప్పు
సద్విధో,పాయము బుద్ధియుం గల నృపాలవరేణ్యులచేత
సాధ్యమై, పాయక దండనీతి సులభస్ఫురణఁ ధరియింపఁ
బొందగున్. 53

వ. అని చెప్పి చిరంజీవియు నిట్లనియె మనకు నిర్యోడం గయ్యం
బునకుఁ గాలంబు గా దెట్లనిన. 54

క. బలసంపద లేకుండిన
వలయు ధనము మంత్రవిధియు వసుధాపతికిన్
బలుపగర నొర్చు ధనమున
విలసితమంత్రంబుచేత విశ్వము గెలుచున్. 55

క. విను ప్రాణము వంచించిన
జనులకుఁ బొందంగరాని సంపద యర్థిం
దనుదాన వచ్చి యుండును
వినుత ఘనోద్యోగపరుని వేశమునందున్. 56

తే. మంచిగుణములు గలిగినమనుజునందు
ఫలము గలుగుట కనుమానపడఁగ వలదు
వర్తనంబున ననువైనవాని కధిక
సమధికైశ్వర్యసంప్రాప్తి సంభవించు. 57

క. శూరులు నుదారశుద్ధులు
సారమతులు నైనబుధులసాహాయ్యమునన్
భూరమణుం డున్నతుఁ డగు
నారయ నృపుఁ డగుట సత్సహాయతఁ గాదే. 58

చ. వల నగు రాజ్యలక్ష్మి వరవంశపరంపర వచ్చినట్టు ని
ర్మలగుణు నైన రూపజితమన్మథు నైన మనీషి నైనఁ గా
వలె నని తా వరింప దలివాంఛ వరించు రహస్యవంతుఁడై
యలవడి సత్సహాయయుతుఁ డైననృపోత్తము నెల్లభంగులన్.

ఆ. ధరణి సత్సహాయవిరహితునకుఁ గార్య
మొక్కఁడైనఁ జేయ నోరవు గాదు
పక్షహీనమైన పక్షికి నాకాశ
గమన మనువుపడనికరణి నధిప. 60

ఉ. ఏలిక యాత్మబుద్ధిఁ దన కించుక దోఁపనికార్య మాప్తుఁడై
చాల వివేకి యైనఘనుసన్నిధి నూహ యొనర్ప నేర్చినం
బోలఁగ నెల్లభంగులను బొం దగుచుండు విఘాతదూరతన్
మాలిమిచేత నోడ జతనంబుగఁ దీరముచేరుచందమై. 61

చ. సతతమునాయమున్ వ్యయము సన్మతితోడ నెఱింగి గుప్తమం
త్రతయును గూఢచారపరిరక్షయుఁ జేసినరాజు ప్రాణిసం
హాతి కహితంబు పల్కక దయాపరుఁ డైనఁ జతుస్సముద్రము
ద్రితనిఖిలోర్వి యంతయు నతిస్థిరతన్ భజియించువాఁడగున్.

క. చెడు నాత్మశక్తి యెఱుఁగక
కడు గర్వముతోడఁ గడిఁది కార్యము చేయన్
దొడరి యవిచారమూఢుం
డడవిన్ గూపమునఁ బడినయంధుఁడువోలెన్. 63

వ. కావునఁ గయ్యం బియ్యెడం గార్యంబుగా దులూకంబులకును మనకును సహజవైరంబుకతంబున సంధియుం బొసంగనేర దనిన విని మేఘవర్ణుం డిట్లనియె. 64

క. మన కయ్యులూకములతో
ననఘా సహజంబు వైర మగు టేకతనన్
జనియించె ననిన నతఁ డి
ట్లను వాగ్దోషమున వైర మయ్యెను వినుమా. 65

తే. తొల్లి యొకగార్దభము పులితోలుతోడఁ
గప్పఁబడుటను వేసవికాల మెల్లఁ
బైరు గడుపార మేయుచు బ్రతికియుండి
యంత వాగ్దోషమున హతమయ్యెఁగాదె. 66

వ. అనిన నవ్విధం బెట్లని మేఘవర్ణుం డడిగినఁ జిరంజీవి యిట్లనియె.

సీ. ఒకయూర నొకచాకి యొక్కగాడిదఁ దెచ్చి
దాని లావుగ మేపఁ దలఁపు పుట్టి
పులితోలు పైఁ గప్పి పొసఁగఁ బండినచేలు
మేయ రాత్రులు దోల మేసి తిరుగఁ
బులి యనుబుద్ధి నాపొలముకావలివారు
దూరంబునను జూచి తొలఁగి పఱవఁ
బైరెల్ల వృథ యైనఁ బరికించి యొకనాఁడు
విసివి యొక్కరుఁడు సాహసముతోడఁ

తే. గడఁగి దూరంబునందునఁ గంబళంబుఁ
గప్పుకొని వింట శర మిడి కాచి యుండ
నాఖరము వచ్చి యాతని నచటఁ గాంచి
పెంటిగాడిద యని చాలఁ బృథురవమున. 68

వ. చేరం జూచి దానికయి పొంచినయతండు. 69

క. పులి యని పాఱితి నక్కట
బలుగాడిద యెలుఁగుకతన బైలయ్యె నికన్
దోలఁగ భయం బేలని యొక
యలఘుప్రసరమున దాని యసువులఁ బాపెన్. 70

వ. కావునఁ గాకులకు నులూకంబులకు వాగ్దోషంబునం జేసి ప్రబల
విరోధంబు సంభవించె నవ్విధంబు వినుమని యిట్లనియె. 71

క. ఈక్షితిలోనం గలిగిన
పక్షులు దమలోనఁ గూడి ప్రభువై మనలన్
రక్షింపఁగవలె నని నిజ
పక్షమున నులూకవిభునిఁ బట్టముగట్టన్. 72

వ. ఉద్యోగించుసమయంబునం దొకవృద్ధకాకం బాపక్షిసమూ
హంబుకడకుం జనుదెంచిన నవి తమయుద్యోగించినకార్యం
బాకాకంబున కెఱింగించిన నది యిట్లనియె. 73

ఉ. క్రూరము ఘోరదృష్టియు విరూపము నీచము నైజకోపదు
ర్వారము నై దివాంధ మన వర్తిలుఘూకముఁ బక్షిరాజుఁగా
మీరలు సేయ నేమిటికి మీఁదట దీని నెపంబునన్ ముదం
బారఁగ రాజ్యరక్ష మన కబ్బదు సుం డెడరైనవేళలన్. 74

ఆ. రాజు లేక యున్న రాజున్న యట్లకా
రాజునెపము చెప్పి బ్రతుకవచ్చుఁ

జంద్రు నెపము వెట్టి శశకంబు లొకచోట
నెడరు వాసి సుఖముఁ బడసెఁ గాదె. 75

వ. అనిన విని పక్షు లావృత్తాంతం బంతయు నెఱింగింపు మని యడిగిన నావృద్ధకాకం బిట్లనియె. 76

సీ. ఏకొండ చూచిన నెరగలి వడిఁ బర్వి
పొగ లేని యనలంబు లెగయుచుండ
నేచెట్టు చూచిన నెలమిఁ బచ్చనియాకు
వెదుక మందున కైనఁ జిదుమ లేక
యేనది చూచిన నెల్లెడ జల మింక
విసరెడిగాలితో నిసుము చల్ల
నేదిక్కు చూచిన నెండమావులపజ్జ
మృగములు జల మంచుఁ దగిలి పఱవ

తే. సలిలతత్వంబు వనరుహాసనుఁడు మాన్పఁ
బోలునో కాక యింతలోఁ బొడవడంగ
ననఁగ సకలజంతుభయావహంబు గాఁగ
దూషితముగ ననావృష్టిదోష మయ్యె. 77

వ. ఇవ్విధంబునం బండ్రెండుసంవత్సరంబు లనావృష్టి దోష మైన నొక్కయెడ మహాగహనంబునం గల గజంబు లన్నియుం గూడుకొని తమకు నేలిక యైన గజయూథనాథునిం గనుం గొని యిట్లనియె పల్వలోదకంబు లల్పమృగంబులకు నోడలు దడుపంజాలుఁ గాక ఖరకరకిరణంబులం దపియించుమాకుం దగినయుదకంబులు లేవని మఱియు నిట్లనియె. 78

తే. వెన్ను మునుఁగంగ నుదకంబువిరివి గలుగు
వారిజాకర మెందైన మాకు వలయు

నల్పజలముల మాదాహ మడఁగనేర
దేమి సేయుదు మనిన గజేంద్రుఁ డనియె. 79

క. దిక్కులకుఁ గొంద అరుగుం
డక్కడ జల మరసి యిచటి కరుదేరంగా
జొక్క మగుచోటి కరుగుద
మిక్కడున కేల వెఱవ నేఁ గలుగంగన్. 80

వ. అని యగ్గజేంద్రుఁ డగ్గజంబులలోన నధికజవసత్త్వంబులు గల యేనుంగులఁ గొన్నిఁటిని దిక్కులకు నీ రారయం బంచిన నవి యును బోయి జలం బెందునుం గానక తిరుగ నొక్కమహా నాగం బాగజేంద్రునిఁ గదియం జని యిట్లనియె. 81

ఉ. ఇన్ని దినంబు లయ్యెను గజేశ్వర చంద్రసరోవరంబు నా
నెన్నిక కెక్కినట్టికొల నేర్పడి యున్నది గాన మైతి మీ
యున్న వనంబుపొంతఁ గమలోత్పల కైరవహల్లకాదిసం
చన్నవపుష్పసౌరభవిశంకటశీతపయఃప్రపూర్ణమై. 82

చ. కురువకతింత్రిణీలికుచకోమలతాలతమాలసాలకే
సరకదళీలవంగపనసక్రముకార్జుననారికేళని
ర్జరకనకామ్రవంశముఖచారుమహీరుహపంక్తిచేత సు
స్థిరతర మైనయక్కొలనితీరము సొంపు వహించు నెంతయున్.

తే. జమ్ము ముమ్మర మశ్వత్థసమితి యమిత
మబ్జములు కేతకంబులు నపరిమితము
లధిప మన కుండ మంచిచో టబ్బె నేఁడు
వేగ విచ్చేయు మన మదద్విరదవిభుఁడు. 84

వ. నితాంతసంతుష్టాంతరంగుం డగుచు నచ్చోటికిఁ గదలిపోవ నుత్సహించుచుండునంతట నీ రారయం బోయినగజంబులు

చనుదెంచి నిలిచి చంద్రసరోవరంబుం గాంచి వచ్చితి మని
విన్నవించిన శతసహస్రసంఖ్యలు గలగజంబులఁ గూడుకొని
సంరంభవిజృంభితుండై కదలునట్టిగమనవేగంబున. 85

సీ. పాదఘట్టన నేల భార మగ్గల మైన
 మ్రగ్గి దిగ్గజములు మ్రొగ్గి పడఁగ
నురువడిఁ బాఱుచో నెరసినతరు లెల్లఁ
 దిట్టలై మహిఁ జాఁపకట్టు పడఁగ
ఘీంకారరవము సంకీర్ణమై పర్వఁగ
 దండకొండలు ప్రతిధ్వనుల నీనఁ
గర్ణజానిలమున గగనభాగమునకుఁ
 దేలి మేఘంబులు దూలి పోవ

తే. దేవసైన్యంబులకు నోడి దితిజకులము
నిలువఁ జో టెచ్చటను లేక జలధి చొరఁగఁ
బాఱుతెంచినచందమై భద్రకరులు
త్వరితగమనంబునను సరోవరము చేరె. 86

తే. అట్టిసంరంభగమనంబునందు నందుఁ
గల శశంబులు తత్పాదఘట్టనమున
మ్రంది మృతిఁబొందుటయుఁ జింతనొంది శశక
నాయకుండు శిలీముఖనాముఁడొకఁడు. 87

వ. తా నరణ్యంబునం గలశశకంబుల కెల్లను రాజుగావునఁ దన
బంధువ్రాతంబు మృతిఁబొందుటకుఁ బరితప్తాంతఃకరణుం
డగుచుఁ జింతించుసమయంబుననతని యమాత్యులుకొందఱు
దైవయోగంబున శేషించినవార లచ్చటికిం జనుదెంచి యభి
వందనంబు లాచరించినం గన్నీ రొలుక వారలం గనుంగొని
శిలీముఖుం డిట్లనియె. 88

గజప్రజనింప నేల యనివారణవారణపంక్తు లింతగాఁ
బఱవఁగ నేల యిట్లు గలబాంధవు లందఱు గాలిధూళిగా
నుఱక విధాత యేమిటికి నుండఁగఁ జేసెను నాదుజీవనం
బెఱుఁగఁగ నేర నైతి మతిహీనుల కెక్కడివే శుభంబులున్.

వ. అని యిట్లు చింతాక్రాంతుండై యున్న తనయేలికం జూచి బహువృత్తాంతవిదుం డగు విజయుం డనునమాత్యుం డిట్లనియె. 90

ఉ. చచ్చినవారికిన్ వగవఁ జయ్యన వాగలు లేచి క్రమ్మఱన్
వచ్చుట లేమి దెల్ల మిఁక వారణముల్ మగుడంగ నింతగా
వచ్చిన నున్నవారము నవశ్యముఁ జత్తుము గాన దీనికిన్
జెచ్చెరఁ జింత సేయుము విశేషమతిం బ్రతుకం దలంచినన్.

వ. అనినం దెలివొందినచిత్తంబుతోడ సుముఖుం డగుచు శిలీముఖుండు దనయమాత్యుం డగువిజయున కిట్లనియె. 92

క. గిరిగహ్వరముల కొండెను
ధరణీవివరముల కొండెఁ దడయక చని య
య్యిరవుల నొరుగుద మనినన్
వెర వగు నది మనకు ననుచు విజయుం డనియెన్. 93

తే. ఏమఱుటఁ జేసి యిటువంటియొదరు పుట్టె
మోసపోయితి మెఱఁగిన మోస గలదె
నెలవు విడువక నిలువంగవలయుఁ గాక
పందతనమునఁ బాఱు టేపౌరుషంబు. 94

వ. అనిన శిలీముఖుం డిట్లనియె. 95

ఆ. నిన్నుఁ గడచినట్టి నిజమైన హితుఁడును
నీతియుతుఁడుఁ గలఁడె నిర్మలాత్మ

జయము నాకుఁ గలుగుసమధికోపాయంబు
తలఁపు నీవు నాకుఁ గలఫలంబు. 96

వ. అనుమాటకు విజయుం డిట్లనియె. 97

క. దేవ నను భారపెట్టితి
గావున నాసామజములకడకుం జని యా
త్రోవ మనమీఁద రాకయె
పోవునుపాయంబు చేసి పుచ్చెదఁ గడఁకన్. 98

వ. అని యతం డాప్రొద్దకదలి పోయి చంద్రసరోవరతీరంబున
నున్నయగ్గజయూథంబులం బొడగని దనమనంబున. 99

సీ. చేరినఁ జేసాచి చెనకెడుగతి దంతి
నిజకరంబునఁ బట్టి నేలఁ గలుపు
నొక్కింతమూర్కొన్న యోజనమై నురగంబు
గదియఁబోయినమాత్రఁ గఱచిచంపు
మేలమాడెడువాఁడుపోలె వినోదంబు
వెలయ నవ్వుచు మహీవిభుఁడు చెఱుచు
నత్యంతవినయసాంగత్యంబు మెఱయంగఁ
గూడి దుర్మార్గుండు గీడు సేయుఁ

ఆ. గాన నాకు వీనిఁ గదియంగ నేలంచుఁ
జెంత నున్నశైలశిఖర మెక్కి
నిక్కి యోగజేంద్ర నీకు సేమమె యన్నఁ
దొండ మెత్తి చూచెఁ గొండమీఁదు. 100

వ. చూచి సూక్ష్మరూపంబున నున్నయాచెవులపోతుం గనుంగొని
గజేంద్రుం డోరి నీ వెవ్వండ వెచ్చటనుండి యిచ్చటికిం జను
దెంచితి వనిన నతఁడు నాపేరు విజయుం డని యిట్లనియె. 101

తే. ఓషధులఁ బ్రోచి జీవుల నుద్ధరించు
కైరవాప్తునిదూత నిక్కడకు నన్ను
నతఁడు పుత్తేర వచ్చితి ననిన గజము
కార్య మే మిచ్చటను మమ్ముఁ గనుట కనిన. 102

వ. అగ్గజశ్రేష్ఠునకు విజయుం డిట్లనియె. 103

చ. పెఱికినయాయుధంబు గొని భీతిలఁగాఁ బొడువంగఁ జూచినన్
వెఱవక దూత స్వామిహితనిశ్చితకార్యము పల్కుఁ దొప్పు న
త్తెఱఁగున వాఁడు రాజునకుఁ దెల్లమి పుత్రసమానుఁ డట్లగా
నెఱుఁగుము నన్నుఁ జంద్రునకు నిష్టతనూభవుఁగా మనంబునన్.

వ. కావున నేను నిజంబు పల్కెద నాకర్ణింపుము. 105

క. ఎదిరి తనసత్త్వ మెఱుఁగక
మదమున వైరమ్ము గొన్నమతిహీనునకుం
దుదిఁ గీడు పొంద కుండునె
వదలక యివ్విధముఁ దెలియవలయున్ మీకున్. 106

క. ఈకొలను చంద్రుపేరన్
బ్రాకటముగ మున్ను కలిగె బహుపక్షికుల
వ్యాకీర్ణతటసమీపా
నోకహసురసిద్ధసాధ్యనుతిపాత్రంబై. 107

క. ఇందులకుం గావలిగాఁ
బొందుగ మమ్మునిచినాఁడు బుధజనకుఁడు మ
మ్మిందఱను మట్టి చంపితి
రిందునితో వైరపడఁగ నెంతటివారల్. 108

క. శశికిన్ వంశ్యుల మగుటను
శశకము లనఁ బరఁగి ధాత్రిఁ జరియింతుము క

ర్క్షశహృదయులార మీకును
వశ మగునే నిలువ ననిన వారణ మనియెన్. 109

క. ఈతెఱఁ గెఱుఁగక వచ్చితి
మీ తెరువున నడవ మింక నేఁగెద మిదె మీ
రీత ప్పోర్వఁగఁ దగు నన
మాతంగమ్మునకు శశము మఱియుం బలికెన్. 110

క. ఈయపరాధంబున కీ
రేయి కళానిధికి మ్రొక్కి ప్రియమున ననుపఁ
బోయెదవుగాక యనుటయు
నాయేనుఁగు నీయకొనియె నౌఁగా కనుచున్. 111

ఉ. అంతటఁ బ్రొద్దు గ్రుంకుటయు నాశశకంబు గజేంద్రు రోహిణీ
కాంతునికొల్వు చూచుటకుఁగాఁ దోడితెచ్చితిఁ జూడుమంచు
ని,శ్చింతతఁ జేరి దంతికి శశిప్రతిబింబముఁ జూప మ్రొక్కుచో
రంతులు చిత్తగింపు మపరాధము సైఁపుమటంచు వేఁడుచున్.

క. ఆచెవులపోతు కరిపతిఁ
జూచి శశాంకుండు కరుణసొంపున నిన్నుం
గాని విడిచి యనిపెను సం
కోచింపక వేగ పొమ్ము కోరినయెడకున్. 113

క. వచ్చిన తెరువునఁ బోయిన
వచ్చుఁ జుమీ చేటు కాన వచ్చినపని నే
మచ్చికఁ జెప్పితి ననుటయు
నెచ్చరికఁ గరివిభుండు నెఱుఁగుదు ననుచున్. 114

క. గజయూథంబులు గొలువఁగ
గజనాథుఁడు గదలె తీవ్రగమనంబున న

వ్యాజయముఁ గైకొని చెలఁగుచు
విజయుం డనుశశక మేఁగె విభుఁ డున్నెడకున్. 115

వ. చనుదెంచి తత్పాదంబులకుం బ్రణామం బాచరించి దేవా గజయూథంబులు మనమీఁద రాక యుండునట్టియుపాయం బును సరోవరతీరంబున నిలువనేరక దూరం బరుగునట్టితెఱం గునుం జేసి వచ్చితి నెలవు దొలంగక సుఖస్థితినుండుం డనిన నవ్విజయుం గౌఁగిలించుకొని ప్రీతుండై బహువిధంబులఁ బ్రశంసింపుచు నచ్చోటుకదలక శిలీముఖుండు సుఖంబున నుండె. 116

క. కావున నీయల్వుఁడు ప్రజ
నేవెరవునఁ బ్రోచు టరిది హీనునిఁ బతిఁగా
సేవింప శశ కపింజల
భావంబునఁ జేటు గల్గుఁ బరమార్థ మిలన్. 117

వ. అనినఁ బక్షులు మాకు నక్కథ వినవలయుఁ జెప్పు మనిన వృద్ధకాకం బిట్లనియె. 118

చ. ఒకపెనుమ్రానికొమ్మతుద నొప్పుగుగూఁట వసింతు నేను దా
నికి నట క్రిందితొఱ్ఱఁ దగ నిల్చి కపింజల ముండు నున్నచో
నకుటిలమిత్రభావమున నర్మిలి నాహృదయంబు దానిపైఁ
బ్రకటముగాఁగ నిద్దఱము పాయక యుండుదు మెల్లకాల
మున్. 119

తే. అట్లు మెలఁగంగ నొక్కనాఁ డాఖగంబు
పొసఁగ మేఁతకునై పోయి మసలుటయును
గొందలంబున వెదకంగఁ గోరి పోవ
వెనుక నాపక్షి యుండెడునునికిపట్టు. 120

వ. దీర్ఘకర్ణుం డనుపేరం బరఁగుశశకంబు చొచ్చుకొనియున్న
సమయంబున నాపక్షియుం జనుదెంచి యిట్లనియె నే నుదర
పోషణార్థం బరిగి వచ్చునంతకు నాయిల్లుచొరఁ దగ వగునే
వెడలు మనిన దీర్ఘకర్ణుం డిట్లనియె. 121

తే. విడిచిపోయినయింటికిఁ బుడమి తేఁడు
లేనిధరణికి మగదిక్కు లేనిసతికిఁ
గడఁక నెవ్వనికిని నాస గాక మాన
దేను బలవంతుఁడను నీకు నేల విడుతు. 122

క. నాకిప్పు డుండ నస్వాం
బీకోటర మేల విడుతు నిలఁ జెఱువులుఁ బ
ద్మాకరములుఁ గూపంబులుఁ
గైకొన్నవి వారిసొమ్ముగా మను వనియెన్. 123

వ. మనుస్మృతిమార్గంబు గలదు గావున నే నిచ్చోటు విడువ
ననినఁ బక్షి యిట్లనియె. 124

క. మొగమోట లేక నాయి
ల్లగు నని గైకొనఁగ నీకు నస్వామె యిచటఁ
దగవునకు రమ్ము లేదా
జగడం బగు నీకు నాకు శత్రుత్వమునన్. 125

వ. అనుటయు దీర్ఘకర్ణుండు తగ వనినం గా దనవచ్చునే రమ్మని
వెడలిన నాపక్షియుం దోడన కదలునప్పు డీయాశ్చర్యంబు
నేనునుం జూచెదఁ గాకనుచు నింతనంతం జనుచుండ నవి
గొంతద వ్వరిగి యరిగి మనకుం దగవుచెప్పందగువా రెవ్వ
రనినఁ బక్షికి శశకం బిట్లనియె. 126

క. యమునానదీతటంబునఁ
దమసత్యవ్రతుఁడు గలఁడు దధికర్ణుఁ డనన్
గ్రమ మెఱిఁగినమార్జాలము
తెమలక మన మతని నడిగి తెలియుద మనినన్. 127

వ. కపింజలం బిట్లనియె. 128

క. పిల్లి కడుఁ గ్రూరహృదయం
బెల్లప్పుడు నమ్మఁ బోల దే నెఱుఁగుదు నీ
యుల్లమున కెట్లు గలిగెన్
జెల్లంబో నమ్మి కనినఁ జెప్పం దొడఁగెన్. 129

క. ఆచారవంతుఁ డుత్తముఁ
డీచేరువవార లెల్ల నెఱుఁగుదు రతనిన్
నాచేరువగా వెఱవక
వే చను దె మ్మనినఁ బక్షి విని యిట్లనియెన్. 130

ఆ. భయము నీకు నాకుఁ బరఁగంగ నేకంబు
నాకు వచ్చుకీడు నీకు రాదె
చెప్పఁ దగినబుద్ధి చెప్పితిఁ గాకంచు
నదియు నదియుఁ గదలి కదియఁ జనక. 131

వ. ఎడదవ్వుల నిలిచి దధికర్ణు నుద్దేశించి. 132

క. ఇరవునకునై వివాదం
బిరువురకుం గలిగి యిచటి కేతెంచితి మీ
వరుసను సమచిత్తుఁడవై
వెరవున మముఁ దీర్చి పంపు వేగం బనినన్. 133

వ. విని యల్లన తల యెత్తి చూచి దధికర్ణుం డిట్లనియె. 134

తే. మున్నువలెఁ గాదు మిక్కిలి ముసలి నైతిఁ
గదిసియుండినయది గాని కానరాదు

వాటముగ నంతదూరంపుమాట వినను
మిగుల నింద్రియవైకల్య మగుటఁజేసి. 135

క. నను విశ్వసించి చేరం
జనుదెం డని పలుక నవియుఁ జకితస్థితి నొ
య్యనఁ గదియ వెఱవ నేటికిఁ
బనివడి యిట వచ్చి ప్రకృతిబాంధవు లయ్యెన్. 136

క. ధర్మంబు చెఱుపఁ జెఱుచును
ధర్మము రక్షించువానిఁ దా రక్షించున్
ధర్మంబు చెడక యుండను
నిర్మలమతి నడపవలయు నిశ్చలనియతిన్. 137

క. ధర్మంబు పరమమిత్రుఁడు
ధర్మము వెనువెంట వచ్చుఁ దక్కినధనముల్
కర్మాయత్తశరీరము
నిర్మూలంబైనచోటనే వసియించున్. 138

ఆ. ఇట్టిమాట లెల్ల నివి నిజంబులు గాని
యధమవృత్తిఁ గల్లలాడ నేను
గల్లలాడునట్టి కష్టుఁ డెవ్వం డైన
మొనసి నరకకూపమున వసించు. 139

క. తలఁప నహింసకు మిగులం
గలిగినధర్మంబు లేదు గావున నే నీ
తెలివిని దగ జీవాత్మం
వలఁపుచు నున్నాఁడ నొండు దలఁపనిబుద్ధిన్. 140

క. పరభామఁ గన్న తల్లిఁగఁ
బరధనముం బెంకు గాఁగ భావించుచు స

త్పురుషుండు సర్వజీవుల
నిరతముఁ దనయాత్మఁ గాఁగ నెమ్మదిఁ జూచున్. 141

ఆ. సకలభూతసమితి సౌఖ్యదుఃఖంబులు
తనవిగాఁ దలంచు తత్త్వవిదుఁడు
జన్మమృత్యుభయవిచారంబు దిగఁ ద్రోచి
లలితగతిని మోక్షలక్ష్మిఁ జెందు. 142

వ. అట్లు గావున. 143

తే. ఎవ్వరికి హింస చేయక హితము చేసి
నాఁటినాఁటికిఁ జాంద్రాయణవ్రతంబు
సలుపుచున్నాఁడ నాతపోబలముకలిమి
నడుగుఁ డేమైనఁ జెప్పుదు నభిమతములు. 144

క. అని తమ్ము నమ్మఁ బలికిన
విని వెఱవక చేరఁ బోవ వేగమె రెంటిన్
మునుగాళ్ల నడఁచి వానిన్
దినియెన్ గ్రూరాత్ముసమ్మతింతురె యెందున్. 145

వ. కావున నీయల్పుండు రాజార్హుండు గాఁ డని యావృద్ధ కాకంబు పలికినం బక్షులువిని యిది నిజంబు పలికెం దప్ప దని యాయులూకంబును రాజ్యాభిషేకంబునకుం దొలంగించి పక్షు లయ్యైదిక్కులకుం జెదరిపోయినఁ దదనంతరంబ యయ్యులూకంబు వృద్ధకాకంబుకడకుం జనుదెంచి రోష సంరక్తలోచనంబులు మెఱయ నుద్ధతంబగుచు నిట్లనియె. 146

క. నీ కేమికీడు చేసితిఁ
గాకమ రాజార్హుఁ డితఁడు గాఁ డని నన్నున్
గైకొనక పలికి తల్పుఁడ
నై కానంబడినభావ మది యెయ్యదియో. 147

వ. అని మఱియు నిట్లనియె. 148

సీ. తోడరి వాఁడిశరంబు దూఱి పాఱినగంటి
మంత్రౌషధంబుల మాన నేర్చుఁ
బరశుఖండితమహాపాదపోన్నతశాఖ
జిగి మించఁ గ్రమ్మఱఁ జిగురు వెట్టు
దర్పితభయదోగ్రదావాగ్నిశిఖలచే
మాడినతృణ మెల్ల మగుడ మొలుచు
నిష్ఠురోక్తులచేత నెఱిఁ జెడ్డకార్యంబు
మగుడ నెన్నండును నిగుడ కుండుఁ

ఆ. గాన నాకుఁ బక్షిగణము లనుష్ఠించు
ప్రాభవంబు చెఱుపఁబడియెఁ గాన
నోరి మీకు మాకు వైరంబు వాటిల్లె
ననుచు గూబ చనియె నాగ్రహమున. 149

వ. అదియ కారణంబుగా నులూకంబునకుఁ గాకంబులకు సహజ వైరంబు వాటిల్లె నని చిరంజీవి చెప్పి మఱియు నిట్లనియె దేవా మున్ను చెప్పంబడిన షాడ్గుణ్యంబులలోన సంధివిగ్రహంబు లిప్పటికిఁ బ్రయోజనంబులుగావాసనయానద్వైధీభావసమాశ్రయంబులు విచారణీయంబు లనిన విని యతం డాసన క్రమం బెట్టి దనిన. 150

తే. విమతుఁ డధికుఁడై కడు సమీపమున నున్న
హీనబలునకుఁ దనయున్నచోనయునికి
కడుఁ బ్రమాదంబు గావునఁ గాదు మనకు
సబలునకునైన నొప్పునాసనగుణంబు. 151

క. యానంబు గదలి పోవుట
గాన బలము లేనిమనకుఁ గా దదియుం బెం

పూనినదై ద్వైధీభావము
ధీనిరతులు ధనసమృద్ధిఁ దీర్పఁగవలయున్. 152

తే. చిరసమాశ్రయవర్తన స్థిరతఁ జేసి
శత్రువరులను గెలుచుట సంశ్రయంబు
తద్గుణంబులు దెలిసి యుద్దండరిపుల
మూలమడఁచిన వారలు మున్ను గలరు. 153

క. ఒడలికి నలజడి యైనన్
గడఁగి సమాశ్రయము నేన కావించెద ని
ప్పుడు వైరు లధికు లైనన్
దడఁబఱచెద నాదుబుద్ధి తాలిమి పేర్మిన్. 154

క. బలవంతు లైనశత్రులఁ
బలువుర నేనియును బుద్ధిబలమున గెలువన్
వలనగు యాగార్థము ధూ
ర్తులచే విప్రుండు వంచితుం డగుభంగిన్. 155

వ. అనినఁ గాక ప్రభుం డత్తెఱం గెఱింగింపు మనినఁ బ్రధా
నాగ్రగణ్యుం డగుచిరంజీవి యిట్లనియె. 156

సీ. యజ్ఞార్థ మనురు ధరామరుఁ డొక్కఁడు
కొని యొక మేషంబుఁ గొంచు రాఁగఁ
దెరువున దుర్జనుల్ దృష్టించి తమలోన
మోసపుత్తము గాక ముని నటంచుఁ
గడు నిర్దయాత్ముండు గా కుర్వి విప్రుండు
వెఱవక హింస గావించు టెట్లు
గనుఁగొన్న మా కెల్లఁ గనికరం బయ్యెడు
దీనిఁ జంపఁగ సమ్మతించుట కిది

తే. యనఁగ నమ్మి చింబోతుఁ దా నచటఁ గట్టి
యాతఁ డాచమనార్థమై యరుగఁ దడవ
సరభసంబునఁ జింబోతుఁ జంపి తినిరి
బుద్ధిగలవారు గెలువనోపుదురు పరుల. 157

ఉ. కావున నేను శాత్రవనికాయము గెల్చెద సాహసంబుతో
నావచనంబు నమ్ముఁడు మనంబున నింతయుఁ జింతదక్కి నే
జీవముఁ బాసినట్టు గతిచేడ్పడి యుండెద రక్తపూరముల్
జేవురుచాయగా నొడలఁ జిప్పిలఁ జల్లుఁడు చల్లి యత్తఱిన్.

తే. మున్ను చచ్చినకాకులమూఁక నడుమ
నన్నుఁ బడవైచి తొలఁగి మిన్నక చనుండు
నే సమాశ్రయ మొనరించి మోసపుచ్చి
వత్తు ననుటయు నామేఘవర్ణుఁ డపుడు. 159

తే. ఆచిరంజీవిఁ జెప్పినయట్ల చేసి
తానుఁ దనవారు నవ్వల తరువుఁ బాసి
తొలఁగి తనమంత్రిపన్నినయలఘుకార్య
మాత్మఁ దలపోయుచుండె నయ్యవసరమున. 160

ఉ. పొంగినవేడ్కతో డమును పూర్వదిశాంగనఁగూడి యుంటి నా
కుం గల రాగ మెల్ల ననుకూలతఁ జూపెద నంచుఁ బశ్చిమా
శాంగనఁ జేరెనో యనఁగ నస్తగిరిన్ రవి చేరి క్రుంకినన్ [గన్.
నింగియు నేలయుం దమము నెక్కొన దిక్కులఁ గప్పె నొప్పు

వ. అయ్యంధకారంబునఁ జిరంజీవి తాను మున్నున్నవటమహీరు
హంబుక్రింద మృతకాకమధ్యంబునం బడి రక్తంబునం దొప్ప
దోఁగి యెఱకలు విచ్చి నేత్రంబులుమూసికొని మృతింబొందిన
చందంబున డెందంబుకొందలం బడపుకొని యున్న సమయం

బున నక్కడ నుపమర్దనుండు తనమంత్రులం గనుంగొని
యిట్లనియె. 162

తే. శత్రు నిశ్శేషముగఁ జేసి చంప కున్న
నొకఁడు దప్పిన మనకది యొప్ప కుండు
గాన వేగంబ యామ్మూకకడకుఁ బోయి
వెదకి చంపుట గార్య మీవేళ ననిన. 163

వ. అప్పలుకు లాకర్ణించి యతనిమంత్రు లేక వాక్యంబుగా నిట్లనిరి.

ఉ. దేవర నీతివాక్యము సుధీవిభవాఢ్యులు మెచ్చ నాడితోఁ
బోవుట మేలు నాఁ గదలి పోయి వటం బరికట్టి చుట్టునుం
గావలి వెట్టి చొచ్చి యొకకాకముఁ గానక కాకు లన్నియుఁ
జీవములం దొలంగె నని చెప్పఁగఁ గ్రమ్మఱి పోవున త్తఱిన్.

వ. అవ్విధం బంతయు నెఱింగి చిరంజీవి తనలో నిట్లని వితర్కించె.

ఆ. మొనసి చేయవలయు మొదల నుద్యోగంబు
చేసెనేని కార్యసిద్ధిఁ బొందఁ
జేయవలయుఁ గానఁ జేసెద నని చిరం
జీవి నిశ్చయించి చింత దక్కి. 167

వ. ఉన్నసమయంబున. 168

క. కాకంబు లెల్ల మడిసెం
గా కిచ్చట నొకటి యైనఁ గలిగెనె యనుచుం
గాకారు లరుగునంతట
నాకాకము కావు కావు రని యెలుఁగింపన్. 169

వ. ఇట్లు గూసినచిరంజీవికూఁత విని యులూకంబులు పోక మగిడి
వచ్చి యచ్చోటు వెదకి చిరంజీవిఁ బట్టుకొనిపోయి తమయేలిక
యగు నుపమర్దనుముందటం బెట్టినఁ గనుంగొని యతండు

నీ వెవ్వఁడ వనిన నతండు నా పేరు చిరంజీవి యనుటయు
నోరి నీవు మేఘవర్ణునకుఁ బ్రధానాగ్రగణ్యుండ వే తెఱంగున
నిట్టివాఁడ వైతి వనినఁ జిరంజీవి యతని కిట్లనియె. 170

సీ. అవధరింపుఁడు నన్ను నమ్మేఘవర్ణుండు
దప్పక కార్యంబు చెప్పు మనిన
నుపమర్ధభూపాలుఁ డుగ్రుండు సాహసి
యధికబలప్రతాపాన్వితుండు
సరగున మన మేఁగి శరణంబు చొచ్చిన
నతఁడు నీ కెంతయు హిత మొనర్చు
నని బుద్ధి చెప్పిన నతనిచిత్త మెఱింగి
యనుచరవర్గంబు లాగ్రహించి
తే. యోరి పగవారిపక్షమై నోరికొలఁది
నోడితివి దీనఁ జే టగుఁ గుడువు మనుచుఁ
జరణఘాతంబులను మేను చఱచి మట్టి
చంచుపుటములఁ గఱచి నొప్పించి చనిన. 171

క. దిగ విడువక ప్రాణంబులు
తగ నాకంఠమున నిలిచి తల్లడపఱిచెఁ గా
దెగ నడవుఁడు మీరైనను
సుగతికిఁ జనునట్టిభంగి చొప్పడ నన్నున్. 172

వ. అనుటయు నుపమర్దుండు రక్తాక్షుండు మొదలయిన తన
యమాత్యులం గనుంగొని వీని నేమి సేయుద మనిన నందు
రక్తాక్షుం డిట్లనియె. 173

ఉ. ఈతఁ డసాధ్యశత్రుఁ డని యించుకయు న్మతి లేక వీని దు
ర్నీతిఁ గృపాకటాక్షమున నిల్పఁగఁ జూచెదు గాని మీఁద న

త్యాతురతం బ్రమాదమని యాత్మ నెఱుంగవుపీనియున్న యీ
రీతి నిజంబు గాదు ప్రహారింపుఁడు పంపుఁడు కాలు ప్రోలికిన్.

ఆ. వీఁడె కాఁడు హీనవిమతుఁ డైనను నొచ్చి
చిక్కినపుడ వేగ చెఱుపవలయుఁ
గరుణఁ గాచెనేని కాలాంతరంబునఁ
బ్రతిఘటించి వాఁడె పగ యడంచు. 175

వ. అనుటయు నుపమర్దనుండు క్రూరాక్షుం డనుతనయమాత్యు
నడిగిన నతం డిట్లనియె. 176

క. శరణము చొచ్చినవానిన్
బరిమార్చినయతని కధికపాపం బనుచున్
బొరిఁ జెప్పు ధర్మశాస్త్రము
పరమకృపం గావు వీనిఁ బతికులేంద్రా. 177

వ. అనిన నతండు దీప్తాక్షుం డనునమాత్యుం గనుంగొని నీమదిం
దోఁచినకార్యంబు చెప్పుమనిన నంత డిట్లనియె. 178

చ. అనఘ యెఱుంగ నెందు శరణాగతుఁ జంపినచోటు చెప్పఁగా
వినవె కపోతమున్ శరణు వేఁడిన నాత్మశరీరమాంసమున్
గొను మని బోయ కిచ్చె శిబి క్రొత్తగ విన్నది చెప్ప నేల యొ
ప్పును మును వైశ్యచోరులకుఁ బుట్టినవాదము చిత్తగింపుమా.

వ. అనుటయుఁ దత్కథాక్రమం బెట్టి దనిన నుపమర్దన కతం
డిట్లనియె. 180

ఉ. మున్నొకపట్టణంబునఁ బ్రమోదమునన్ ధనగుప్తనామసం
పన్నుఁడు వైశ్యుఁ డుండు నొకభామిని వానికిఁ జంద్రరేఖ నా
నెన్నిక కెక్కి యొప్పుఁ గమలేక్షణ రూపవిలాసవిభ్రమో
త్పన్నవయోవిభాసి కులభామలయొప్పుఁ దృణీకరింపుచున్.

తే. మెలఁగునాసతి దనపతి మిగుల వృద్ధు
గాన నెన్నఁడు నొల్లక కదియనీక
యున్నయెడఁ జోరుఁడొకఁడు వారున్నయిల్లు
కన్నమిడి చొచ్చి ధనమున్నకందువరయ. 182

వ. ఆచోరుండు నలుదిక్కులం బరికించునప్పు డనర్ఘ్యమణికనక భూషణాలంకృతయై మృదుతల్పంబునం దనపురుషునొద్దఁ బరాఙ్ముఖియై నిద్రించునంగనాతిలకంబుం బొడగని నాకు నితని మందిరంబున ధనంబు వెదక నేల యివ్విభూషణంబులలోన నొక్కతొడవు నాకుఁ జేపడిన నంతియ చాలునని దీప్తజ్వాలాజాలంబులకుం దగిన తదీయాభరణకాంతు లినుమడింప నక్కంబుకంఠికంఠాభరణంబపహరింపం గరంబు చాఁచిన. 183

క. తొడగినతొడవులదీప్తులు
తొడిఁబడి చీఁకట్లు దూలఁ దూలఁగఁ దనపైఁ
దొడరినహస్తము సోఁకినఁ
బడఁతుక మేల్కాంచి చూచి భయకంపితయై. 184

వ. తనజీవితేశ్వరుం డున్నదిక్కున కభిముఖియై. 185

సీ. కరికుంభములకంటెఁ గడునైన చనుదోయి
యుగ్మలి బిగియార నొత్తి యొత్తి
బిసకాండములకంటెఁ బసమించుకరముల
నతివ యంతంతకు నలమి యలమి
పల్లవంబులకంటె బాగైన కెంగేల
లలితాంగి యల్లన తెలిపి తెలిపి
పికనాదమునకంటెఁ బెంపారు నెలుఁగున
బింబోష్ఠి పలుమాఱు పిలిచి పిలిచి

తే. తెలుపునంతట మేల్కాని తెలివి నొంది
తనకుఁ బ్రియకాంత చేసిన ధన్యతకును
మేను పులకాంకురంబుల నీనుచుండ
నొలసి సౌఖ్యాంబునిధిలోన నోలలాడి. 186

వ. ఆవైశ్యుండు కొండొకసేపున కాకుటిలకుంతల కిట్లనియె. 187

క. ఏకాలంబున వెనుకను
నీకౌఁగిలి నాకు నబ్బ నేరదు భాగ్యం
బోకాంత నేఁడు గలిగెను
మేకొనుటకు దీని కేనిమిత్తము చెపుమా. 188

వ. అనిన నయ్యింతి భయముకతనం బలుకక నిజకటాక్షవీక్షణం
బులం గరాభినయసంజ్ఞాభావంబులం దెలుపం దెలియక యీ
లేమ యిటు చేయుటకుఁ గతం బెయ్యది యని నలుదిక్కులం
గనుంగొనునప్పుడు తనవెనుకదిక్కున నొదిగియున్న చోరునిం
గనుంగొని యిట్లనియె. 189

ఉ. ఈరమణీలలామ నను నెప్పుడు వృద్ధుఁ డటంచు దగ్గఱం
జేరదు నేఁడు నిన్నుఁ గని చెందినభీతిని గౌఁగిలించుటన్
వారివిశేషసౌఖ్యముల నంది కృతార్థుఁడ నైతిఁ గావునన్
నారుచిరార్థసంపద గొనం దగు నిచ్చెదఁ బుచ్చుకోవనా. 190

వ. అనినఁ జోరుం డిట్లనియె. 191

చ. కలధన మెల్ల దేవుకొని గ్రక్కునఁ బోయెద నంచు వచ్చి నీ
యలఘుమృదూక్తుల న్వినము హర్షముఁ జేయుట నర్థ మెల్ల
న్నుఁగ్మలి విను నేఁటియ ట్లితనిఁ గౌఁగిటఁ జేర్చి రమింపకున్న
నన్, దలఁచినవేళ వచ్చి మొగ తప్పక గ్రింగుదు నంగిటం
బడన్. 192

వ. అనిన వైశ్యుం డతని కిట్లనియె. 193

క. ఉపకారంబునకును బ్ర
త్యుపకారము చేయ కుంట యుచితమె నీ వీ
యపరిమితార్థముఁ గొని చను
నెప మేమియుఁ బలుక కనుచు నిలయమునందున్. 194

వ. తనకుం గలిగినధనం బంతయు నతనిముందటం బెట్టి నీ వేమియుం బెనంగక కొనిపొ మ్మనిన నతం డేమియు నొల్లక న న్నిపక్షంబు తుదిముట్టం జూడు మనుచు నేమియు ముట్టక చనియెఁ జోరవ్యవహారంబు జీవనంబుగా నొడలెత్తిన యతండును నవైశ్యునికి నుపకారంబు చేసి పోయెం గావున నీవును నీవాయసంబువలనఁ గృప గలుగవలయు ననిన నుపమర్దనుండు వక్రనాసుం డనుమంత్రిం జూచి నీ తలంపునుం జెప్పు మనుటయు నతం డిట్లనియె. 195

క. తెగి చంపరాదు కాకముఁ
బగతురు దమలో విరోధపడిరేని శుభం
బగు మన కొకరాక్షసగో
యుగచోరులకథ వినంగ నొ ప్పగుఁ దెలియన్. 196

వ. అనినఁ దత్కథాక్రమం బెట్టి దని యుపమర్దుం డడిగిన నా వక్రనాసుం డిట్లనియె. 197

చ. ఘన మగునగ్రహారమునఁ గర్మవిదుం డొకబ్రాహ్మణుండు పావనచరితుండు గోవులఁ బ్రవర్ధన మొందఁగ రెంటి మేపఁగాఁ గనుఁగొనితాఁ బ్రమోదమునఁ గైకొనఁగాఁ దఱివేచియుండు ద్రుచ్చనిశము నొక్కనాఁ డొకమహానిశి నొక్కఁడు పోవుచుండఁగన్. 198

తే. మొగులు సన్నపుఁజినుకుతో ముసురుకొనుట
మీఁదఁజీఁకటి దట్టమై మెండుకొనుట
మనుజవిరహితమును నిశామధ్య మగుటఁ
బొదలుమనమున నాదొంగ పోయిపోయి. 199

సీ. ఎదురుగా నొక్కరుఁ డేఁగుదెంచిన వానిఁ
దరలక చోరుండు దాఁకి బెదరి
యెవ్వండ వనుటయు నే బ్రహ్మరాక్షసుఁ
డను నన్నుఁ దాఁకిన ఘనుఁడ వైన
నీ వెవ్వఁ డవునన నే మ్రుచ్చుఁ బొమ్మన
నింత ప్రొద్దెచ్చటి కేఁగె దనిన
నీపురిలోన మహీసురోత్తము ధేను
వులు రెండు మంచివి గలుగఁ జూచి

ఆ. యపహరించుకొఅకు నరిగెద నే నన్న
నేను నతనిఁ బట్టి నిపుడు వత్తు
రమ్మటంచుఁ గదలి బ్రహ్మరాక్షసుఁడును
నతఁడు నంతఁ గూడి యతనిగృహము. 200

వ. కవియం బోయి యమ్మహీదేవుగృహద్వారంబునొద్ద నిలిచి
చోరునిం జూచి బ్రహ్మరాక్షసుం డిట్లనియె. 201

ఆ. ఏను మున్ను పోయి యీయింటివిప్రునిఁ
బట్టి భుక్తి నాకుఁ బెట్టఁ జూచి
పిదప నీవుఁ గదిసి మొదవులఁ దోలుకొ
మ్మనిన నతనిమాట కాగ్రహించి. 202

వ. చోరుం డిట్లనియె. 203

ఆ. తొలుత నీవు విప్రుఁ దెలిపిన మఱి నాకుఁ
బట్ట నెట్టు వచ్చుఁ బశుయుగంబు

వారు నతనిపొరుగువారును మేల్కన్నఁ
బాఱవలసియుండుఁ బసుల విడిచి. 204

వ. అని మఱియు నిట్లనియె. 205

క. చోరఁబడి గోయుగముం గొని
సరగున నే నూరు వెడలి చనునంతట భూ
సురు నీవు పట్టు మనుటయు
నరుణాక్షులు మెఱయ నతఁడు నాతని కనియెన్. 206

క. పసుల మును నీవు దోలిన
మసరిననెవ్వగల నతఁడు ముచ్చిరుచుండక్
బస లేదు నాకుఁ బట్టఁగ
వెస నే ము న్నరుగ నీవు వెనుచను మనినన్. 207

వ. ఇవ్విధంబున నయ్యిరువురు నొండొరులమీఁదియాగ్రహంబున మెల పెఱుంగక రొదకొట్టునంతట నాయింటిగృహపతి మేల్కని తలవాకిటికిం జనుదెంచి యర్ధరాత్రసమయంబున వచ్చి మావాకిటం బోరుచున్నవా రెవ్వ రనిన నతనికిఁ జోర రాక్షసు లిట్లనిరి. 208

ఉత్సాహ. వెస నితండు నిన్నుఁ బట్ట వేచి వచ్చె బ్రహ్మరా
క్షసుఁ డటంచుఁ జోరుఁ డనినఁ గనలి నీపశుద్వయం
బెసఁగువేడ్క వీఁడు వేగ యిపుడు దోల వచ్చె సా
హసికవర్యుఁ డితఁడు దొంగ యంచుఁ జెప్పెఁజెప్పినన్.

తే. విని మహీసురవర్యుండు వితతమంత్ర
బలమునను బ్రహ్మరాక్షసుఁ బాఱఁదోల
నంత నటమున్న చోరుండు నరిగెఁగానఁ
బొసఁగ నహితులు దమలోనఁ బోరమేలు. 210

క. కావున శరణాగతునిం
గావం దగుఁ గాని చంపఁ గా దనినయెడన్
దా విని ప్రాకారవర్ణుని
నీవివరము చెప్పు మనిన నేర్పున నతఁడున్. 211

వ. వక్రనాసుండు చెప్పినయట్లు చెప్పిన విని రక్తాక్షుండు సముత్థితుండై మ్రొక్కి యుపమర్దన కిట్లనియె. 212

తే. దీనదశ దోఁపఁ బగతుండు హీనవృత్తి
నడఁగి బల మబ్బువేళను మడఁగఁ జేయు
ధృష్టముగఁ గీడు చేసినదుష్టువలని
వినయవాక్యంబులకు మెచ్చు వెట్టివాఁడు. 213

వ. అని మఱియు నిట్లనియె మున్నిట్టిప్రియాలాపంబుల కలరి.

క. ప్రేమను జారిణి యగుతన
రామను శిరసావహించె రథకారుఁ డొకం
డీమహి నవివేకి యనుడు
నామంత్రి మొగంబు చూచి యతఁ డెట్లనినన్. 215

వ. ఆతం డిట్లను రథకారుని కొక్కకులకాంత గలదు దాని తెఱంగు వినుండు. 216

క. నగుమొగముఁ గలికికన్నులు
బిగిచన్నులు నసదునడుము బింబాధరమున్
జిగి దొలఁకుపదతలంబులుఁ
దగియొప్పన్ బద్మముఖికిఁ దరుణులలోనన్. 217

క. ఆపాలఁతుక పరపురుష
వ్యాపారము చేయుచుండ వరుఁ డెఱిఁగి నిజం
బేపారఁ దెలియుతలఁపునఁ
గోపం బడఁచుకొని పలికెఁ గోమలితోడన్. 218

ఉ. బాలరో నన్ను రాజు పనిపంపఁగఁ బోవుచునున్న వాఁడఁ బోఁ
జాల నటంచు భృత్యునకు సందుల దాఁగఁగఁ బోల దెందునే
నేల నృపాలుకొల్వునకు నేగతి వచ్చె నవస్థయంచుఁ జిం
తాలసుఁ డైననాథునకు నంగన యిట్లనియెన్ ముదంబునన్.

ఉ. ఎన్నికబంట వీవు నిను నేలిక పిల్చి ప్రియంబు చెప్పినన్
సన్నక సన్నఁ బోక పెఱసన్నల సాకులు పన్ను టొప్పునే
తిన్నఁదనంబుతోడఁ బని దీర్చక వచ్చి సుఖింతు గాని పో
కున్న నృపాలుఁడుగ్రుఁ డదయుండు చలంబున నేమి సేయునో.

వ. అని ససంభ్రమంబును సకౌతుకంబునుంగా నమ్మగువ యతని మజ్జనభోజనాదులం బరితృప్తుం జేసి తాంబూలం బిచ్చి సెజ్జకుఁ దార్చి యిట్లనియె. 221

క. తడ వోర్వవు ప్రాణంబులు
దడసి నినుం బాసి నాకుఁ దప్పదు నీకున్
బడఁతుక లచ్చటఁ గల రని
తడవుచు రా కున్న విడుతుఁ దనువు నిజేశా. 222

తే. అనుచుఁ గందర్పసంక్రీడ నాత్మనాథు
నుల్ల మలరంగ నేర్పుల నోలలార్చి
చలిదియును సంబడంబును జాల నొసఁగి
ప్రొద్దు గ్రుంకెడునంతన పుచ్చె నతని. 223

క. పుచ్చి యుపనాథుఁ బిలువం
బుచ్చి యుదక మాడఁబోవఁ బోవక మగుడన్
వచ్చి యిలు చొచ్చి సూతుం
డచ్చటిమంచంబు క్రింద నడఁగినవేళన్. 224

వ. పదంపడి యక్కాంతయు. 225

చ. ఒడలికి నాడి సన్నమణుఁ గొప్పుఁగఁ గట్టి సుగంధ మంతటం
బొడవడకుండ మేన నెగపూఁతగఁ బూసి వినీలకేశముల్
ముడివడ కుండఁ దీర్చి విరులం గురువేరుఁ గదంబకంబుగాఁ
బొడవుగఁ గొప్పు వెట్టి మణిభూషణముల్ ధరియించె వేడుకన్.

తే. ఇవ్విధంబునఁ గై సేసి యిందువదన
దీప్తు లడరంగ నద్దంబు తెచ్చి చూచి
తనముఖావయవంబులు తానె మెచ్చి
సుదతి యుపకాంతున కెదురుచూచుచుండె. 227

వ. అయ్యవసరంబున నుపనాథుండును నతిసంభ్రమంబున నలంకరించుకొని దూతికానుగమ్యమానుండై పద్మముఖమందిరంబునఁ బ్రవేశించి పర్యంకంబునందుఁ గూర్చుండి యుండె.

క. ఆసమయంబునఁ బుష్పశ
రాసనుసామ్రాజ్యలక్ష్మి యన శృంగారో
ద్భాసితయై నిజపర్యం
కాసనమునఁ గాంత జారు నల్లన చేరెన్. 229

వ. ఇట్లు చేరినకాంతాతిలకంబునకుం గదిసి యతం డిట్లనియె. 230

ఉ. ఎప్పుడు పిల్చుఁ బద్మముఖి యెప్పుడు దాని ప్రియుండు వోవున
న్నెప్పుడు గారవించుఁ గమలేక్షణ యంచు నహర్నిశంబు నే
నెప్పుడుఁ గోరుచుండుదు మహిం దలపోయఁగ నేను ధన్యుఁ
డన్, జెప్పఁగ నేల నన్నిపుడు శీఘ్రమ రమ్మని పిల్వఁ బంచు
టన్. 231

క. అని మఱియుఁ బ్రియము చెప్పుచు
ఘనపరిరంభంబు చేసి కాంతయు నతఁడున్
మనసిజసంక్రీడలమై
ననుపమశయ్యాతలంబునం దున్న యెడన్. 232

ఆ. మగువ కాలు చాప మగనిఁ దాఁకుటయును
నతివ యాత్మలోన నది యెఱింగి
వీఁడు మగఁడు గాని వింతవాఁ డెవ్వఁడుఁ
గాఁ డటంచుఁ గొంత కళవళించి. 233

వ. విచారించుసమయంబునం గూటమితమకంబున నమ్మగువయభి
ప్రాయం బెఱుంగమింజేసి పరపురుషుండుఁదాని కిట్లనియె. 234

ఆ. నాకు వలతొ మున్ను చేకొన్న మగనికి
వలతొ నిజము చెప్పవలయుఁ దెలియ
నోపి చెప్ప కున్నఁ గోసెదఁ జూ ముక్కు
సెవులు ననిన వాని కువిద యనియె. 235

ఉ. ఓరి దురాత్మ! నీవును బ్రియుండవె నాహృదయేశు కాలిపై
గోరును బోల వీవు నసగూఁటఁ గడున్ జపలస్వభావలై
నారులు రూపయౌవనమున న్నిలుపోపక యివ్వలవ్వలన్
జారహితంబు సేయ విభుచక్కటిమోహము మాన నేర్తురే.

వ. అదియునుంగాక. 237

సీ. మగఁడు దైవం బని మదిఁ దలంచినయట్టి
మగువ పుణ్యాంగన మగువలందు
విభుఁడు శరీరంబు విడిచి పోయెడివేళ
నగ్నిముఖంబున నరుగుఁగాక
తరుణి యుండఁగ లేక తగనికార్య మొకటి
నేరక చేసిన నిముడుకొనుచు
సతిలేనిధర్మంబు పతికి నేయెడ లేదు
పతి వెలిగా లేదు సతికి మేలు

ఆ. గాన సతియుఁ బతియుఁ గలకాల మెల్లను
దోడునీడ గాఁగఁ దొలఁగ రనిన

శయ్యక్రింద నుండి సంతోషమున రథ
కారుఁ డద్భుతంబు గ్రమ్మమదిని. 238

వ. ఇట్లని తలంచె. 239

ఆ. మిగులఁ బతి మైనమెలఁతుక యొకనాఁడు
ప్రియము పుట్టి యొకనిఁ బిలిచెనేని
నేమి దప్పె ననుచు నెంతయు ముద మంది
యలుక విడిచి యున్న యవసరమున. 240

క. పరపురుషుండును దరుణియు
సురతశ్రమపారవశ్యసుఖసుప్తిమెయిం
గరచరణంబులు పెనఁగొనఁ
బరిరంభణకేళి నున్న భావించి మదిన్. 241

ఉ. ఆరథకారుఁ డల్లన నిజాంగనఁ దెల్పినఁ గన్ను విచ్చి యా
సారసనేత్ర యిట్లనియెఁ జయ్యన నీవు తొలంగు మంతకా
కారుఁడు వీఁడు మేల్కనిన గ్రక్కున నిన్నును నన్నుఁ జంపు
ము, న్నారసి వీఁడె పట్టిన భయంబునఁ బోవక చిక్కి యుండి
తిన్. 242

ఆ. అనిన దానినాథుఁ డటఁ బాసి తొలఁగిన
నొద్ద నిదురపోవుచున్నవిటునిఁ
దెలుప వెఱచి తాను దెలియక నిద్రించు
మగువఁ గాంచి యపుడు మగఁడు కినిసి. 243

క. ఆమంచము తల నిడుకొని
ప్రేమంబునఁ బెద్దవీథిఁ బెట్టిన జారుం
డామగువఁ బాసి తొలఁగిన
నేమియు నన కతివఁ గొనుచు నింటికిఁ జనియెన్. 244

వ. కావునఁ బ్రత్యక్షదోషంబు చేసినవానింజూచియైన నవివేకి మంచిమాటలకుం జొక్కి మోసపోవు నని పెక్కుభంగుల రక్తాక్షుండు చెప్పిన నతనిమాట లవధరింపక యాచిరంజీవిం దోడ్కొని నిజనివాసంబునకుం జని యతని నత్యంతగౌరవంబునం గొలిపించుకొని యున్నసమయంబున నచిరకాలంబునకు నొక్కనాఁ డుపమర్ద్దుండు సకలభృత్యామాత్యనివహంబుతోడం గొలువున్నసమయంబునఁ జిరంజీవి చనుదెంచి యతనికి మ్రొక్కి యిట్లనియె. 245

ఉ. నీపగవానిముందటను నీగుణముల్ గొనియాడఁ గోపసం
తాపపరీతచిత్తుఁ డయి దండితుఁ జేసెను నన్నుఁ బ్రాణముల్
తీపని యుండ నొల్ల సడి తెచ్చినయీబ్రతుకేల యగ్నిలో
నేపునఁ జొచ్చి దేహము దహించెద నడ్డము రాకుఁ డెవ్వరున్.

క. తనయేలిక ముదల కొనక
గొనకొని ప్రాణంబు విడువఁ గొఱ గా దనినన్
విని రక్తాక్షుఁడు వానిం
గనుఁగొని యిట్లనియె మనసు గనుఁగొనుబుద్ధిన్. 247

ఆ. చచ్చి యేమి చేయు దిచ్చట నీ వన్న
నతఁడు దా నులూక మగుచుఁ బుట్టి
కాకకులము నెల్ల గ్రక్కునఁ జంపుదు
గాలి వోవకుండఁ గాంతు దీఱ. 248

వ. అనిన విని రక్తాక్షుం డవ్విధంబు సేయ నీకు సాధ్యంబుగా దెట్లనినఁ దొల్లి యొక్కమూషికంబు సూర్యానిలదేవేంద్ర మేరుపర్వతంబులు దనకుఁ బ్రత్యక్షంబులైనను నెప్పటిరూపంబునె పొందెఁ గాని యుత్కృష్టజన్మంబు నొందనేరదయ్యె

యనినఁ జిరంజీవి తత్కథాక్రమం బెట్టి దనిన రక్తాక్షుం డిట్లనియె. 249

సీ. మునివరుఁ డొకరుండు ముఖ్యతీర్థము లెల్ల
నాడి భాగీరథి కరిగి యందు
నవగాహనము చేసి యాదిత్యుఁ డుదయించు
తఱి నర్ఘ్యజలము హస్తములఁ బట్టి
నయ్యవసరమున నాకాశవీథిగా
నొకడేగ యెలుకఁ బట్టుకొని చనఁగ
నాయెల్క విడివడి యమ్మహీసురుచేతి
యర్ఘ్యజలంబులయందుఁ బడిన
తే. నతఁడు గనుఁగొని కౌతుకాయత్తచిత్తుఁ
డగుచు నమ్మూషికముమీఁద నిగుడుకరుణఁ
గన్య యగుఁగాక యనుటయుఁ గాంతయయ్యె
దానిఁ దనభార్యచేతికమ్మాని యొసఁగ. 250

క. ఆరామయుఁ దనకన్నకు
మారితకంబెను గరంబు మక్కువ మెఱయన్
గారామునఁ బెనుపఁగ న
న్నారీరత్నంబు యౌవనప్రాయమునన్. 251

వ. అతిమనోహరాకార యైనయక్కొమ్మం గనుంగొని యొక్కనాఁ డమ్మునీశ్వరుండు మనంబున నిట్లు విచారించె. 252

క. ఈకన్నియఁ దగువరునకు
నీకున్న రజస్వల యయి యిది వృషలి యగున్
బ్రాకటనిందాపాత్ర
వ్యాకుల యగు ననుచుఁ దనమహత్త్వముపేర్మిన్. 253

క. త్రిభువనదీపకుఁ డగునా
నభోమణిఁ దలఁచిన వేగ యమ్మునిమ్రోలన్
శుభమూర్తి వచ్చి నిలిచిన
నభివందన మాచరించి యతఁ డిట్లనియెన్. 254

క. ఈరూపవతికి మర్త్యులు
గా రని నిలిపితిని భార్యఁగాఁ గైకొనుమీ
కోరిక నా కిది యనుటయు
నారవి విని యపుడు వేడ్క నాతని కనియెన్. 255

ఉ. ఏణవిలోలనేత్ర వరియింప మహాబలుఁ డైనయాజగ [న
త్ప్రాణుఁడు గాని కాఁడతనిఁ బ్రార్థన సేయుము నన్ను మీఱు
క్షీణవిభూతి నాతఁ డని చెప్పి దివాకరుఁ డేఁగినన్ దప
స్త్రాణపరాయణత్వమునఁ దాపసుఁ డయ్యనిలుం దలంచినన్.

చ. తలఁచిన నాసమీరుఁడును దత్పరతం బొడచూపి నిల్చినన్
దళితసరోజనేత్ర యిది నాకుఁ దనూభవ నీకుఁ బత్నిఁగా
నొలసి పరిగ్రహింపుమని యగ్గలిఁ జూప మునీంద్రుఁ జూచి హా
సలలితవక్త్రుఁ డై మృదువచస్స్మితితోఁ బవమానుఁ డిట్లనున్.

ఉ. నా కధికుండు దేవపతి నాతుక నాయన కిచ్చినన్ దగుం
గాక మహేంద్రుఁ డైనతనిఁ గా దని యన్యుల కిచ్చు టర్హ మే
నాకనివాససౌఖ్యసుమనస్సరసీరుహలోచనాశిర
శ్శ్రీకరపాదపద్మ యయి చెన్నెసలారుచు నుండు టొప్పదే.

వ. అని యిట్లు వాయుదేవుం డమ్మునీంద్రు నొడంబడం బలికి
యతనిచేత ననుజ్ఞాతుండై నిజేచ్ఛం జనియెఁ దదనంతరంబ
యమ్మునీంద్రుం డింద్రు నారాధించి తలంచిన నతండును జను
దెంచి పొడచూపి నిలిచి నన్నుఁ దలంచినకారణం బేమి యని
యడిగిన నయ్యింద్రునకు నమ్మునీంద్రుం డిట్లనియె. 259

చ. అతులతపస్సమాధినియతాత్ములు నధ్వరకర్తలుఁ దృఢ
వ్రతులును దానశూరులును వాసవునిం బొడగాన నేర ర
ద్భుతము దలంచినంత వృథ పుచ్చక నన్నుఁ గృతార్థుఁ జేయ వ
చ్చితి మునికోటిలోపలఁ బ్రసిద్ధుఁడ నైతిఁ ద్రిలోకనాయకా.

వ. అని మఱియు ననేకప్రకారంబులఁ బ్రస్తుతింపఁ బ్రసన్న
ముఖుం డైన శతమఖున కతం డిట్లనియె. 261

సీ. కలికిచూపుల కాంతిఁ గలువతోరణములు
పచరించిన ట్లున్న బాలఁ జూడు
మెఱుఁగుఁజెక్కిళ్లను మించుటద్దంబులఁ
జూపెడు నీకు నీసుదతిఁ జూడు
గురుకుచంబులు పూర్ణకుంభంబులును బోలె
నిలిపిన ట్లున్న యీనెలఁతఁ జూడు
చిఱునవ్వువెన్నెల శీతలామృతమట్లు
చిలుకుచు నున్నయీచెలువఁ జూడు

తే. నమరవల్లభ నీకైన నమరుఁ గాని
నరసురాసురయక్షకిన్నరవరులకు
నీడు గా దని నిలిపితి నీమృగాక్షిఁ
గోర్కె నిగుడంగ దీనిఁ జేకొందు గాక. 262

వ. అని యిట్లు మహేంద్రునకు నన్నారీరత్నంబుపయిం
బ్రియంబు పుట్టం బల్కిన తపస్విం గనుంగొని దానిజన్మ
ప్రకారంబును మునీంద్రునకుం గలిగినవాత్సల్యంబును
నెఱింగినవాఁడై నవ్వుచు మునీంద్రునకు నింద్రుం డిట్లనియె.

చ. సురుచిరరత్నసానువుల శుద్ధసువర్ణమహోన్నతాయత
స్ఫురదురుశృంగసంఘముల సూర్యసుధాకరతారకానిరం

తరపరివర్తనంబుల గదాధరపద్మభవాదిదేవతా
పరిచితమౌళిభాగములఁ బ్రస్తుతికెక్కి వెలుంగు నెంతయున్.

ఉ. మేరుమహామహీధరము మీకును మాకును బెద్ద గావునన్
వారిరుహాక్షి నగ్గిరి కవశ్యము నిచ్చుట మేలు కాంతకుం
గోరిక వల్లభుండు ధనికుండును సత్త్వయుతుండుఁ గాఁగ మే
లారసి కాంచనాద్రికిఁ బ్రియంబున నిమ్మని యింద్రుఁ డేఁగినన్.

వ. అమ్మునీంద్రుండు తనమనంబున. 266

తే. పిలిచి యీఁబోవ నెవ్వారు దొలఁగనాడి
పడుచు నొల్లమి లోకంబుపాడి గాదె
భాస్కరానిలస్వర్లోకపతులు దగిన
యొరపు చెప్పిరి గాని తా రొల్లరైరి. 267

వ. ఒల్లకున్న నేమి యగు నని మహామేరువుం దలంచిన నమ్మహీ
ధరంబును నత్యంతసుకుమారత్వంబును ధరియించి యాతని
ముందట నిల్చినంగనుంగొని యర్ఘ్యసత్కారంబులఁ బరితుష్టుం
జేసి మునీంద్రుం డిట్లనియె. 268

తే. ఎవ్వరికి నీక నీకు నే నిత్తు ననుచు
నింతగాఁ బెంచినాఁడ నీయిందువదన
నింపు సొంపార నీవు మాయింట నిపుడు
వియ్య మొందంగవలయు నుర్వీధరేంద్ర. 269

వ. అన నమ్మహీధరం బిట్లనియె. 270

తే. చూడ సూక్ష్మంబుగాని నాసొబగుమేను
ఘాతగొని పెక్కులాఁగలుగాఁగఁ ద్రవ్వ
గాన నాకంటె నధికమై ఘనతఁ బేర్చు
వేషధారిణి గైకొనయిమ్మూషికంబు. 271

ఉ. కావున నీకుమారికకుఁ గాంతుఁడు మూషిక మైన నొప్పుఁ గా
కీవగ గాఁగ నల్పులకు నిచ్చుట నీ కది బుద్ధి గాదు నన్
బోవఁగ నంపు మంచు మునిపుంగవు వీడ్కొని మేరు వేగినన్
దేవసమానవిప్రునకు దీని నొసంగెద నంచు వేడ్కతోన్.

క. ముని పుణ్యాశ్రమభూములు
వనితం గొని తిరిగి తిరిగి వరియింపఁ డటం
చును విప్రవరుల నడిగినఁ
గనుఁగొని వా రధికబోధకలితాత్మకులై. 273

తే. ఇంతచక్కనితరుణి మహీసురులకు
నమర నేర్చునె రాజుల కైనఁ గాక
చెలువ నే మొల్ల మనఘు విచ్చేయు మనిన
నతఁడు గడు లజ్జ నింటికి నరుగుదెంచి. 274

క. ఇది దాఁ గన్యాత్వంబున
ముదిసినఁ గడు ధర్మహాని మున్నిటిరూపం
బొదవంగ మూషికంబై
వదలక చరియించుఁ గాక వసుమతి నెందున్. 275

క. అని పలుక నపుడు మూషిక
తనువునఁ దనమ్రోల నున్న దానిని ఖేదం
బున నొక్కపురుషమూషిక
మున కంటఁగఁ గట్టి రెంటి మునివరుఁ డనిపెన్. 276

వ. అట్లు గావున. 277

తరల. ఇనసమీరణదేవతాధిపహేమశైలము లాదిగాఁ
దనకు సన్నిధి చేసె నేనియు దానిమూషికజన్మము

న్వినుము మాఱఁగ నేర దయ్యెను నీకు నట్టిద మాకులం
బున జనించు టనంగ నాతఁడు పొంక మింక నడంగినన్.

వ. అంతట సుపమర్ధుండును జిరంజీవిఁ జేరంబిలిచి యభయం బిచ్చి వెఱవ కుండు మని వీడ్కొల్పినఁ గొంతకాలం బుండి దుర్గస్థానమర్మంబు లెఱింగి యాచిరంజీవి యొక్కనాఁడు దనలో నిట్లని తలంచె. 279

క. అరులకుఁ గలసత్త్వంబును
దెరువులు నునికియును వారు ద్రిమ్మరుతావుల్
గిరిదుర్గము సాధించెడు
వెరవును నెఱిఁగితిని నాకు వేళగుఁ జెఱుపన్. 280

తే. అని విచారించి గుహచుట్టు నరయఁ దొల్లి
యాలమందలయునికి పట్టగుటఁ జేసి
కుప్పలై యున్నయెరు వెల్లఁ గొక్కరించి
చరణముల సన్న తెరువుల సరవిఁ బఱచి. 281

వ. తిరిగి పెద్దవాకిట వచ్చి యులూకంబులఁ జూచునప్పు డవి రాత్రి దూరదేశంబులఁ బరిభ్రమించి మేసి వచ్చి యలసి సూర్యోదయసమయంబున మే నెఱుంగకయొండొంటిపయిం బడి నిద్రింపఁ జూచి తల యూఁచి చిరంజీవి తనలో నిట్లనియె.

ఉ. నమ్మినవారిఁ జంపినను నాకు నధర్మము గాదు లెస్సగా
నమ్మక చంపరాదు రిపు నన్ను నిజంబుగ నాత్మభృత్యుఁగా
నమ్మినదోష మెవ్విధమునం దగఁ బొందె విచార మేటికిన్
నమ్మిననా నిజేశునకు నాదుహితం బెఱిఁగింతు నెంతయున్.

ఉ. ఏపని చేయు మంచుఁ దనయేలిక సేవకుఁ బంచెఁ బొందుగా
నాపని దీర్చి వచ్చుటయ యాతనికిం దగుధర్మ మిట్టిచోఁ

బాపము పుణ్యముగ విభునిపా లగు భృత్యుని కేమి కారణం
చేపున మేఘవర్ణునకు నీసమయం బెఱిఁగింపఁ బోం దగున్.

సీ. అని నిశ్చయింపుచు నతివేగమునఁ జని
యేలికఁ గాంచి కే లెత్తి మ్రొక్కి
మనపగ సాధింప ననువైన కాలంబు
తఱి గాంచి వచ్చితిఁ ద్వరితముగను
వెనుక న త్తెఱఁ గెల్ల విన్నవించెదఁ గాని
వీరు వారన కెల్ల వారిచేతఁ
గాపతృణంబులు గఱచి తే నియమింపు
మని తాను మందుచున్నట్టి కొఱవి

తే. మెఱసి నేర్పున ముక్కునఁ గఱచిపట్టి
కడలఁ దృణకాష్ఠములు గొంచుఁ గాకకులము
మేఘవర్ణుని వెనుక నమిత్రతతిని
గెలుచు వేడుక నుడువీధిఁ జెలఁగి పఱవ. 285

క. ఘూకంబు లున్నగుహాకును
వాకిటఁ గాష్ఠములుఁ దృణము వడిఁ గప్పింపన్
వే కవిసి చిరంజీవియుఁ
దాకొనఁ దనముక్కు-కొఱవిఁ దగిలించి వడిన్. 286

వ. తనదుపక్షానిలంబునం జేసి యయ్యనలంబు నిగుడం జేసిన. 287

శా. ధూమజ్వాలలతోడిపహ్ని గుహాలోఁ దూరంగ నయ్యండజ
స్తోమంబుల్ భయసంభ్రమంబు లడరం దూరంబుగాఁ బాఱఁ
ద,త్సీమారంధ్రము లెందు లేకునికి న్నార్తిం బొంది యచ్చో నిజ
స్వామిం జేరి యచేతనంబు లగుచుం జావంగ వీక్షింపుచున్.

వ. రక్తాక్షుం డుపమర్దన కి ట్లనియె. 289

క. తెగి చంపరాదు గాకముఁ
దగ వని దుర్ణీతు లపుడు దలకొల్పఁగ నీ
దగుమంత్రులు నీవును నీ
పగిదిం బడవలసె నిట్టిపాపము గంటే. 290

క. హితుఁ డైనమంత్రిపలుకులు
మతి ననుమానించి విననిమానవపతి యీ
గతి దుర్దశలం బొందును
సుతసోదరబంధుమిత్రసుదతులతోడన్. 291

వ. అనిన విని యుపమర్దుం డిట్లనియె. 292

ఆ. విను మధర్మ మైనపని ధర్మమని తోఁచుఁ
గాని తెరువు తెరువుగాఁ దలంచు
శత్రు మిత్త్రుఁగాను మిత్త్రు శత్రునిగాను
గాంచు నరుఁడు చేటుకాలమునను. 293

ఉ. కావున నాకుఁ బథ్య మగుకార్యముగాఁ గడు నొత్తి యమ్మె
యిన్, నీవు హితంబు చెప్ప విననేరక దుర్ణయశీలినై చిరం
జీవిఁ బరిగ్రహించి జముఁ జేర నుపాయముఁ జేసికొంటి నే
దైవిక మైనచేఁతకును దప్పనుపాయము లొండు గలునే.

మ. ఒకయక్షౌహిణితోడఁ బాండవబలం బున్న న్నిశామధ్యవే
ళను ద్రోణాత్మజుఁ డొక్కఁడుం గదిసి లీలన్ సంహరింపంగ
నుత్సుకతన్ మాన్పఁగఁ జాలెనే హరియు నచ్చోనుండిసర్వం
బు దైవిక మంచున్ దెలియంగలేక విధిపై ద్వేషించినం
దప్పునే. 295

క. అని యూరకుండు నంతట
ననలశిఖాసమితిచేత నన్నియు సమయం

గనుఁగొనుచు వాయసంబులు
పనివడి గుహఁ జొచ్చి చూచి పరమప్రీతిన్. 296

క. అవి యుపమర్దనునంగము
లివి యారక్తాక్షముఖ్యహితమంత్రిసుహృ
న్నివహములతనువు లనుచును
వివరించి యులూకసమితి వెడలి కడంకన్. 297

తే. అపుడు మేఘవర్ణాదివాయసకులంబు
పొరిఁ జిరంజీవిఁ బొగడుచుఁ బోయి నిజని
వాసమున నంచితోన్నతవైభవమున
మేఘవర్ణుండు కొలువున మెఱయుచుండి. 298

వ. చిరంజీవి నాలోకించి నీ విన్ని దినంబులు శాత్రవజనంబులు నమ్మునట్లుగా నెవ్విధంబున గొలిచి తిరిగితి వనిన నతం డిట్లనియె.

తే. సకలదిక్కులరాజుల శౌర్యమహిమ
గెలిచి తనుఁ గొల్చుతమ్ములు గలుగునట్టి
పాండవాగ్రజుఁ డనువు గాకుండునట్టి
వేళ హీనుఁడై కొలువఁడె విరటునగరి. 300

సీ. కాషాయదండంబు గైకొని యమసూతి
కంకుభట్టనునామకంబు దాల్చె
నడబాలతనమున నధముఁడై పావని
వలలుండు నాఁగ నవ్వలన నిలిచె
నటవేషమున నింద్రనందనుఁ డొకయేఁడు
పేడితనంబునఁ బెంపు దొఱఁగె
హాయశిక్షకుం డయి యాలగాపరియు నై
మాద్రేయు లుండిరి మహిమ దొలఁగి

తే. కృష్ణ సౌభాగ్యరేఖ నుత్కృష్ట యయ్యు
నిలిచె సైరంధ్రి యనుపేర నీచవృత్తి
బలపరాక్రమవంతు లోపతులు గలిగి
బ్రతుకరా వారు మగుడంగఁ బక్షినాథ. 301

క. ఏనును నవ్విధమునఁ గడు
హీనదశం బగరఁ గొలిచి యిాడేర్చితి నీ
దైనమహాకార్యమును
న్మానసమున నెపుడు నిలిపి మహితవిచారా. 302

వ. అనిన మేఘవర్ణుండు చిరంజీవి కిట్లనియె. 303

క. నీ వసిధారావ్రతమున
నావంతయు శంక లేక యహితులలోనన్
జేవ చెడ కెట్లు మెలఁగితి
నావుడు నాతండు పక్షినాథున కనియెన్. 304

సీ. అవధరింపుం డులూకాధీశమంత్రుల
లోన రక్తాక్షుఁడనూనవిభవ
సంపన్నుఁడును నయశాస్త్ర విదుండును
సజ్జనప్రియుఁడును సాధుహితుఁడు
విక్రమోదగ్రుండు నక్రూరచరితుండు
నగుచు సర్వజనంబు పొగడుచుండ
బుద్ధిబలంబునఁ బూజ్యుండు నాకంటె
నతఁ డుపమర్దుతో నర్థి నెపుడు

ఆ. నన్నుఁ జంప బుద్ధు లెన్ని యేనియుఁ జెప్ప
వినయమున నులూకవిభుఁడు వినక
మఱియుఁ దనకుఁ గలుగుమంత్రులతో నాడు
మతము నడుగ నొక్కమాట గాఁగ. 305

క. శరణాగతులం జంపెడు
పురుషుల నెచ్చోటఁ గానమును వినమును సు
స్థిరధర్మనిర్మలుఁడవై
పరమకృపం గావు వీనిఁ బక్షికులేంద్రా. 306

వ. అనిన వారివచనంబు లవలంబించి రక్తాక్షుపలుకు లనాదరంబు
చేసి నన్నుఁ దోడ్కొని పోయి కొలిపించుకొని యతం డింత
దెచ్చుకొనియె నని యుపమర్దువృత్తాంతం బంతయుం జెప్పి
చిరంజీవి వెండియు నిట్లనియె. 307

క. పగవానిపక్షమునవాఁ
డగపడినం గాచెనేని నత్యాసన్నుం
డుగ మెలపఁ దగదు మెలపినఁ
దెగు నుపమర్దుండపోలె ధీరహితుండై. 308

ఆ. అరులయొద్దనుండి యరుదెంచి కొల్చిన
భటుఁడుఁ బాము నొక్కభంగి గాన
మోసపుచ్చి చెఱుచు నాసన్నుఁ డౌవాని
నమ్మినట్లు యుండి నమ్మఁ దగదు. 309

వ. అని చెప్పి మఱియును. 310

సీ. జలక మాడెడువేళ సరసాన్నపానంబు
లింపైనయవి భుజియించుతఱిని
కామినీసంభోగకాలంబులెడ మృగ
యావినోదంబుల కరుగుపట్ల
విమతులపైఁ దండు వెడలుచో నటపోయి
విడియుచు నిద్రించువేళలందు
వాస్థానమునఁ గొలువై యున్నయప్పుడు
నారామకేళివిహారములను

తే. నృపుడు దేహంబుసంరక్ష నియతిఁ జేయఁ
దగును ధర్మార్థకామసాధనము గాఁగ
మనుజనాయకుఁ డించు కేమఱియె నేని
చెడుట సహజంబు నయశాస్త్ర సిద్ధమతము. 311

సీ. దుర్మంత్రి నేలినతోడనే చెడు రాజు
చెడు నపథ్యంబులు చేసి రోగి
కలిమికి గర్వించి కలవాఁడు చెడు వేగ
లోలుఁడు చెడుఁ బరస్త్రీలవలన
బుద్ధి చాలక యుండుపురుషుచేఁ జెడుగీర్తి
నడవడి గోఱగామిఁ జెడును మైత్రి
చెడు ననాచారిచేఁ జెందినకుల మెల్ల
నర్థలోభమునఁ బుణ్యంబు చెడును

తే. వింతభంగి దుర్వ్యసనికి విద్య చెడును
జెడు సుఖంబు పరాధీనసేవకునకు
నాజ్ఞ పాలింపఁ గోఱ గానియధిపుఁ డేలు
మండలం బెల్లఁ జెడు మాటమాత్రలోన. 312

సీ. శుష్కకాష్ఠంబులసోఁకున నగ్నియు
నతిమూర్ఖువలనఁ గ్రోధానలంబుఁ
జపలునివలనఁదోషంబును మగువల
వలనఁ గామోద్రేకవర్ధనంబు
దక్షునివలన సుదాత్తధనంబును
దయగలవారిచే ధర్మములును
మహితాత్మువలనను మహితధైర్యంబును
మనుజేంద్రువలన భూమండలంబు

తే. నంతకంతకు నభివృద్ధి నందునట్లు
విశ్రుతోద్యోగనిజధైర్యవిక్రమముల
నతిసమర్థుఁడ వగుట నీ వరుల గెలిచి
యసమజయలక్ష్మిఁ గొంటి వాయసకులేంద్ర. 313

వ. అని మఱియును. 314

ఉ. మూఁపున మోసి యైన రిపుమూర్తిఁ జెడం దఱి వేచి యుండఁ
గా, నోపుట లెస్స బుద్ధియుతుఁ డోపిక గల్గి చలంబు వట్టి ము
న్నేపునఁ జేరి కృష్ణభుజగేంద్రుఁడు కప్పల మోచి యన్నిఁటిఁ
రూపు చెడఁగ వధించె నని రూఢిగ వింటిమి గాదె యేర్పడన్.

వ. అనిన మేఘవర్ణుం డక్కథ వినవలతుం జెప్పు మనినఁ జిరంజీవి
యిట్లనియె. 316

తే. మందవిషుఁ డనుపేరట బొందుపడిన
యురఁగ మిట్టట్టు నాఁకటఁ దిరుగుచుండి
కాంచె మండూకగణసమాక్రాంతికలిత
జీవనం బగునొక్కసరోవరంబు. 317

క. కని యక్కొలనిసమీపం
బునకుఁ జేరంగ నరిగి భోగివిభుఁడు గ్ర
క్కున జలపాదుం డనియెడు
ఘనభేకముఁ గాంచి దైన్యకంపితుఁ డగుచున్. 318

వ. ఎలుంగు కుత్తుకం దగుల హీనస్వరంబున నిట్లనియె. 319

క. నాకడుపుకొఱకు దైవం
బీకార్పణ్యంబు దెచ్చె నెవ్వరి నడుగం
బోకుండితి గతకాలము
మీ కిదె భృత్యుండ నగుచు మెలఁగఁగ వలసెన్. 320

వ. అనుటయు నమ్మండూకాధీశ్వరుం డగుజలపాదుండు మమ్ము నిప్పు డాశ్రయించుటకుఁ గతం బేమి యని యడిగిన నమ్మంద విషుం డిట్లనియె. 321

సీ. అర్ధరాత్రపువేళ నాఁకొని డస్సి నే
నెరకునై యిట్టట్టుఁ దిరుగుచుండ
నవనీసురాన్వయునర్భకుఁ డొక్కరుం
డాచమనార్థమై యరుగుదెంచి
కానక నామేను కడువడిఁ ద్రొక్కిన
నత్యుగ్రభంగి నే నతనిఁ గఱవ
విష మెక్కి మూర్ఛిల్లి వేగ నన్ బొడఁగాంచి
పిన్నపాపనితండ్రి భీతి మిగుల
తే. మంత్రవాదులఁగొనివచ్చి మందులొసఁగి
యతని బ్రతికించుకొని నన్ను నాత్మఁదలఁచి
యద్భుతోత్పన్నకోపారుణాక్షుఁ డగుచు
బాంధవులఁజూచి యిట్లనె బ్రాహ్మణుండు. 322

క. పసిపాపఁ డనక నాసుతుఁ
గసుమాళపుఁ జెడుగుఁబురుగు కఱచెను దీనన్
ముసుఁగువడుపాపమున నది
దెసలం జరియించుగాక దీనతతోడన్. 323

వ. అని యతం డెంతయు నలుక వొడమిన వెండియు. 324

ఉ. కప్పల మోచిమోచి కడగానక వానిన గొల్చి యాఁకటన్
గప్పిననెవ్వగన్ వనరఁగా నవి చూచి కృపాకటాక్షముల్
చొప్పడుగ్రాస మిచ్చి తమలో నొకఁడై చరియించువానిఁగా
నెప్పుడు నాత్మలం దలఁప నీభుజగం బటు లుండుఁ గావుతన్.

ఆ. సుతుఁడు చచ్చెనేని సుతునితోడనె కూడ
నరుగునట్లు గాఁగ నహి శపింతుఁ
జావఁ డయ్యెఁ గానఁ జావనిమననట్టి
నుగ్రయై చరించు నోరుమాలి. 326

వ. అని యిట్లు ఘోరంబుగా శపియించిన నమ్మహీసురవరునిష్ఠు
రాలాపంబులు నాకుఁగర్ణశూలంబులుగాఁ దత్సమీపవల్మీక
గతుండనై యాకర్ణించి మదాత్మగతంబున. 327

తే. అశనిహతుఁ డైన శూలవిద్ధాంగుఁ డైనఁ
బడకయొకచోటఁ గొఱదప్పి బ్రతుకుఁగాని
విప్రశాపాగ్ని తోడరిన వికృతిఁ బొంద
కుండ బ్రతుకుజంతువులు లే వుర్విమీఁద. 328

తరల. అనువిచారము నామదిం గడు నగ్గలంబుగఁ బర్వినన్
విను మహీసురశాపభీతిని నీవ దిక్కని చేరితిన్
గనికరంబున నన్నుఁ గైకొని గ్రాస మొక్కొకపూఁటగా
నను భరించిన నీకుఁ గీర్తివినాశ మెప్పుడుఁ గల్గునే. 329

వ. అని మఱియును. 330

శా. మామీ పెద్దలు బుద్ధిచాలమిఁ గదన్ మైత్రిన్ సుఖామో
ఘవిశ్రామంబుల్ నడపంగ నొల్లక వృథాక్రౌర్యంబు వాటించి
తా, రేమేలుం గనలేక పోయిరిది దా నేకార్య మూహింపు
మా, యేమున్ మీరునుఁ బాయకుండఁదగుఁగా నెల్లప్పుడున్
జూడగన్. 331

ఉ. ఉండిన నూరకుండుదునె యొక్కరుఁ డీపని చేయ నోపఁ డీ
తం డనుచుం దలంపకు నిధానమువంటినినుం బ్రధానులన్
మండితమస్తకాగ్రముల నాదగువీఁపున మోచి యాడెదన్
మం డెడుదీపనానలము మాన్పఁగ భారము మీది గాదొకో.

వ. అనినం బ్రమోదాయత్తచిత్తుండై జలపాదుం డలవు మిగులం బుట మెగసి ఫణిపతిశిరంబులపయిం బ్రవేశించి తత్ఫణామణి మరీచులం దనమొగంబు ప్రతిబింబంబుగానంబడం జూచు చుండె నతనియమాత్యులును నయ్యురగంబు వెన్నెక్కి నిలిచి రివ్విధంబున మండూకంబుల మోచుకొని నానాగతి విశేషంబులం గొంతప్రొద్దు పుచ్చి యలసినవాఁడుంబోలె మందవిషుండును మందగమనంబునంగదల నతనికి జలపాదుం డిట్లనియె. 333

క. వడిగా నడచిన మాకుం
గడు వేడుక గాక మందగమనము మాకి
ప్పుడు హర్ష మొదవఁ జేయదు
బడుగవుగా వెద్దికతము బలహీనతకున్. 334

వ. అనుటయు మందవిషుం డిట్లనియె. 335

తే. మీరు పెట్టక కాని యాహార మిచట
నబ్బకుండుట తెలిసినయదియ కాదె
పెట్టిపనివాని కైనను వేళతోడఁ
గడుపునకుఁ బెట్టి పనిగొంట గలదు గాదె. 336

వ. అని మఱియును. 337

క. ఈకొలఁది చూడ దేహము
నా కేమియు వశము గాదు నడవఁగ నోపఁ
మీ కేను భృత్యభావము
గైకొనుటకుఁ బ్రాణరక్ష గావింపఁ దగున్. 338

వ. అనుటయు భేకకులాధీశ్వరుం డయ్యహికిం గరుణించి నీకు మొదల వెట్టితి నిక్కాలనిమండూకంబులలోన నీవలసినవాని

తోడ నుదరపోషణంబు చేసికొని శీఘ్రంబచనుదెంచి నాకు
వాహనప్రయోజనంబు దీర్పు మనిన మహాప్రసాదం బని
యతనిఁ బ్రధానుల నచ్చట డించి మందవిషుండు జలమధ్యం
బునకుం జని. 339

చ. వలసినకప్పలం గడుపువాచఁగఁ బౌరణచేసి వచ్చి ని
చ్చలుఁ దనుపూనువాహనపుఁజందము కొండొకసేపు దీర్చిలో
పలికుటిలత్వ మేమియును బాహిరమై చననీక యన్నిఁటిం
బొలియఁగజేసె నమ్మడుఁగు బొల్పెసఁగెన్ జలపాద శేషమై.

వ. అంతట నొక్కనాఁడు మందవిషుండు జలపాద శేషంబై నసరో
వరంబునఁ గ్రుమ్మరి మండూకంబులం గానక నా కింక నిచ్చట
నిలువంబని లేదు జలపాదభక్షణానంతరంబునఁ జనియెదం
గాక యని యెలుఁ గెత్తి పలికిన నప్పలుకు లాకర్ణించి జల
పాదుండు నాకుం గీడు సేయం దలంచితివే యనిన మంద
విషుం డిట్లనియె. 341

క. భూసురశాపము నన్నుం
జేసినదోషంబు నిన్నుఁ జెందినపనికిం
గాసిలఁగ నేల రమ్మని
డాసినజలపాదు రూపడంగ వధించెన్. 342

వ. వధియించి యాకృష్ణసర్పంబు నిజేచ్ఛం జనియెం గావున
నేనును నవ్విధంబున శత్రులనాశ్రయించితి నని పలికి
వెండియు నిట్లనియె. 343

తే. అగ్ని శేషంబు ఋణశేష మహితశేష
మడఁపలేకున్న నవి వృద్ధి యగుడు నేచి

నిర్దహించును బొదలును నిగిడి చెఱచు
పెఱిఁగి నిశ్శేషముగ నడఁగించు టురవు. 344

ఆ. అడవి నిర్దహింప ననలంబు తరుమూల
రక్షసేయ మొలచుఁ గ్రమ్మఱంగ
నట్లుగాక శత్రు నాబాలవృద్ధంబు
మొనసి చంపవలయు మొదలడంగ. 345

వ. అని విచారించి పగతుర నిరవశేషంబుగా సంహరించిన భాగ్య
వంతుండ వని పలికి చిరంజీవి యిట్లనియె. 346

సీ. వ్యసనశీలుఁడు గాక వసుమతీనాథుండు
సకలప్రజానురంజనము వడసి
క్రోధలాభమదాదిగుణముల వర్జించి
సత్యధర్మక్షమాశాలి యగుచు
మొనసి యాత్మచ్ఛిద్రములు గాన నీక న్య
మానవచ్ఛిద్రము ల్మది నెఱింగి
దేశకాలంబులు దెలిసి సప్తాంగసం
రక్షకుండై పరాక్రమము మెఱసి

తే. యాత్మసంరక్ష మఱవ కహర్నిశంబు
ధార్మికుం డని జగ మెల్లఁ దన్నుఁ బొగడ
నిగిడి సత్కీర్తి దిక్కుల నించెనేని
దేవతాంశమువాఁ డని తెలియవలయు. 347

వ. అని మఱియును. 348

క. కడిఁదిపగరు గైదువు గొని
పొడిచినయెడ నైన బ్రదుకు బుద్ధిని జెఱుపం
బడినయమిత్రుఁడు మఱి యె
న్నఁడుఁ దా బ్రతుకంగ లేక నాశమునొందున్ 349

చ. అలఘునిశాతహేతి నదరంటఁగఁ దాఁకినవైరి యాహవ
స్థలమున నోర్చుఁగాని బహుసైన్యములన్ బొలియింపలేఁడుని
శ్చలనయతత్త్వసాధనము శాత్రవపుత్రకళత్రమిత్రమం
డలబలశౌర్యవైభవవిడంబములన్ హరియించు గ్రక్కునన్.

వ. అని మఱియును. 351

క. ఏపని యుద్యోగించిన, నాపని దైవానుకూల మైన ఫలించున్
రూపింపఁగ మానుష మని, చేపట్టి పెనంగ నేని సిద్ధింప దిలన్.

వ. కావున దైవానుకూలత లేనిపౌరుషవ్యాపారంబు నిరర్థకం
బెట్లంటేని. 353

సీ. తాపసవేషంబు ధరియించె రాముఁడు
బంధనప్రాప్తుఁడై బలి యడంగె
వనవాసగతు లైరి వగఁ బాండుతనయులు
యాదవు లన్యోన్యహతులఁ జనిరి
ఘోరదుర్దశ నొంది కుందె నైషధరాజు
శరతల్పగతుఁ డయ్యె శాంతనవుఁడు
వామనరూపంబు వాసుదేవుఁడు దాల్చె
దశకంఠుఁ డర్జునోద్ధతికి నొదిగె

తే. సర్వమును దైవవశమున జరుగు జగము
గాన నేరక తాఁ గర్తగాఁ దలంచు
మూఢచిత్తుఁడు సుజ్ఞానమూర్తి యైన
పురుషుఁ డిన్నియు నెఱిఁగి సుస్థిరతనుండు. 354

వ. అని మఱియును. 355

చ. శ్రుతమునఁ జేసి బుద్ధి మతిహీనవ్యఘనవ్యసనంబుచేత మూ
ర్ఖతయు మదాలసత్వమునఁ గాంతయుఁ జంద్రునిచేత రాత్రి

యుఁ, వితతసమాధిచే ధృతి పవిత్రజలంబులచేత నేఁబు నూ
ర్జితనయమార్గవర్తనముచే నృపతిత్వ మలంకృతం బగున్.256

వ. అని యిట్లు చిరంజీవి చెప్పినహితోపదేశంబునకుఁ బగ సాధించినసాహసంబునకుఁ బ్రియం బంది మేఘవర్ణుం డతని కర్ధరాజ్యం బిచ్చి తానును సామ్రాజ్యంబునం బూజ్యుండై సుఖం బుండెనని చెప్పుటయు. 357

ఉ. హారపటీరహీరరజతాద్రితుషారధరాధరేంద్రమం
దారమరాళరాజహరనారదపారదకుందచంద్రికా
క్షీరమృణాలశంఖసురసింధురఫేనఫణీశకాశక
ర్పూరసమానకీర్తివరభూషణ సజ్జనలోకపోషణా. 358

క. ఉభయదళరుద్ర లక్ష్మీ
శుభమందిర సతతదానశోభిత సమ్య
గ్విభవసురాధిప విలస
త్ప్రభవా హేమాద్రిధీర బసవకుమారా. 359

మత్తకోకిల. వాసవప్రతిమానవైభవ వైరిరాజభయంకరా
వాసుదేవపదాబ్జషట్పద వాంఛితార్థసురాంఘ్రిపా
భాసురప్రమదామనోభవ భానువంశసముద్భవా
ప్రాసతోమరకుంతముద్గరపట్టసాయుధసాధనా. 360

గద్యము. ఇది శ్రీమైత్రావరుణగోత్రపవిత్ర బ్రహ్మనామాత్య పుత్త్ర సుకవిజనవిధేయ నారాయణనామధేయప్రణీతం బైన పంచతంత్రం బనుమహాకావ్యంబునందు సంధివిగ్రహం బను నది తృతీయాశ్వాసము.

శ్రీరస్తు

# పంచతంత్రము

## లబ్ధనాశము

క. సమధికగుణమందిర
వాసవవిభవాభిరామ వర్ధితదానా
భ్యాసకరకమల నిర్మల
భాసురసత్కీర్తిహార బసవకుమారా. 1

వ. అవధరింపుము సుదర్శనక్షితీశనందనులు విష్ణుశర్మకుం బ్రణామం బాచరించి లబ్ధనాశం బనుచతుర్థతంత్రం బెఱిం గింపు మనిన నతం డిట్లనియె. 2

క. చెందినయర్థం బితరుల
యందపుమాటలకు విడుచునతిమూఢుఁ డిలన్
డెంవంబు గలిసి కపితోఁ
బొందై యొకమొసలి మోసపోయినభంగిన్. 3

వ. అనినఁ దత్కథాక్రమం బెట్టి దని నృపకుమారు లడిగిన నతం డిట్లనియె. 4

సీ. రంగదుత్తుంగతరంగసంఘంబులు
సరసాభినయకరాబ్జములు గాఁగ
బహువిధప్రచలనపాఠీనపఙ్క్తులు
ధవళవిలోలనేత్రములు గాఁగ

సురుచిరస్నిగ్ధపాండుర ఫేనపటలంబు
చారుతరాట్టహాసంబు గాఁగ
లాలితభూరిబాలప్రవాళంబులు
విరిసినఘనజటాభరము గాఁగ
తే. ఘుమఘుమధ్వని వాద్యఘోషములు గాఁగఁ
జండతాండవాడంబరశంభుమూర్తిఁ
బోలు నని తన్ను జనములు పొగడునట్టి
వర్ణనకు నెక్కి యొప్పు మహార్ణవంబు. 5

ఉ. ఆలవణాంబురాశిదరి నర్జునతాలతమాలసాలహిం
తాలరసాలభూరుహవితానము సొంపు వహింప నచ్చటన్
వేలతరంబు లై నకపివీరులతో బలివర్ధనాముఁ డి
చ్ఛాలఘువర్తనంబుల నజస్రముఁ గ్రుమ్మరుచుండు నత్తఱిన్.

వ. మఱియును దత్సమీపంబున నొండొకయూధనాథుం డై నకపీశ్వరుండు బలివర్ధనునుద్దేశించి. 7

ఉ. ఈముదిమర్కటంబునకు నేటికి నీకపిరాజ్య మంచు ను
ద్దామపటుప్రతాపబలదర్పమునన్ వెడలంగఁ దోలినన్
సీమకుఁ బాసి యొక్కరుఁడు సిగ్గునఁగన్ బలివర్ధుఁ డేఁగెనా
రామవిహారముల్ విడిచి రాజసవృత్తిఁ దొలంగి యయ్యెడన్.

వ. చనిచని యొక్కనదీతీరంబున మధుగర్భం బగునౌదుంబరంబు ఫలభరితం బై నదానినాలోకించి బలివర్ధనుండు దనమనంబున.

క. కామితఫలముల నొసఁగం
గా ముందటఁ గల్పకంబు గానంబడిన
ట్లామేడి కడు ఫలించెను
నాముందటిభాగ్యవాసనకు దృష్టముగాన్. 01

వ. అని తలంచి డాయం బోయి. 11

క. తరు వెక్కి దీర్ఘశాఖలఁ
పరిపక్వఫలంబు లరసి భక్షించుతఱిన్
గరమునకుఁ దప్పి యొకఫల
మరుదుగఁ బడె నీటిలో మహాధ్వనితోడన్. 12

క. ఆచప్పుడు తనచెవులకు
నేచినకౌతుకముఁ బెనుప నెడనెడ ఫలముల్
వైచుచును సహజచాపల
మైచనుమర్కటము చప్పు డాలించుతఱిన్. 13

వ. క్రకచనామధేయం బగుశింశుమారం బమ్మేడిక్రింది జలంబుల లోనఁ గ్రుమ్మరుచుండి మత్స్యమీనపంబున నెన్నఁడును నిట్టి యపూర్వధ్వని విన్నది లేదని తలయెత్తి చూచినప్పు డొదుం బరతరుశాఖాసమారూఢశాఖామృగకరవిముక్త ఫలపతనం బమ్మహాగ్రాహంబు దెలిసి తాను నమ్మధురఫలంబు లుపయో గించి యావృద్ధవానరంబుతోడఁ జెలిమి చేసి తన్మిత్రత్వానం దంబున నమ్మధురఫలాస్వాదనలాభంబున నచ్చోటుగదలం జాలక కొన్ని దినంబులు మఱచియున్న మొసలిం దలంచుకొని యమ్మొసలిభార్య తన సఖిం బిలిచి దానితో నిట్లనియె. 14

ఉ. ఇంతకుమున్ను నాదుహృదయేశ్వరుఁ డెయ్యెడ కైననేఁగినన్
సంతస మొప్ప వచ్చు నిమిషంబున నిన్నిదినంబు లయ్యెఁ దాఁ
జెంతలఁ జేరఁ డేమిటికిఁ జిక్కెనొ కాక పరాంగనారతి
భ్రాంతి నిజాలయంబునకు రాకచటం బ్రియ మంది నిల్చెనో.

క. తెలియంగవలయుఁ బొమ్మని
పలికిన నది పోయి వచ్చి ప్రాణసఖికి నే

ర్పలవడఁగఁ జెప్పఁ దొడఁగెఁ
గలవియు లేనివియుఁ గూర్చి కలఁకం బొందన్. 16

సీ. నెలఁత నీవిభుఁజూడ నీవు న న్నంపినఁ
జయ్యన నేను బ్రచ్ఛన్నవృత్తిఁ
గదిసి చూచితి నొక్కకపిభామ రూపలా
వణ్యవిలాసభావములఁ బెద్ద
మధుగర్భమను నుదుంబరముపై నుండంగఁ
బొడఁగని దానితోఁ బొందు చేసి
యాపొందు మక్కువ నంతకంతకుఁ బెంప
నీయింటి తెరువును నిన్ను మఱచెఁ
తే. బేర్చుమతిఁ బూరుషులు నవప్రియులు గాన
వారి మాన్పంగ నేరికి వశము గాదు
చెలియ నీమీఁదిభక్తిమైఁ జెప్పవలసెఁ
గాక వివరింప నా కేమికారణంబు. 17

క. అమ్మాట మొసలిలేమకు
నమ్మయి తొఁకుటయు నిశ్చయం బని మదిలోఁ
గ్రమ్మెడువిరహానలమున
సమ్మోహనమూర్ఛ పరవశత్వముఁ జేయన్. 18

వ. అమ్మకరవధూటి ప్రియసఖీసంభాషణంబులఁ బెద్దయుం బ్రొద్దు
నకుఁ దెలివి నొంది. 19

ఆ. మగఁడు చేసినట్టినెగులునఁ గడు నొచ్చి
విరహవహ్ని చేత వేఁగి వేఁగి
పొరలుచుండునంతఁ బొలఁతిపై మక్కువఁ
గొన్ని మేడిపండ్లు గొనుచు వచ్చి. 20

వ. ఆక్రకచుం డట్లున్నతనప్రాణవల్లభం జూచి యిట్లనియె. 21

ఉ. పంకజనేత్ర నీయొడలిభారము చూచి భయంబు పుట్టెడుఁ
గింకకుఁ గారణంబు పరికించి యొకించుక నాకుఁ జెప్పినన్
గొంకక తీర్తు నన్న విని కోమలి నెచ్చెలిమోము చూచినన్
శంక యొకింత లే కది నిజంబుగఁ బుట్టెడునట్టిభంగిగాన్. 22

వ. ఆశింశుమారంబున కిట్లనియె. 23

ఉ. అక్కట నీవు పోయినది యాదిగ నీకలకంఠ రుగ్ణతం
జిక్కినఁ జావకుండఁగఁ బ్రసిద్ధుఁడు సిద్ధుఁడు వచ్చి యౌషధం
బొక్కటి చెప్పి పోయె నది యుత్తమ నీ కెఱిఁగించువారమై
యిక్కమలాయతాక్షియును నేనును నీపొడఁగాన మెన్నఁ
డున్. 24

వ. అనిన నమ్మహాగ్రాహంబు. 25

క. సంజీవని మొదలుగ నే
నంజక కొనివత్తు నెట్టియౌషధ మైనన్
రంజకపుమాట గా దిది
కంజాతదళాయతాక్షి గ్రక్కునఁ జెపుమా. 26

వ. అనిన నది యిట్లనియె. 27

క. వానరహృదయముతోఁ దగ
నూనినయౌషధము వెట్ట నువిదకు మానున్
మేనఁ గలరోగ మనుచును
దా నెంతయుఁ గరుణఁ జెప్పి తాపసుఁ డరిగెన్. 28

ఆ. కానఁ గోఁతిగుండెకాయ నీ విప్పుడు
తెచ్చి యిచ్చితేని తెఱవ బ్రతుకు
లేక యుండితేని నీకులభామిని
తనువు విడుచు గడియతడవులోన. 29

వ. అనినఁ దద్వచనంబు లాకర్ణించి యతం డట్టిద కాక యనుచుఁ
గొంతదవ్వరిగి యరిగి తనమనంబున నిట్లని వితర్కించె. 30

క. తరుచరహృదయము నాకుం
దరమే దొరకింపఁ గష్టదశ వచ్చెఁ గపీ
శ్వరుఁడు బలివర్ధుఁ డొక్కఁడు
పురుషార్థపరుండు వానిఁ బొరిఁగొనఁ దగునే. 31

చ. అతని వధించు టెంతయు మహాదురితంబు సమస్తధర్మసం
తతికి నిధాన మీసతి వృథా మృతిఁ బొందినఁ బాప మీ
యెడఁ, మతిఁ దలపోయ నిద్దఱును మాన్యులె యైనను
భార్యరక్ష దా,నతిశయధర్మ మంచుఁ దగ నార్యులు చెప్పఁగ
విందు నెట్లనన్. 32

ఉ. ఎక్కువ చెప్పఁ జూపఁ గలయింట జనించుకులాంగనాళిలోఁ
జక్కఁదనంబు గల్గి గుణసంపద మించి యలౌకికస్థితిన్
నిక్కక యేమృగాక్షి పతి నిర్మలచిత్తము పట్టు భక్తిమై
నక్కమలాక్షి యెవ్వనికి నాలగు వాఁడు కృతార్థుఁ డిమ్మహిన్.

వ. కావునఁ గులకాంతను రక్షించుటయ యుత్తమధర్మంబు
మిత్రుం డైనబలివర్ధనుఁ బరిత్యజింతు నని కృతనిశ్చయుండై
యాశింశుమారప్రవరుం డనుమానించుచు మందమందగమ
నంబున నయ్యుదుంబరంబు చేరం జనుదెంచినం జూచి మిత్రుం
డైన బలివర్ధనుం డతని కిట్లనియె. 34

తే. ఎంతవేగిర మింటికి నేగి తిప్పు
డింతలోననె మరలి రా నెద్దికతము
మందగమనంబుతోఁ జింత నొందె దేమి
కారణం బన్న నమ్మహాగ్రాహ మనియె. 35

క. చిరకాలమైత్త్రి నీయెడ
జరగంగా నింటి కరుగఁ జాలక నేఁ డ
ట్లరిగిన నచ్చటినాయి
ల్లెరవై మదిఁ దోఁచె నిలుప నెట్లగుఁ జెపుమా. 36

క. ఉపకారవాంఛ సఖ్యము
నిపుణతఁ జేయుదురు గాక నీ వేమియుఁ బ్ర
త్యుపకార మపేక్షింపని
సుపురుషుఁడవు కావె యెపుడు సుస్థిరచరితా. 37

వ. అనుటయు బలివర్ధనుం డిట్లనియె. 38

తే. డాసి యుపకారమే నేమి చేసినాఁడఁ
బూని నీతోడఁ జేసినపొందువలన
రాజ్యవిరహితదుఃఖభారంబుఁ ద్రోచి
తాల్మి నున్నాఁడ నదియు యుక్తంబు గాదె. 39

తే. శోకశాత్త్రవభయములఁ జొప్పు మాన్పు
ప్రీతివిశ్వాసగుణహేతుభూత మైన
మిత్త్ర మనునక్షరద్వయమిశ్ర మైన
రత్న మే వేల్పు సృజియింపఁ బ్రబలెనొక్కొ. 40

వ. అని పలికిన విని క్రకచుం డిట్లనియె. 41

ఉ. మింటికి నిక్కునీతరువుమీఁదను నీవును నేను నీటిలో
నొంటిఁ జరింప నోపుటకు నోర్తునె వీఁపున మోచి నిన్ను మా
యింటికిఁ గొంచుఁ బోయెదఁ గపీశ్వర రమ్మన నాక్షణంబ ని
ష్కంటకబుద్ధిఁ బెల్లుఱికి గ్రక్కున వీఁపున వచ్చి నిల్చినన్. 42

క. నిలిచినకపివరుఁ దోడ్కొని
నిలుపోపక మొసలి పలికె నేఁ డీమిత్త్రుం

జలముఁగొని చంపవలసెను
కలఁడే నావంటిపాపకర్ముఁడు జగతిన్. 43

క. స్త్రీకార్యము బలవంతము
నా కింతటిసాధుమిత్త్రు వనచరు మృతుఁ గాఁ
జేకుఱఁగ జేయుకతమున
లోకంబున నింద కేను లోనైతిఁ గదా. 44

వ. అని విచారించి మఱియును దనమనంబున. 45

సీ. హేమంబుమేలుగీ డెఱుఁగంగఁ దలఁచిన
మానుగా నొరసినఁ గానవచ్చుఁ
బురుషులగుణములు పరికించి చూచిన
నెందైన నడవడి నెఱుఁగవచ్చు
లలితగోవృషములఁ దెలియ భావించిన
భారముల్ గాంచి యేర్పఱుపవచ్చు
స్త్రీస్వభావంబులు దెలియుద మన్నచో
నెంతధీయుతులకు నెఱుఁగ రాదు

తే. మాయలకు నిక్క మందులమనికిపట్టు
సకలదోషంబులకు నెల్ల జన్మభూమి
మగువ గావున నిపుడు న న్నగడుచేసి
యేమిపన్నెనో నాసతి యెఱుఁగరాదు. 46

వ. అని తలపోసి వెండియుఁ దనమనంబున. 47

ఆ. ఆఁడుదానికొఱకు నకట నాప్రియమిత్త్రు
వృద్ధుఁ జంప నెట్లు బుద్ధి పుట్టె
ననుచు వినఁగ నాడునమ్మాట లాలించి
వానరుండు పలికె వానితోడ. 48

క. ఏమంటి విప్రుడు నీలో
నేమిటి కీచింత నాకు నెఱిఁగింపు మనం
గా మొసలియు నిట్లను నే
నేమియు ననఁ దప్ప వింటి నే నేమంటిన్. 49

క. అనుమాట కాత్మలోపల
ననుమానము నొంది వానరాధిపుఁ డీతం
డనుమానించుచు వగచుచు
ననుఁ గొనిపోవుటకుఁ గారణం బెయ్యదియో. 50

తే. అడిగి చూచెదఁ గాకంచు నగచరుండు
కలఁక నొందినమదితోడ జలచరేంద్ర
నాకుఁ దోఁబుట్టువైన నీనాతి కిపుడు
నేమమే యన్న నామాట చెవులు సోఁక. 51

ఉ. అల్లన శింశుమారవిభుఁ డాకపినాథునిఁ బల్కె మన్మనో
వల్లభ రోగపడ్డయది వైద్యు లసాధ్య మనంగ దాని కే
నుల్లమునం దలంకెదఁ బ్రయోగము చెప్పినఁ దీర్చువారు లే
రెల్లెడ నీటిలోనిపని యింతియ నాపని మిత్త్రవత్సలా. 52

వ. అనుటయు నాబలివర్ధనుం డిట్లనియె. 53

చ. జలములఁ గాని వెల్పలికిఁ జాల నటంచు విచార మేటికిన్
బలికినమందు దెత్తు ననుఁ బంపు మ టెన్నఁటికేను బోయి భూ
వలయము నెల్లఁ గ్రుమ్మరి దివాకరుఁ డయ్యపరాంబురాశిలో
పల దిగి పోకమున్న వడిఁ బాఱి రయంబున వత్తుఁ బోయెదన్.

క. పో మ్మనవు పోయి మందులు
దె మ్మనవు చికిత్స చాలఁ దెలిసినవైద్యున్
రమ్మనవు భార్య నిజ మగు
నో మ్మనవు దలంక నేమిచోద్యము చెపుమా. 55

వ. అనిన నమ్మకరకులాధీశ్వరుం డిట్లనియె. 56

చ. అడిగినవాఁడఁ బండితుని నాయన చెప్పఁగ మందు నీకడం
దడవఁగ జాల కేను బరితాపముఁ బొందుచు నున్నవాఁడ ని
ప్పుడు నెఱిఁగింపకున్న నది పోవదు నామదిలోన దుఃఖముం
గడవఁగ నీవ కారణ మకారణ బాంధవ యెన్నిభంగులన్.

వ. అనినఁ దరుచరనాథుం డిట్లనియె. 58

తే. మనసు గలిసినచో నొకమాట యైనఁ
గపటమునఁ జెప్పకుండుట కలుష మండ్రు
ప్రాణసఖుఁ డగునాకు దాపంగ నగునె
చెప్పఁ దగనిది యైనను జెప్పు మనిన. 59

వ. అమ్మాటకుఁ బుయిలోట దక్కి మొసలి యిట్లనియె. 60

క. వానరహృదయముతోఁ దగ
నూనినయౌషధముఁ దెచ్చి యువిదకుఁ బెట్టన్
మేనఁ గలరోగ మంతయు
మాను ననుచు నొక్కవెజ్జు మగువకుఁ జెప్పెన్. 61

ఉ. చెప్పిన నన్నుఁ దె మ్మనియెఁ జెప్పెడి దేమి మఱెందు నేరికిం
జెప్పక నీకునుం దెలియఁ జెప్పఁగఁ జాలక యాత్మ నాకు నేఁ
జెప్పఁగ నీవు నన్నడుగఁ జెప్పితిఁ గాని భయంబు పుట్టఁగాఁ
జెప్పుట గాదు కార్యగతి చెప్పితి వానరయూథనాయకా. 62

క. తనసతికి రోగ మైనం
గనుఁగొని యది చక్కఁబెట్టఁగా నేరఁ డితం
డని నన్ను బంధుజనములు
మనుపీనుఁగుగాఁ దలంప మను టేమిటికిన్. 63

వ. అని చెప్పినఁ గపీశ్వరుండు. 64

తే. సగముచచ్చినమేనితోఁ జకితుఁ డగుచుఁ
గంపమొందుచు వృద్ధమర్కటముమూర్ఛ
మునిఁగి కన్నులు గానక మునిఁగి కొంత
వడికిఁ దెప్పిఱి యాత్మ దైవంబుఁ దూఱె. 65

వ. తనలో నిట్లని వితర్కించె. 66

తే. ప్రేమ నటియించి యింటికి బిలువఁ దడవ
మొసలిమాటకు నా కేల మోసగలిగె
నెంతముదిసిన నేను జితేంద్రియుండఁ
గామి నాపదఁ బడితి యుక్తంబు గాదె. 67

వ. అని మఱియును. 63

సీ. రాగసంయుక్తుఁ డరణ్యవాసంబున
బహుకాల మున్నను ఫలము లేదు
నెఱయఁ బంచేంద్రియనిగ్రహంబున నిల్లు
గదలకున్నను వాని కదియ ఫలము
వీతరాగుండును వినయశీలుండును
వివిధధర్మాధర్మవిదుఁడు నగుచు
సత్యదయాదానశౌచంబు లెవ్వఁడు
గలిగి వర్తించు నిష్కపటవృత్తి
తే. వానినిలయంబు ఘనతపోవనము గాని
దండకాషాయవస్త్రకమండలువులు
ముండితయును భిక్షాటనముం జదువును
నాటకమ్ము లివిప్రయోజనములు గావు. 69

వ. అని తలంచి బలివర్ధనుండు దైవానుకూల్యంబున నాయుశ్శే

షంబుకతంబునం దనకు నప్పటి కొక్క యుపాయంబు దోఁచిన
నాశింశుమారంబునకు నిట్లనియె. 70

క. ఓయన్న కల్ల చేసితి
నీయర్థము మున్ను నాకు నెఱిఁగించిన నే
నాయంతరమునఁ గలిగిన
యాయాపథ మపుడ కొంచు నరుదెంతుఁ గదే. 71

ఉ. గుండియ పుచ్చి పెట్టుకొని కొమ్మపయిం బదిలంబు చేసి నే
నుండుదు నట్టిభారమున కోర్వక యెప్పుడు నేఁడు నే నభా
గ్యుండను నీకు నక్కటకుఁ గూర్చినసొమ్మని మున్నెఱింగి తే
కుండుటఁ జేసి యే మని ప్రియోక్తులు వల్కుదు నేమి
సేయుదున్. 72

వ. అయినను ద్వరితగమనంబున నయ్యుదుంబరంబుకడకుం జని
యస్మదీయహృదయంబు గొని చనుదెంత మని పలికి
వెండియు. 73

తే. మొనసి ధర్మార్థకామముల్ మూఁటివలన
ఫలము లెవ్వాఁడు దా నాసపడియె నేని
వాఁడు రిక్తహస్తములఁ బోవంగఁ దగదు
భూమిసురరాజకాంతలపొంత కెందు. 74

క. మానుగ హృదయం బచ్చటి
మ్రానం దగిలించి యుంటి మన మట మగుడం
గా నరిగి వేగ యది గొని
మానిని యున్నెడకు నిపుడ మగలఁగవలయున్. 75

వ. అనిన. 76

క. అమ్మాటల జలచరమును
సమ్మతితో నమ్మి వృక్షచరమును గొనుచుం
గ్రమ్మఱ మున్నున్న తరువు
కొమ్మం గదియింపఁ గపియుఁ గుప్పించి వడిన్. 77

తే. అంతకంతకుఁ బొడవుగా నరిగి యరిగి
వృక్షశాఖాగ్రమున నున్న వృక్షచరముఁ
గాంచి చెలికాఁడ రమ్ము వేగంబ మనకుఁ
బోవలె నటన్న జలచరంబునకు ననిగొ. 78

ఆ. పొందు చేసిచేసి పొసఁగక మతి
తిరిగి వచ్చునతఁడు తిరుగఁ జెడున
గార్దభంబు నక్కకఱపుల హరిఁ జేరి
పోయి తిరిగి వచ్చి పొలిసినట్లు. 79

వ. అనినఁ దత్కథాక్రమంబు తెఱంగు జలచరపతి యడిగినఁ దరు
చరపతి యిట్లనియె. 80

సీ. కలఁ డుగ్రవనములోపల నొక్క మృగరాజు
గోమాయు వతనికిఁ గూర్చుభృత్యుఁ
డై పంపు చేయంగ నమ్మృగేంద్రుఁడు జంబు
కముఁ జూచి పలికె దైన్యము దలిర్ప
ననఘ మహోదరవ్యాధి నాతనువున
నొదవి యంతంతకు ముదురఁ జొచ్చె
ననుగుణం బగుమందు లరసి సేవింపక
యూరకుండిన మీఁద నొప్పకుండు

తే. గార్దభముకర్ణ మొక్కటి గలిగెనేని
యాపథంబున నది గూర్చి యారగించి

మచ్ఛరీరంబు రోగంబు మాన్పుకొందుఁ
గానఁ గొనిరమ్ము ఖరము నాకడకు వేగ. 81

చ. అనిన మహాప్రసాద మని యామృగధూర్తము పోయి.
రోయుచుఁ, జని నగరోపకంఠమునఁ జాకలవానికృశాంగ
గార్దభం,బును బొడగాంచి సద్వినయపూర్వముగా మృదు
భాషణంబులన్, గనికర మొప్పఁ బల్కె నధికం బగునేర్పున
నాక్షణంబునన్. 82

క. ఎలయించి తెచ్చి యిచ్చినఁ
బొలియింప మృగేంద్రుఁ డడరఁ బొడమినభీతిన్
నిలువక వడిఁ జవి మున్నిటి
నెలవున గార్దభము పోయి నిలిచినపిదపన్. 83

వ. ఆమృగపతి గోమాయువుం గనుంగొని మన యత్నంబు
విఫలంబయ్యె నింకను బ్రయత్నంబున ననుసంధింపవలయు
ననిన నాసృగాలం బిట్లనియె. 84

తే. మునుపు గార్యంబు దెలియనిమూఢచిత్తుఁ
బొసఁగ నిది సేయుమనమోసపోవుఁగాని
దృష్టముగఁ జూచి కపటంబు దెలిసెనేని
పూని క్రమ్మఱ మఱి మోసపుచ్చ రాదు. 85

వ. అయినను నాబుద్ధిబలంబునసుం బలుకులనేర్పునను నాగార్ద
భంబుమనంబునం గలభయం బుడిపి దేవరదివ్యశ్రీపాద
పద్మంబులసన్నిధిం బెట్ట నవధరించెదం గాక యని క్రమ్మఱం
జని గార్దభంబుఁ గాంచి యిట్లనియె.

ఉ. మృగరాజుం గని కొల్చియాయనకడన్ మేఁ తెల్లనీసొమ్ముగాఁ
దగ భృత్యప్రకరంబు లెల్ల నిసుఁ దాత్పర్యంబునం జూడఁగా

జగతిం బెద్దఱికంబు గట్టుకొన కీజాడన్ భయభ్రాంతి నొ
ప్పగు నే క్రమ్మఱి పాఱ సాహసవిహీనాత్ముండు పెం పొందు నే.

వ. అని మఱియును. 88

ఉ. మానుగ నంటరానికొఱమాలిన మైలలమోపు వీఁపునం
బూని ధరించి తిట్టియును మొత్తియు నీరజకుండు నొంపఁగా
నీనిగృహంబునందుఁ దగవే నడపీనుఁగవై చరింప ని
చ్ఛానుగుణంబుగా నభిమతార్థము లానఁగ లేక యక్కటా.

వ. అనుటయు నాగార్దభం బిట్లనియె. 90

క. నమ్మించి యేను నీవును
నిమ్ముల బ్రదుకుద మటంచు నెలయించి నను
రమ్మని కొనిచని మృగపతి
సమ్ముఖమునఁ బెట్టి చంపఁ జను నే నీకున్. 91

తే. శితనఖంబులు మెఱయంగ జేగురించు
ఘనతరానన మతిభయంకరముగాఁగ
నుఱుక నుంకించున ట్లున్న యుగ్రహరికి
బెదరి పాఱక నిలువ నే బిరుదనయ్య. 92

వ. అనిన నమ్మాటకు జంబుకం బిట్లనియె. 93

మ. మొదలం జూడనివాఁడ వైనకతన న్మంచెన్ భయం
బెంతయున్, గదియం బోయి నమస్కరింప నతఁడున్
గారుణ్యపూర్ణాంగుఁడై, చెదరం బాఱఁగనీక ప్రోచు నధిక
శ్రీయుక్తుఁగా భృత్యు నీ, వది గాన న్వెర వేని వచ్చితివి
పంచాస్యంబుపొం దొప్పదే. 94

వ. అని మఱియును. 95

చ. వలసిన భక్ష్యభోజ్యము లవారణఁ బారణ సేయవచ్చు ని
చ్చలుహరిమూలభృత్యవనజంతునికాయములోన నెక్కుడై
మెలఁగఁగ వచ్చుఁ జల్లనిసమీరము వీవఁగ నిచ్చవచ్చు శ
య్యల శయనింప వచ్చును మహామహిమాఢ్యుని బంటుగా
మదిన్, దలఁపనిపేదకున్ బ్రతుకు దాఁ గలదే తలపోయ
నెమ్మెయిన్. 96

శా. నాయత్నంబు ఫలింప దయ్యె నకటా నాస్నేహభావంబునన్
బాయం జాలక కూడి యుండుటకునై ప్రార్థించినట్టే కదా
ధీయుక్తుండు త్రివర్గముం బడయ నర్థిం గోరఁగా నెయ్యెడన్
శ్రేయఃప్రాప్తికిఁ బెక్కువిఘ్నము లగున్ జింతింప నింతేటికిన్.

వ. అని మఱియునుం బ్రియాలాపంబులు పలుకునగ్గోమాయువు
మృదుమధురభాషణంబులకు నోటుపడి గార్దభం బిట్లనియె.

క. కందువచుట్టమవై మది
కం దంతయుఁ బాపి మీఁదఁ గలభాగ్యము నా
కందించి మనుపఁ దలఁచితి
కందళితస్నేహభావగౌరవ మెసఁగన్. 99

క. కడుపున కందియు నందని
కుడుపుల ననుదినముఁ గుదిలఁ గుడుచుటకంటెన్
గడు దొడ్డరాజుసేవకు
నొడఁబడి యొకనిమిష మైన నుండఁగ రాదే. 100

వ. అని నిశ్చయంబుగాఁ బలికి గార్దభం బమ్మృగధూర్తంబు

వెనుకం జనఁ గొనిపోయి మృగేంద్రుముందటం బెట్టి
యిట్లనియె. 101

క. నమ్మించి తోడితెచ్చితి
నమ్మినభృత్యుండు గాఁడు నాక యితని నీ
సొమ్ముగ నోరం గన్నుల
నిమ్ముగఁ జూడంగఁ దగు మృగేంద్రకులేంద్రా. 102

వ. అని విన్నవించి యామృగధూర్తంబు దోలంగిన మృగ
నాథుండు. 103

ఆ. ఉఱికి గార్దభంబు నుగ్రదంష్ట్రలు గల
ముఖమునం దుదగ్రనఖములందు
నొత్తి పట్టఁ దడవ యుసురు పోయినదానిఁ
జూచి జంబుకంబుఁ జూచి పలికె. 104

తే. దినముఖోచితకర్మంబు దీర్చి వచ్చి
యనుభవించెద నందాఁక నరసి యుండు
మనుచు సింగంబు నదికిని నరుగఁ జూచి
జంబుకంబుఁ దలంచె మనంబులోన. 105

సీ. దివ్యౌషధం బని తెప్పించి మృగరాజు
నన్నుఁ గావలి పెట్టి నదికిఁ బోయె
నీమందు మృగపతి కేల పోవఁగనిత్తు
గ్రక్కున నతఁ డిందు రాకమున్న
భక్షించి నామేనఁ బరఁగురోగములెల్ల
హరియింతు నముచు మహాభిలాష

మొదవ గార్దభకర్ణహృదయంబు లప్పుడు
తోడిఁబడఁ దిని మాఱి దుడుచుకొనుడు

తే. నంత హరివచ్చియాగార్దభావయవము
లెక్కడికిఁబోయె నిపు డన్న నెఱుఁగనట్లు
మూర్ఖచిత్తున కెందైన మొదలఁగలవె
హృదయకర్ణంబు లవి చూడ కెఱుఁగకంటి. 106

వ. కావున నీగార్దభంబునకు హృదయకర్ణంబులు లేవనిన నట్లు కాఁబోలు నని యామృగేంద్రుం డూరకుండె నేను నవ్విధంబున మోసపోవ నగ్గార్దభంబు గాను విచ్చేయుమనిన నాశింశుమారవల్లభుండు లబ్ధనాశంబునకుఁ జింతాక్రాంతుండగుచు సిగ్గుపడి జలమధ్యంబునకుం బోయె నని యిట్లు విష్ణుశర్మ లబ్ధనాశం బనుచతుర్థతంత్రం బెఱింగించినఁ గుమారులసంప్రేక్ష్యకారిత్వం బెఱిఁగింపు మనుటయు. 107

ఉ. తెల్లదలాటరాయ సుదతీజననూత్నమనోజ మల్లికా
వల్లభ సప్తసప్తికులవర్ధన మేదినగేంద్రధీర సం
ఫుల్లసరోజనేత్ర గుణభూషణ యాహవభీమ తమ్మభూ
వల్లభుకూర్మిపుత్త్ర బసవక్షితిపాలక రాజశేఖరా. 103

ఉత్సాహ.—

మందరాచలేంద్రధీర మనుచరిత్రసంతతా
నంద కులపవిత్ర ధర్మనందితావనీజనా
కుందచంద్రహారహీరగురుయశఃప్రకాశ గో
విందచరణకమలయుగళవిస్ఫురన్మనోంబుజా. 109

భుజంగప్రయాతము.—

రమాసూను రేఖావిరాజత్స్వరూపా
యుమానాథఫాలానలోద్యత్ప్రతాపా
సమస్తావనీచక్రసంస్తూయమానా
నమద్రాజసంరక్షణాసంవిధానా. 110

గద్యము. ఇది శ్రీమైత్రావరుణగోత్రపవిత్ర బ్రహ్మనామాత్య పుత్త్ర సుకవిజనవిధేయ నారాయణనామధేయప్రణీతం బైన పంచతంత్రం బనుమహాకావ్యంబునందు లబ్ధనాశం బనునది చతుర్థాశ్వాసము.

శ్రీ ర స్తు

# పంచతంత్రము

## అసంప్రేక్ష్యకారిత్వము

శ్రీ కారుణ్యకటాక్ష
స్వీకృతబుధబంధునికర జృంభితవిమలా
నీకగ్రీవాఖండన
భీకరకరవాల బసవపృథ్వీపాలా. 1

వ. అవధరింపుము సుదర్శనక్షితీశ్వరనందను లసంప్రేక్ష్యకారిత్వం బెఱింగింపు మనిన విష్ణుశర్మ వారల కిట్లనియె. 2

చ. నిజమును గల్లయుం దెలియనేరక క్రోధమునం బ్రమత్తుఁడై
సుజనుల కెగ్గు చేసి చెఱుచుం దనమున్నటిమైత్త్రి మానవుం
డజగరముఁ హరించినమహానకులంబు వధించి బ్రాహ్మణుం
డజితమనోవ్యథం బొరలు నయ్యవివేకముఁ బోల్పఁ బట్టగున్.

వ. అనుటయు నృపకుమారులు తత్కథాక్రమం బెఱింగింపుఁ డనిన నతం డిట్లనియె. 4

సీ. గౌడదేశంబునఁ గల దగ్రహారంబు
సకలసౌఖ్యములకు జన్మభూమి
తన్నివాసంబుగ ధరణీసురాన్వయ
జాతుఁ డుండును దేవశర్మ యనఁగ

నాయనకులకాంత యాజ్ఞసేని యనంగ
శుభలక్షణాంగి యాసుదతి తనకు
ఘనపురాకృత పుణ్యకర్మంబునను జేసి
సమధికంబైనగర్భము ధరింప
తే. నధికసంతోషచిత్తుఁడై యతివఁ జూచి
నాతి నీగర్భమున నున్ననందనుండు
మనకులం బెల్ల నుద్ధరింపంగ నోపు
భాగ్యవంతుఁ డౌ ననఁ దనభర్తఁ జూచి. 5

వ. యాజ్ఞసేని యిట్లనియె నాథా నీమనోరథసహస్రంబులేమియుఁ గొఱగా వీయస్థిరంపుసంసారంబునకుఁ గడకట్టినకార్యంబు తుద ముట్ట నేర దని పెద్దలచే వినంబడు విను మని యిట్లనియె. 6

తే. మహి ననాగతకార్యంబు మదిఁ దలంచి
కోరునాతఁడు దుఃఖసంకులత నొందుఁ
బెక్కువిధములఁ జింతింప బెండువడుట
సహజ మది సోమశర్మునిజనకునట్లు. 7

వ. అనినఁ దత్కథాక్రమంబు విప్రుండు తనభార్య నడిగిన నాని తంబినీతిలకం బిట్లనియె. 8

సీ. పరఁగ విద్యాభ్యాసపరుఁ డొక్కభూసురుం
డనువుగా మహాశయంబున భుజించి
చనుదేర నొండొకసదనంబు విప్రుండు
పెతరులకై పేలపిండి యిడినఁ
గైకొని తా నొక్కఘటము సంపాదించి
పొందుగా నాసక్తు వందుఁ బోసి

చేతి కందెడునట్టి చేరువ నాకుంభ
మెలమితోఁ బ్రీతుఁడై యచటఁ బెట్టి
తే. సమధురోత్కృష్టభోజనోత్సవముకతన
నతఁడు సుఖసుప్తి నొందెడునవసరమున
నంతకంతకు దట్టమై యలముఁబడిన
గురుమనోరథ మంతయుఁ గోరుచుండి. 9

వ. ఆనైష్ఠికుండు తనలో నిట్లని తలపోయం దొడంగె. 10

చ. కలి వరుదెంచినం ఘటముగర్భమునం గలసక్తు వంతయుం
దలఁగక యమ్మి మేఁకఁ గొన దానికిఁ బిల్లలు రెండు గల్గు న
మ్మలికలు రెంటికిం గలుగు మానుగ దూడలు నాల్గు వానికి
ట్లలిమెలి నెన్న నెన్మిదిఁ బదాలును ముప్పది రెండుఁబుట్టఁగన్.

వ. ఇవ్విధంబునం గ్రమక్రమవృద్ధిం బొందినఛాగంబులు కాలాం
తరంబున శతసహస్రసంఘంబు లగుటయు వాని నమ్మి గోధనం
బులు సంపాదింప నవియును బ్రతిసంవత్సరంబును వత్సంబుల
నిడ ననేకసంవత్సరంబులకు నసంఖ్యాతగోధనంబు లగుటయు
వానియందు. 12

సీ. కోడె లన్నింటిని గూడంగఁ దోలించి
మేదింప దుక్కికి మేతక లైన
మ్రుచ్చుగిత్తలఁ బట్టి ముకుద్రాళ్లు గుట్టించి
గంతగోనెకు వాని సంతపలిచి
బేహార మాడింపఁ బెరిఁగినధనమునఁ
గమ్మతంబులు వెట్టఁగా ధరిత్రి
నమరినధాన్యంబు లమ్మించి ధనములు
గోటులసంఖ్యలై కొలఁది మీఱి

తే. రాజుచేత మహాగ్రహారములు వడసి
గుళ్లఁ జెఱువులు వనములు గోపురములు
సౌధములు మల్లెసాలలుఁ జప్పరములు
నంతిపురములు లోనుగా నమరఁ జేసి. 13

సీ. గజనికేతనములు గట్టించి యన్నిఁట
భద్రదంతావళప్రతతి నుంచి
వాజిశాలలు గట్టి వరరూపజవసత్త్వ
సంపన్నవర్ణితాశ్వములఁ గట్టి
పరశుపట్టసగదాప్రాసతోమరకుంత
కోదండహస్తులఁ గూడ నేలి
భేరీమృదంగగంభీరరావంబులు
కలయంగ ముందటఁ జెలఁగుచుండ
తే. రత్నభూషణాలంకృతరమ్యగాత్రు
ననుదినంబును వాహ్యాళి కరుగు నన్నుఁ
జూచి బంధుజనంబులు చోద్యపడుచు
నెలమిఁ దమకన్నియల నాకు నీఁ దలంప. 14

క. కులమును రూపును గుణమును
గలకోమలిఁ బెండ్లియాడి కాయజకేళిం
జెలఁగంగఁ బెద్దకాలము
జలజాక్షికిఁ జనుచునుండ సంతతిలేమిన్. 15

తే. పెక్కునోములు నోమంగ భీతహారిణ
నేత్ర గర్భంబు ధరియించి పుత్రుఁ గాంచ
నాఁడు నత్యంతసుకుమారవైభవమునఁ
బేరు సోమశర్మ యనంగఁ బెరుఁగుచుండ. 16

తే. కనకసూత్రంబుతో మొలగంట లమర
బోక నలికంబుపై రావిరేక లమరఁ
జరణయుగమున నందియల్ మొరయుచుండ
నంతటంతటఁగూర్చుండి యాడునపుడు. 17

వ. పనితమకంబునఁ గృహిణి బాలకు నెత్తక యుండు దెట్లు నీ
వని భృకుటీవికారవదనాంబుజుండై వసుధామరుండు తాఁ
దనకర మొప్పఁ జూచి ఘనదండము గైకొని ప్రేయఁ బిండి పె
ట్టినకలశంబు భగ్న మగుడుం దెలి వొంది యనంతరంబునన్.

క. తలయుం జీరయు నొడలును
దెలతెలఁగాఁబడ్డపిండి దిక్కులు గప్పఁ
బలపలని వేడ్కతో డుత
వెలవెలనై బ్రాహ్మణుండు విస్మితుఁ డయ్యెన్. 19

వ. విస్మితుండై మనోరాజ్యంబు మిథ్య యగుటకుం జింతా
క్రాంతం బగునంతఃకరణంబుతో నెగ్గువడి యూరకుండెంగావున
నీవును నమ్మహీసురునట్ల యనాగతమతిం దలంపం దగ దన్న
కొన్ని దివసంబులకుం బరిపూర్ణం బయినగర్భంబున నాతన్వికి
శుభలక్షణాలంకృతుం డైననందనుండు పుట్టిన సాంద్రానందం
బునం బొదలుచున్నసమయంబున. 20

తే. పుణ్యదివసంబు వచ్చినఁ బోలఁతి వేడ్క
నర్భకుని నాత్మనాథున కప్పగించి
విప్రకన్యాసమేతయై వెడలి నదికిఁ
బావనస్నాన మొనరింపఁ బోవునంత. 21

ఉ. ఆనగరంబుభూపతిగృహంబునఁ బుణ్యదినంబు వచ్చినఁ
దానముఁ గైకొనం దలఁచి తక్కినవిప్రులు పాఱుచుండఁగాఁ

దా నది చూచి బ్రాహ్మణుఁడు తద్దయు శోకము నొంది యాత్మ
లో, మానిని నేల పంపితిఁ గుమారునిరక్షకు లెవ్వ రిత్తఱిన్.

వ. అని మఱియు నమ్మహీసురవరుండు తనమనంబున. 23

ఉ. ఎన్నఁడు వచ్చుఁ బుణ్యతిథి యెన్నఁడు దానముచేయు భూవ
రుం, డెన్నఁ డకించనత్వమును నేఁ నెడఁబాసి సమస్తవస్తుసం
పన్ననికేతనుండ నగుభాగ్యము గల్గునొ యంచుఁ గోర్కిమై
నున్నయెడన్ ధనాగమము నొందుటకుం దఱితప్పె నెట్లొకో.

ఉ. అక్కఱ లెల్లఁ దీఱవు నృపాగ్రణికిం బొడసూపకున్న నా
కిక్కడ వెన్నపాపనికి నెవ్వరు కాపిఁక వేళ దప్పెఁ బో
నక్కడ నేప్రయోజనము లబ్బు మనంబున మానవుండు దా
నొక్కటి చింతసేయ విధి యొక్కఁడు వేఱ తలంచు నక్కటా.

ఆ. అనుచుఁ గదలి పోవు నట పోయి క్రమ్మఱ
మగిడి వచ్చి బాలుమొగము చూచు
సుదతి వచ్చుతెరువు చూచు దిక్కులు చూచు
నిక్కి చూచు గోడలెక్కి చూచు. 26

వ. ఇవ్విధంబున నాందోళించుచు డెందంబు కొందలం బందనం
దందుసందడిం బొందుచుఁ బొందుపడి డిందుపఱుచుకొని
పుత్రసమానంబుగా మునుమున్న పెంచిననకులంబు నాలో
కించి దాని బంధించినసూత్రంబు విడిచి కొనివచ్చి కుమారుని
చుట్టునుం ద్రిప్పి సంజ్ఞగా నెఱింగించి తలవాకిటం బదిలం
బుగా నిలిపి పుత్రసంరక్షణంబు నీకుం గర్తవ్యం బని పలికి
బ్రాహ్మణుండు చనినం దదనంతరంబ. 27

సీ. నకులంబు చూడంగ నొకకృష్ణసర్పంబు
వడిగొని మూషికద్వారవీథి

గాఁ జొచ్చి బాలునిఁ గవియునంతట ముంగి
యుదరినాగము ముట్టె యొడిసి పట్టి
కంఠంబు గ్రక్కున ఖండించి మే నెల్ల
శతఖండములు చేసి చంపి వైచి
నవరక్తధార లాననమున జొత్తిల్లి
శోభిల్లు మున్నున్నచోన నిలువఁ

ఆ. దాన మంది యపుడు ధరణీసురుఁడు తన
పట్టిఁ దలఁచుకొనుచుఁ బాలు తెంచి
శిరము నోరు రక్తపరిషిక్తముగఁ దన
ముంగిటఁ దనుఁ గన్నముంగిఁ జూచి. 28

క. ఈనోరు రక్త మూరక
కానేరదు శిశువుఁ జంపెఁగా దుర్జాతం
బైనపురు వంచు నుగ్రత
దానిం జావంగ నడిచెఁ దత్క్షణమాత్రన్. 29

వ. అడిచి యమ్మహీదేవుం డభ్యంతరమందిరంబునకుం జని శత
ఖండీకృతకృష్ణసర్పంబును జెలంగి యాడుచున్న తనకుమారుం
గనుంగొని నకులమరణంబునకుఁ బరితప్తాంతఃకరణుం డగుచు
నుదరతాడనంబు చేసికొనియు శిరంబు పగుల మోఁదు
కొనియు ధరణింబడి పొరలుచు మొఱలు వెట్టుచు ననేక
కాలంబునంబట్టి పట్టివలెఁ బెంచిననకులంబుం బరామర్శింపక
వధించినపాపం బేమిటం బాయు నని మఱియు ననేకప్రకా
రంబులఁ బ్రలాపించు సమయంబున భార్య చనుదెంచి యిది
యేమినిమిత్తం బనియడిగిన నతండు తద్వృత్తాంతం బంతయుం
జెప్పిన నమ్మగువ యతని కిట్లనియె. 30

క. పదిలముగ వినక చూడక
మొదలఁ బరామర్శ చేసి మొనయక పనుసం
బొదవించు నెవ్వఁ డాతం
డదయత క్షౌరకుఁడువోలె నాపదఁ బొందున్. 31

వ. అనిన నవ్విధం బెఱింగింపు మని యావిప్రుం డు భార్య నడిగిన నమ్మానినీతిలకం బిట్లనియె. 32

చ. కలఁ డొకపట్టణంబునను గ్రామణి వైశ్యకుమారుఁ డెల్లవారలుఁ గొని యాడుసచ్చరిత్రవివరంబుగలం డతిధార్మికుండు పెద్దలయినతల్లిదండ్రులును దత్పరివారము రోగబాధలన్ బొలిసిన దాదిచేఁ బెరిఁగి పూర్వవయఃపరిపాకశాలియై. 33

ఆ. ఉండి సెట్టిబిడ్డఁ డొకనాఁడు తనదాదిఁ
జేరఁ బిలిచి నాకుఁ జెప్పు మతివ
యయ్య చేర్చినట్టియర్థ మెక్కడఁ బోయెఁ
దెలిసి లేమి నెట్లు తిరుగువాఁడ. 34

సీ. తల మాసినప్పుడును దైల మించుక లేక
ముదమునఁ గోకయు మొలకు లేక
కడుపార నన్నంబు కుడువ నెన్నఁడు లేక
మన సైన నొకపోఁక తినఁగ లేక
కమ్మపువ్వులపూఁత కలలోపలను లేక
పేర్మికతంబునఁ బెండ్లి లేక
ప్రియబంధుజనులకుఁ బెట్ట నేమియు లేక
దీవించునర్థులఁ బ్రోవ లేక
తే. యేల యున్నాఁడ నీదేహ మేల నాకు
విడుతు నీప్రొద్దె కాదేని విపినభూమి

చొచ్చి మునివృత్తిఁ దపము భాసురముగాఁగఁ
జేసి పుణ్యలోకంబులు చేరువాఁడ. 35

వ. అనినం గన్నీరొలుక నయ్యుపమాత యిట్లనియె. 36

క. నాకన్నతండ్రి నీ కీ
శోకం బేమిటికి నేను జూడఁగ భాగ్య
శ్రీకలిమి మెఱయుచుండెదు
లోకంబులు వొగడ బంధులోకములోనన్. 37

తే. వెలయ నీవు జనించినవేళఁ దొల్లి
దివ్యయోగీంద్రు నడిగినఁ దేటపఱిచె
నిన్నిసంవత్సరంబులు నిట్టిమాస
మిట్టిదినమున శ్రీకాంత యితనిఁ జేరు. 38

వ. అని యతం డిట్లు చెప్పె నది యాదిగ నేను సంవత్సరమాస
దినంబు లెన్నికొనుచుండుదునదియును నెల్లింటికిం బరిపూర్ణం
బగుచు వచ్చెఁ దప్పదని యవ్వైశ్యకుమారు నూఱడంబలికి
మజ్జనభోజనాదుల నతనిఁ బరితుష్టుం జేసి మృదుతల్పంబున
నునిచిన నారాత్రి నిద్రించె నక్కుమారుండును దీర్ఘనిశ్వాస
వ్యాకులమానసుం డగుచుఁ దృతీయయామంబున నిద్రా
ముద్రితలోచనుం డయ్యెఁ జతుర్థయామావసానంబున. 39

ఉ. బద్ధగజాజినాంబరము బాలశశాంకకలావతంసస
న్నద్ధజటాభరంబు కరుణారసపూర్ణము నైనమూర్తితో
శుద్ధపటీరహీరరుచిశోభితవర్ణము నైనమూర్తితో
సిద్ధవరేణ్యుఁ డొక్కరుఁడు చెచ్చెర నాతనిఁ జేరి యిట్లనెన్.

శా. ఓరీ వైశ్యకుమార సాహసమహోద్యోగంబునన్ జావఁగాఁ
గోరం గారణ మేమి యేఁ గలుగ నీకుం జింత యింతేల న

న్నారాధించితి పూర్వజన్మమున నయ్యత్నంబునన్ సంపదల్
చేరం బ్రాప్తము నేఁటరేపటను నిశ్చింతుండవై యుండుమీ.

క. కల యని చూడకుమీ నా
పలు కంతయు నిక్కువంబు భావించి మదిన్
దలపోసి యేను జెప్పిన
తెలివిం దగ నాచరింపు ధీయుక్తుఁడవై. 42

వ. అవ్విధం బెట్టి దనిన. 43

సీ. అరుణోదయంబున హరిహరస్మరణంబు
చేయుము మేల్కాంచి చిత్త మలరఁ
దల దువ్వి ముడిచి వస్త్రము పొందుగాఁ గట్టి
చెనసి యాచమనంబు చేసి వచ్చి
సుస్నాన మొనరించి సురభూసురార్చనా
యత్తచిత్తుం డెట్ల యట్ల యుండు
తఱి వచ్చి భిక్షుకత్రయము నీముందటఁ
బొడమినఁ గని వారిఁ బూజ చేసి

తే. లగుడమున మస్తకంబులు పగుల నడువఁ
దాఁకు వడునట్టిభిక్షుకత్రయము చూడఁ
దక్షణంబున ఘననిధిత్రయము నగుచుఁ
గోటిసంఖ్యలమాడల కుప్ప లగును. 44

వ. ఇవ్విధంబున సంప్రాప్తం బయిన ధనంబువలన. 45

సీ. దేవతాగృహములు దృఢముగాఁ గట్టించి
ఘనతటాకంబులు కలుగఁజేసి
వనములు పెట్టించి వడుగులుఁ బెండ్లిండ్లు
భూదేవసమితికిఁ బొందుపఱిచి

కీర్తికి నెలవై నకృతులకుఁ గర్తవై
నెలకొన నంతంత నిధులు నిలిపి
యధిపతిచేఁ గొని యగ్రహారము లిచ్చి
మఱియుఁ బొందైనధర్మములు చేసి
తే. యాశ్రితుల బంధుజనముల నరసి మనిచి
పుత్రపౌత్రాభివృద్ధితోఁ బొగడువడఁగ
లాలితంబుగఁ బెద్దకాలంబు బ్రతుకు
మనుచు సిద్ధుండు కానరా కరుగుటయును. 46

వ. అప్పు డావైశ్యకుమారుండు తనదాదిం బిలిచి యిట్లనియె నేఁ డరుణోదయానంతరంబ మనగృహం బలంకరించి శుచిస్నానంబు చేయించి గృహదేవతలఁ బూజింపు ముదయవేళకు నెద్దియేనియు శుభప్రాప్తికిఁ గారణంబు గలదు పొమ్మనిన నమ్ముదుసలి దాదియు నట్ల చేసిన యనంతరంబ. 47

సీ. పాకశాసనపురప్రాసాదశిఖరాగ్ర
గురుతర సౌవర్ణకుంభ మనఁగఁ
బూర్వదిగంగనాస్ఫురితఫాలస్థలీ
దీపితసిందూరతిలక మనఁగ
బహులవీచీస్ఫురత్ ప్రాగ్దిగంభోరాశి
కూలప్రవాళనికుంజ మనఁగ
నమరాధిపతిసతీహస్తాబ్జవిన్యస్త
మోహనమాణిక్యముకుర మనఁగ
తే. నరుణకిరణుండు పొడచూపె నఖలజనక
రాబ్జములతోడఁ గుముదవనాలి మొగుడ
జారచోరులచిత్తంబు జల్లనంగఁ
జక్రవాకంబు లానందజలధిఁ దేల. 48

వ. ఇవ్విధంబున సూర్యోదయం బగుటయుఁ గనుంగొని యవ్వై
శ్యకుమారుండు తనదాదిం బిలిచి యిట్లనియె. 49

క. క్షౌరాభ్యంగస్నానము
లారంగ నవశ్య మగుట నతిశీఘ్రగతిన్
జేరంగఁ బిలువు నాపితు
నీరును నటకలియుఁ గాచి నీవు లతాంగీ. 50

వ. అనిన నాయమ విదగ్ధక్షౌరకుంబిలిచి తెల్పిన వాఁడును దంత
ధావనపదనఖధావనాది క్షౌరకర్మంబులు తనకు నత్యంత
సమీచీనంబుగాఁ జేసినం బ్రియంబంది యవ్వైశ్యుం డతని
కిట్లనియె నీ వింతకుమున్ను నావలన నెన్నఁడును బ్రయో
జనం బెఱుంగవు నేఁడించుకతడవు మద్గృహంబున నిలువుమని
నిలిపి తైలాభ్యంగనస్నానం బాచరించి ధౌతపరిధానశోభి
తుండై మహాదేవు నర్చించి గృహదేవతలం బూజించి విశు
ద్ధాత్ముం డయి యుండ నంత విధిప్రేరితం బైనక్షపణకత్రయం
బావైశ్యకుమారునిముందఱం బొడచూపి నిలిచిన నతండు
వారలం బూజించి తదీప్సితాహారంబులఁ దృప్తులం జేసి లగుడ
ఘాతంబుల నమ్మువ్వురం బ్రహరించిన వారు సంపూర్ణనిధి
త్రయం బగుటయుఁ దద్ధనంబుఁ దనగృహంబున నించుకొని
సుఖంబుండి నాపితునకు విశ్వాససంరక్షణార్థంబుగా సువర్ణ
నిష్కశతం బొసంగి నిగూఢంబుగా ననిపిన. 51

క. కొనిపోయి నిష్కశతమును
తనకాంతకు దాఁప నిచ్చి తద్వృత్తాంతం
బెనయంగఁ దెలిపి మంగలి
మనమునఁ దలపోసి వైశ్యమతముం జేయన్. 52

వ. తనభార్య కిట్లనియె. 53

క. పరదేసు లైనజోగుల
తిరిపంబున నడఁచి ధనముతిప్పలఁ బడసెన్
వెర వెఱఁగి సెట్టిబిడ్డఁడు
తరుణీ నే నొద్దనుండి తప్పక కంటిన్. 54

వ. అని క్షౌరకుండు క్షౌరాభ్యంగనస్నానధౌతపరిధానాది కర్మంబు లావైశ్యకుమారునట్ల తానును నాచరించి వేల్పుల వలగొని భిక్షుకాగమనంబును గోరుచుండునంత నప్పురంబునఁ గాఁపురంబున్న వృద్ధజంగమయ్యయొక్కరుండు క్షౌరకుని గృహద్వారంబు చొచ్చి లోపలికిం జని ధర్మమే సంచితార్థం బని పేరెలుంగున భిక్షంబడుగుటయుఁ గనుంగొని నాపితుం డాభిక్షుకున కిట్లనియె. 55

ఆ. నీవు గాక యుండ నెరయంగ నిరువురఁ
దోడికి వచ్చితేని నోడిక మైన
భంగి మువ్వురకును భైక్షంబు పెట్టెదఁ
గూర్చి తెమ్ము మ్రొక్కు తీర్చుకొనఁగ. 56

వ. అనినం బ్రమోదంబు నొంది యాభిక్షుకుండు మఱియును నిరువురం దోడ్కొని వారుం దానును జనుదెంచి నిలిచినం జూచి క్షౌరకుండు. 57

తే. మెచ్చు లొదవంగ నర్చనలిచ్చి వారి
కిచ్చువచ్చినభోజనం బిడుచు నుండి
త్వరితముగఁ బొఱె వాకిటితలుపు వైచి
శీఘ్రగతి ముట్టి లగుడంబు చేతఁ బట్టి. 58

క. పొడవు గలజంగమయ్యను
బెడతల లగుడంబుచేత బెట్టిడువ మహిన్

బడినఁ గని పాలునిరువుర
బడి తప్పక మొఱలు పెట్టఁ బరువడి నడచెన్. 59

క. అప్పుడు మొఱ్ఱో యనుచుం
దప్పక ముప్పురును గూయఁ దలవరులు వడిన్
దప్పుగొని మదురుగోడలు
కుప్పించి యదల్చి వెఱవకుఁడు మీ రనుచున్. 60

వ. ఆభిక్షుకత్రయంబును మోపించుకొని నాపితుం బెడకేలు గట్టి కొనివచ్చి భూవరుసమ్ముఖంబునం బెట్టిన నతండు నాపి రకునిం జంపించి తద్గృహంబు సర్వంబునుం జూఱగొనియెం గావున నీవు నట్లు విచారమూఢుండ వని పలికి వెండియు. 61

క. నెఱయంగఁ బలుక నేరని
యెఱుకయు నాచారహీనునిలువడియును నీ
వెఱుఁగుము నిరర్థకం బని
యఱిముఱి భస్మమున నిడిన యాహుతిఁ బోలెన్. 62

వ. అని మఱియుం దనపురుషు నుద్దేశించి. 63

చ. తనమతి వేగిరించి నెఱి దప్పఁగఁ గార్జము సేయరాదు చే
సినయవివేకి నాపదలు చెందుట సిద్ధము నీతికోవిదుం
డనయము సద్విచారమతియై యొనరించిన యట్టికృత్యముల్
పనుపడి భవ్యసంపదలఁ బాయ కొనర్చు ధరామరేశ్వరా. 64

వ. అని యిట్లు తనభార్య చెప్పినవివేకవచనంబులకుఁ బ్రమోదంబును నవిచారమూర్ఖత్వంబునం దాను జేసిననకులవ్యాపారంబునకుఁ బరితాపంబును నైన చిత్తంబుతో సర్వమ్మును దైవాధీనంబు గాక యని పలికి యమ్మహీదేవుండు దననందను నుపలాలనంబు చేయుచుఁ దనభార్యయుం దానును జిరతర

జీవనస్థితిం బ్రవర్తిల్లి రని చెప్పి సుదర్శనక్షితీశ్వరనందనులకు
విష్ణుశర్మ యిట్లనియె. 65

చ. కదిసి పఠింప లోకహితకార్యము లెల్లను దోఁచు మూఢులై
చదువనివారికిం దెలివి చాల నొనర్పదు నీతిసంపదా
స్పద మగునీప్రబంధము విశాలగుణోన్నతి నెల్లనాఁడు న[నన్
భ్యుదయము జేయు భక్తి వినుచుండినఁ బాఠము చేయుచుండి

క. ధర్మార్థకామసాధన
కర్మములకుఁ దగినయట్టి కథ లన్నియు మీ
కర్మిలిమై వినిపించితి
నిర్మలదృఢచిత్తు లగుచు నెగడుఁడు మీరల్. 67

వ. అనిన విష్ణుశర్మకుం గుమారు లిట్లనిరి. 68

చ. విమలగుణోన్నతా పరుసవేది యొకించుక సోఁకినట్టి లో
హములును శుద్ధకాంచనమయత్వమునుం గనునట్టిభంగి ను
త్తమభవదీయవాగమృతధారల నాత్మలు నిర్మలంబులై
యమర వివేకసంపదకు నర్హుల మైతిమి మీకతంబునన్. 69

వ. అని యతనికిం బ్రణామంబులు చేసి మఱియు నక్కుమారులు
నృపనీతిశాస్త్రంబులు చదువుచున్న యనంతరంబ సుదర్శనక్షి
తీశ్వరుండు విష్ణుశర్మ రావించి యనఘా మీవలనం గుమారు
లత్యంతప్రజ్ఞాధురంధరులై బ్రతికి రిటమీఁద నాయుధా
భ్యాసంబు చేయింపఁ గాలంబె గావునఁ జదువు చాలింపు
మని యమ్మహీదేవు నగణ్యగోహిరణ్యాదిదానంబుల నధిక
సంతుష్టుం జేసి బహుమానంబుగా ననుపుటయును. 70

శా. బాలాహ్యత్సరసీమరాళ పరిఘాభవాహ్యోన్నతోద్యద్భుజా
లీలారూపజయంత పద్మవదనాళీనూత్న కందర్ప నా

రీలావణ్యధనాధిపాత్మజ కుమారీపూర్ణ రాకాశశీ
భూలోకప్రమదారమాధిప సితాంభోజాతపత్రేక్షణా. 71

లయగ్రాహి.—

కింకరజనాంబురుహపంకరుహమిత్రరిపు
పంకరుహరాజిహరిణాంక నిభమూర్తీ
శంకరమనోజ్ఞ కరకంకణవచోవిభవ
వేంకటగిరీశకరుణాంకురితభాగ్యా
సంకులమణీనిచయసంకలితహేమసద
లంకరణదేహ మకరాంకురకరాసీ
కుంకుమహిమాంబుశశిసంకుమదసంకరవి
శంకటపటీరయుతపంకిలశరీరా. 72

భుజంగప్రయాతము.—

దిగంతప్రమేయప్రదీప్తోరుకీర్తీ
ధగన్మేరుధైర్యా సదాదానమూర్తీ
యగణ్యోరుభర్మాద్యలంకారభారా
దృగంతానుకూలప్రతిష్ఠాపవీరా. 73

గద్యము. ఇది శ్రీమైత్రావరుణగోత్రపవిత్ర బ్రహ్మనామాత్య పుత్త్ర సుకవిజనవిధేయ నారాయణనామధేయప్రణీతం బైన పంచతంత్రం బనుమహాప్రబంధంబునం దసంప్రేక్ష్యకారిత్వం బనునది సర్వంబును బంచమాశ్వాసము.

చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1953.